# మణికర్ణిక

## (ఆధునిక తెలుగు కవిత్వం & తెలుగు నాటకం)


*ప్రధాన సంపాదకులు*

**ఆచార్య కె. ఆశాజ్యోతి**

**అధ్యక్షులు, తెలుగు అధ్యయన శాఖ**



ಆಗು ನೀ ಅನಿಕೇತನ
BE BOUNDLESS

**బెంగళూరు సిటి విశ్వవిద్యాలయం**

బెంగుళూరు

# మణికర్ణిక

## (ఆధునిక తెలుగు కవిత్వం & తెలుగు నాటకం)

*ప్రధాన సంపాదకులు*

**ఆచార్య కె. ఆశాజ్యోతి**

**అధ్యక్షులు, తెలుగు అధ్యయన శాఖ**

ಆಗು ನೀ ಅನಿಕೇತನ
BE BOUNDLESS

**బెంగళూరు సిటి విశ్వవిద్యాలయం**

**బెంగుళూరు**

**MANI KARNIKA (ADHUNIKA TELUGU KAVITVAM, ADHUNIKA TELUGU NATAKAM):** A Prescribed Telugu Textbook for III Semester Degree Classes, Chief Editor: Prof. K. Asha Jyoti; Chairperson, Department of Studies in Telugu, Bangalore University, Jnanabharati, Bengaluru; Published by Bangalore City University, Bengaluru; pp viii + 186.

© బెంగళూరు సిటి విశ్వవిద్యాలయం

ప్రథమ ముద్రణ**:** 2021

*ప్రధాన సంపాదకులు:*

**ఆచార్య కె. ఆశాజ్యోతి**

**అధ్యక్షులు,** తెలుగు అధ్యయన శాఖ

బెంగళూరు విశ్వవిద్యాలయం

జ్ఞానభారతి, బెంగుళూరు-560056

*ప్రకాశకులు* **:**

నిర్దేశకులు

ప్రసారాంగ మరియు ముద్రణాలయ విభాగం

బెంగళూరు సిటి విశ్వవిద్యాలయం

బెంగుళూరు

---

ముద్రణ:

బెంగళూరు సిటి విశ్వవిద్యాలయం, బెంగుళూరు

**ఆచార్య కె. ఆశాజ్యోతి**
అధ్యక్షులు, తెలుగు అధ్యయన శాఖ
బెంగళూరు విశ్వవిద్యాలయం
జ్ఞానభారతి, బెంగుళూరు–560056

# ముందుమాట

బెంగళూరు సిటి విశ్వవిద్యాలయం డిగ్రీ కళాశాలలో బి.ఏ. / బి.ఎస్సి / బి.ఎస్సి. (ఫాడ్) / బి.కాం. / బి.బి.ఎమ్ / బి.హెచ్.ఎమ్ / బి.బి.ఎ. కోర్సులు చేస్తూ, తెలుగు రెండవ భాషగా ఎన్నుకున్న విద్యార్థులకు తెలుగు పాఠ్యాంశాలు ఈ పుస్తకంలో ఉన్నాయి. పాఠ్య ప్రణాళికా సంఘం విద్యార్థుల కోసం నిర్దేశించిన ఆధునిక తెలుగు కవిత్వం, ఆధునిక తెలుగు నాటకాలను "మణికర్ణిక" పేర మూడవ సెమిస్టర్‌కు, ఆధునిక తెలుగు కథ, ఆధునిక తెలుగు సాహిత్య విమర్శలను "మణిప్రవాళం" అను పేర నాలుగవ సెమిస్టర్‌కు పాఠ్యాంశాలు.

మూడవ సెమిస్టర్‌లోని "మణికర్ణిక" అనే తెలుగు పాఠ్య గ్రంథంలో ఆధునిక తెలుగు కవిత్వం అనేది మొదటి భాగం కాగా, రెండవ భాగం ఆధునిక తెలుగు నాటకం. ఆధునిక తెలుగు కవిత్వంలో భాగంగా విశ్వనాథ సత్యనారాయణగారి 'ఆధునిక కవిత్వం', దువ్వూరి రామిరెడ్డిగారి 'కృషీవలుడు', డా॥ సి. నారాయణరెడ్డిగారి 'కర్పూర వసంతరాయలు', గుంటూరు శేషేంద్రశర్మగారి 'పక్షులు', చెరబండరాజుగారి 'నన్నెక్కనివ్వండి బోను', గుఱ్ఱం జాషువాగారి 'శ్మశానవాటి'లను పొందుపరచడం ద్వారా ఆధునిక కవిత్వం గురించి ఆయా కవుల రచనా శైలి విద్యార్థులకు కొంత అవగతం అవుతుంది. అలానే రెండవ భాగం పాటిబండ్ల ఆనందరావుగారు రచించిన 'పడమటిగాలి' అనే నాటకం ద్వారా విద్యార్థులు ఆధునిక తెలుగు నాటకంలోని వివిధ దృశ్యాలు, అందులో ప్రవేశించే పాత్రల గురించి క్షుణ్ణంగా తెలుసుకోగలుగుతారు.

కళాశాల స్థాయిలో డిగ్రీ మొదటి, రెండు విద్యా సంవత్సరాలకు నాలుగు సెమిస్టర్లలో తెలుగును, బెంగళూరు సిటి విశ్వవిద్యాలయం, పాఠ్యప్రణాళికా సంఘం ద్వారా ఆమోదించబడిన పాఠ్యాంశాలను ప్రారంభించడమైంది.

తెలుగును రెండవ భాషగా ఎన్నుకున్న విద్యార్థుల అభివృద్ధిని ఆకాంక్షిస్తున్న బెంగళూరు సిటి విశ్వవిద్యాలయం కులపతి ఆచార్య లింగరాజు గాంధీగారికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

**ఆచార్య కె. ఆశాజ్యోతి**
శాఖాధ్యక్షులు, తెలుగు అధ్యయన శాఖ
బెంగళూరు విశ్వవిద్యాలయం
జ్ఞానభారతి, బెంగుళూరు–560056

# ఆధునిక తెలుగు కవిత్వం, ఆధునిక తెలుగు నాటకం

**(బి.ఎ., బి.ఎస్సి., బిఎస్సి(ఫాడ్), బి.కాం., బి.బి.ఎమ్.,**

**బిహెచ్.ఎమ్., బి.సి.ఎ., బి.బి.ఎ.)**

**సెమిస్టర్ - 3**

## విషయ సూచిక

### I. ఆధునిక తెలుగు కవిత్వం


1. కొండవీటి పొగమబ్బులు
   - విశ్వనాథ సత్యనారాయణ 1
2. కృషీవలుఁడు
   - దువ్వూరి రామిరెడ్డి 6
3. కర్పూర వసంత రాయలు
   - డా॥ సి.నారాయణరెడ్డి 10
4. పక్షులు
   - గుంటూరు శేషేంద్రశర్మ 16
5. నన్నెక్కనివ్వండిబోసు
   - చెరబండరాజు 20
6. శ్మశానవాటి
   - గుఱ్ఱం జాషువా 24


### II. ఆధునిక తెలుగు నాటకం


పడమటిగాలి

- పాటిబండ్ల ఆనందరావు 27-186

# ఆధునిక కవిత్వం

## 1. కొండవీటి పొగమబ్బులు

**– విశ్వనాథ సత్యనారాయణ**

దగ్ధాంధ్ర రాజ్యానిత్య విధూత ధూమమ్ము వలెఁ గొండబురుజుల కెలన లేచి
బురుజుకొమ్మల వీడి పోలేని రెడ్ల కీరితి వోలెఁ బెనురాళ్ళ నతుకులుబడి
రెడ్లకందావెన్క రేఁగు వంటింటి పెన్పొగవోలె గుమురులై ముందుసాఁగి
ద్రాగ్ధవదాంధ్ర స్వతంత్రతా రమవోలెఁ గొండ లంటే యంటకుండఁ బోయి

శ్యామలీభవ ద్ద్రాస ఘాసాదనార్థ
మొలయు వెల్లావుల కదంబములుగ నిలిచి
కొండకొమ్ములు లో దాఁచుకొన్న క్రొత్త
క్రొత్త పొగమబ్బు లలమె నీ కొండకొసల.

ఒకరెడ్డి సభతీర్చి ఉన్న కొండకు వాలు కొసలలో ముత్యాల గొడుగు పట్టు
ఒకరెడ్డిమూర్తి పోలిక తీరియున్న కొండకు గోసగాఁ గిరీటమ్ము పెట్టు
ఒక యంతిపురము వధూత్ప్రేక్షఁ జను బురుజున సన్న మేలిముసుంగు తొడుగు
ఒక తెల్గుబంటు రీవికి ముద్ర గొనియున్న బురుజు పజ్జ మహాసివోలె వ్రేలు

ఈ జగాపొగమబ్బులు రాజసేవ
మఱచిపోవులే, రసధునీ మహితమూర్తుఁ
లేము లెక్కించుచుంటిమి యెన్ని నాళ్ళు
చనెనో యని వందలేళ్ళుగాఁ సాచుకొంచు

అస్మదర్థాతిథేయారబ్ధములు రెడ్ల భువి వంటశాలల బొగ లటంచు
అచట శ్రీనాథకావ్యశ్రోతలగు మాకుఁ బఱచిన పందిళ్ళపఱపు లంచు

కొండకొమ్ములఁదీర్చికొని నిల్చియున్న యాంధ్ర భటాళి వీరగంధాలటంచు
ఉత్సవాగత జనమ్మొతిగిపోఁ గొండకొమ్ములఁ దొంగి కను రెడ్ల ముగుద లనుచు

మున్ను గుఱ్ఱాల దూకించుకొన్న చోట
నడుగడుగునందుఁ బాతంబులైన మాకు
నప్పుడప్పుడు తలలెత్తి నంత కొండ
కొసల మబ్బులు పొరపెట్టి విసరులాడు.

ఒకసారి వలిపమ్ము చిలికి ముత్యాల యంచుల వోలిక నుపత్యకలఁ జరించు
ఒకసారి జఘనభాగోపరిస్రస్త చేలవిధాన గిరిమొదళ్ళఁ బడిపోవు
ఒకసారి గిరిలక్ష్మి మొగముపై మొగలి పుప్పొళ్ళూఁదుకొన్నట్లు చెల్లరేఁగు
ఒకసారి స్వేదబిందుకములు రత్యంతవేళా కుచావృత్తి విస్తరించు

చిఱుత పొగమబ్బు లీకొండసీమఁ బలుచఁ
బడి విశీర్ణమై ధూతమై తడిసి రాచ
సిరి యుడిగిపోయినట్టి యీ శిథిల దుర్గ
లక్ష్మి కొనఁగూర్చు వెట్టి యలంకృతులను

అధిరూఢ కుండినేశాత్మజమ్మయిన స్యందన గరుత్మన్మండిత ధ్వజమ్ము
గజపతి ప్రౌఢోగ్ర కరిఘటా శుండా విధూతాంబునిచయ బిందూత్కరంబు
రెడ్లకీర్తిపతాక శ్రీనాథకవికావ్యదూత హంసాధినాథుని గరుత్తు
అల కసవాపాత్రు నంటి రాఁజిన కృష్ణరాయ బాహాగ్రజాగ్రన్మహాగ్ని

ఒక టొకటిగాఁగ స్మృతితెచ్చుచున్న వన్ని
చిఱుత లీ పొగమబ్బులు చిందులాడి
కొండవీటి ప్రాఁగోట పై కొమ్మలందు
నవ్యవర్షేందిరా ధురంధరవిరూఢి.

నిప్పులఁ జూఁడ మన్నీ లుత్కలప్రౌఢపాత్రులు బురుజుల పైని లేరు
ఈటెలఁ గ్రుఁమ్మ శౌర్యేందిరా పుంమూర్తులైన రెడ్డీ కోటపైన లేరు

గుండెలు కత్తులఁ గ్రుమ్మ రాయల రాచయేనికగున్న లీ పైన లేవు
అడుగడ్డునకుఁ బ్రాణ మాహుతిగొనఁగ ద్వారస్థాన రక్షకభటులైన లేరు.

ఓసి పొగమబ్బులార! రండోసి రండు
మీకు మాకిష్టమే యిష్ట మాఁక లేక
తిరుగవచ్చు రాజులు కొల్వుతీర్చుచోట
నరుగవచ్చు రాకన్నె లున్నట్టిచోట.

ఎంత నిర్భయముగా నీ పొగమబ్బులు జెట్టీల బురుజుపైఁ జిమ్మిరేఁగు
ఏ లెక్కలేనట్లె యీ పొగమబ్బులు మిరియాల తఖతుపై తఱిమిపోవు
ఇంత యడ్డంకి లేకీ పొగమబ్బులు కేళిశుద్ధాంతసౌధాళిఁ జొచ్చు
ఏ మాత్ర మాఁక లేకీ పొగమబ్బులు తారాబురుజు మీఁద దాట్లు వెట్టు.

పిచ్చి పొగమబ్బులార! కోపించిరేని
చెడ్డవారు సుమీ! మిమ్ము చించి ఱొమ్ము
తాఁచి చెండాడిపోదు రడ్డంకిరెడ్లు
లేలిహానమ్ము లడ్డంకిలేని రెడ్లు.

ఇడుపుల విలిఖించిరేమొనా ముక్తాక్షరములుగా దుర్గకుడ్యముల నొలసి
ఇచట ముగ్గులుపెట్టిరేమొనా గ్లప్తముక్తారేఖగా గిరిస్థలము మెఱసి
ఇట వితానమమర్చిరేమొనా మృదుమరుచ్చాలితమధ్యమై చదలఁ దీర్చి
ఇటఁ గేళకుళి పెట్టిరేమొనాఁ దుదల శీతలపృషత్పరిషించితములఁ గదలి.

ప్రాత రనతిక్రమితయామ భానురోచి
రాసమాత్త ధావళ్య మర్యాదయైన
లేఁత యీ పొగమబ్బు పురాతనంబు
త్రవ్వుచున్నది రెడ్ల యాంధ్ర ప్రశస్తి.

ఇవి రెడ్లరాజుల యెదలలోఁ బూరించుకోరాని కోర్కెలు గుములు కట్టి
ఇది తెన్గుబంటుల యిందుపగింజలై నాత్మలు వీడలేకరుగుదెంచి

ఇదియు శ్రీనాథుని యెఱ్ఱప్రగడ కావ్యతకు రాని భావముల్ తరకగట్టి
అవచితిప్పయసెట్టి విని రత్నరాశిగా మలఁచిన ప్రాణముల్ మగిడివచ్చి.

కొండవీటి పొలాల్ వీడికోను లేక
ఆశబలమున మగుడు ప్రేతాత్మలవలె
సొరిది నీ గిరికొమ్ముల జుట్టుపట్ల
నిట్టి పొగమబ్బులై భ్రమియించుఁ గాక

నా ప్రాణములకును నీ పొగమబ్బులకేమి సంబంధమో! యేనుగూడ
పొగమబ్బునై కొండచిగురుకోసలపైన బురుజులపైనిఁ గొమ్ములకుఁ బైని
వ్రాలిపోనో మధ్య వ్రీలిపోనో నేల రాలిపోనో గాలి తేలిపోనో
నా యూహ చక్రసుందరపరిభ్రమణమై యీ పొగమబ్బులనే వరించే.

యెన్ని పొగమబ్బు లెతిఁగిలేనేను మున్ను?
తూర్పుకనుమలు విడుచు నిట్టూర్పులట్టి
విచటి యీ పొగమబ్బులే యెడఁదలోని

ప్రొద్దుపొడుపను కాఁపుపూఁబోడి రాజ
సముల పరియెన్నుగంప గేహమున దింప
నంబరమున నెగురుచు సరసఁజేరు
పిల్లలనఁ బుల్గుతుటుములు వింటికెగసి.

అరుణమయూఖముల్ తరులతాంతరమార్గము దూరి గేహగో
పురములఁ బ్రాఁకు ప్రొద్దువొపుం దరుణంబున నీటికోసమై
సరసుల కేఁగు కాఁపునెఱజాణల నూపుర మంజులార్భటుల్
నెఱసెఁ బ్రభాతమన్ శిశువునేర్చెడి ముద్దుమాటలో యనన్.

ఇరువులఁ జూరులందుఁ జరియించి తమోహరణైక దక్ష భా
స్వర కిరణాళి నీమృదులకయ్య సువర్ణముయంబు చేసి ని
ద్దుర నిఁకనైనమాని వెలిదోలుము బీళ్ళకు నాలమంద, ని
త్తఱి దమిదీఱమేయుఁ బులదంటులుఁ గమ్మనిమంచుపచ్చికల్.

ఓయి హాలిక! యెంత ప్రొద్దాయెఁ జాలు
మింత నిదురేల? పాలకై గొంతురాయ
లేఁగ యాదూడ పలుపును లాఁగికొనుచు
నఱచుచున్నది 'యంబ యంబా' యటంచు.

పొదుగు నిండుగఁ బాల్చేపి గుదులు త్రెంపి
దూడకై దొడ్డిగోడ రాపాడి దాఁటెఁ
దఱిపి పెయ్య; యింకేల మాంద్యమునఁ బొరల?
లెమ్మునిద్దుర; పాల్దీయఁ దెమ్ము చెంబు.

బిఱ్ఱు కడుపుగ నన్నంబుఁ బెరుఁగుఁ గుడిచి
దొడ్డి వెడలించు చున్నాడు గిడ్డిగములఁ
దమ్ముఁగుఱ్ఱడు; లేదూడ లమ్మలకును
పరుగు లిడనీక కట్టుము పలుపువెట్టి.

చెమరు ముత్యాలు చెక్కిళ్ళఁ జెదరిజాఱ
పైట తెరవెన్క జమరి పోరాటమెసఁగ
(ముద్దుచన్నులు పయ్యెద మురిపెమాడ)
గాజునీలాలు మధుర నిక్వణము లొలయ
దధి మథించెడు కాంత గీతములు వినవొ?

# కృషీవలుఁడు

### - దువ్వూరి రామిరెడ్డి

సమయమమూల్య, మొక్క నిమిషంబు వృథాచనఁ గ్రమ్మఱింపనే
రము; మనయాయుదా త్రుటిపరంపరయౌట నెఱింగి, నిద్రమాం
ద్యమును దొలంగి మీపనుల నారయుఁడో జనులారయంచు డం
బముగ మెడన్నిగిడ్చి కృకవాకువు గూసెడి నిండికొప్పునన్.

వడఁకుచుఁ బాడు మేల్కొలుపు పాటకు రాటము ఝుమ్ముమంచుఁ జే
సెడి మధురారవంబు శ్రుతిచెల్వువహింపఁగ, రాజనూఁది ముం
గడ నిడికొన్న కుంపటిసెగన్ సాగియించుచు నమ్మలక్క లొ
క్కెడగుమిగూడి నూల్వడకునిత్తఱిఁదోఁచెను రెడ్డిచుక్కయున్.

అత్తల యాఁడుబిడ్డల భయం బొకవంకయుఁ గోర్కె వేఱొకం
చిత్తములాఁగఁ గ్రొవ్వెదయుఁ జీరయు వే సవరించి తూఁగుమై
మత్తున నున్నవల్లభుని మంచము మెల్లన వీడి దీనయై
బిత్తఱికోడ లిల్వెడలె వేకువఁ బ్రాఁచిపను ల్వొనర్పఁగన్

రచ్చ చపారమందు నిడి రాతిరిఁ బుచ్చిన బాటసారులుం
జిచ్చు రగిల్చి మంటలకుఁ జేతులు చాపుచుఁ గూరుచుండి వా
రిచ్చకు వచ్చినట్టి కతలెల్ల వచింపుచుఁ దెల్లవాఱఁగా
వచ్చిన మూటముల్లె గొను పైనపుసందడి రేఁగె గొల్లునన్.

'అమ్మీ, తూరుపుదెల్లవాఱె, నిఁకలెమ్మా' యంచనన్ మూల్గి మం
చమ్మున్ డిగ్గక, బుజ్జగించినను, 'పో చాల్చాలు, వేన్నీళ్లు లే
కెమ్మై నేఁ బలుదోముకొందుఁ జలిలో, నింతాగడంబా?' యటం
చమ్మం గూఁతురు కోపగించుకొనుఁ గన్యాత్వంపు గారామునన్.

కమ్మన్ని నెత్తావి గడలు కొనఁగ,
రత్నకంబళ మట్లు రాణించు వీరులఁ –
బలువన్నెపూవులు బలిసి విరియ,
వ్రాలఁబండిన రాజనాల కేదారంబు –
పంటలక్ష్మికి నాటపట్టుగాఁగ,
ప్రొద్దునిగ్గలు సోకి పొగమంచు మబ్బులు –
బంగారు వలిపంబు పగిది వ్రేల

ఈ నిమేషమందు నిల యెల్ల సందమై
స్వర్గశిల్పి యింద్రజాలశక్తి
వ్రాసినట్టి చిత్రపటమున విలసిల్లె; –
తొంగిచూడు మిపుడు తూర్పుదిక్కు!

వేకువనె లేచి వైకుంఠవాకిళులను
ముంగిట రచించి గుమ్మడి పూలతోడ
గొబ్బిముద్దల నిలిపి కుంకుమను జల్లె
నీ యనుంగుకూఁతురు! గాంచుమోయి సొబగు.

గనిమల తుంగకున్ గఱికకాడల కల్లిన సాలెగూళ్ళ స
న్నని పటికంపుమంచు పడి నాణెపు ముత్తెసరాల పోలికం
గనుఁగొన రమ్యమయ్యె రవికాంతులఁ దేలుచు, నిట్టి భావమో
హనపు నిసర్గశిల్పముల, హాలిక! త్రొక్కక దాఁటిపొమ్మికన్.

పొలముల కేగు పల్లెతలు పుత్తడిగాజులు ఘల్లుమంచు రా
పిలి యులివెత్తగం జిటికెవేయుచు నిన్నని యేలపాటలం
జెలువుగ బాడ నుప్పతిలు సిగ్గున నూరకపోక మాఱుపా
టల నెలుగెత్తి పొదుమ, మిటారుల నవ్వుల కాస్పదంబుగన్.

గ్రామవాసుల కిట్టి నిష్కైతవంపు
ముగ్ధపరితోషములు సుఖభోగ్యములగు;

పట్టణ నివాసకుల శుష్కభావములను
నిట్టి సామాజికానంద మెసఁగఁగలదే?

ఉయ్యేల నిద్రలేచి తనయుం డెదుటన్ జనయిత్రి గాంచకే
కుయ్యిడు చున్నవాఁడు కులుకుంగనుదమ్ముల బాష్పబిందు లొ
య్యెయ్యన జిందువాఱ, సతియున్నికటంబున లేదు, లేచి య
బ్బయ్యనునెత్తి మేనుపులకాంకితమౌనటు ముద్దు వెట్టుమా

చలికప్పుగప్పి విచ్చలవిడి లేయెండ –
గ్రాగు ముద్దులకూఁతుఁ గౌఁగిలించి
పునికి దోఁగాడుచు బొమ్మలతో నాడు –
పసిబిడ్డమోము చుంబనముచేసి

యెగతాలి సరసాల నిల్లాలు పలుకుచు –
నవ్వినందుకు మాఱునవ్వు నవ్వి
పసివాండ్రు వచ్చియుండిన దండ్రియేమను –
నో యను శంక లోనొరసికొనఁగ

చలిది కడుపారఁ గుడిచి యెద్దులను దోలి –
కొనుచు మడి కేఁగుచున్నారు, కనుమ! యొరులు
వారు నీతోటివారలు గారె? రెడ్డి –
యువకు లెచ్చటఁ గొఱగాక యుందురయ్య?

మనపనిఁ జేసికొన్న నవమానమె? ప్రాఁచిపను ల్వొనర్చుచున్
వనిత యతిప్రయాసమున పర్వులిడం గనుఁగోవె? కావడిం
గొని సరసీజలంబులను కోపము సేయక తెచ్చియిచ్చి కాం
తను పరితోషపెట్టుము; వృథాచన వెప్పుడు నట్టిసాయముల్.

సోమరిపోతవై జనకు సూక్తు లలక్ష్యముచేసి కొంటిపో
రాముల ప్రొద్దుపుచ్చకు, నిరర్థకభూములనైన చెమ్మటన్

శ్యామల సస్యవంతముగ సల్పెడు కాపులు నోగులైన నిం
కోమెడువార లెవ్వరు జనోత్కరమున్ సరసాన్నదాతలై.

అరుణకిరణుండు తూర్పున నవతరింప
ప్రాణిలోకంబు మాంద్యమ్ముఁ బాసె; నింక
నింటనుండుట మర్యాదయే కుమార?
చలిదిచిక్కంబు గట్టుము పొలముఁ జేర.

# కర్పూర వసంత రాయలు

**– డా॥ సి. నారాయణ రెడ్డి**

"జయ జయ సమగ్రాంధ్ర
సర్వంసహా భార
సంభరణ శేషాహిరూపా!

పరిపంథి నృపతి దో
ర్బలకంధి మంథనా
పర మందరాద్రి స్వరూపా!

జయ జయ కళాదుగ్ధ
సాగర మనోముగ్ధ
సంపూర్ణ చంద్రమూర్తీ!

సురసరి న్మందార
సుమగరు న్నీహార
పరిహాస న్మంజుకీర్తీ!

జయ నిత్య దాతృత్వ
చణతా నతానంత
సౌరద్రుమాగ్రశాఖా!

ప్రస్ఫురత్ బ్రహ్మతే
జస్ఫురత్ ఫాలతల
విస్ఫుర ద్రాజరేఖా!

జగనొబ్బగండ జయ
జగరక్షపాల! జయ
జయ చెంచుమలచూరకారా!

కవి గమకి వాది వై
ణవిక వైణిక జన
స్తవనీయ కవితావిచారా!

అనవోత భూనాథ తనయాగ్రణీ !
పంటకుల పద్మసంప ద్ద్యోమణీ !
జయ కొమరగిరి ధరావరదా
జయ జయ వసంతరాడ్బిరుదా !”

ఈ గతిని విననయ్యే మాగధుల కైవారముల్
కైవారములు గావు గానామృతాసారముల్
పుష్కలావర్త జలమ్ముజ్మంద్ర నిస్తంద్ర
వాగ్ధీరముల్ వార్థిభావనా గంభీరముల్

స్తుతిరవమ్ములు జనశ్రుతిపుటమ్ముల సోకెనో లేదో
స్తోత్రగీతులు సౌధచూడాళి నెగబ్రాకెనో లేదో
కొండవీటి పురాన సుండు బండలు గూడ
గుండె గలగలలాడ ‘కో’ యంచు పిల్చినవి.

మనుదిన్నపాము బోలిన రాజమార్గమ్ము
ఒక మహానదివోలె ఉప్పొంగి నడచినది
పంచభూతము లొక్కపరి ‘ఓ వసంత ప్ర
భూ’! యంచు మైమరచిపోయి శబ్దించినవి.

అది చైత్ర శుద్ధ త్రయోదశీ దినమంచు
అది మదనదేవ పూజారంభ దినమంచు
అది కొమరగిరి బ్రతుకుటంగణమ్మున మల్లె

లే మొల్లలే విరియు లేత ఆమనియంచు
నేను వేరుగ చెప్పనేల?
వ్యంజనకు వ్యాఖ్యానమేల?

పాలసంద్రపు నురుగు తరగలు
పరిమళించిన సురగజముపై
స్వారి వెడలు శచీద్వితీయుని
స్మరింపించె వసంతరాయడు.

జనసమూహము దుగ్ధసాగర
సామ్యమున మిసమిసలు వోవగ
అందు రాజ్ఞీయుతుడు మధురా
యడు స్ఫురించె రమాధిపునివలె.

కడకు ఉచ్చైశ్రవము నైనను
కదనులో కాల్ద్రొక్కి చను హురు
మంజి తేజి లెక్కి అశ్విక
మండలము మును సాగుచుండెను.

నడుము కొమరగిరీశ్వరుని దం
తావళము నడయాడుచుండెను
ఆ పిదప సైన్యాధిపతి కా
టయ్య వేముడు సమరభీముడు.

అతని వెంట అనేక మండల
పతులు సచివులు దండనాథులు
ఆ వెనుక భూ మీనినట్టుల
హయదళమ్ములు కాల్బలమ్ములు.

ఇంక వెన్కకు ఎంత జనమో?
ఇసుక వేసిన పిసరు రాలదు.

వారి ఉత్సాహమును చెప్పగ
వాయి చాలదు వాక్కు చాలదు.

విచ్చుకత్తుల ధాళధళ్యము
విద్యుదున్మేషమును చూపెను.
జయ నినాదము లబ్ధములు లే
కయె ప్రగర్జకు దారి తీసెను.

వీటిలోన రసాల కిసల న
వీన తోరణమాల లెందును.
బాటలో నెల్లెడల పూవుల
మాటలే మరి యేమనందును?

ఏ మొగమ్మున చూపు నిల్చిన
ఇగురువోసెడు కాంతివల్లులు
ఏ సిగను పరికించి చూచిన
ఏటవాలుగ నవ్వు మల్లెలు.

యునతు లెల్లరు రతీరామలు
యువకులో మన్మథస్వాములు
నాడు నిజముగ పండుముసలులు
గూడ నవయువతాభిరాములు.

సాగెను జనవాహిని వి
స్తార రాజమార్గమ్మున
మ్రోగె పంచ మహావాద్య
ములు రోదోంతరమందున.

గవాక్ష రంధ్రమ్ము లన్ని
కనులు చేసికొని ముగ్ధాం
గనలు చూచి రా వసంత

కాంతుని రాజసమూర్తిని.

ఒక్క తలుపురెక్క తీసి
ఒయారముగ అణుమధ్యలు
మధ్యలు తిలకించినారు
మహీశ్వరుని యువమూర్తిని.

ద్వారమ్ములు డాసి త్రపా
భారమ్ములు త్రోపి ప్రౌఢ
లీక్షించిరి ఇక్షుధన్వి
కీడగు మోహనమూర్తిని.

పురపురంధ్రు లడుగడుగున
కురిపించిరి రాయలపై
పులుగడిగిన ఆణిముత్య
ముల తలపించిన లాజలు.

వృద్ధాంగన లానందము
వెల్లివిరియ మంగళాక్ష
తలు ఆశీరామృతములో
తడిపి రేనిపై చల్లిరి.

నాగరకులు జానపదులు
నారీనరు లెల్లవారు
పూలజల్లుతో రాయల
మూర్ధము నభిషేకించిరి.

ఈ రీతిగ లోకబంధు
వౌ రాయడు పౌరుల హృ
న్నీరేజముల వికాస
శ్రీరమ్యములుగ జేయుచు.

సాగిపోవ సాగిపోవ
ఆగిపోయే రాచబాట.
ఆగిపోయే రాచబాట
అట నిల్చెను నగరితోట.

తోటబయట గజమ్ము దిగి విరి
బాటలో నడుగిడెను రాయడు.
అతని ఉత్తర దక్షిణమ్ముల
అనుగు రాణియు కాటవేముడు.

వారివెంబడి మదనపూజా
సర్వ సందర్శన కుతూహలు
రెంద రెందరొ సాగిపోయిరి
చందురునితో చుక్కలట్టుల.

# పక్షులు

**- గుంటూరు శేషేంద్ర శర్మ**

కోకిల యాకులం దొదిగి
కోయని తీయని కేకవేసి, కా
రాకులు రాలువేళ, శిశిర
ప్రతిసీర తొలంగ ద్రోసె, నీ
లోకమునందు దోచె నవ
లోకము, నాకము నీ ధరిత్రితో
నేకముజేయు లేళ్లు, సెల
యేళ్లు, చిగిర్చిన కొండ కోనలున్. 1

కాలము కూల మెక్కి యొక
కమ్మని ఈల వెలార్చి హేలగా
నీలి దిగంత కూలములు
నిండిన బాలకిసాల రాశిలో
నోలి గిరాటువేసె నొక
నూతన చేతన కాంతి ఖండమున్
పూలు తటాలునం బొదవె
బుద్బుద పుంజ విలాసరోచులై. 2

చిగిరిచి పూచినట్టి తరు
సీమలు మేన ధరించి, నవ్వుచున్
నగములు తెల్ల మబ్బులను
నాణెముగా తలపాగ జుట్టి, పై

దిగు సెలయేళ్ళ నాత్మభుజ
దేశములన్ సవరించి ప్రత్యుషో
గగన విలాసినీ రుచిర
గండతలమ్ములు ముద్దులాడెడిన్. 3

కెరలి వసంతవేళ పుల
కింపగ నింపగు కొండకోనలన్.
బరుగిడు కన్నె కాలువలు
పచ్చని తోటల గున్నమావులం
దిరిగెడు గండు కోయిలలు
తీగెల నూగెడు చిల్క బోదలున్
విరిసిన రమ్యతా విపణి
వీధిగ దోచె సమస్త లోకమున్ 4

పచ్చని నునురెక్క పైట దాల్చిన చిల్క
గొంతెత్తి పిల్లన గ్రోవి నూదె,
సంపెగ ముక్కును సవరించి పిచ్చుక
'జలతరంగణి మీటె శ్రావ్యసరణి,
శబల చూడము తలన్ చలియింప వడ్రంగి
ఖేలగా తియ్యని యీల వేసి,
గుమ్మడి పూవన్నె కుక్షి కదల్చుచు
భరత పక్షి సితారు పలుకరించె,
గరుడ పక్షియు నీలాల గగన సీమ
దిరిగి సన్నాయి వాయించి తేనె గురిసె,
కుసుమ పీఠిక తుమ్మెద కూరుచుండి
తంబుర న్మీటి శ్రుతి గూర్చె ధరణి కెల్ల. 5

చల్లని రేల నింగి విర

జాజుల పందిరియై హసింపగా
తెల్లని సోగ వెన్నెలలు
తెమ్మరలుం జత గూర్చి నిండు జా
బిల్లి జగమ్ము మీద వల
వేసెను, లోపల జిక్కి చేపలై
యెల్లెడ జీవరాసు లటు
లిట్టుల గంతులు వేయుచుండగన్. 6

సాగె వసంత కాలపు బ
జారు హజారు విరుల్ పరాగముల్
రేగగ రంగు రంగు నును
రేకుల కోకలు దాల్చి కేకలన్
స్వాగత వాక్యముల్ విసరి
వైచెను; తుమ్మెద గుంపు లింపుగా
రాగము లాలపించుచు త్వ
రం బరుగెత్తి పసంత సంతకున్. 7

సంపెంగా! నను చంపకే, పొగడ! నీ
సౌరభ్య పూరమ్ములన్
ముంపం జూచెద వేలనే, నళిని! నీ
పుప్పొళ్లు పై జల్లకే,
సొంపుల్ గుల్కు గులాబ! నీ
సొగసులన్ జూపించి బంధింపకే,
కెంపుల్ బూచిన కింశుకమ్మ! అటులం
గ్రీ గంట నన్ జూడకే. 8

అబ్బ! లోక మెల్ల అందాల గోలతో,
నిండి యున్న దిచట నిలువలేను

నిమిషమైన గాని సమకూర కున్నది
శాంతి యీ వసంత సంతలోన 9

ఓ విహగమ్ములార! ఎట
కోయి ప్రయాణ? మనంత వీధులం
దా వన భూములన్ వదలి
యా గిరు లా ఝరు లా సముద్రముల్
ఆ వియదధ్వముల్ గడచి
యావల తారల దాటి తేలుచున్
బోవుచు నుంటి రెచ్చటికి
పువ్వుల నవ్వుల గోల కావలన్. 10

చివురులు వేసిన వేయనీ మధువులం
జిప్పిల్లి పుష్పింపనీ
చవులూరన్ ఫలగుచ్ఛముల్ పొదలనీ
శాఖోప శాఖాదులం,
దివి యంటం పెరగంగనీ, నిలువలే
నీ వృక్షమం దింక, నా
యవదత్తాభ్ర పతాకముల్ కదలె దా
మాకాశ మార్గమ్ములన్. 11

అదిగో ఆ చిగురాకులందు చిలుకై
యానంద మందారమై
మృదుల స్వాదు ఫలమ్ము ముట్టక సము
న్మీలాక్షియై చూచుచు
న్నది యా పక్షి ననున్; క్షణమ్మయిన నుం
డం జాల నిచ్చోట; నా
కదిగో సుందర మందహాస రుచిరా
హ్వానమ్ము; నే బోయెదన్. 12

# నన్నెక్కనివ్వండిబోను

**- చెరబండరాజు**

నల్ల కోట్లు నీలిరంగునోట్లతో
ఒక దేశం ఒక కోర్టులో
ఫైసలా అయ్యే కేసు కాదు నాది
నన్నెక్కనివ్వండి బోను

నలుగురి నమ్మకంతో 'అమ్మా' అని పిలవటం తప్ప
నవమాసాలు మోసిందెవరో
ఎవరికైనా ఏమి తెలుసంటున్నాను
సృష్టికర్తనే వెక్కిరిస్తోన్న పాపిష్టిని
మీలో మిమ్మల్ని ప్రశ్నించుకోమ్మరిటున్నాను
అంటున్నాను అంటాను
అనుకుంటూనే వస్తున్నాను

మనిషి మీద నమ్మకం పోగొడుతున్న మీరు
దేవుడిమీద ప్రమాణం చేయమంటారెందుకు?
దోషికి నిర్దోషికి ఒకటే సూత్రం
వల్లించిందే వల్లించి వాదిస్తారు
ఫీజు కుడితి కుండలో
న్యాయాన్ని ఎలుకలా ముంచేస్తారు
మీ ఉద్యోగాలకు ప్రమాణాలేమిటి?
ఎక్కనివ్వండి నన్ను బోను

కలాలు కాగితాలు సర్దుకోండి
లా బుక్కుల్లో నా సందేహాలు వ్రాసుకోండి

న్యాయానికి దేశాలేమిటి? యెల్ల లేమిటి?
మనిషి, రక్తం, ప్రాణం ముఖ్యం
లింగ భేదాలు వాదాలు తప్పితే
మందిర్, మజ్జిద్, చర్చి
మతాధికారులు మతాలు యెందుకు?

ఆకలి, కామం, కలలూ, కన్నీళ్ళు,
మనిషిలోని మర్మజ్ఞానమంతా ఒక్కటే
దేశమేదైతేనేం? మట్టంతా ఒక్కటే
అమ్మయేవరైతేనేం? చనుబాలతీపంతా ఒక్కటే
బిక్క ముఖాలతో చూస్తారేం ?
పిచ్చివాణ్ణిగా కేసు పుటప్ చెయ్యండి
నన్నెక్కనివ్వండి బోను

తిన్న యింటి మర్యాదెంచని నాకు
బుద్ధుల్లో పెద్దల సహజాతాలేమైయుంటాయ్?
మంచి మనసు పరిమళాలు
విశ్వ వ్యాప్తి కాకపోవు
భావితరం గుర్తించకపోదు
జగత్ప్రళయ కావ్యంలో
తపనాగ్ని జ్వాల నిలుస్తోంది
అణువణువున అగ్నికణం
చల్లారక రగులుతోంది
నన్నెక్క నివ్వండి బోను

తీర్పు మీది జైలు మీది
భయపడతారెందుకు
మీ మనోసౌధాలనిండా
తరగని తరతరాల బూజు

అనుక్షణం చచ్చే ప్రియత్వం
కాపురాల గోపురాలలో తిరిగే పావురాళ్ళారా
నరుక్కో రెందుకు తలలు
గోడీ నాల్గు గోడలు కూల్చివేసి
దిశలు నాల్గుగా మార్చుకోండి
ప్రపంచ పౌరులు కారెందుకు అప్పుడు?
నాకు తెలుసు

మీరాత్రి చొక్కాలు పగళ్ల నిలవవు
పగటి చొక్కాలు రాత్రివుండవు
మీ పెళ్ళాలు పిచ్చివాళ్లు
పాతిక చీరతో స్వర్గాన్ని కప్పుకొని
వంట గదిలో ఆలోచనలకు
ఎసర్లు పెడుతున్న వాళ్లు
మీ వాగ్దానాలు పుచ్చుగింజలు
మీ బిడ్డలు కృత్రిమ నాగరికత షోలో
మోడల్‌గా పనికొస్తున్న వాళ్లు
ఛీ, ఛీ యెవరు మీరు?
నవ్వుతారెందుకు
నీవు నేను కలిసి యెదుటవాని పిలుపుకు
'మీరు' గాక ఏమౌతాం?
నీ గుండెలు నా గుండెలు
మూతబడిన కొండగుహలు
ఎక్కనివ్వండి నన్ను బోను

ఈ సువిశాల ప్రపంచ జీవశాలతో
సిసలైన న్యాయస్థానం యెక్కడైనా వుంటే
నన్నెక్కనివ్వండి బోను

నా గుండెలు పిండుకునే
కొండల్లాంటి సందేహాలు....

విశ్వశాంతి మనధ్యేయం
యుద్ధాలకు పరిమితమా?
అబద్ధమా యీ వేదన?
మాంసం ముద్దలుగా మనుషులు
శిశువులుగా జన్మించుట ఏ దేశంలో లేదు
ఏ దేశంలో నైతేనేమి?
అర్ధరాత్రి పడగ్గదుల
అంతరార్థ మొకటేగద !
ప్రపంచ మొక నగ్నశిలా
ఫలకము వలె కనిపిస్తున్నది
భగవంతుడి అసలు పేరు నగ్న ప్రియుడంటాను
అంటాను అంటున్నాను
అనుకుంటూనే వస్తున్నాను
అందుకే
నన్నెక్క నివ్వండి బోను.

# శ్మశానవాటి

**– గుఱ్ఱం జాషువా**

ఎన్నో యేండ్లు గతించిపోయినవి కానీ, యీ శ్మశానస్థలిన్
గన్నుల్ మోడ్చిన మందభాగ్యు డొకఁడైనన్ లేచిరాఁ, డక్కటా
యెన్నా ళ్ళీచలనంబు లేని శయనం? బేతల్లు లల్లాడిరో!
కన్నీటంబడి క్రాఁగిపోయినవి నిక్కంబిందు పాషాణముల్!

ఆకాశంబును కాఱుమబ్బుగము లాహారించె; దయ్యాలతో
ఘూకంబుల్ చెరలాడసాఁగినవి; వ్యాఘోషించె నల్దిక్కులన్
గాకోలంబులు; గుండె ఝల్లుమనుచున్నంగాని యిక్కాటియం
దా కల్లాడిన జాడ లే; దిచట సౌఖ్యం బెంత క్రీడించునో!

ఇచ్చోట; నేసత్కవీంద్రుని కమ్మని
కలము, చిప్పలలోనఁ గఱఁగి పోయె
యిచ్చోట; నేభూము లేలు రాజన్యుని
యధికారముద్రిక అంతరించె!
యిచ్చోట! నే లేఁత యిల్లాలి నల్లపూ
సలసౌరు, గంగలోఁ గలసిపోయె
యిచ్చోట; నెట్టిపే రెన్నికం గనుఁగొన్న
చిత్రలేఖకుని కుంచియు, నశించె!
ఇది పిశాచులతో నిటాలేక్షణుండు
గజ్జె గదలించి యాడు రంగస్థలంబు;
ఇది మరణదూత తీక్ష్ణమౌ దృష్టు లొలయ
నవనిఁ బాలించు భస్మ సింహాసనంబు.

ముదురుతమస్సులో మునిగిపోయిన క్రొత్తసమాధిమీఁద బై
బొదలు మిణుంగురుంబురువు పోలిక వెల్లుచునున్న దివ్వె, ఆ
ముద ముడివోయినన్ సమసిపోవుట లేదది దీప మందుమా?
హృదయముసుమ్మి, నిల్పి చనియె న్గతపుత్రక, యే యభాగ్యయో!

కవుల కలాలు, గాయకుల కమ్మని కంఠము లీ శ్మశానపుం
గవనులఁ ద్రొక్కి చూచెడి; నొకానొకనాఁ డల కాళిదాస భా
రవుల శరీరముల్ ప్రకృతిరంగమునం దిపు డెంతలేసి రే
ణువులయి మృత్తికం కలిసెనో కద! కుమ్మరివాని సారెపై!

ఆలోకించిన గుండియ ల్గరఁగు; నాయా పిల్లగోరీలలో
నే లేబుగ్గల సౌరు రూపఱియెనో! యేముద్దు నిద్రించెనో!
యే లీలావతి గర్భగోళమున వహ్నిజ్వాల జీవించునో ?
యీలోకంబున వృద్ధిగాఁ దగిన యేయే విద్య అల్లాడునో ?

ఇట నస్పృశ్యత సంచరించుటకు దావేలేదు; విశ్వంభరా,
నటనంబున్ గబళించి గర్భమున విన్యస్తంబు గావించి,
యుత్కటపుం బెబ్బులితోడ మేకఁ నొకప్రక్కన్ జేర్చి జోకొట్టి యూ
ఱటఁ గల్పించు నభేద భావమును, ధర్మం బిందుఁ గారాడెడిన్.

వాకొనరాని గొప్ప ధనవంతుని నిద్దపుఁ బాలఱాతి గో
రీకడఁ బారవేయఁబడి ప్రేలికలం బొరలాడు ప్రేత మే
యాకటిచిచ్చునన్ గుమిలి, యార్చి, గతించిన పేదనాని దౌ
నోకద! వానికై వగవఁ డొక్కఁడు; దాఁచదు కాటినేలయున్.

మూడవ సెమిస్టర్

# ఆధునిక తెలుగు నాటకం

# పడమటిగాలి

**- పాటిబండ్ల ఆనందరావు**

## నాంది

ఎక్కడో కొన్ని వేల మైళ్ళ దూరంలోనముద్రాలకవతల
ఓ బహుళజాతి కంపెనీ మెదడులో ఓ కొత్త వ్యాపారపు ఆలోచన మెరిసింది
భారతదేశంలోని ఓ మారుమూల పల్లె తల్లి గుండె చప్పుడు మారింది.
చేను చెంప చెమ్మగిల్లింది.

## నేపథ్యం

ఆర్థిక విధానం సరళీకృతమౌతూంది
ప్రపంచీకరణలో దళారి భూతం బలిసిపోతుంది.
మాఫియానీడలో మాదక ద్రవ్యాల విజృంభణ కొనసాగుతూంది.
మీడియా విస్ఫోటనం చెంది విష సంస్కృతిని వెదజల్లి
పట్టణాన్ని కబళించి పల్లెపైకి పంజా విప్పింది.
స్పీడ్‌మనీ ఈజీ మనీ విలాసజీవిత లాలస
మనిషిని పిచ్చివాణ్ణి చేస్తున్నయ్.

ప్రేమానురాగాల ముద్దగా వుండలసిన మనిషి
కలుషితమై వికృతత్వాన్ని పొందుతున్నాడు.

పల్లె సహజత్వం సౌందర్యం ధ్వంసమైపోయి
పరాయీకరణ చెందుతూంది.

మట్టితోను చెట్టుతోను సజీవ సంబంధాన్నేర్పరచుకొన్న ఓ మట్టి మనిషి
తన సహజత్వాన్ని ఆస్తిత్వాన్ని వ్యక్తిత్వాన్ని నిలుపుకోవాలనుకున్నాడు.

# దృశ్యం 1

అదుగదుగదుగో.. అల్లంత దూరాన....ఎంకిలాగా...
సుంకుబట్టిన జొన్న కంకిలాగా పల్లెటూరు. సందేలయినాది.
పసువులు పల్లె గూటికి సేరుకుంటన్నయ్.

పచ్చుల గుంపులు రివ్వున గూళ్లలోకి ఎగిరిపోతన్నయ్.
లేగ దూడలు సెంగుసెంగున గెంతులేస్తన్నయ్.
గొడ్లకాడి బుడ్డోళ్ల లొల్లాయి పదాలు ఇనపడతన్నయ్.

నాగేలు బుజాన పెట్టుకోని
పంట సేను గెట్టు మీదుగా వస్తన్నాడు రాంకోటు.
ఇత్తనాలమూట నెత్తిన బెట్టుకోని అతనెంట వస్తావుంది అతనింటి లచ్చిందేవి
మేడి బుజాన బెట్టి యింకా అర్రు నలగని కోడె గిత్తలాగా
అడ్డదిడ్డంగా పరుగుల్దీస్తన్నాడు కొడుకు రాంపండు
పసుపు సున్నంతో పిసికి దిస్టి తీసి యిసిరేసిన యర్రకూటి ముద్దలాగా
సూరీడు పడంవటి కొండల సందున రాలిపోతన్నాడు.
నల్లమబ్బులు తెరల్తెరలుగా పల్లెని కప్పేస్తన్నయ్.

# దృశ్యం 2

(ఆ వూళ్లో రచ్చబండ. దాని ముందు ఎడం వేపుగా యెల్తే బస్టాండూ కుడేపుగా పోతే ఊరూ వస్తాయి. అరుగెనక ఓ మూల్న పాత బల్ల మీద బట్టలిస్త్రీ చేస్తంది దొరసాని. ఇంకో మూల్న బొగ్గుల కుంపటి రాజేసి టీ పెట్టే పన్లో వుండాదు కోట్లింగం. ఇంకోపక్క పీట మీద కూసున్న ముసలాయనకి గెడ్డం గీస్తన్నాడు ముచ్చాలు. అరుగుపైన శీనాయి చారోడు సుబ్బాయి రాంపందు పేకాడతన్నారు. ఒంటేల్రాగోలు శ్రీదేవి మొగుడు పైన నిలబడి ప్రవేటు చేస్తన్నారు)

శీనాయి : ఒరే శారోడా సోనియాగాంధీ పెశారానికి దిగింది గదా. ఓట్లేంవన్నా రాల్తయంటావా.

సుబ్బాయి : అయ్యా సిలక పెశ్న అడిగొచ్చి సెవతాడుగనీ... మూసుకోని ముక్కెయ్. (ముక్కకోసం ఆగలేకపోతన్నాడు సుబ్బాయి. ముక్కెయ్యకుండా సతాయిస్తన్నాడు శీనాయి)

రాగోలు : ఒక్కముక్క సరిపోద్దంటన్నాయ్.

సుబ్బాయి : నీయబ్బడిబొక్క కంపునూకుతుంది నీ దగెర. అవతలకి సావు.

రాగోలు : బలే సెప్పేవే. నిదర్లేవంగనే నీలు పోసుకోని వుతికిన గుడ్డలు తొడుక్కుంటల్లా. కంపెందుకు నూకుద్దీ. (అంటా పక్కకి జరిగేడు).

శీనాయి : హు. కాస్తె దూరంగ నిలబడ్రా సోంవీ.

చారోడు : నాయాల్టి రేత్రిపూట గుడ్డలు తడుపుకునే రోగం ఏందిరా ఒంటేలోడా.

సుబ్బాయి : నీయమ్మ...ముక్కేత్తావా లేదురా శీనాయ్.
(లుంగీ యెగ్గట్టుకుంటా పైకి వుబుకుతున్నాడు సుబ్బాయి)

శీనాయి : ఒరే ఒంటేలోడా కోట్లింగం కాడొక టీ తీసకరారా
(రాగోలు బయిటికెల్లాడు)

రాంపందు : సూత్తంటే సుబ్బాయికి లైపు లేనట్టుంద్రో.

శీనాయి : కార్డు కౌంటేనా. ముక్కేస్తే మూస్తావేందిరా సోంవి.

సుబ్బాయి : మిడిలు. (పేక నేల మీద బోర్లించాడు)

శీనాయి : షో, (ముక్క మూసి ఆట తిప్పేడు గబుక్కున మూసిన ముక్క పైకెత్తి సూసేడు సుబ్బాయి.)

సుబ్బాయి : ఇదెక్కడ పెట్టుకుంటానికాపేవురా పెంట నాకొడకా.

శీనాయి : నీక్కావాల్సిన ముక్కెయ్యటానికి పేకెప్పుడు సూపిచ్చేవురా సోంవి.

సుబ్బాయి : ఎయ్యన్నాకొడుకువి యిందాకనంగ మూసెయ్యాల.
(ఒంటేల్రాగోలు తెచ్చిన టీ తాగుతున్నాడు శీనాయి)

రాగోలు : నేనేంవో ఆ ముక్కే యెయ్యమన్నానన్నాయ్.

సుబ్బాయి : అన్నావా. (పాన్ పరాగేసుకున్నాడు)

రాగోలు : ఆ.

సుబ్బాయి : ఒరే ఒంటేలోడా సీట్ల పేకలో యెన్ని ముక్కలుంటయ్‌రా.

రాగోలు : బలే సెప్పేవే. మొత్తం లెక్కెత్తే తెలియదాయేంది.

సుబ్బాయి : తంతా నీయమ్మ ముండనాకొడక. నువ్వెయ్యమనకపోతే ఆ నా కొడుకే సేవోడు నేను బతికేవోణ్ని. గుడ్డల్లో వుచ్చబోసుకునే నా కొడక.

రాగోలు : బలే సెప్పేవే. (బయిటికెళ్లాడు)

సుబ్బాయి : ఇదుగోరా పుల్లు.
(పదిరూపాయలు శీనాయ్ మీద కొట్టి దొరసాని వంక తిరిగాడు)
ఇదుగో దొరసానీ…యాంవే దొరసానీ…

దొరసాని : ఏందబ్బాయ్.

సుబ్బాయి : నా బట్టల్రుద్దేవంటే. ఒంగోలు పోవాల.

దొరసాని : పొద్దునే రుద్దేనబ్బాయ్. ఇంట్లో యిచ్చాచ్చా.
(రాంపండు పేక కలుపుతున్నాడు)

చారోడు : అవునొరే నాయాల్ది యియ్యాల మీటింగుందంట్రి గదరా.

సుబ్బాయి : మీ తూరుబ్బజారోళ్లొస్తేగా.

రాంపండు : నాది తూరుబ్బజారు కాదా యేంది.

శీనాయి : నువ్వా. ఒరే పండో అరుక్కాడికి మీ బాబొస్తన్నాడేందిరా.

రాంపండు : మా… బా…బా. (ఎగిరి గంతేసి దూకి అరుగుసాట్న దాంకున్నాడు. అందరూ నవ్వేరు. శీనాయ్ ఆట పట్టిచ్చేడని తెలుసుకొని సిన్నబుచ్చు కుంటా అరుగు మీద కొచ్చేడు)

రాంపండు : నాయాళ్లార బురిడీ నూకేరు గదరా.
(అంతలో కోటిబాబు ఓండా మీదొచ్చి బండాపాడు)

కోటిబాబు : ఏందిరా యింకా మొదులు బెట్లా.

చారోడు : నాయాల్ది కాస్తె గుర్రం దిగవోయ్.

మొగుడు : ఒదే బాబాయ్ ఓందా బంది గొనాలంతే యెంతవుద్దే.

సుబ్బాయి : యాంవ్రో మొగుడా హెూండా కొంటావేందిరో.

(బండిని ఆశగా తాకుతున్నాడు శీదేవి మొగుడు)

కోటిబాబు : ఆ బండికొనీ శ్రీదేవిని చేసుకుంటావ్రా యీడో.

మొగుడు : ఎగతాల్కొక బాకందే. బాగా దబ్బు జంపాయిత్సే...సీదేవిగాదు దానమ్మ చేసుకుంతది.

శీనాయి : అదిరా. (అందరూ నవ్వేరు)

మొగుడు : నవ్వంది నవ్వంది. దీనమ్మ.. యీ బందిగనక నేను కొనకపోతే.. . అప్పుదదగంది.

సుబ్బాయి : తూరుబ్బజారోళ్లు...బ్రెమ్మంవు గంటోడూ వస్తండాడ్రో.

చారోడు : ఇట్టా గదంట్రా తగూలుబదేది. గంటోడనకపోతే నాయాల్ది అసలు పేరుతో సింగారావు అనొచ్చు గదా.

శీనాయి : అంటే... ఇప్పడీడ్ని కూడ శారోడనకుండా నాగేసర్రావ్ అని పిలవాలండీ. అదీ యేడుపు. (బ్రెమ్మంపు గంటోడూ వొచ్చేరు. )

బ్రెమ్మం : మీసైడోళ్లంతా వొచ్చేరంటోయ్.

శీనాయి : వొచ్చినట్టే. ఆ మా లీడరు కూడ వస్తనాళ్లే

(రొండో పక్కనించి యంగట్రావొచ్చేడు)

సుబ్బాయి : అసలోడుండాడ్రా స్టిక్కోడు.

యంగ : ఒరేయ్ ఆ మాట పెద్దంగ అనవాకండ్రా. నాయనకమాల్నే వస్తండాడు.

(బయిటికి చూశాడు. స్టిక్కోడొచ్చాడు)

రేయ్ మా పెదనానకి సోటియ్యండ్రా.

(సోటిచ్చారు. స్టిక్కీరాసాంవి వొచ్చి అరుగు మీద కూసున్నాడు)

బ్రెమ్మం : ఇంక పీసీ ఆపెయ్యండోయ్.

(బ్రెమ్మం వొచ్చిన పక్కనించి బుచ్చియ్యొచ్చాడు)

బ్రెమ్మం : రాయ్ బుచ్చితాతా కూసో. మన బజారుకి పెద్ద దిక్కు నువ్వొక్కడివేనే. (బుచ్చియ్య గంటోడు బ్రెమ్మంపు ఒక పక్కకి చేరేరు. కోటిబాబు

యీాళ్లపక్కనే బండి మీద కూసున్నాడు. స్టిక్కీరాసాంవి యంగట్రావు చారోడు శీనాయి సుబ్బాయి రొండో పక్కకి జరిగేరు. మిగిల్న రాంపండు ఒంటేట్రాగోలు శీదేవి మొగుడు యనక నిలబడ్డారు.)

శీనాయి : సంగతేందో బయిటికి రానియ్యండ్రా సోంవి.

యంగట్రావ్ : ఏంవుందే ఈ జిల్లా నాయికుడు రైతు నాయికుడు మనూరోడూ ముక్కెంగా మనోడూ మన రైతు బందు... ఇయ్యాల మనూరొస్తున్నాడు. అన్నట్టొరే సుబ్బాయ్ దండల్దెచ్చేరంట్రా

సుబ్బాయి : ఎప్పడో తెస్తింగదన్నాయ్ (దండ చూపెట్టేడు).

బ్రెమ్మం : ఒరే గంటోడా అవ్వాయ్ సువ్వాలు రడీగా వుండయా.

గంటోడు : ఇయిగేం బావా. (సూపెట్టేడు)

యంగట్రావ్ : కాబట్టి రైతు బందుని మనంవంతా కలిసి ముక్కెంగా సమ్మానం చేసుకోవాల.

బ్రెమ్మం : మా గ్రూపంతా కలిసి డిస్కసన్ చేసుకున్నాం. మేం వోకే. మరీ... గార్లేందు లేస్తాం అవ్వాయ్ సువ్వాయ్ లు కాలుస్తాం. అదీ ఓకే మనం ఆయన్ని యేం డిమేండు సెయ్యాల. ఏం వర్కు చేయించుకోవాల. అది డిసైడ్ చెయ్యండి.

చారోడు : మనం యిరువర్గాలంవీ కలిసిపోతన్నాం కాబట్టి రాజ్ మాట కూడ యిదుగో యిట్టా అనుకుంటే బాగుంటది. మళ్లీ రైతు బందొొచ్చినాక నాయాల్ని తేడాలుంటే బాగుండదుగదా.

స్టిక్కోడు : ఇప్పుడూ.... రాజీ అంటే..అమ్మోరి జాతర్లో యెవురి బండి ముందుండాల్నో అది తేల్చుకున్నారా.

రాంపండు : పడిందిరా స్టిక్కు (కాసేపు యెవురూ మాట్లాడ్లా)

యంగట్రావ్ : అది కాదే పెదనానా అయ్యన్నీ జాతర జరిగేటప్పుడు తేల్చుకోవచ్చుగదే. ఇన్నాలకి అంతా వొకతాటి మీద కొస్తాం అంటంటే ముక్కెంగా స్టిక్కు నూకుతావేందీ.

బుచ్చయ్య : ఒరే నేనొక మాట...

బ్రెమ్మం : తాతా నువు కాసేపు సైలెంటుగుండవే.

గంటోడు : అదుగో రైతుబంధు కారొస్తన్నట్టుందరా.

(దండ పట్టుకొని సుబ్బాయీ అవ్వాయ్ సువ్వాయిల్తో గంటోడూ బస్టాండు వైపుగా పరుగుల్దీసేరు)

శీనాయి : అది కారు కాదురా సోంపీ.

(గంటోడు సుబ్బాయి యనక్కొచ్చేస్తన్నారు. సుబ్బాయి దండ తెగిపోయింది. గంటోడి లుంగీ వూడిపోయింది.)

మొగుడు : అంత దొందదెందుకుదా బాబాయ్.

కోటిబాబు : ఎందుకంటే దండ యెవుడు ముందేస్తే వాడే లీడరనుకుంటారనీ.

సుబ్బాయి : గంటోడు మరీ తొందర పడతండాడు. లైసన్సేదో నూకాలనేరా.

గంటోడు : ఆ నూకే బుద్దులు మాయేరా. గుడి టస్టీలుగా వుందప్పుడు పూజార్ని బురిడీ నూకీ దేంపుడి సొమ్ముల్నూకింది మేంగదో.

సుబ్బాయి : అందరూ పత్తిత్తులేలేవోయ్. పెసిరెంటుని సేతులో పెట్టుకోని సెర్లో శాపలన్నీ అమ్మకనూకింది యెవురో.

బుచ్చియ్య : ఒరే నేనొక మాట

బ్రెమ్మం : అబ్బ నువ్వు కాస్తాగవే.

శీనాయ్ : పెద్దోడ్ని మాట్లాడనియ్యరేందిరా సోంపీ.

సుబ్బాయి : ఆ. (పాస్‌పరాగేసుకున్నాడు)

కోటిబాబు : ఎందుకు మాట్లాడ్నిస్తార్రా. శాపలమ్మక నూకింది బయట పడతందిగా.

బ్రెమ్మం : నువ్వేం మిష్టర్ క్లీన్‌వి కాదు లేవోయ్. టొబాకోబ్యార్న్‌లో పొగ పెట్టీ ఫైర్ యాక్సిడెంటు అయిందని యిన్సూరెన్సోళ్ల దగ్గిర ఫిఫ్టీ తౌజండ్స్ దొబ్బలా.

కోటిబాబు : ఆ సర్వేయరు మనోడేలే సంతకాల్జేయిస్తానూ అంచెప్పి అందులో అయిదేలు నువ్ బొక్కలేదాయేంది.

గంటోడు : అశ వూరుకోండీ పడంవటీదోళ్ల ముందు సిగ్గుబోతందె.

బ్రెమ్మం : రైతు బందొచ్చే లోపల మనం రాజీ పడి ఒక అండర్ స్టాండింగుకి రావాలగదా.

యంగ్రావ్ : గతంగతా, జరిగినయన్నీ మర్చిపోండబ్బాయ్. మన పెద్దోళ్ల కాలంనించీ మనూళ్లో ఒక మాట లేదు. కదిల్తే తన్నులాట్లు కోర్టుకెక్కటం. ఊరు

డవలప్మెంటంతా ఆగిపోయింది. ఊరంతా వొకటైతే...ముక్కెంగా వూర్ని బాగుచేసుకోవచ్చు గదా.

చారోడు : నాయాల్ది అది మంచి మాటే.

బుచ్చయ్య : ఒరే నే నొక మాట...

కోటిబాబు : మజ్జలో నువ్వేందే. కాసేపు అట్టుండు.

సిక్కోడు : ఒరే వూరు బాగు చేసుకుందాం అంటండారు బాగనే వుంది. దీని కంటే ముందు పోయిన్నెల్లో... గుడి బాగు చెయ్యాలని మీటింగేస్తిరే. అదేంవైంది.

రాంపండు : పడిందిరా స్టిక్కు

యంగట్రావ్ : ఏదోవక స్టిక్కు నూకందే వూరుకోవుగదే పెదనాన.

గంటోడు : స్టిక్కేర్సాంబాబు అడిగిందాంట్లో తప్పేం వుందీ.

శ్రీనాయ్ : అదిగాదురా సోంపీ. యాలాం యెయ్యకుండానే దేంవుడి మాణ్నెంలో సెట్లమ్మక నూకేరుగా యాబయ్యేలకి. అది బయట పడుద్దనీ.

యంగట్రావ్ : అంతా నేనొక్కణ్నే తిని మిద్దె కట్టిచ్చ లేదమ్మా. ఎండోమెంటోళ్లకి అయిదేలూ ఎజ్జుకూటూ ఆపీసర్కైదేలూ మన పెసిరెంటుకి మూడేలూ ముక్కెంగా గుళ్లో సెంబుశాత్రికి రొండేలూ. యిట్టా అందరకీ మేపలా.

సుబ్బాయ్ : నీ గబ్బు కడగ లేదనా యేందిరా శీనాయ్.

చారోడు : గబ్బు కడగటానికి మావోడిదేంవన్నా లచ్చలాయేంది. స్టోర్లో సక్కెరా బియ్యంవూ అమ్మక నూకితే యెంతొచ్చుద్దేంది. నాయాల్టి యిరవయేలో.. ముప్పయేలో. అంతేగదా.

శ్రీనాయి : ఓర్నీయమ్మ ఇరవైలూ ముప్పయ్లూ ఎక్కడ్రా సోంనీ. వీయేవోకీ సర్వేయర్కీ ఆరైకీ యమ్మార్వోకీ మన పెసిరెంటుకీ వరసగా పర్సెంటేజీలియ్యాలా. ఎవుడమ్మ మొగుడి సొమ్ము తెచ్చిచ్చేదమ్మా.

కోటిబాబు : ఆ యవ్వారాలాపి అసలు సంగతికి రండోయ్.

యంగట్రావ్ : ముక్కెంగ రాజ్ యవ్వారం ఎట్నో నువు సెప్పవోయ్ బ్రెమ్మం.

బ్రెమ్మం : ఏం వుంది. మీ యీదోళ్లకీ మా యీదోళ్లకీ డిపరెన్సుల్రాకుండా వుండాలంటే వొకళ్ల మీదొకళ్లు పిటీసన్లు పెట్టుకోవటం స్టాప్ చెయ్యాల.

ఇంక.. స్కూల్ టీచరున్నాడు గదా, మీరు కావాలని ఫైట్ చేసి మీ వోణ్నేయిచ్చుకున్నారు.

సుబ్బాయి : మావోడంటే.. మా మేనత్త కొడుకాయేంది. గొర్ల డాక్టర్ని కావాలని మీ సుట్టపోణ్ని తెచ్చుకున్నారు. కాబట్టి కులపోడే కదాని టీచరోడ్ని మేందెచ్చు కున్నాంవూ.

బ్రెమ్మం : ఎట్టయితేంవి. స్కూల్టీచరు మీవోడు డాక్టరు. మావోడు. ఇప్పుడేందంటే.. మీ టీచరు బడికి రాకపోయినా టీచింగు చెయ్యక పోయినా మేం యింటర్ ఫియరు కాంవు. అట్నే...మా డాక్టరు మంతులో వొక్కసారి కూడ ఆస్పత్రికి రాకపోయినా మెడిసన్లన్నీ అమ్మకనూకినా మీరింటర్ఫియర్ కాగూడదు. అప్పుడింక ప్రాబ్లం రాదుగదా.

సుబ్బాయి : ఇది బానే వుందే.

బ్రెమ్మం : తరవాత సెరువు మా కింద వుందిగదా. శాపల మీద యిన్కం ఎంతొచ్చిందని గానీ యేంవైందని గానీ మీ గ్రూపోళ్లు కొచ్చం చెయ్య గూడదు. అట్టానే గుడిమాణ్నెం యిన్కం గురించి మావోళ్లు కొచ్చం జెయ్యకుండా వుండాల.

గంటోడు : ఇదీ బానే వుంది. (గంటోడి వంక కోపంగా చూసేడు కోటిబాబు)

యంగట్రావు : ముక్కెంగా యింకొక్కటుందబ్బాయ్. పీసీ ఆడుకునేటప్పుడు... అంతా గుంపుగా యీ అరుగు మీద సేరటం వాడొకటీ యీ డొకటీ అని తగూలు పెట్టుకోవటం. అందుకనీ ఈ రోజు నించీ యీ అరుగు మీద పీసీ అట్టం మానెయ్యాల. డాక్టరెట్టా రాడు కాబట్టీ మీ గూపోళ్లంతా గొడ్లాసుపత్రిలో ఆడుకోండి. మా గూపోళ్లంతా రాంవులోరి గుళ్లో ఆడుకుంటారు. లేదా స్కూల్ టీచరు కూడా వొక సెయ్యేస్తాడు కాబట్టి బళ్లో యెజ్జెష్టయినా ప్రాబ్లం వుండదు.

సుబ్బాయి : ఇదింకా బాగుందీ. (పాన్ పరాగేసుకున్నాడు)

బుచ్చయ్య : ఒరే..నేనొక మాట..

గంటోడు : సెప్పేది కానియ్యవే.

బ్రెమ్మం : ఈ రకంగా.. అందరంవీ కలిసి డిసిప్లీన్గా పీసుపుల్గా విలేజీని డవలప్ చేసుకుందాంవూ.

యంగట్రావ్ : ముక్కెంగా రాజీ అయిపోయిందబ్బాయ్.

సుబ్బాయి : రైతు బందుశాత మనం యేంపన్లు చేయిచ్చుకోవాలా అనేది..

బ్రెమ్మం : నా వొపీనియనేందంటే యెక్కువగా అడక్కుండా..పర్టికులర్గా టూ వర్క్స్ అడుగుదాంవోయ్. ఒకటేంవో వుత్తరపు పొలానికి గ్రావెల్ రోడ్డెయ్యటం రొండోదేంవో మరి సెట్టుకాడ బాయి తొవ్వించ్చటం.

యంగట్రావ్ : ఉత్తరపు పొలం ఎక్కువగా మీ తూరుపీదోళ్లదే కాబట్టి ముక్కెంగా డొంక రోడ్డు మీరేయిచ్చుకోండోయ్.

కోటిబాబు : అదిరా సంగతి. ఉత్తరప్పొలాన బ్రెమ్మాంది యిరవై గదుర్లేకుల్సెడ్డు కాళీగా పడుందిలే. అక్కడ దాకా గ్రావెల్ రోడ్డు పడితే... సాలుకి పదేనేలు రెంటిస్తాం వంటన్నారంట పొగాక్కంపెనీవోళ్లు. అట్నించి నరక్కొస్తన్నాడులే.

బ్రెమ్మం : మరి డొంకరోడ్డు తెచ్చి మీ యింటి ముందేయిచ్చ మంటావా.

చారోడు : నాయాల్ది మాగూపోళ్లకి మరిసెట్టు కాడ బాయన్నమాట.

శీనాయి : మరక్కణ్నే కదంట్రా సోంవీ యంగట్రావు యాటా నారు దొడ్లు బెట్టేది. బాయికొక మోటరు కూడ బిగిస్తే.. ఒక పనైపోద్ది.

సుబ్బాయి : మరి బాయెక్కడ తొవ్విచ్చాల్నో నువ్వు చెప్పరాదంటమ్మా.

శీనాయి : ఇంకెక్కడా సోట్లేదా యేందిరా సోంవి.

చారోడు : గంగెద్దల మిట్టకాడ తొవ్విచ్చ కూడదాయేంది.

యంగట్రావ్ : అంతేలే. అక్కడైతే...శీనాయ్ గొడ్ల కొట్టానికి బాగా దగ్గిరగా వుంటదిరా

గంటోడు : పెద్దానికీ అడ్డం చెవితే యట్టరా.

సుబ్బాయి :ముందనుకున్న పెకారం కానియ్యండబ్బాయ్ మాట్లెందుకు.

శీనాయి : ఎంగిలి ముద్దలెవ్వారం చెయ్యమాకరా సుబ్బాయ్. పెద్దానికీ వాణ్నెనకేస కొస్తండావ్ సీజన్లో పెట్టుబడి పెడతాడనేగా.

సుబ్బాయి : తన్నేనంటే నాకొడక... గుండెల్తో కూడ జారిపోవాల. నాది యెంగిలి ముద్ద లెవ్వారం వా. మళ్లీ అన్రా ఆ మాట. (దురుసుగా పైకెల్లేడు)

యంగట్రావ్ : ఊరుకోరా సుబ్బాయ్. (సెయ్యిబట్టి యనక్కి లాగేడు)

సుబ్బాయి : పెట్టుబడి నువు పెట్రాదంటే ముండా. నీకోటా బియ్యం నూకటానికి.. శారోడు..నువ్వు పలకమన్నట్టల్లా పలకటంలా.

చారోడు : తంతా నాయాల. మజ్జిలో నాయవ్వారంవెందుకు.

మొగుడు : అందదూ అత్తాతోల్లేగదా, ఇంక అనుకునేదెందుకుదా బాబాయ్.

కోటిబాబు : ఒరే పండో మీ బాబొస్తన్నట్టున్నాడు కదరా.

రాంపందు : ఈ బురిడీ మాటల్నమ్మన్లేరో
(గంటోడు సైగ చేసి బస్టాందు వంక సెయ్యి చూపిచ్చేదు. అటు చూసిన రాంపందు అదిరి పడి పైకి లేశాదు)
వామ్మో నిజంగానే వొస్తన్నాదు, తప్పుకోంట్రా. నేనిక్కదుండట్టు యొవురూ సెప్పవాకండి (జనాన్ని తోసుకుంటా యెల్లి అరుగు సాట్న దాంకున్నాదు)

శీనాయి : ఒరే మొగుడా.

మొగుడు : ఏందే బాబాయ్.

శీనాయి : రాంకోటు బాబొస్తన్నాదు గదా. ఆయన్ని వలకరిచ్చే ధైర్నం నీకుందంట్రా.

మొగుడు : పలకదిత్తానికి నాకేంవన్నా బయ్యంవా యేంది.

శీనాయి : అయితే పిలవరా, మొగోడివైతే అరుక్కాడికి రప్పిచ్చు. ఊ.

మొగుడు : దెబ్బకి దప్పిచ్చనో. ఏందే బాబాయ్ తీసి నూకేవే.
(పట్టేళ్లు బుజానేసుకోని నాగేలు యింకో బుజాన పెట్టుకోని రాంకోటు వూరు తట్టుగా యల్తన్నాదు. శీనాయి సైగజేశాదు)

మొగుడు : ఒయే బాబాయ్ దాంకోతు బాబాయ్ (రాంకోటు ఆగేదు)
ఒక్కదుగు యితు దాయే

రాంకో : యేందిరా. (ముందుకొచ్చాదు)

మొగుడు : ఏందో యిప్పుడు సెప్పవే శీనాయ్ బాబాయ్.

శీనాయి : నన్ను చెప్పమంటావేందిరా సోంవీ, పిల్చేవుగా సెప్పు.

మొగుడు : నేం చెప్పేదేందే బాబాయ్.

శీనాయి : అదేరా రైతుబందూ సమ్మానంవూ.. ఇందాక చెవితివే. నీకు తెల్పిన సంగతే గదంట్రా సోంవి

మొగుడు : అదా. (రాంకోటు దగ్గెరకి పోయేదు)
ఇదుగో దాంకోతు బాబాయ్ దైతుబందు అదే తోక దాంవయ్య మనోదు

మంచి నాయకుదూ. ఇయ్యాల మనూదు కొత్తందాదంత. దంద లేసి సమ్మానం చేత్తం దాదు. అంతేగదో శీనాయ్ బాబాయ్.

శీనాయి : నువ్వు చెవతా మజ్జలో నన్నడుగుతా వేందిరా సోంవి.

మొగుడు : అంతేనే. నువు కూడా వుంతే బాగుంతదని.

రాంకోటు : చారోడా యిట్రారా, (చారోదు దగ్గిర కొచ్చేదు. రాంకోటు నాగేలు కిందకి దించి చారోడికి పట్టిచ్చాదు. శీదేవి మొగుడి పనైపోయిందన్నట్టు ముసిముసిగా నవ్వుకుంటండారందరూ.)

రాంకోటు : రైతుబందు మనూరొత్తన్నాడా సమ్మానం చేస్తండారా నేనూ కూడా వుండాల్నా ఏం వ్రా.

మొగుడు : అంతేగదో. ఒక దంద కూడా యేత్తే బాగుంతది బాబాయ్.
(యంటనే రాంకోటు సెప్పుదీసి శీదేవి మొగుణ్ని బాదటం మొదులెట్టేదు)

రాంకోటు : రైతుబందు సమ్మానం దంద యాస్తారా.

మొగుడు : ఒదే ఒదే ఒదే నీయమ్మ సావనూకుతుందావేందే. అబ్బో అమ్మో నీయమ్మ కొదితే కొత్తేవు సెప్పుతో కొదతావేందే బాబాయ్.

రాంకోటు : సెప్పుతో కాదురా, సెప్పు తెగిందాక కొట్టాల. పదేళ్లనాదు పుగాకు కొని పైసా యియ్యకుండా పారిపోయేదు. ఆ దొంగ నా కొదుకు రైతు నాయకుడా. రైతుల కొంపలు ముంచి లచ్చలు కాజేసిన్నాకొదుకు రైతుబందా. వాడికి దండం పెట్టి దండెయ్యటానికా మీరంతా యిక్కద చేరింది. సిగ్గూ లజ్జా లేదంట్రా మీ మొకాలకి. ఒరే శీనుగా మీ అయ్య తాటి సెట్టు సేను తెల్లారేల కమ్మేసేదు. ఎందుకురా. ఆ తోకరాంవదూ అదే రైతుబందు మీ అయ్యని ముప్పయ్యేలకి ముంచితే అప్పుల బాధ తట్టుకోలేక సేనమ్మేదు. ఒరే సుబ్బిగా మీయయ్య పురుగుల మందు తాగి కందిపట్టెలో దిక్కు లేకుండా చచ్చేదు. ఎందుకురా, ఆ తోక రాంవదు మీ అప్పని చేసుకుంటానని మాయమాటలెప్పి కదుపు చేసేదు. పది మందికీ తెలిసేలకి పత్తా లేకుండ పోయేదు. వాడికి దండెయ్యటాని కొచ్చేవంట్రా తప్పుణ్నాయాల.
(దంద గబుక్కున యనక దాచుకున్నాదు సుబ్బాయి.)

ఎంవే యిార్సాంబాబా బుచ్చిమాంవా అంతా తెల్లంగా నెర్సినోళ్లు మీకెట్టా లజ్జ లేదే యిక్కడ కూసోటానికి థూ (అంటా వూసి నాగేలు బుజానికెత్తుకున్నాడు.)

రాంకోటు : గంటోడా రారా యిటు, (ఉలిక్కి పడి పరిగెత్తుకొచ్చేడు గంటోడు) మా పండోడేంవన్నా కనపడ్డాడా.

గంటోడు : ద బ అది... (నీలు నములుతున్నాడు)

రాంకోటు : నా సంగద్దెల్సుగా ఇక్కడికొచ్చేడాని.

గంటోడు : ఒచ్చేడు సెట్టు సొట్నుండాడు.

రాంకోటు : పండో రాంపండో,

(బిక్కు బిక్కుమంటా అరుగు మీదకెక్కాడు రాంపండు. పండుని బాదేస్తాడు అనుకుంటన్నారంతా. రాంకోటు కోపం దిగ మింగేడు.) ఎద్దులు సెర్లో వుండయ్, ఒల్లు కడిగి తోలకోస్తా. ఈ నాగేలు కొట్టాం కాడికి తీసకపా. (పండు యనకా ముందుగా చూస్తన్నాడు) ఎత్తుకుంటావా లేదా

(పండు వులిక్కి పడి నాగేలు బుజానికెత్తుకోని వూరు వైపుగా యెల్లేడు. కండవ యిదిలిచ్చి పైనేసుకోని అందరి వంకా ఒక్క చూపు చూసి వొచ్చిన దార్నే యెల్లిపోయేడు రాంకోటు, కాసేపొవురూ మాట్లాడా)

సుబ్బాయి : ఈ పుర్లుబెట్టే నా కొడుకు చేసేడ్రా యిదంతా. పిలిపిచ్చి సెప్పుతో కొట్టిచ్చేడు.

శీనాయి : నాగ్గూడా పెట్టేడు గదరా సోంవీ గెడ్డి.

స్టిక్కోడు : రాంకోటన్నది నిజంవేరా. తోకరాంవడు తప్పుడోడే.

చారోడు : నాయాల్ది ఇందాకట్నుంచీ యిా కూత కుయ్య గూడదో.

బ్రెమ్మం : నిజంవే తోకరాంవడు ఫ్రాడ్ చేసేడు. ఎవుడు చెయ్యటం లేదు. మన యంపీ సంగతేందీ కోట్లు ఎరన్ జేసేడు. ఎవురడిగేరూ.

గంటోడు : మనాల వాళ్లోళ్లు బయటేసుకుంటారా యేంది, యాంవైనా పక్కోడు పచ్చంగుంటే మన కులపోళ్లు సూళ్లేర్రా.

యంగట్రావ్ : రైతుబందు యగ్గొట్టేడు. అయితే దాంతోనే కోటీస్సురు డయ్యేడాయేంది. ముక్కెంగా కాళీ పొగాగ్గోడౌను తగలేసేడు. రొందు ..కోట్లకి యించూ

రెంచు క్లెయింజేసేడు. అట్టా మేనేజ్జేసుకోని సెటిలయ్యేడుగనీ, మన సొమ్మేంవన్నా పెట్టేంవా.

గంటోడు : రేపెమ్మెల్లే సీటొస్తే కోట్రూపాయలు పొయ్యాల. ఎవురిస్తారేందిరా.

బ్రెమ్మం : సెటిలయ్యేవోణ్ణి చూస్తే యెవురికైనా జలసీ లేరా.

బుచ్చియ్య : ఒరే నేనొక మాట..

కోటిబాబు : సెవుదువుగోన్లే వుండే. ఇంతకీ రైతు బందేద్రా.

బ్రెమ్మం : డెఫనెటుగా వస్తానన్నాడే.

యంగట్రావ్ : ముక్కెంగా ఆయనకెన్ని పన్లంటా. వస్తానే వుండాల.

స్టిక్కోడు : అదృరేగనొరే తోకరాంవడొచ్చినాక అదే రైతుబందొచ్చినాక ముందోడిగా దండే సేదొవుడ్రా వాళ్లోడా మనోడా.

గంటోడు : పడిందిరా స్టిక్కు

యంగట్రావ్ : ఇందుగ్గదంటే పెదనానా అందరూ నిన్ను స్టిక్కోడంటందే. ముక్కెంగా ముడి బణ్నియ్యవేందీ. (కారొస్తన్నట్టు యినపడింది)

బ్రెమ్మం : అదుగోరా అదేకారు. రండ్రా, రైతుబందు కే.

(అందరూ కిందికి దూకేరు. జిందాబాదులు కొడతా బస్టాండు వైపుగా లగెత్తారు. పెద్ద పెద్దంగా జే కొడతన్నారు. ఢాం మంటా అవ్వాయ్ సువ్వాయ్ పేలింది. గెడ్డం చేయించుకుంటన్న ముసిలోడు బ్యార్ మని అరుస్తా పైకి లేశాడు. శంప మీద రగతం కారతా వుంది. ముచ్చాల్ని యేందో అంటన్నాడు. రొదలో యీ మాటలినిపించటంలా యింకేదో సర్ది సెవతన్నాడు ముచ్చాలు. టపాసులు మోగుతానే వుండయ్. కాసేపుటికి గులాం రంగులో మునిగిపోయుండా మడిసిని మోసు కొచ్చారు. ఈళ్ళు కూడా గులాంలో మునిగి పోయుండారు. అరుగు దగ్గెర కొచ్చినా అతన్ని కిందికి దించటంలా. ఒకరు దించంగానే యింకొకరు బుజాల మీద కెత్తుకోని యీరావేశంగా జేజేలు కొడతన్నారు. శానాసేపుటికి అల్సిపోయి కిందకి దించేరు పువ్వులు రాలిపోయి దారం మటుకి అతని మెల్లో మిగిలింది. యంగట్రావతన్ని గెట్టిగా కావలించుకున్నాడు. బ్రెమ్మం తన వైపుకి లాక్కోని తానుగూడ వాటేసుకోని అదనంగా మెడ మీద ముద్దు కూడ పెట్టుకున్నాడు.

శీనాయొచ్చి గబుక్కున కాళ్లకి దండం పెట్టి పైకి లేసి వాటేసుకున్నాడు.)

బ్రెమ్మం : మీరంతా సైలెంటుగా వుంటే మన రైతు నాయికుడ్ని గురించీ సిన్న స్పీచ్చిస్తానూ....

యంగట్రావ్ : మన ప్రియతమ నాయికుడూ రైతుబందూ ముక్కెంగా మన అన్న... మన మజ్జకొచ్చేడూ.. నేంజెప్పేదేంవంటే

బ్రెమ్మం : రైతుబందో....రైతు నాయికుడో.... రైతు బందో...
(జిందాబాద్ అంటా కేకలేస్తండారు మిగిల్నోళ్లు)

యంగట్రావ్ : ఆపండి..ఆపండే..ఇప్పుడూ.. ముక్కెంగా మన అన్న మాట్లాడతాడు.

అతను : అయ్యా మీరందరూ అనుకున్నట్టు నేను రైతుబంధుని కాదు (అందరూ చప్పట్లు కొట్టారు)
మీరిప్పుడు చప్పట్లెందుకొట్టేరో నాకర్థం కాలేదు.

బ్రెమ్మం : మన అన్నకీ పొగడ్తలంటే లైకింగుండదూ. అందుకనే అస్సలు రైతుబంధునే కాదంటన్నాడు.

అతను : కాదండీ నిజంగానే నేను రైతుబంధుని కాదు. ఆయనకి దూరపు బంధువుని, నా పేరు రంగనాయకులు.
(అందరూ తెల్లబోయి ఒకరి మొకాలొకరు చూసుకుంటన్నారు. బ్రెమ్మంవు యంగట్రావు ముందుకొచ్చి రంగనాయికులు మొకాన్ని దగ్గరగా చూస్తన్నారు. గులాం రంగులో యెవురో తెలవటంలా) అర్జంటు పని వల్ల రైతుబంధు యీ సభకి రాలేకపోయారు. ఆ మాట చెప్పటానికి నన్ను పంపించారండీ.

శీనాయి : ఈ ముక్క ముందే సెప్ప గూడదంట్రా సోంవీ.

గంటోడు : అతన్ని నోరు తెరవ నిచ్చేరా మీరు. ఒచ్చిందొవురో కూడా సూడకుండ లగెత్తుకోని పోతిరే. ఇంకొవుడన్నా ముందు పోయి దండేస్తాడనే.

శీనాయి : ఆ లుంగీలు జారిపోయేది చూసుకోకుండా లగెత్తి వాటేసుకున్నాం డొంకరోడ్డు నూకచ్చనీ.

కోటిబాబు : ఆహా దండేసి కాళ్లకి దండం పెట్టిందొవురో బాయి కోసం.

గంటోడు : బుజాల కెత్తుకోని బొల్లావునాడిచ్చినట్టు ఆడిచ్చేరు కదరా.

బ్రెమ్మం : గంటోడా యింక నోర్ముయ్యి.

యంగ్‌ట్రావ్ : శచ్చచ్చచ్చ... ముక్కెంగా యదవతనంవై పోయింది గదరా. రారా సుబ్బాయ్. (అంటా ఊరు వైపుగా యెల్లిపోయాడు. మిగిల్నోళ్లు కూడా దారి పట్టేరు. పేకాటోళ్లు మల్లీ పరుసుకుంటన్నారు)

బ్రెమ్మం : రారా గంటోడా, (బ్రెమ్మం ఎల్లిపోతన్నాడు. గంటోడు కూడ అతనెంటే యెల్లిపోయేడు. కోటిబాబు బుర్రుమనిపిచ్చేడు)

రంగనా : సార్ అంజయ్య యిల్లెక్కడో చెవుతారా.

కోటిబాబు : వాళ్లనడగవయ్యా. (అంటా బండి మీద తుర్రున యెల్లిపోయాడు)

రంగనా : ఏంవండీ అంజయ్య గారిల్లూ...

శీనాయి : ఇంకొవుర్నన్నా అడగరా సోంవీ. పేక కలపంర్రా. (యొవురూ దారి సెప్పేట్టు లేరు రంగనాయకులు యనక్కి తిరిగేడు. బస్టాండు వైపునించి వూరు వైపుగా యల్తన్నాడు మాయోడు.)

రంగనా : సార్... అంజయ్యగారిల్లెక్కడో చెప్తారా.

మాయోడు : ఏ అంజియ్య మరిసెట్టుకాడంజియ్యా కొండయ్య గారంజియ్యా. కోడి పెంటంజియ్యా.

రంగనా : .....రైతుబంధు. తోకరాంవయ్యకి బాగా దగ్గరోడంటా.

మాయోడు : అయితే కోడిపెంటంజియ్య. నేనక్కడకే పోతండా. తీసకపోతా రా.

రంగనా : కో..డి..పెంట.. అంజయ్యా.

మాయోడు : వస్తన్నావా లేదా.

రంగనా : వస్తన్నానండీ. (మొకం చూపిచ్చి)
కాసిన్ని నీళ్లు...

మాయోడు : దార్లో బోరింగుందిలే రా... మందేవూరూ.
(వాళ్ల మాటలు దూరంవై పోయినియ్. పేకాట జోరందుకుంది మల్లీ)

# దృశ్యం 3

(కోడి పెంట అంజయ్య మండువా లోగిలి. మంచం మీద బోర్లా పండుకోని ఆంధ్రబూంచి యీక్లీ చదువుకుంటా వుంది రాజ్జం. గింజల బస్తా బుజానేసుకోని యింట్లో కెల్తన్నాడు పేరాయి. యేరుశనక్కాయల్దింటా ఓపక్కన కూసున్నాడు ఒంటేద్రాగోలు.)

పేరాయి : రాగోలో ఊరెక్కూసోకపోతే కొట్టాంకాడికి పోయి పాలు పిండక రాగూడదో.

రాగోలు : బలే సెప్పేవే ఇక్కడ్నే కూసోమన్నాడు పెద్దాయన.

పేరాయి : తింటా కూసోమన్నాడా.

రాగోలు : బలే సెప్పేవే. సూస్తా కూసోమన్నాడు కాపలా.

పేరాయి : కాపలా యెవురికీ.

రాజ్జం : నాకు. ఎవరన్నా యెత్తుకు పోతారనీ.

పేరాయి : ఆ....అదా...సర్లే. (బయిటి కెల్లాడు)

రాజ్జం : రాగోలూ..నీకు చదువొచ్చా.

రాగోలు : బలే సె ప్పేవే గడగడగడ సదివెయ్యనో.

రాజ్జం : సెంటర్ సెన్సేషన్ కథ...యెప్పుడన్నా చదివావా.

రాగోలు : అదేందో నేనెప్పుడూ సదవలేదే.

రాజ్జం : నీకెప్పుడూ లౌజెయ్యాలని కోరిక పుట్టదా.

రాగోలు : లౌజెయ్యటంవా

రాజ్జం : సర్లే. అద్దెలిస్తే నాక్కాపలా యెందుకుంటావ్.
(మళ్లీ బయట్నించి బస్తా మోసుకొచ్చిన పేరాయి వుత్తరం వొకటి తెచ్చి ఒంటేద్రాగోలు కిచ్చాడు.)

పేరాయి : పోస్టెంగటేసుర్లిచ్చేడు. పెద్దాయనకియ్యి.

(పేరాయి లోపలికెల్లాడు. ఒంటేలు రాగోలు చేతిలో వుండా వుత్తరాన్ని గబుక్కున లాక్కొని సించి సదుపుకుంటంది రాజ్జం. తపేల శాత బట్టు కొస్తన్న పేరాయి అది సూసేడు.)

పేరాయి : జాబు.... అమ్మాయి కిచ్చేవా.

రాగోలు : బలే సెప్పేవే. నేనిచ్చేనా. పైకి దూకి పసక్కన లాక్కుంటే.

పేరాయి : జాబులియ్య కూడదని సెప్పలా.

రాగోలు : బలేసెప్పేవే. సూస్తా కూసోమన్నాడుగనీ జాబులియ్యగూడదని సెప్పేడా యేంది. (తల కొట్టుకుని పెద్దాయనకి చెప్పమని సైగ చేసి పేరాయి బయిటి కెల్లేడు. ఒంటేర్రాగోలు లోపలి కెల్తన్నాడు. )

రాజ్జం : ఏయ్ యిట్రా. (రాగోలు దగ్గిరకొచ్చేడు)

ఏం జెప్తావ్ పోయి.

రాగోలు : అదే.. జాబొచ్చిందని సెవతా.

రాజ్జం : దాని కెందుకిచ్చేపురా అని పెద్దాయన కర్ర తీసుకోడూ.

రాగోలు : బలేసెప్పేవే. పెద్దాయనకి కోప్మొస్తే కర్ర తీసుకుంటాడా. సెప్పే.

రాజ్జం : పోయి చెప్పు. (సెవితే తంతాడని యిప్పుడు తెల్సిందతనికి.)

తిట్లు తినకుండా వుండాలంటే నోరు మూసుక్కూచో.

(తలూపి కూసున్నాడు ఒంటేర్రాగోలు. ఉత్తరం మల్లీ చదివినాక యేందో ఆలోశనొచ్చింది రాజ్జానికి)

రాజ్జం : ఏయ్.....మా యత్తని పిలువు.

రాగోలు : పిన్నీ...రత్తం పిన్నీ... (పెరటి వైపుకి పోయి పిల్చాడు. ఆ అంటా లోపల్నించి పలికింది సుబ్బరత్తం) నిన్ను రాజ్జం రమ్మంటంది.

రాజ్జం : తొందరగా.

రాగోలు : తొందరగా రావాలంట, (సుబ్బరత్తం లోపలికొచ్చింది.)

సుబ్బరత్తం : ఏందే రాజ్జం.

రాజ్జం : వాంతౌతంది.

సుబ్బరత్తం : వాంతా వాంతెందుకౌతందే.

రాజ్జం : వాంతెందు కవుద్దో కూడా చెప్పాల్నా కడుపైంది.

సుబ్బరత్తం : కడుపా...కడుపు....యేందే నువ్వనేది.

రాజ్యం : ఇంకా యెట్ట చెప్పాలత్తా, మూడో నెల.

సుబ్బరత్తం : ఓసి నీయమ్మ కడుపు మండ సిన్నంగ మాట్లాడవే. అవ్వ అడకూతురా అనుకున్నంత పని చేసేవు గదే. ఇప్పుడేం జెయ్యాల.

రాజ్జం : పెళ్ళి కాకుండ కడు పైతే యేంజేస్తారు. ఎబార్షన్ చేయించుకుంటారు.

సుబ్బరత్తం : ఓసి లంజ తెగిచ్చుండావుగదే.

రాగోలు : ఏం పిన్నీ కడుపు కాయంవేనా.

సుబ్బరత్తం : ఓర్నీ మొదులారా సిన్నంగ మాట్టాడరా. మాయన్నకి తెలిస్తే దీన్ని బతకనియ్యడు. ఒరే నువ్వర్జంటుగా దొరసానింటికి పోయి నేం చెప్పేనం చెప్పి చాన్నెంట బెట్టకరా. ఇక్కడుండట్టు రావాల. ఒరే యీసంగతి ఎవురికీ సెబ్బాక.

రాగోలు : బలే సెప్పేవే. పెళ్ళి కాకుండా కడుపైతే యెవురికీ సెప్పగూడదని నాకు తెలవదా యేంది. (బయిటికెల్లాడు)

రాజ్జం : ఇదుగో అత్తా నువ్వూ దొరసానీ కలిసి యిక్కడ పల్లెటూరి పద్ధతుల్లో యాంవన్నా చెయ్యాలనుకుంటారేంవో అదేం కుదర్దు.
(బయిట్నించి పాల తపేలాతో పేరాయొచ్చాడు.)

పేరాయి : ఏందీ కుదర్దంటందీ.

సుబ్బరత్తం : ఇట్రా.
(పేరాయిని పక్కకి తీసకపోయి సెవులో చెవతా వుంది. ఇద్దరూ పైకి యినపడకుండా మాట్లాడుకుంటన్నారు. రాజ్జం మల్లీ కతల పుస్తకం సదువు కుంటంది. బయిట్నించి రంగనాయికులు మాయోడు వొచ్చారు.)
ఏబ్బాయ్ మాయోడా రా..ఆయనొవురు.

మాయోడు : రంగనాయికులనీ మీయన్న కోసం వొచ్చేడు. ఉండాడా.

సుబ్బరత్తం : ఇప్పుడే తిండి కాడ కూసున్నాడు. కూసోండి. అమ్మాయ్ నువు లోపలికి పోయే. (రాజ్జం లోపలికి పోయింది)

సుబ్బరత్తం : కూసోండి...మంచినీల్దాగుతారా.

రంగనా : ఆ ఇప్పించండి.

సుబ్బరత్తం : రాజ.. మంచినీళ్దీసకరాయే.

పేరాయి : మోటారురూం తాళాల్దీసకరా.

(తపేలా సుబ్బరత్తానికిచ్చాడు. సుబ్బరత్తం ఇంట్లో కెళ్లింది.)

మాయోడు : యాంవోయ్ పేరాయ్ కంటికి కనపట్టం లేదే వూళ్లో.

పేరాయి : కనపట్టానికి యాడ తీరుద్దీ. తోటకి నీలుగట్టు కోవాల, గొడ్ల మేత సూసుకోవాల. నారు పీకటం నాట్లెయ్యటం..ఒకటా.

(తాళాలు తెచ్చి పేరాయి కిచ్చింది సుబ్బరత్తం)

సుబ్బరత్తం : ఒకసారే తిండి తిని పోగోడదో. (రాజ్జం మంచినీల్దెచ్చి వాళ్లకిస్తంది.)

పేరాయి : ఆలిశంవైతే కరంటు కట్టేస్తారు. (ఎల్లబోయి ఆగాడు) రొండేలు యిప్పిచ్చమని కూసున్నాడు పాపారావు, పనైతే గాని సేలో గింజ పడదని మొండికేసేడు. మీయన్నకి చెప్పు.యీ దబాకి సర్దమను అయిదు రూపాయలోడ్డీ కట్టుకుంటానన్నాళ్లే.

(నీల పైపు సర్దుకుంటన్నాడు)

రంగనా : ఈ యమ్మాయి.. (గ్లాసు రాజ్జానికిచ్చాడు)

మాయోడు : మా అంజియ్య బాబు కూతురు.

రంగనా : ఆంవె.

మాయోడు : ఈ యమ్మాయికి మేనత్త. మా అంజియ్య బాబుకి సెల్లెలన్నా మాట.

రంగనా : అతనూ...అంట పెనింవిటన్నా మాట.

(పేరాయింజూయించి అడిగేడు)

మాయోడు : ఆ ఆ కాదు కాదు.. బలేవోడివయ్యా. (గ్లాసు యిసురుగా లాక్కోని పేరాయినీ రత్తాన్నీ సురసురా చూస్తా యెల్లింది రాజ్జం. పేరాయి బయిటికి రత్తం లోపలికి యెల్లిపోయ్యేరు.)

రంగనా : వాళ్లు క్లోజ్ గా వుంటేనూ.. ఇంటల్లుడేంవో అనుకున్నా.

మాయోడు : ఇంటల్లుడూ.. అంటే.. ఒక రకంగా అట్టాటోడే అనుకోండి. అసలు వాడూ.. మావోడు కాదండే.

రంగనా : కాదంటారూ అట్టాటోడే నంటారు.. అసలేంటండీ.

మాయోడు : అబ్బా... అదంతా సెప్పగూడ నెవ్వారంలెండే. ఈ సుబ్బరత్తానికీ ఆ పేరిగాడికీ తంటెం.

రంగనా : తంటెం అంటే..

మాయోడు : అదే కనకన్ను.. అయితే యేంవండి. అంజియ్య కొడుకెక్కడ్నో బెంగుళూర్లో డా(టు కోర్సు చదువుతుంటాడు. ఇంక యీ యింటి పనీ పొలం పనీ గొడ్డు శాకిరంతా యెవురు చేస్తన్నారనుకున్నా నలుగురు మణుసుల పంజేస్తాడు. అంత ముద్దేగా కర్సయ్యేదీ.

రంగనా : మరి.. రత్తం భర్త.. లేడా.

మాయోడు : పెళ్లయితే వుండేవోడే.

రంగనా : కాలేదా. మరిదంతా అంజయ్యగారికి తెలుసా.

మాయోడు : తెలుసా.. అంటే యింట్లో జరిగే యవ్వారం తెలియకుండా యట్టా వుంటదండే.

రంగనా : ఇం(టెస్టింగా వుంది. అసలు.. వీళ్లిద్దరికీ కనక్షనెట్టా అయిందీ.

మాయోడు : యాంవండీ యిప్పుడు వాడు తోటకాడికి పోయేడు. పన్లన్నీ అయినాక యీంవె అన్నం తీసకపోవాల. ఏకుంజాంవున ఒం(టిగా కొట్టాం కాడికి పోయి నిద్దర్లేపాల. పెళ్లి కాకుండా యింట పడుందీ. వుప్పు కారం తింటందీ. కనకన్నొక రొౌచ్చి పెట్టాలంటండే.

రంగనా : అసలావిడకి పెళ్లెందుకు చెయ్యలేదూ.

మాయోడు : అబ్బా.. మీ రొక్కటొక్కటే బయిటికి లాగుతుండారండే

రంగనా : చెప్పగూడని వైతే వొద్దులెండి. ఏదో.. వూరకున్నాంవని అడిగా.

మాయోడు : చెప్పగూడందేంవుంది లెండి. అంజియ్య సుబ్బరత్తం ఒక తల్లి పిల్లలు అంజియ్యకీ డబ్బుకీ లంకె. డబ్బుకోసం పెంటతినే రకం. రకవేందిలే తిన్నాడు కూడా.

రంగనా : బలేవార్లే వూరుకోండి.

మాయోడు : ఏందీ... ఈ సుట్టు వక్కల అందరకీ తెలుసే. అనలు కోడి పెంటంజియ్యనే పేరెట్టా వొర్చిందనుకుంటన్నారు.

రంగనా : చెప్పండి.

మాయోడు : ఇరవయ్యేళ్ల కిందటి మాట. రచ్చబండ కాడ కూసోనీ.. కు(ర్రాళ్లంతా సెతుర్లాడు కుంటండారు. ఒకడేంవో వాడొవుడో పందెం పెట్టుకొని వంద రూపాయల కోసం వక్క పలం కోడిపెంట తిన్నాడంటా అన్నాడు.

సిసిసీ అన్నారంతా, తింటే తప్పేం వుందీ వంద మిగిలిళ్లేదా అన్నాడు యీ అంజియ్య. అయితే నువు తిన్రా సూద్దాం అన్నాడు అవతలోడు. తింటే యేం విస్తావురా అన్నాడు అంజియ్య. బాంచ్చెత్ నువ్వుగనక కోడి పెంట తింటే... నాకున్న అయిదెకరాల రేగటి పొలం రాసిస్తారా అన్నాడు వాడు. బాంచ్చెత్ నువ్వు కనక అయిదెకరాలు రాసిచ్చేట్టయితే, పలంగాదూ పావుకేజీ తింటారా అన్నాడు యీడు. మాటా మాటా పెరిగింది. ఎవుడూ యనక్కి తగ్గలా మాట తప్పకుండా పెద్దమణుసుల్లో రాతకోతలో కట్టడి చేసుకున్నారు. ఇంకేం వుంది. పావు కేజీ కోడి పెంట పసావసా మింగేసేడూ పందెం గెలిసేడూ అయిదెకరాలు కొట్టేసేడు.

(తట్టుకోలేక తల అడ్డంగా వూపేడు రంగనాయకులు)

నమ్మ బుద్దెయ్య లేదు కదో. బయిటి కొచ్చినాక ఆయన్నే అడుగు. అంజియ్య సిగ్గుపడే మణిసి కాదు.

రంగనా : ఆ... ఆ తరువాత.

మాయోడు : తరవాతేం వుంది. అంజియ్యేంవో కోడిపెంటంజయ్యయ్యేడు అయిదెకరాలు పోయినోడు సన్నాసయ్యేడు

రంగనా : చా..లా... గొప్ప వాడండి. ఆ మరా పెళ్లి.

మాయోడు : వస్తన్నా ఈ అంజియ్య పెంట బుద్ధి వాళ్లయ్యకి ముందే బాగా తెలుసు గాంవాలా..తోడబుట్టిందానికన్నేయం చేస్తాడనీ.. పదేనెకరాల రేగడి బూంవీ అయిదెకరాల బీడూ డెబ్బయ్ సవర్ల బంగారంవూ కూతురు పేరుతో రాసి పోయేడు.

రంగనా : మరింకేం లక్షణంగా కోరిన వాణ్ని పెళ్లిజేసుకోవచ్చు గదా.

మాయోడు : ఆంహా.. అంత వీజీగాదు. ఒచ్చిన పెతి సంవందాన్నీ యేదో వక వంకబెట్టి తిరగ్గొట్టటం మొదులు బెట్టేడు అంజియ్య. అపశకునాలు పుట్టిచ్చేడు. ఆకాశరాంవన్న వుత్తరాలు రాయిచ్చేడు. అబ్బో.. శానా యిద్దెలు చూపేళ్లే. సిట్ట సివర్లో ఒక్కుర్రోడు..అన్నీ తట్టుకోనీ ఆస్తి కోసం కావాలా నే జేసుకుంటాననొచ్చేడు. ఇకప్పుడు అంజియ్య..ఆకరి బాణం వొదిలేడండి. అంతే, వాడు కూడా పరార్.

రంగనా : ఆకరి బాణం అంటే.

మాయోడు : సుబ్బరత్తానికి.. మావూళ్లో యింకొకడితో సంవందం వుండట్టు సిన్న డ్రామా ఆడిచ్చేదు నమ్మిచ్చేదు. (రంగనాయికులు మల్లీ తలడ్డంగా వూపేదు)

రంగనా : మరి యిదంతా సుబ్బరత్తానికి తెలుసా.

మాయోడు : మొదట్లో తెలియదు. తెలుసుకునేలకి వొయుసు ముదిరి పోయింది. పెళ్లాశ మానుకుంది. ఇంకా నీతి కలిగింది కాబట్టి యింటి పట్టునే వుండి అదుగో అట్టా కాలం గడుపుతుంది. ఇంకో సంగతి తెలుసా రొండో వోడికి తెలియకుండా పేరాయితో లింకు పడే కతనడిపిచ్చింది కూడా అంజియ్యే అంటారు. పాపం పున్నెం పయోడికి తెలవాల.. ఇదుగో నేన్నీకేం చెప్పలేదు నీకేంవీ తెలవదు. ఒట్టు..

(ఒట్టు కోసం సెయ్యి జాశాడు)

రంగనా : చెప్పనులే. (మాయోడి సేతిలో సెయ్యేసేడు. కండవ వల్లె వాటేసుకోని అంజియ్య తేపుతూ వొచ్చాడు)

అంజియ్య : యాంవ్రా మాయోడా మొన్న కబురుబెడితే యిప్పుడా వొచ్చేది. (నిబ్బరంగా నవ్వాడు)

మాయోడు : నేను వూళ్లో లేను బాబా.

అంజియ్య : ఇతనొవురు.

మాయోడు : రంగనాయికులుగారనీ, రైతుబందు తోకరాంవయ్యగారు పంపారు.

రంగనా : నంవస్కారం.

అంజియ్య : అరెరెరెరే. మా తోకరాంవన్న పంపిచ్చిన మణిసివా. కూసోకూసోకూసో. (నిబ్బరంగా నవ్వేదు)

అమ్మాయ్ రత్తంవా రొండు గళాసులు మజ్జిగ తీసకరాయే... మనోళ్లే (ఆ... తెస్తండా. అని పలికింది రత్తం లోపల్నించే. మల్లీ నిబ్బరంగా నవ్వేదంజియ్య, అట్టా నవ్వటం వతనికి అలవాటు)

అంజియ్య : రాంవన్న బాగుండాడా. అవునూ యియ్యాలొస్తానన్నాడే.

రంగనా : రావాల్సిందే. అర్జంటు పని అడ్డం వొచ్చి రాలేక నన్ను పంపాడు ముక్యంవైన విషయం మీతో మాట్లాడి రమ్మన్నాడు.

అంజియ్య : మాట్లాడదాం. మజ్జిగ తీసుకున్నాక..యాంఁవ్రా మా డా. గొర్ల దలారీ మీద తిరుగుతుండావా.

మాయోడు : గొర్ల దలారీ మానుకుంట్ని కద బాబా. ఒంగోల్లో యిళ్ల స్తలాల బోకరు పాపారావుళ్లా అతని దగ్గెరుంటన్నా.

అంజియ్య : అయితే ప్లాట్ల బోకరేజీలో చేరేవన్నమాట. మంచిదేలే.
(రత్తం మజ్జిగ తెచ్చి మాయోడికీ రంగనాయికులుకీ యిచ్చింది.)
రంగనాయకులనీ మన తోకరాంవన్న తాలూకు

సుబ్బరత్తం : మనోడంటన్నావు. కదా. రాజ్జానికేదన్నా మంచి సంవందం వుంటే సెప్పమను. నాలుగు సోట్ల తిరిగేవోళ్లు గదా.
(అంజియ్యకి మాత్రమే యినపడేట్టు చెప్పింది)

అంజియ్య : మనమ్మాయుందండీ. మంచి కుర్రోడుంటే సెప్పండి. అమ్మాయేంవో వుద్దోగస్తుడు కావాలంటందీ...

సుబ్బరత్తం : మంచి సంసార పచ్చం వైన పిల్ల. బియ్యే దాకా సదింవింది పెట్టుపోతల కేంవీ తక్కువ చెయ్యం. నా పేర్నుండా పొలంవూ బంగారంవూ అంతాదాందే. పిల్ల మటుకి.. నిప్పంటి దంటే నమ్మండి యాంవబ్బాయ్ మాయోడా నీకు తెలుసుగా.

మాయోడు : ఆ ఆ ..సక్కటి సుక్కగదో.

అంజియ్య : ఇక్కడ తల దించిందంటే బస్సు యెక్కిందాకా తలెత్తదు. అందరి పిల్లలాల సినుమాలు.. అల్లరి సిల్లరి యెవ్వారాలు.. వూంహూ.

రంగనా : చూసేగా...మరి..నాకు టైం లేదండి.

అంజియ్య : ఆ ఆ... (మాయోడి వంక చూశాడు రంగనాయికులు)
ఒరే మాయోడా సేనుగాడి కొట్టుకి పోయీ వంద గ్రేంవులు పుగాకు...
సేబోలాకు తీసకరారా. (మాయోడు బయిటి కెల్లిపోయేడు)
ఆ..యింక చెప్పండీ యేంటి కత.

రంగనా : (ఒక్కాగితం తీసి యిప్పి సూపిచ్చేడు)
ఇది చూడండి. సర్వే నంబరు ఇరవయ్యేడు. ఈ పొలం కొనుగోలుకి కావాల. ఈ పక్క పంటచేలు ఆపక్క వారు ఈ పక్క కొండ ఆ పక్కేంవో నేషనల్ ఐవే. ఇది మొత్తం యాబయ్యెకరాలు. యంతయినా ఫరవాలేదు.

అంజియ్య : అది సరే. ఈ బూంవులు గల్లోళ్లు లొంగి వచ్చే బాపతు కాదే.

రంగనా : ఎలాగైనా ఎంత రేటయినా కొని తీరాలన్నాడండీ.

అంజియ్య : ఒకాల దీంట్లో యెవుడన్నా ఒక ముక్క యియ్యకపోతే.

రంగనా : కుదర్దండీ, మొత్తంగా వాస్తేనే బేరం. రేటాశ చూపండీ.

అంజియ్య : అసలీ బూంవెందుకూ యెవురికీ కతేంది

రంగనా : అదీ....సీక్రేటు.. అయినా రాంవయ్యగారు మీకు చెప్పమన్నార్లే.

అంజియ్య : మా సావాసం అట్టాటిదిలే. సెప్పు.

రంగనా : జనంలో పడిందంటే ఒక్క గెజం కూడ కొన్లేంవు. లక్షలు మిగిలే వ్యవహారం. ఊరక పోతుంది.

అంజియ్య : ఇశయం జెప్పు.

రంగనా : యూరోప్ నించీ బహుళజాతి కంపెనీ అంటారే.. పెప్సి కోకో కోలా లాంటి దన్నమాట. అది మన దేశంలోకి రాబోతంది. ఇండియా కొలాబరేషన్తో పెద్ద పెస్టిసైడ్స్ కంపెనీ పెడతారంట. తొమ్మిదొందల కోట్లు దాని పెట్టుబడి. ఆసియా మొత్తానికి దాన్నించే సప్లయంట దాన్నెక్కడ పెట్టలా.. అని యిండియా మొత్తం సర్వే చేసి రెండు ప్లేసులు సెలక్టు చేసేరంట. ఒకటి యీ సర్వేనంబర్లోది. రెండోది తమిళనాడులో తిరుచ్చి దగ్గర. దీన్ని కనక మనం కొని పెట్టలేకపోతే తమిల్నాడు కెల్లిపోతారు. స్టేట్ లెవల్లో యిద్దరూ సెంటర్లో యిద్దరూ దీని వెనకున్నారు. వాళ్లంతా కలిసి యీ వ్యవహారం డీల్ చేసే బాధ్యతని మన రాంవయ్యగారి కప్పజెప్పారు

అంజియ్య : మరీ.. దీంట్లో ఆదాయం ..

రంగనా : అది కూడ చెప్పమన్నారు. ఈ పని చేసి పెడితే మీకు టూ పర్సెంట్ కమీషను, ఫరెగ్జాంపుల్ ఆ యాభయ్యేకరాలురీ యాభై లక్షలకి సెటిలైందనుకో. మీకు లక్ష వస్తుందన్నమాట.

అంజియ్య : రాంవన్నకి.

రంగనా : వారికి ఫైవ్ పర్సెంట్ కమీషనిచ్చి ఫ్యాక్టరీ కట్టేటప్పుడు లేబర్ కాంట్రాక్టు కూడ యిస్తాంవన్నారు.

అంజియ్య : అయిదరాబాదోళ్లకీ డిల్లీ వోళ్లకీ...

రంగనా : హైదరాబాదులో వున్న యిద్దరికీ కలిపి పావలా వాటా. ఢిల్లీకి పావలా వాటా. మిగిలిన అర్ధరూపాయి..

అంజియ్య : పయోళ్లకన్న మాట. (నవ్వాడు నిబ్బరంగా)

రంగనా : ఇంకావుంది. ఇది నక్స సైతే రాంవయ్యగారికీ మీకు నాకూ రాజయోగంవే.

అంజియ్య : అదెట్టా.

రంగనా : ఈ పొలం ఎదురు రోడ్డుకి రొండో వైపున పనికి రాని సవిటి పొలం వుందంటగదా

అంజయ్య : ఆ

రంగనా : మనం ముగ్గురం కలిసి..బాగా చౌక రేట్లో ఆ సవిటి భూమి మొత్తం కొనేస్తాం. ఈ ఫ్యాక్టరీ మొదలైతే యెదురుగా పెద్ద టౌనుషిప్పేర్పడాల. ఆ పనికిరాని సవిటి పొలంవే కోట్లమ్ముద్దన్నమాట. కాబట్టి యిదేంవో ఫ్యాక్టరీ కోసంవు అదేంవో మన కోసంవూ కొనాల. తేడావొస్తే.. కొంపలు.. కాదు గవర్మెంట్లు కూలిపోయే వ్యవహారం. మందేదో మనం జాగర్తగా చూసుకోవాల.

అంజియ్య : మరీ సంగతి.. ఊళ్లో యింకెక్కడా లీగ్గానియ్య కూడదు.

రంగనా : ఆ మాట నేను మీకు చెప్పాల.

అంజియ్య : ఇంక లేవండి బోంచేద్దురుగోని.

రంగనా : లేదండీ నేనెళ్తాను.

అంజియ్య : మా తోకరాంవన్నొస్తే యీ యింట్లో యెంగిలి పడకుండా పోదు. నువ్వూ రాంవన్నతో సంవానంవే. తినాల తప్పదు
(నీళ్ల సెంబుతో వచ్చింది సుబ్బరత్తం)

సుబ్బరత్తం : అన్నం వొడ్డిచ్చా. కాళ్లు కడుక్కోండి.

అంజియ్య : మన పద్దతులట్టాటియి లేవండి.
(సెంబుతో బయిటికెల్లాడు రంగనాయకులు)

సుబ్బరత్తం : ఇరవయేడు సర్వే నెంబర్లో పొలం మనదేగా, తలుపు సాట్నించి యిన్నా.

అంజయ్య : నడించిన నాలుగెకరాలు రాంకోటు సేనుంది. అది కనక కొని మన కిందకి తీసుకోగలిగితే..మనం ఎంతంటే అంత. యొవుర్తో అనంవాక.

సుబ్బరత్తం : నాకు తెలవదా యేంది.

(రంగనాయికులొచ్చాడు. సుబ్బరత్తంవు రంగనాయికులూ ఇంట్లో కెల్లారు. మాయోడు పొగాకు తీసుకొచ్చి అంజయ్యకిచ్చాడు.)

మాయోడు : రంగనాయకులుగారు ఎల్లిపోయేరా

అంజియ్య : పొయ్యేరుగనీ నిన్ను పిలిపిచ్చింది ఎందుకో అడగవేందిరా.

మాయోడు : సెప్పు బాబా.

అంజియ్య : నాలుగేకరాలు పొలం బేరం చేసి పెట్టాల్రా. మన సుట్టపోడొకడు కావాలనొచ్చేడు. మనతరుపునే వుండి యగసాయం చేసుకుంటాడంట.

మాయోడు : అదెంతపనే. ఏ పొలాన కావాల్నోసెప్పు.

అంజియ్య : సెవతా. ఏసేను కావాల్నో కతెట్టా నడపాల్నో అంతా రేపొద్దున చెవతా, పనైతే.. బిళ్లకుడుంవాల పదేలు సేతులో పెడతా. నీ పాతబాకీ రద్దు జేసి నోటు చించేస్తా.

మాయోడు : అసలా సేనేదో చెప్పు బాబా.

అంజయ్య : దూకుడొద్దూ. సవిటి పొలం ఎవ్వారం కూడా చూడాల. రేపు పంచవి రోజున మొదులెడదాం. సూడో. యీ యవ్వారంలో నా పేరెక్కడా బయిటికి రాగూడదు. కత అడ్డం తిరుగుద్ది. శానా జాగర్తగా నడపాల.

మాయోడు : నువు చూస్తావుగదే బాబా. మరి నువు మటుకి యింకొవుర్తోటీ అనమాక.

అంజియ్య : రేపొద్దున రా.

మాయోడు : తెల్లారేలకి యిక్కడుండనో. (మాయోడెల్లిపోయేడు. సుట్ట నిప్పుతో రత్తం వొచ్చింది. సుట్ట ముట్టిచ్చు కుంటన్నాడంజయ్య)

సుబ్బరత్తం : మన పొలం లచ్చరేటు పలుకుద్దా.

అంజియ్య : లచ్చగాదు మూడు లచ్చలు పలికిస్తా. అయితే రాంకోటు లొంగి రావాలు. పెళ్లనుకున్నాంగా రాజ్జం అదుష్టం ఎట్టుందో సూడాల.

సుబ్బరత్తం : ఏంవి అదుస్టంవో యేంవో. దానికేంవీ లోకం తెలవటంలా.

అంజియ్య : మల్లీ కాలేజీ కెల్తానని గోల్జేస్తుందా.

సుబ్బరత్తం : కాలేజీ కెల్టంగాదు.. యేం చెప్పేదిలే.

అంజియ్య : సెప్పు.

సుబ్బరత్తం : నాపాణం వొనికి పోతంది. దానికేంవో సీంగుట్టినట్టున్నాలేదు.

అంజియ్య : యాంవైందమ్మాయ్.

సుబ్బరత్తం : అదీ.. నువు పెద్దంగా కేక లెయ్యవాకు.. అదెక్కడ్నో కాల్జారింది.. మూడో నెలంటంది.

అంజియ్య : దానికెందుకు అంత కంగారవతావు. ఆ దొరసాన్ని పిలిసీ (అంటా బయిటికి చూసి సెప్పటం ఆపాడు. దొరసానీ ఆంవెనక యేరు సెనక్కాయలు తింటా ఒంటే(రాగోలూ వచ్చారు. లోపలికెల్లేడు అంజియ్య)

సుబ్బరత్తం : ఒసే దొరసానీ రాజ్జంవూ...

దొరసాని : ఒంటేలు రాగోలు చెప్పేళ్లే వదినా.

సుబ్బరత్తం : సెప్పేడా, ఓరి మిడింవేలపోడా యొవురికీ సెప్పద్దంటిని గదరా.

రాగోలు : బలే సెప్పేవే. సెప్పిందాకా వూరుకుండాయేంది

సుబ్బరత్తం : హు.. పోయి పంజూసుకో. (రాగోలు పెరట్లోకెల్లాడు, రాజ్జం సూట్‌కేస్ తెచ్చి మంచం మీద పెట్టి బట్టలు సర్దుకుంటంది.)

సుబ్బరత్తం : సూటుకేసేందే.

రాజ్జం : నేనిక్కడ చేయిచ్చుకోనం చెప్పేనా.

సుబ్బరత్తం : సెవితే పరుగేనా. మంచీ సెడ్డా సూసుకునే పన్లేదా.

రాజ్జం : కడుపు తీయించుకోటానిగ్గాడ పంచాంగం తీసి మూర్తం బెట్టాల్నా.

సుబ్బరత్తం : సూడే దీని దూకుడు ఆడపిల్లేనా యిది.

రాజ్జం : అయితేనే కడుపొచ్చింది.

దొరసాని : నువ్వుండొదినా.. నే మాట్లాడతాను... ఎన్నో నెలమ్మాయ్.

రాజ్జం : మూడు.

దొరసాని : దీనికి ఒంగోలు దాకా యెందుకమ్మాయ్. (సెవులో యేందో సెప్పటోయింది)

రాజ్జం : నేం చేయించు కోనని చెప్పానా. (కంయ్యిమంటా అరిసింది)

సుబ్బరత్తం : ఒసే ఒసే.. ఆ కేకలేందే. తలొంపులొచ్చే పంజేసింది చాలక.

రాజ్జం : నీ కంటే యెక్కువేం చెయ్యలా.

సుబ్బరత్తం : ఏందే నువ్వు కూసేది. పళ్ళురాల గొడతా లంజా.

రాజ్జం : రెచ్చిపోబాకు. నేనేంవీ పనోడి పక్కలో పండుకోలా.

(సుబ్బరత్తం నోరు పడిపోయినట్టయింది. కాసేపావురూ మాట్లాడలా, సుబ్బరత్తం కూలబడి పోయింది)

దొరసాని : ఇదుగో యేందమ్మాయా ఆ మాట్లూ. సిన్నా పెద్దా వుండబన్లా. ఆ పిల్ల మాట్లకేం వొచ్చెలే వొదినా నువ్వూరుకో. (సుబ్బరత్తం దగ్గరకొచ్చింది)

సుబ్బరత్తం : దాని వొయుసెంత నా వొయుసెంత. అది ఏవంటందో సూడే. నా కరమ. అందరి సేత యిట్టా అనిపిచ్చుకునే రాత రాసేడు ఆ బగమంతుడు. రేత్రింబగుళ్ళు యిరగబడి సేస్తన్నా. ఎవురి కోసం. నేనంటే యొవురికీ లెక్కలేదు. నాకొవురూ లేరనేగదే. నేనెందుకే యింక బతికేదీ. (కుంవిలి కుంవిలి యేడుస్తుంది.)

రాజ్జం : దొరసానీ వాళ్లన్నకేం చెప్పుకుంటదో యట్టా చెప్పుకుంటదో నాకు అనవసరం. పాతికేలు కర్చవుద్ది. ఇచ్చుడో లేదో అడుగు

సుబ్బరత్తం : పాతికేలా.

దొరసాని : పాతికేలెందుకమ్మాయ్.

రాజ్జం : అదీ... సూపర్ స్పెషాలిటీ హాస్పటల్..పోయిన సారి కూడ పాతికేలే అయింది. (నోళ్లు తెరిశారు దొరసానీ సుబ్బరత్తంవు)

దొరసాని : ఒకసారయింది.

సుబ్బరత్తం : మరప్పుడు పాతికేలెక్కడియీ.

రాజ్జం : ఆ యబ్బాయే యిచ్చేడు.

సుబ్బరత్తం : ఇప్పుడు కూడా ఆ యబ్బాయి సేతనే యిప్పిచ్చుకోకపోయేవా.

రాజ్జం : ఇప్పుడు లేడు. ఉంటే మిమ్మల్నడిగే దాన్నా.

దొరసాని : యాడకి పోయేడో.

రాజ్జం : జైలుకి, మర్డర్ కేసులో అరెస్టయ్యేడంట.

దొరసాని : వదినా యింక మన మాటెక్కదుగనీ ఆ పైకం తీసుకోని నువు కూడ యంటబో.

సుబ్బరత్తం : నావల్ల కాదే. నువ్వే పోయి తగల బెట్టకరా.

(బొడ్లో తాళాలు సేతికి తీసుకుంటా యిసురుగా యింట్లోకెల్లింది. రంగనాయకులు బయిటికొచ్చాడు.)

దొరసాని : ఈయనొవ్వురమ్మాయ్

రాజ్జం : నాన్నకి తెలిసినాయన.

రంగనా : అమ్మాయెక్కడికో ప్రయాణం లాగుంది.

దొరసాని : ఆ వాళ్ల సేయితురాల్ది పెళ్లి, అద్దరేత్రి మూర్తం వంట్లే.

రంగనా : ఒంగోలు వరకైతే నాకార్లో తీసుకుపోగల్ను.

దొరసాని : ఎందుకులెండి బసుందిగా. (ఇసురుగా డబ్బు తెచ్చి సూట్కేస్ లో కొట్టింది)

సుబ్బరత్తం : పర్లేదు మనోళ్లే. కార్లోనే పోండి. (అంజియ్య బయిటికొచ్చాడు)

రంగనా : ఇంక బయల్దేరతానండీ. అమ్మాయికీ ఒంగోల్లో పెళ్లుందంట. మన కార్లో రమ్మంటన్నా.

అంజియ్య : ఆ ఆ పెళ్లి, బస్టాండు దగ్గిర దించెయ్యండి చాలు.

రంగనా : రండి. (అంటా బయల్దేరాడు).

అంజియ్య : పని...రేపే మొదులెడతన్నానని చెప్పు. నేనొచ్చి కలుస్తాలే. పదండి. (రాజ్జం దొరసాని రంగనాయకులు యెల్లిపోయారు. బయిటికి చూస్తా వుంది సుబ్బరత్తం. పొలం ప్లాను కాగితంలోకి చూస్తన్నాడు అంజియ్య.)

# దృశ్యం 4

(రాంకోటు పొలం నడించిన కల్లందిబ్బ. రొండు యాప సెట్లున్నయ్. సెట్టు మొదిట్లో కూసున్న రాంకోటు కళ్లు మూసుకోని యేందో ఆలోసిస్తన్నాదు. లచ్చిందేవమ్మ బోజనాల్దెచ్చి సెట్టు మొదట్లో పెట్టింది)

లచ్చిందేవి : ఇ.స్సబ్బబ్బబ్బ. నిప్పులు సెరుగుతుందెండ. యాంవయ్యో. (పైటతో సెంవటద్దుకుంటా రాంకోట్ని కుదిపింది. ఉలిక్కిపడి కళ్లు తెరిశాడు రాంకోటు) పట్టపగులీ నిదరేంది కలలేంవన్నా కంటండావా యేంది.

రాంకోటు : అప్పులోళ్లకి యొవురొవురికి ఎంతియ్యాల్నో లెక్కలేస్తండా.

లచ్చిందేవి : లెక్క లెయ్యటానికేం కోట్లా. క్రాపులోను రెండు లచ్చలు సేసయ్య కాడ యాబయ్యేలు బంగారంపెట్టి తెచ్చిందీ మందులకొట్లో యియ్యాల్సిందీ ఇయ్యేగా.

రాంకోటు : ఒడ్డీతో యెంతవుద్దీ. మూడేళ్లనించి పైసాగూడ సెల్లెయ్యక పోతింవి. యొవురూరుకుంటారు సెప్పు.

లచ్చిందేవి : మనం ఏంవన్నా దాసి పెట్టుకుంటన్నాంవా. పంట మీద పది కాసులు కంట జూసి యొన్నేళ్లయింది.

రాంకోటు : ఆ యగసాట్లన్నీ మనకి తెలుసు. సొమ్మిచ్చినోడికేం పని.

లచ్చిందేవి : యేందయ్యా సేసయ్యేంవన్నా గెట్టిగా మాట్టాదేడా.

రాంకోటు : పుట్టి బుద్ధెరిగినాక యొవుడికీ తలొంచలా. నడీదిలో నిలబెట్టి.. ఆ వడ్డీలోడు..యింకీ జలమం ఎందుకా అనిపిచ్చింది. లచ్చిందేవీ..యీ నాలుగేళ్లూ యట్టా బతికేంవా అనిపిస్తందే. ఎన్ని అవుమానాలు పడ్డాంవు, ఎన్ని రేత్తుర్లు నిదర్లేకుండా గడిపేంవు.. బేంకీ నోటీసు లొచ్చిన్రోజు.. యేకుంజాంవు దాక...యిద్దరంవీ యెదురెగురుగా కూసోని.... (కళ్లు సెమ్మగిల్లినయ్.)

లచ్చిందేవి : ఏందయ్యా సిన్నపిల్లోడాల..

రాంకోటు : ఈ అప్పులన్నీ కడిగేసుకోని గుండెల మీద బరువు దించుకోటానికి యింకొక్క వారం రోజులు గెడువు.
(నిండా గాలి పీల్చుకోని కసిగా సేనంతా పారజూశాడు)
వారం తరవాత.. పంటమ్మి... యొవుడి దోడి మొకాన గొట్టి.. అ...ప్పుడు సెవతానే. (పైట సెంగుతో రాంకోటు కళ్లద్దింది లచ్చిందేవి. లచ్చిందేవిని అట్టానే సూసేడు రాంకోటు)

రాంకోటు : లచ్చిందేవీ కాసుల్దండా నాంతాడూ నీ మెళ్లో చూసి యెన్నాలయిందే. మళ్లీ వాట్ని కంట చూస్తాననుకోలా. అసలీ వూరుకీ మనకీ రుడం తీరిపోయిందనుకున్నా, నేల్తల్లి యియ్యేడు మన మీద దయ సూపిచ్చిందే. బూంవిన్నమ్ముకున్నోడు సెడిపోడే. సూడు....... ఎ..ట్టా పండిందో సూడు.
(గుండెల్నిండా వూపిరి తీసుకొని సేనొంక సూస్తన్నాడు రాంకోటు, సెట్టు దగ్గిర కెల్లి కూటి గిన్నెలు తీసింది లచ్చిందేవి.)

లచ్చిందేవి : కూడు తిందువు గాని.
(మంచే దిగవే అంటా దూరాన్నించి పాట యినపడతావుంది)

రాంకోటు : ఆకలవటం లేదే. సేలో కూసోని సూ...త్తా వుండాలనిపిస్తంది.

లచ్చిందేవి : మా పండిందిలేవయ్యా నాలుగేళ్లకీ. పొద్దు తిరిగి పోయింది. వొచ్చి కాళ్లు జేతులు కడుక్కో.

రాంకోటు : సుందిర్నీ కూడా రానియ్యి.

లచ్చిందేవి : సరేలే. సేలోకి పోతే వాడు బయిటికొస్తాడా. అప్పటికీ వకసారి కేకేసే వొచ్చా, సుందిరీ వొరే సుందిరీ..(కేకేసింది. ఏందప్పా అని పలికేడు సుందిరి) పొద్దెక్కడుందో సూద్రా, తిండి తినవా.
(వస్తండా అంటా పండిన వరెన్నులు పిడికిట్నిండా పట్టుకోని మంచా దిగవే...అని పాడుకుంటా వొచ్చేడు)

రాంకోటు : ఎలికెలు కుంది పోసినియా. (వరెన్నులు సేతులోకి తీసుకున్నాడు) దిగుబడి నలపై దాకా వుంటదా.

సుందిరి : యకరా యాభై కట్టకి తగ్గితే సెప్పు కోయిచ్చుకోనో.

లచ్చిందేవి : సెవ్వులూ ముక్కులూ తరవాత కోయిచ్చుకుందురుగోని, సేతులు

కడుక్కోన్రండి. (మళ్లీ పాటందుకుంటా పక్కకెల్లేదు సుందిరి)

రాంకోటు : అబ్బ యండ కాస్తె తగ్గిందిలే. (పైకి పార్ జూశాడు)

లచ్చిందేవి : నువు కూడా కడుక్కోవయ్యా పోయీ.

(సేతులు తుడుసుకుంటా సుందిరొస్తంటే రాంకోటు బయిటికెల్లాడు)

అయితే మొత్తం ఎన్ని కట్టలవుతయన్రా

సుందిరి : ఏందప్పా రొండొందల కట్ట నిలబెట్టెత్తంవో.

లచ్చిందేవి : రేటెట్టుందో.

సుందిరి : ఇయ్యేడు రేటు కూడ అదిరి పోతందిలే. అదేగా యిసేసం. (మళ్లీ పాటందుకున్నాడు. రాంకోటు కూడా వొచ్చి కూసున్నాడు. లచ్చిందేవి ముద్దలు చేసి పెడతావుంది.)

లచ్చిందేవి : యాంవయ్యా రొండొందల కట్టయితే అప్పులన్నీ తీరిపోతయా.

సుందిరి : రోజూ లెక్కలేగదో. అప్పుల్దీరి ముప్పయేలన్నా మిగుల్తాయంటన్నాళ్లే.

లచ్చిందేవి : యాంవయ్యా నిజంవేనా.

రాంకోటు : ఆ కాస్తటూ యిటుగా వుంటయ్‌లే.

లచ్చిందేవి : అయితే యీ సారి..ఓ పాతికేలు నీయి కాదనుకోని పక్కన బెట్టు.

సుందిరి : ఏందప్పో మాకు పోటీ వాచ్చేవే.

లచ్చిందేవి : పోటీ యేంది.

సుందరి : నేనేంపో మిగిలిండబ్బుతో యీ దిబ్బ మీద సిన్న రేకులెస్డ్డీ యే యిచ్చుమంటన్నా, తనేంవో సుబ్బాయి నేను బేరాని కొచ్చిందంట కదా. ఆ యకరా కొందాంవంటండాడు. మజ్జలో నువ్వు.

రాంకోటు : ఒరే యేనాడూ నాకిది కావాలని తానడిగింది లేదు. మనకి మిగిలిందీ లేదు. నోరు తెరిసడిగింది. అట్నే సేయిచ్చుకో మన్రా.

సుందరి : సరే రాంపండు పెళ్లిగూడ వస్తండే. ఒక సొమ్మన్నా యేర్పుదుద్దిలే.

లచ్చిందేవి : సరేలేరో నగల్జేయిచ్చి తొడుక్కునే వొయుసా యేంది. సొమ్ములేక పోతే నాకేం తక్కువైందనీ.

రాంకోటు : మరింక పాతికేలు ఎందుకే

లచ్చిందేవి : నేనడిగితే నాకేనా యేంది. అబ్బాయి రాంపండు...ఒక్క మాయిన బతింవాల్తండాడు.

సుందిరి : రాంపండుకెందుకప్పా.

లచ్చిందేవి : ఏందో మోటారు సైకలంట. అది కొనుక్కోవాలని.

రాంకోటు : ముచ్చతో కొడతా వాణ్నీ నిన్నూ యిద్దర్నీ. మోటార్సైకలేసుకోని తిరగటానికి యీయనేంవన్నా కలట్రుజ్జోగం చేస్తండాడా.
(ఇసురుగా లేసి సెయ్యి కడుక్కోటానికి పొయ్యాడు)

లచ్చిందేవి : అదేందిరా ఈ బండ్లేసుకోని తిరిగే వోళ్లంతా కలట్రుజ్జోగాలే చేస్తండారా. నలుగురూ పడే పాటు పడాలంటన్నాడు.

సుందరి : సిన్నంగ.. రెచ్చిపోతాడు. (సెయ్యి తుడుసుకుంటా వొచ్చాడు)

రాంకోటు : నువ్వేదన్నా వొస్తువు సేయిచ్చు కుంటానంటే సెప్పు. అంతేగనే గాలికి, తిరిగే దర్గా కోసం పాతికేలు కాదుగదా పాతిక రూపాయలు కూడ యియ్యను. (లచ్చిందేవి గిన్నెలు సర్దుకుంటంది)

సుందరి : నువ్వు తినవంటప్పా.

లచ్చిందేవి : కడుపు నిండిందిలే. (సుందిరి బయిటికెల్లాడు)

రాంకోటు : ఇప్పుడేంపన్నాననీ. కూడు తినకుండ అలగటం.

లచ్చిందేవి : యొవురు మీదలగమంటావ్. ఒక్కగా నొక్కడు, వాడి మాటంటేనే నీకు సివాలెత్తుద్ది, బిడ్డ మూడ్రోజుల్నించి మెతుకు ముట్టకుండా పండుకో నుండాడు, ఏ తల్లికైనా యట్టా సయిచ్చుద్దీ తిండి.

రాంకోటు : మూడ్రోజుల్నించి పడక సీను అందుకా. వాడితో పాటు నువ్వుగూడ తింటం మానేస్తావన్నమాట. మూడ్రోజులు కాదు. మూడు నెల్లు తినకుండా పండుకున్నా మోటార్సైకలాదు

లచ్చిందేవి : వాడు కూడు దినంది. అందుకోసం కాదులే.

రాంకోటు : మరెందుకంటా.

లచ్చిందేవి : ఎదిగిన పిల్లోడే అనుకోవు. నీ మూలంగా నలుగుర్లో నవ్వుల పాలయ్యేడంట. తలెత్తుకోని కుర్రోళ్లల్లోకి పోయే దెట్టా అని కుంపిలి పోతండాడు.

రాంకోటు : తలెత్తుకోలేనంత పని నేనేం చేసేనో.

లచ్చిందేవి : మొన్నా రచ్చబండ కాడ...

రాంకోటు : ఆ రచ్చబండ కాడ...

లచ్చిందేవి : పదిమందిలో వుండప్పుడు కేకలేసి నాగేలు బుజానికెత్తేవంటగా..
(అంతే లచ్చిందేవి సెంప సెళ్లు మనిపిచ్చాడు. రాంకోటు)

సుందిరి : ఏంది మాంవా ఆ తొందర. (అడ్డం వొచ్చాడు)

రాంకోటు : రైతింట పుట్టిన్నా కొడుక్కి. నాగేలు బుజాన పెట్టుకోవటం సిన్నతనంవా. ఆ మాట నువ్వు చెవతండావా. (నారపిడి తీసుకోని యిసురుగా సేలోకెల్లిపోయాడు. గిన్నెలు సర్దేసి కొడవల్టీసుకోని తానూ యెల్లి పోయింది లచ్చిందేవి. సుట్ట సుట్టు కోవటం ఆపి వాళ్లు పోయిన తట్టుకే చూస్తన్నాడు సుందిరి. యనకనించి మాయో డొచ్చాడు అతనెంట శీదేవి మొగుడు మూర్తి అనే యింకోమణిసి వుండారు)

మాయోడు : యాంవోయ్ సుందిరీ రాంకోటు మాంవెక్కడ.
(నోట్లో పొగాకు పొరవుండటం వల్ల సెయ్యి పక్కకి చూపిచ్చి సైగ చేశాడు సుందిరి)

మాయోడు : ఒకసారి పిలువు.

సుందిరి : ఏందికతా. ఆ మడిసొవురూ.

మాయోడు : మనోడే గనే రాంకోటు మాంవని పిలవరా.

సుందిరి : ఏడి మీదుండాడు. నువ్వే పిలువు. (తాను కూడా ఎల్లిపోయేదు)

మొగుడు : ఒదే బాబాయ్ మదింక నేనెల్లిపోతానే.

మాయోడు : ఎల్దువులే వుం(డా. పనుందన్నాగదా.

మొగుడు : పనేందో సెప్పదాదో.

మాయోడు : ఓర్నీ సెవతానుం(డా, ఒట్టప్పుడేంవో యాపారం నేరిపిచ్చే యాపారం నేరిపిచ్చే అనెంటబడతావూ. తీరా పనుండి పిల్చినప్పుడేంవో నేనెల్తానే నేనెల్తానే అని కూసుంటావు. (మూర్తి కేసి తిరిగాడు)
ఇదుగో మూర్తీ సెప్పింది గుర్తుందిగా.

మూర్తి : ఆ మరతన్ని పిలువు.

మాయోడు : పిలుస్తుండా.. ఒరే మొగుడా... రాంకోటు మాంవని కేకెయ్యరా.

మొగుడు : ఏం నువ్ పిలవదాదో. అజ్జంతు పని మీద పోతంతే పిల్చకొచ్చింది. యిందుకా. అసలు నన్ను దమ్మందేందుకే.

మాయోడు : ఉ సెవతా గదా. ముందామణిసిని కేకెయ్.

మొగుడు : యాత్తాలే. తొందద పనిమీద పోయేవోన్ని పిలిచీ, (నాలుగడుగులేసి)
దాంకోతు బాబాయ్..ఒయే దాంకోతు బాబాయ్
(యొవుడ్రా సేలోనించే పలికేడు రాంకోటు)
నేనేనే శీదేవి మొగున్ని. నువ్వొక్కదవ్వ దావాల బాబాయ్.
(వస్తన్నారా అన్నాడు రాంకోటు)
ఒదే బాబాయ్. యింకనే నెల్లిపోతానే. అజ్జెంతు పనుందే.

మాయోడు : ఒరే వస్తన్నాడు గదరా. కాసేపుండు.
(అక్కడున్నా యాప కొమ్మ వొంచి యిగురు దుయ్య బోయేడు మూర్తి. దద్దద్దద్దా అంటా యెర్రి కేకలు పెట్టాడు శీదేవి మొగుడు. అదిరిపడతా కొమ్మిడిసి పెట్టాడు మూర్తి.)

మూర్తి : ఏందయ్యా అట్టా అరిశావూ.

మొగుడు : దాంకోతు బాబాయొచ్చేదంతే పల్లిదగ నూకుతాదు
(మా డొంక తిరిగాడు)
కొమ్మిదగ తీత్తందాదు బాబాయ్.

మాయోడు : ఇరిసేవా దేంజరైపోద్ది. ఆ సెట్టుతో నీకేం పనయ్యా

మూర్తి : నేను డయాబిటిక్ పేషెంటునీ. కాస్త వేపిగురు నోట్లో వేసుకుందాం వనీ..ప... ట్టుకున్నానంతే.

మొగుడు : బాబాయ్ నాకజ్జంతు పనుందే. నీయంవ.. దమ్ముందెందుకో.

మాయోడు : సెవతా సెవతానాగు. (రాంకోటు కోసం చూస్తన్నాడు)

మూర్తి : అవునూ. వేపకొమ్మ పట్టుకుంటే దేంజరొద్దంటారేంటి.

మాయోడు : అది మటుకి దేంజరేనయ్యా. ఒకసారేంవైందంటే పది పన్నెందేళ్ల కిందట పళ్లు తోంకుండదాంవనీ.. అదుగో ఆ సెట్టునే కొమ్మవంచీ సిన్న పుల్లిరగదీ సేనయ్యా.. అంతే రాంకోటు యనకమాల్నే వుండాడు గాంవాల నేంజూళ్లా. యనకనించే జుట్టు బట్టుకోనీ కొమ్మిరుత్తావంట్రా.. అనీ...

మొగుడు : ఆ..కొమ్మిదుత్తావంతదా నా కొడకా అని...

మాయోడు : ఉ.. నువ్వుంట్రా అనీ కిందబడేసీ డొక్కలో కుమ్మేదయ్య.

మొగుడు : కాల్తో కాల్తో అజ్జెప్పు.

మాయోడు : ఊ దేంతో అయితేంతేరా. అదర గొట్టేడు.

మొగుడు : ఆ తదవాతేంవైందో అదిగూడ జెప్పు.

మాయోడు : ఆ తరవాతా ఎప్పుటికైనా గుర్తుండాలా అనీ సిన్న పుల్లిరగ దీసినట్టు నా సిటికినేలు సిటుక్కునిరగదీసేడు ఇదుగో.

మూర్తి : పుల్ల యిరిచినందుకు.. వేలిరిచాడా. మరి .. పెద్ద కొమ్మిరిస్తే.

మొగుడు : ఆ యిదువు, ఇదువే సూద్దాంవు. కాల్లూ సేతులూ ఇదగదీసీ కాలవలో తొక్కి పాడ్డెంగుతాదు. కుచుక్కు కుచుక్కుమంతా సంకలో కద్దలేసుకోని నదవాల ఆ.

మాయోడు : తొందర పడి ఆకు దూసేవుగాదు.

మూర్తి : తమాశాగా వుందే. పకీరు ప్రేణం రాంచిలకలో వుండట్టూ ఆ రాంకోటు ప్రేణం యీ సెట్టుల్లో వుందా యేంది.

మాయోడు : రాంకోటు పాణం గాదు. వాళ్ల పెద్దోళ్ల పేణాలన్నీ యీ సెట్టల్లో వుండాయంట. ఈ సెట్లకి వాళ్ల తాత ముత్తాతల పేర్లు పెట్టుకోని పిలుస్తా వుంటాడు.

మొగుడు : బాబాయ్ యెందుకు పిల్చేవో సెప్పవేందే. అజ్జంతుగా పోవాలంతే.

మాయోడు : అదుగో వస్తన్నాడ్లేరా. (తాడు పెణుసుకుంటా రాంకోటోచ్చాదు.) నీకోసంవేనే. ఈడు మరీ తొందర జేస్తన్నాడూ.

మొగుడు : అసల్సంగజ్జెప్పకుందా యీ ఆల్చంవేందే బాబాయ్.

మాయోడు : ఒరే సెవతా నాగరా, ఇప్పుడే గదా వొచ్చిందీ.

రాంకోటు : పైన మబ్బు కమ్ముతుందీ..వానేంవన్నా కురుసుద్దేంద్రా.

మాయోడు : ఆ అది కురిసే మబ్బు కాదులే మాంవా. పొద్దున కాసిన ఎండకి.

రాంకోటు : ఆ ఏందో పని మీదొచ్చినట్టుందే.

మాయోడు : పనంటే..నా పని కాదులే. సెప్పురా మొగుడా.

మొగుడు : నీయంవ...నేం జెప్పేదేంది బాబాయ్. అజ్జంతుగా పోయేవోన్ని పిల్చీ..

మాయోడు : సరేసరే. నేనే సెవతాలే వుంద్రా, బయపడతన్నాడ్లే మాంవా.

రాంకోటు : బయంవేది సెప్పేదేందిరా. ఇంతకీ అతనొవురూ.

మాయోడు : మూర్తిగారనీ ఒంగోలు. బిజినెసు చేస్తంటాడు. సిన్న బేరమ్మీదొచ్చేడు.

రాంకోటు : మరి నిలబెట్టి మాట్లాడతారే. అక్కడ కుక్కి మంచం వుండాల.

తెచ్చెయ్యండి.

మొగుడు : ఏందిదా బాబాయ్ ఆలిశంపూ, తొందదగా పోవాలంతంతే.

మాయోడు : అబ్బ సెవతన్నాగదరా నీ యవ్వారంవే. ముందా మంచం తెచ్చెయ్. పట్టకరా పోయి.

మొగుడు : నేనసలికి తొందదగా పోవాలంతంతే.. అద్దీసకదా యిద్దీసకదా అంతావే (విసుక్కుంటానే మంచం కోసం ఎల్లాడు.)

రాంకోటు : అసల్సంగతేందిరా.

మాయోడు : సంగతంటే మాంవా. (సెప్పటానికి తటపటాయిస్తన్నాడు) ఇయ్యేడు దిగుబడెట్టుంటదే మాంవా.

రాంకోటు : బాగనే వుంటదిగనే యవ్వారం ఏందో బయటికి రానియ్యహే.

మాయోడు : సెవతాన్లే. ముందా మణిసిని సెటిలవ్వనియ్యి.
(మొగుడు మంచం తెచ్చి వాల్చాడు)
మూర్తిగారూ కూసోండి. కాసేపు రెస్ట్ తీసుకోండి.

రాంకోటు : ఏందిరో మాయోడా నోట్లోంచి యింగిలీసు మాట్లు దూకుతుండయి. కట్టు సెంగేవో కిందకి దిగిపోయిందీ. గొడ్ల దలారీ మానేసి యింకేందన్నా బోకరేజీ మొదులు బెట్టేవా యేంది.

మాయోడు : బతకటానికేదో వకటి సెయ్యాల గద మాంవా.

రాంకోటు : కొంపదీసి పొలం బేరంవేంవన్నా తెచ్చేవేంరా.

మాయోడు : అబ్బ అబ్బ యేం పట్టేసేవు మాంవా. ఆవులిస్తే పేగుల్లెక్కబెడతావే పొలం బేరంవే మాంవా.

రాంకోటు : మరట్టా సెప్పవేందిరా అల్లుడా.

మొగుడు : ఇదుగో మాయోదు బాబాయ్ తొందదగా సెప్పవేందే. అత్తయితే నేనెల్లిపోతా.

మాయోడు : నీ యవ్వారంవే గడరా మాట్లాడతండీ. ఈడికంతా తొందరే మాంవా.

రాంకోటు : వాడి మాటలకేంలే నువ్వు చెప్పు.

మాయోడు : ఈ యేర్యాలో యకరా రేటు యంతుందే మాంవా.

రాంకోటు : యంతంటే...మొన్న కోటి బాబు కొన్నాడుగా యకరా యాబయేల్లెక్కన

మాయోడు : కదా. (అని మూర్తి దగ్గిర క్యాసు సేతికి తీసుకున్నాడు)

మాంవా రొండు మూడు ముక్కల్లో తేలిపోవాల్నే.

రాంకోటు : రొండు మూడు దాకా ఎందుకురా. ఒక్క ముక్కలో తేల్చునో.

మొగుడు : మాయోడు బాబాయ్. యింకా యెందే ఆల్చం.

మాయోడు : ఒరే సివర కొచ్చేం గదరా.. (రాంకోటు వంకకి తిరిగాడు) రాంకోటు మాంవా కోటిబాబు కొన్నది యకరా యాబయ్యేలు రేటు. మంది నిండా లచ్చ. డబల్రేటు. నాలుగెకరాలకీ నాలుగు లచ్చులు. పదేలు బయానా, లచ్చా తొంబయ్యేలు అగిర్మెంటప్పుడు. మిగిలిన రొండు లచ్చులూ కండింపులప్పుడు. రదీ క్యాసు. మరింకేంవీ మాట్టాడే పన్లేదే. (బయానా సేతులో పెట్టేడు)

రాంకోటు : ఇంకా మాట్లాడేదెందుకురా. యట్టా పదేలిప్పుడు బయానా. అగిర్మెంటుకి లచ్చా తొంబయా, కండింపులుకి రొండు లచ్చులా.

మాయోడు : ఆ.

రాంకోటు : మరీపదేలూ ఆ లచ్చా తొంబయేలూ సివరి రొండు లచ్చులూ మొత్తం కలిపి యిప్పుడే యిస్తే యట్టుంటదిరా.

మాయోడు : అదేం రాంకోటు మాంవా. అంతా వొక్క సారంటే యొవురిస్తారే.

రాంకోటు : నేనిస్తారా. (ఒక్కసారిగా రెచ్చిపోయి మంచమ్మీద కూసున్న మాయోణ్ని లాగి తన్నాడు. మాయోడు నిలువునా యిరసక పడ్డాడు) నీయమ్మ డలార్నా కొడ..క. నా పొలం కొంటాని కొచ్చేవంట్రా నువ్వు. ఎంత దైర్నంరా నీకు. ఏదిరా నా కఱ్ఱ...
(కఱ్ఱ కోసం ఎతుకుతుండాడు. మూర్తికి ముచ్చంవటలు పట్టినయ్. మాయోడు గబుక్కున శీదేవి మొగుణ్ని జుట్టు పట్టుకోని వంగదీసి బాదటం మొదలెట్టేడు.)

మొగుడు : ఒదే.ఒదే..ఒదే బాబాయ్ ఏందిదా. అమ్మా అబ్బా.. ఓది నీ జమ్మంజెంగ బాబాయ్ నా కొడకా ఇదేందిదా.

మాయోడు : నేం చెవితే యిన్నావంట్రా యదవనా కొడక, రాంకోటు మాంవ పొలం అమ్మడ్రా అమ్మడ్రా అంటే యిన్నావా.

మొగుడు : ఓది బాబాయ్ నా కొదక పొలం వేందీ అమ్మేదేందీ. అజ్జంతు పని మీద పొయ్యేవోన్ని తీసకొచ్చింది యిత్తా సావ జెంగతానికా. జమ్మం జెంగ నా కొదకా. (కఱ్ఱ దీసుకోనొచ్చిన్రాంకోటు నిలబడిపోయి

సూస్తావుండాడు)

మాయోడు : ముయ్యరా నోరు... అప్పుటికీ నేం చెప్పేను మాంవా. ఒరే రాంకోటు మాంవంటే యేంననుకున్నావురా. పాణాలన్నా యిస్తాడు గాని పొలం యియ్యడ్రా అని బతింనాలి సెప్పా. ఇన్నాడా నువ్వు సెప్పు నువ్వు సెప్పు అని అడిగిందాకా వూరుకున్నాడా.

మొగుడు : ఒదేయ్ కొదితే కొత్తేవుగనీ నన్నసలికి పిల్చిందెందుకో సెప్పవేందిదా బాబాయ్.

మాయోడు : ఎందుకంటే... యిందుకు ఇందుకు...

(ఇంకా రొండు పీకేడు మాయోడు. శీదేవి మొగుడు మంచం పైకెత్తి అడ్డంపెట్టుకున్నాడు. నులకసందుగుండా తలకాయ బయటి కొచ్చింది)

మొగుడు : ఏంజి....సావజెంగతానికా. నీ..

మాయోడు : అవతలకి పోతావా యింకా నాలుగు పడాల్నా.

మొగుడు : పోతాలేయే... జమ్మం జెంగ నా కొదక.

(తిట్టుకుంటా మంచం తీసుకోని పోయేదు శీదేవి మొగుడు)

మాయోడు : యదవ నా కొడుకుని పాతెయ్యాలండీ. (మూర్తి వైపుకి తిరిగాడు). మీరు సెప్పండి. యిందాక నేను చెప్పేనా లేదా అహ సెప్పండి.

(మూర్తికేంవీ బోద పళ్లా. అయినా తలూపేదు.)

అసలు ఆ తిక్కలోడు చెప్పేదనుకో మీరెట్టా వొచ్చేరండీ కొంటానికీ మా రాంకోటు మాంచంటే యేందనుకుంటన్నారురీ. ఈ సెట్టూ...యీ సెట్టేందని, మా రాంకోటు మాంవ అబ్బ

రాంకోటు : అబ్బ కాదురా నీయమ్మ డలార్నా కొడక. తాత. మా తాతరా. ఒరేయ్ యియ్యాల నువు లేసిన యాల మంచి దైందిరా.

మాయోడు : అదిగాదు మాంవా.నేనూ...

రాంకోటు : సరికేస్తా నోరెత్తేవంటే, ఒరేయ్.. ఓ ఒంగోలాయనా యిద్దరూ యినండి... మా నాయనమ్మ తొమ్మిదో నెల కడుపుతో వుండీ పొద్దంతా యీ సేలో పంజేసీ మా అయ్యని కనింది యీ గెద్ద మీదనే. ఒంటి సేత్తో అరవయదుగుల లోతున బాయి తొవ్వీ వొట్టిరిగి పడి మాఅయ్య సచ్చి పోయిందీ యీ గెద్ద మీదనే. నేను బతికేది యీ గెద్ద మీదనే సచ్చి పోయేదీ యీ గెద్ద మీదనే. ఇంకొొక్కసారి యిట్టాటి కూత

యొవుడన్నా కూస్తే వాణ్ని పూడిసి పెట్టేది కూడ యీ గెడ్డ మీదనే మాయోడా ఆవులిస్తే నేను పేగులెక్కబెట్టను. బయిటికి తీస్తా. (ఫెళఫెళమంటా ఉరుం యినిపిచ్చింది. రాంకోటు పైకి చూసి సేను వైపుగా యెల్లేడు. సన్నంగా సినుకులు మొదులైనై.)

మూర్తి : బలే చోటికి తీసకొచ్చేవు గదయ్యా, అవునూ పాపంవా శీదేవి మొగుణ్ని అట్టా చేసే వేందయ్యా.

మాయోడు : సూడండి.. యేదన్నా యదవ పని చెయ్యాలనుకున్నప్పుడు.. ఆ పాపం మొయ్యటానికి యింకొకణ్ని రడీ చేసుకోనుండడాల.

మూర్తి : ఆహాహాహా. బాగుంది. మరింక నాతో పనైపోయినట్టేగా.

మాయోడు : మరంతేగా, రేటు దెబ్బకి దిమ్మ తిరిగి పడిపోతాడనుకున్నా. ఆహా బాణం పంజెయ్యలా. ఇంకొక బాణం తీస్తా. వాన మెండవతంది ఈడికింక సిప్పే పోదాంరా.

(యిద్దరూ యెల్లిపోయారు. ఉరుంపులూ మెరుపులో కుండపోతగా వాన మొదులయ్యింది. వాన్లో తడుసుకుంటా అడుగులో అడుగేసు కుంటా వచ్చేడు రాంకోటు. అతని సూపు సేనుమీదుంది. పేణం పైరు మీదుంది. సూస్తా నిలబడిపోయ్యేడు. కాళ్లీడుసుకుంటా వొచ్చింది లచ్చిందేవి.)

లచ్చిందేవి : ఆయిపోయిందయ్యా.. అంతా నాశనంవై పోతంది దేంవుడా... (అంటా కొమ్మలిరిగిన సెట్టు లాగుండా పెనింవిట్ని చూసింది.) యాంవయ్యా.. సూడయ్యా..అయిపోతందయ్యా రొండొందల కట్ట నీట కలిసి పోతందయ్యా, అయ్యా.... సుందిరి చెప్పినట్టు రేకుల్సెడ్డూ వొద్దు... పండోడికి మోటార్సైకలీ వొద్దు.. నాకు సొమ్ములూ వొద్దు...పాతికేలే వొద్దయ్యా. తింటాని కొక్క ముద్దక్కూడా వొద్దయ్యా. రుణాల బాదలు తీరుసుకోవటానికన్నా అంత మిగిలిచ్చమని సెప్పయ్యా ఆ వాన దేవుడికీ..

(నేల మీద కుప్ప కూలిపోయింది. సుందిరీ వొచ్చేడు. వాళ్లిద్దర్నీ సూసేడు, సేనొంక చూసేడు. వానొంక చూసేడు. సుందిరి చూస్తానే వుండాడు. వాన కురుస్తానేవుంది.)

# దృశ్యం 5

(కోటిబాబింటికీ రాంపండింటికీ నడిమిన యీది. సిగిరెట్టు పీలుస్తా అరుగు మీద కూసోనుండాడు మాయోడు. యెవురి కోసంవో చూస్తన్నాడు. రొండో పక్క నించి ఒంటేఁలాగోలు సైకిలు నడిపిచ్చు కుంటా వస్తన్నాడు.)

రాగోలు : తప్పుకో తప్పుకో.. తప్పుకో మాయోడన్నా. (బ్యాలెంచు కుదరక సైకిలు కింద పడేశాడు.)

మాయోడు : యాంఁవా ఒంటేలోడా సైకిల్తొక్కటం కూడా రాదంఁటా

రాగోలు : బలేసెప్పేవే. నేర్చుకుంటే రాదాయేంది.

మాయోడు : సైకిలావుర్దీ.

రాగోలు : పటాన్ సాయిబు దగ్గర అద్దెకి తీసుకున్నాలే.

(మాయోడు యెదురు చూస్తండా మడిసి వస్తండట్టుంది. బుఁరకేందో తట్టింది. సటుక్కున యసక్కి తిరిగి సైకిల్లేపు కోని పోబోతన్న ఒంటేఁలాగోలుకి అడ్డం వొచ్చేడు)

మాయోడు : అవునా ఒంటేలోడా వాడు గంటోడూ..పొద్దు కూకిందంటే యింట్లోంచి బయిటికి రాడేందీ.

రాగోలు : బలే సెప్పేవే. బయిటి కెట్టొస్తాడూ. వాడికి రేజీకట్టైతే.

మాయోడు : గంటోడికి రేజీకటుందా. నేన్నమ్మఁనా

రాగోలు : బలే సెప్పేవే. ఉంది మాయోడన్నా.

మాయోడు : ఎహె లేదులే.

రాగోలు : ఒరే ఉందన్నా.

మాయోడు : ని.. జ్జంగా వుందా.

రాగోలు : అమ్మతోడు మాయోడన్నా ఉందీ. ఉందంటన్నాగదా.

(సరిగ్గా అప్పుడే రాంపండొచ్చాడు.)

రాంపండు : ఏందిరా వొంటేలోడా వుండేదేంది.

రాగోలు : అదే రాంపండూ నువ్వూ..

మాయోడు : నేనడిగి కనుక్కుంటాలే. నువ్వెల్లు,

రాగోలు : అడుక్కో కావాలంటే నా మాటొట్టిదేంవో. ఊళ్లో అందరకీ తెల్సిన సంగతి నీకు తెలవదే. (సైకిలు తోసుకుంటా యెల్లిపోయాడు ఒంటే ౹లాగోలు)

మాయోడు : తెలిస్తే మటుకి మొకమ్మీదనే అడిగేస్తాంవా యేంది.

రాంపండు : అడిగేదేందిరా మాయ మాంవా.

మాయోడు : నీ సంగతేరా అల్లుడా. ఆ వరాలు సెల్లెలు సీతికీ నీకూ సంవందం వుందంటగా.

రాంపండు : ఆ సీతికీ నాకా సంపందంవా యొవ్డ్రా సెప్పిందీ.

మాయోడు : ఇప్పటిదాకా ఒంటేలోడు వుందీ.. వుందీ.. అని రాయిగుద్ది వాదిస్తంది ఏందనుకున్నా..

రాంపండు : సెప్పుతో కొడతా నా కొడుకుని, ఒరే ఒంటేలోడా....

మాయోడు : ఆగాగు. ఎంతమందిని కొడతా. ఊరంతా అనుకుంటన్నారంట. అయినా వుంటే తప్పేందిలేరా అల్లుడా.

రాంపండు : వామ్మో అది నలుగురు పిల్లల తల్లి. దాంతో నాకేందిరా.

మాయోడు : దాందేం వుందిలే. సీతి నీ కంటికి రంబలాగుందేంవో.

రాంపండు : ఒరే మాయమాంవా దాని మొకంవే నేనెరగ౹నా

మాయోడు : అయితే... నిజంగా..సంవందం...

రాంపండు : ఏ వొట్టు పెట్టమంటే ఆ వొట్టు పెడతా. నన్ను నమ్మరా మాంవా.

మాయోడు : నిప్పు లేకుండా ...పొ...గ..

రాంపండు : నీకు దండం పెడతారా మాంవా. అసలే పెళ్లి కాబోతన్నోణ్ని.

మాయోడు : సరే. నాకబద్దం చెప్పవుగదా. నమ్ముతా.

రాంపండు : ఎంతన్నేయం మాంవా అసలిది పుట్టిచ్చిన్నా కొడుకు..

మాయోడు : ఒద్దు. ఒదిలెయ్. నువ్వావేశపడి వాడ్ని రొండు దెబ్బలేస్తావ్. పదిమందికీ తెలుసుద్ది, అట్టబడి అట్టబడి ఆ పిల్లనిచ్చేవాళ్ల దాకా పోయిందనుకో.

రాంపండు : అదే గదా నా బాద. పైగా నలుగురు పిల్లల తల్లి. సీచ్చీ.

మాయోడు : అందుకనే దొంగకి తేలు కుట్టినట్టుండాల. కూసో సెవతా. (కూసున్నారు.)

మాయోడు : అయితే పెళ్లి సంవందం కుదిరిందా.

రాంపండు : ఆ కుదిరిందిలే.

మాయోడు : ఏది...మల్లారప్పాడు సంవందం వేనా.

రాంపండు : ఆ అదేలే

మాయోడు : మూర్తం పెట్టుకున్నారా.

రాంపండు : పెట్టుకున్నాంలే.

మాయోడు : ఏందీ బలంతంగా చెవతండావూ, కట్నం బాగా నూకటంలా.

రాంపండు : ఆ..నూకినట్టే వుంది.

మాయోడు : అసలు బేరం ఎంత కైందిరా అల్లుడా.

రాంపండు : ఆ యేం బేరంలే. పది సవర్లు బంగారంవు. లక్ష క్యాషు. (ఇసిత్రంగా చూసేడు మాయోడు)

మాయోడు : సెప్పేవోడికి లేకపోయినా యినే వోడికన్నా వుండాల్రా బుద్ధి. రొండు సెవుల్లో పువ్వులుండాయేందిరా నాకు... ఓహో... పెళ్లయినాక... అప్పడుగుతానని కటింగిస్తన్నావా.

రాంపండు : అదిగాదురా మాంవా. నేం జెప్పేది...

మాయోడు : నాకు చెప్పొద్దురా. చారోడి తమ్ముడు రమేష్ గాడు మొన్న చేసుకుంది రొండో పెళ్లిగదంట్రా. వాడు తీసుకుందెంత. నాలుగున్నర యంగట్రావు సెల్లెల్ని పొందూరిచ్చేరు గదా వాళ్లిచ్చిందెంత అయిదు. కుర్రోడేంవో పగుల్జూస్తే రేత్తిరి కల్లో కొస్తాడు. నీకేం కన్నొంకరా కాలొంకరా. నాయాల్ది... కింగు సైజు గోల్డు పేక సేతబట్టి యీరో వోండా మీదెక్కి రం...య్యి మంటా ఒంగోలు రోడ్డు పడితే.. అదే సిగిరెట్టు పెట్టె సేత పట్టి యీరో వోండా బండి మీద వొచ్చేడు కోటిబాబు)

మాయోడు : ఎక్కట్నించోయ్ కోటిబాబో.

కోటిబాబు : ఒంగోల్నించిరా. (అంటా యెల్లిపోయేడు)

మాయోడు : ఈ కోటిబాబు..ఎంత తీసుకున్నాడు. అహ ఎంతో సెప్పులే.

రాంపండు : వాడికంటే.. యిస్తారు. హీరో హొండా బండీ ఇంటి ముందు టాక్టరు

ఒంగోల్లో పైనాంచు బిజినెసూ సీటీల బేరంవూ..

మాయోడు : అయ్యన్నీ యెట్టొచ్చిని యేంది. డేరింగ్ చేసి పాతికెకరాలు కౌలుకి తీసుకోని పత్తేసేడు. పాటు కుదిరింది. పైకెక్కి పోతన్నాడు.

రాంపండు : మూడేళ్ల నించి పోరాడతన్నా. పాణం వుండన్నాలూ తిండి గింజలు పండిస్తాడంట, పండిచ్చేడుగా మొన్న వానకీ. పత్తీ పుగాకు,.. మాటంటేనే మండి పడతాడు.

మాయోడు : పెద్దోళ్లొద్దంటం కుర్రోళ్లు కావాలనటం అన్నిళ్లోనూ వుండేదే. ఎదురు నిలబడి నచ్చ చెప్పుకోవాల.

రాంపండు : చెప్పబోయినందుకే.. దౌడ పెంకూడిపోయింది.

మాయోడు : దెబ్బతో యింట్లో ముసుగేసేవ్. కొడితే కొట్టేళ్లే మా బాబేగదా అని.. యింకొంచం నచ్చ చెప్పేవనుకో...

రాంపండు : ఇంకో దౌడ పెంకూడుద్ది.

మాయోడు : కొట్టనియ్. మరింకొంచం గెట్టిగా మాట్లాడు ఇంకో దెబ్బేస్తాడు. ఇంకా కాస్త పైకిపో. ఇంకా రొండేస్తాడు. ఆ తరవాతేం చేస్తాడూ. సంపుతాడా. ఇసుగు పుట్టీ నీయిష్టంవొచ్చినట్టు చేసుకో ప్పో అంటాడు. అప్పటిదాకా నీకు వోపికేది. అసలూ.. ముందటేడేంవైంది. ఈ కోటిబాబుకీ వాళ్లయ్య సోంవయ్యకీ టాక్టరు కొనే కాడ పేసీ వొచ్చింది. ఎద్దుల్నమ్మేసి టాక్టరు గొందాంవంటాడు కోటిబాబు. ఆ పనే జరుగదూ యెద్దుల్సేద్దెంజాలూ అంటాడు సోంవయ్య.. మాటకి రొండు మాట్లు యెదురెల్లేడు కోటిబాబు. సోంవయ్య కోపం ఆపుకోలేకా లాగి సెంప మీద కొట్టేడు. కోటిబాబు తగ్గేడా. పొట్టి బండి పక్కనే వుంది. సన్ను కొయ్య పీక్కోనీ ఒకే ఒ..క్క దెబ్బ.. సాసి పీకేడు. బిళ్లపాటుగా తిరగబడ్డాడు సోంవయ్య, అంతే. మరసట్రోజు సిన్నదినం చేసేడు. మరసట్నెల్లో టాక్టరు కొన్నాడు. మరసటేడేంవో వోండా కొన్నాడు. మొన్న పైనాన్స్ కంపెనీలో సేరూ ఇప్పుడేంవో... (అంతలో ఒకతను బల్లరిచ్చా లాక్కుంటా వొచ్చేడు. బండి మీద పెద్ద పెద్ద అట్ట పెట్టెలుండయ్)

అతను : కోటిబాబుగారి యిల్లెక్కడండీ.

మాయోడు : అదుగో ఆ కనపడేదే.. బండి మీద్దేందో

అతడు : ప్రిజ్జండీ ప్రిజ్జు. (బండి లాక్కోని పోయాడు)

మాయోడు : అదీ సంగతి, ఏదైనా పెద్దాళ్లకి నచ్చ చెప్పుకునే దాంట్లో వుంటది.

రాంపండు : నచ్చజెప్పిందాకా ఆయన సెయ్యి పైకి లేవకుండా ఆగితే కదా. నా మొకానికి ఒక్క లక్షే రాసిపెట్టుంది గాంవాల్లే.

మాయోడు : అయితే నువు చెప్పింది నిజంవే నన్నమాట. అదే. ఒక్క లక్ష.

రాంపండు : ప్రెంవాణ పూర్తిగా చెవతండారా మాంవా.

(ముక్కు మీద ఏలేసుకున్నాడు మాయోడు)

మాయోడు : అందులో కొంతేంవో పెళ్లి కర్సులుకి పోద్ది. మిగిలింది మీ బాబు చేసిన అప్పులుకి సరిపోద్ది, ఇంక నీకు మిగిలేదేందిరా. (రాంపండు ఆలోశన్లో పడ్డాడు).

అసలింత కీతాగా మ్యారేజ్జేసుకోకపోతే యాంవంటా..సరేలే. పాపం మీ బాబు రుణాల బాదల్లో వుండాడు. అందుకైనా చేసుకోవాల గదా. అ..యి..నా. లక్షేందిరా, ఒంగోల్లో కొండ మీద శివాలయం కాడ గుడ్డ పరుసుకున్నోడు సంపాయిస్తన్నాడు గదరా. నీకేం కర్మ. నువ్వేందీ నీ కలరేందీ నీ దర్జా యేందీ. నాల్రోజులు యేసీ రూంలో పెట్టి పుల్లుగా మేకప్పు గొడితే...యాబయ్యేళ్ల కిందట యెంటీఆర్ లాగుండే కుర్రోడివి. యీన పచ్చంగా నలపై సవర్ల బంగారంవు నాలుగు లక్షల క్యాసు కొసురుగా ఒక్కలరు టీవీ పువ్వుల్లో పెట్టియ్యరంట్రా నీ పర్సనాల్టీకీ.

రాంపండు : ఒరే మాయ మాంవా ఎందుకురా యగతాల్జాకుతావు.

మాయోడు : యగతాలేందిరా. యొవుడ్నైనా అడుగు.

రాంపండు : నాకొవుడ్రా యిచ్చేది నాలుగు లక్షలూ.

మాయోడు : యొవుడైనా యిస్తాడు. ఇంతెందుకు నాలుగైదు. అయిదు లక్షల క్యాసు యాభై సవర్ల బంగారంవూ నేనిప్పిస్తా. సేసుకుంటావా. అహ సేసుకుంటా వాని.

రాంపండు : యాంవ్రా మాయ మాంవా. మా బాబంటే బయపడతండాను కదాని గోల్జాకుతుండావంట్రా.

మాయోడు : సీరియస్గా చెవతండానోయ్ పండూ ప్రామీసు

రాంపండు : అయితే... నువ్వు చెప్పేది.. నిజంగా నాలుగు లక్షలు..

మాయోడు : నాలుగైదు. అయిదు. తల్లితోడు నన్నింక మాట్టాడియ్య వాకు.

రాంపండు : అమ్మాయి దేవూరు.

మాయోడు : ఏ వూరైతేంది సంవందం కుదిర్చేది నేను. నువు మాటకి నిలబడతావా అయిదు లక్షల క్యాసు యాభై సవర్ణ గోల్డు గెట్టిగా పట్టుకుంటే ఒక్కలర్ టీవీ కూ.. డ మాటన్నాక మరెనక్కి తగ్గ కూడదు.

(ఆలోశన్లో వుక్కిరి బిక్కిరౌతన్నాడు రాంపండు. వోండాలు టాగటర్లు టీవీలు సెవుల్లో గీ పెడతన్నయ్.)

రాంపండు : సరేరా.

మాయోడు : సరే అంటే కాదు, అడుగినక్కెయ్యనని వొట్టెయ్యాల.

రాంపండు : ఒట్టు.. (సెయ్యి ముందుకి చాశాడు. మాయోడు సెయ్యి చాపలా.)

మాయోడు : పెళ్లికి మూర్తం పెట్టుకున్నాం అంటివే

రాంపండు : ఆ...పీటల మీద పెళ్లిళ్లే ఆగి పోతండయి.

మాయోడు : మీ బాబుకి కోప్మొచ్చుద్దేంవో.

రాంపండు : నేన్నచ్చ జెప్పుకుంటా గదా.. పిల్లది ఏవూరు.

మాయోడు : ఈ వూరే.

రాంపండు : ఈ వూరా, ఈ వూళ్లో.

మాయోడు : కోడి పెంటంజియ్య కూతురు. రాజ్జం.

రాంపండు : రా...జ్జంవా..అంజియ్య..అంత కట్నం..

మాయోడు : ఇంకొకరికైతే యియ్యడు. కాని నీ కియ్యటానికి రడీగా వుండాడు. యెందుకో తెలుసా.

రాంపండు :....

మాయోడు : మీ రొండు కుటుంబాలకీ వైరం వుంది. నీకు తెలుసనుకుంటా, మీ మేనత్త రుప్పిణమ్మని..అంటే మీ బాబు సెల్లెల్ని కోడి పెంటంజియ్య కిచ్చి చేసేరు. ఈ అంజియ్య కోడి పెంట తిన్నా యిశయంలో మొగుడూ పెళ్లాలకి గొడవైందంట. ఆ తరవాతేంవైందో. మీ యత్త యింగ్రిన్ తాగి సచ్చి పోయింది. రుప్పిణమ్మ పిల్లలు కూడ పుట్టకుండానే సచ్చిపోయింది. కాబట్టి కట్నం కిందిచ్చిన రొండెకరాల తెల్ల పొలాన్ని తిరిగి యిచ్చెయ్యమని అడిగేడు మీ బాబు. ఇయ్యనన్నాడు అంజియ్య

మాటా మాటా పెరిగింది. మీ బాబుకి సెయ్యి తొందరగదా, సెప్పు తీసుకోని టపీ టపీ మని రొండు పీకేడు. ఇంకేం రొండు సెప్పు దెబ్బలకీ రొండెకరాలు సెల్లూ అన్నాడు. అంజియ్య. థూ అని వుమ్మేసి పూరుకున్నాడు. మీ బాబు.

రాంపండు : నిజంవే అప్పుడప్పుడూ మాయమ్మ చెవతా వుంటది.

మాయోడు : కదా. ఇప్పుడేమైందంటే అంజియ్య యెంత పెంటోడైనా మణిసే కదా. కొడుకేంవో డాగట్రౌతన్నాడు. అంవెరికాలో వుండే పిల్లని మ్యాచ్చింగు చూసుకున్నాడంట. వాడెట్టా అంవెరికాలోనే సెటిలై పోతాడు. ఇంక సంపాయిచ్చిందంతా యెవురు కాపాడాలా అని ఆలోశన్లో పడ్డాడు. రాజ్జాన్ని నీ కిచ్చి చేస్తే పాత సుట్టరికం కలుపుకున్నట్టు వుంటది. పిల్ల కళ్లెదట్నే వుంటది. మీ రొండెకరాల సేను కట్నం కింద మీకు తిరిగి యిచ్చినట్టు వుంటది. ఇన్నుండయ్ ఆయన బుర్రలో, అసలన్నిటికంటే సచ్చిన మీ మేనత్తకి తన వల్ల శానా అన్నేయం జరిగిందని యిప్పుడు తెగ బాధపడతన్నాళ్లే. యట్టయినా నిన్ను అల్లుణ్ని చేసుకోని సేసిన తప్పుకి కొంతయినా సెల్లేసుకుందాం అనుకుంటన్నాడు. ఇదుగో అల్లుడూ స్టారు మారిపోయే శాంచు, నీ సెవులో యేస్తుండా. ఇంక నువ్వెట్ట మలుపు కుంటావో అల్లకపోతావో..నీ యిష్టం

రాంపండు : అయితే.. అంజియ్య మాంవకి మా మీద కోపం లేదా.

మాయోడు : ఇంకా కోపం ఏందోయ్. ఆ మూడు ముళ్లూ పడ్డాక రాజ్జంతోపాటు అంజియ్యకి కూడ నువ్వే మొగుడివి. శక్రం తిప్పటంవే.

రాంపండు : అది ..సరే.. మరి..అది

మాయోడు : నీలు నంవలొద్దూ డౌటుంటే అడిగెయ్.

రాంపండు : అదే.. రాజ్జం గురించి.. ఏదో అనుకుంటంటారు కదా....

మాయోడు : అదా ఇదుగో అల్లుడూ యెవుర్ని గురించి అనుకోరోయ్ మనోళ్లు ఒక సంగజ్జేప్పు. నిప్పులాంటి పిల్లరా అనుకున్నారంతా. స్టిక్కోడి మనంవరాల్ని, పెళ్లయిన మూడో నెల్లోనే మొదులుబెట్టి నెలకొకడ్ని మారుస్తుంది. అవునా కాదా. చారోడికి సంవందం చూసేటప్పుడు పిల్లని చూట్టానికి నేను కూడ పోయా. ఆ యమ్మాయంత గుణమంతు

రాలు సుట్టు పక్కల్లో లేదన్నారు. నాకూ అట్నే అనిపిచ్చింది. మరిప్పుడో. ఊల్లో వొకడు ఒంగోల్లో వొకడు. ఇట్టాటియి తలెంటికలన్ని చూపిస్తా. ఎందుకు చెవతన్నానంటే.. అమ్మాయి బలే మంచిదిరా అని సేసు కున్నాక చెడిపోతే యేం చేస్తాంవూ అని. పెతోళ్లమీద అనుమాన పట్టం అదట్టా యిదిట్టా అని ఆడి పోసుకోవటం మనోళ్లకి అలవాటల్లుడూ. రాజ్జాన్ని గురించి సెప్పుకోవటం లెక్కేంవుందీ. సీతమ్మ తల్లినే సెంకిచ్చేరు మనోళ్లు

రాంపండు : అది నిజంవే అనుకో.

మాయోడు : అంత దూరం ఎందుకు. ఇప్పుడు నీ గురించీ సీతి గురించీ యెంత నీశంగా అనుకుంటండారు. అహ అనుకుంటండారా లేదా. ఇది కూడా నమ్మాల్నా. నమ్మాల్నా వొద్దా సెప్పు.

రాంపండు : అసలిది పుట్టిచ్చిన్నా కొడుకు...

మాయోడు : అక్కడకొద్దూ. జనం చెప్పుకునే యన్నీ నిజం అనుకుంటే మూడొంతులు కాపరాలు నిలవ్వు.

రాంపండు : అవుననుకో.

మాయోడు : ఇట్టాటెవ్వారాల్లో అనుకునే దానికీ వాస్తవానికీ సంవందం లేదోయ్. బుల్లెంకయ్య కూతుర్ని రకరకాలుగా అనుకున్నారా. పెళ్లైనాక చూడు ఎట్టా మారిపోయిందో. ఎంత పద్ధతిగా కాపరం చేసుకుంటందో. పెజ్జాలయ్య సిన్న కూతుర్ని గురించి సెప్పులు కొరుక్కున్నారు. ఆ మూడు ముళ్లూ పడ్డయ్. ఆ పిల్లోంక యేలెత్తి సూపే వోడుండాడో యియ్యాల అంత దూరం వెందుకు. మీ అక్క.. అదే నా వైపు.. దాన్ని చేసుకోవాలని కాయం చేసుకున్నాక అయిదొచ్చినియ్ ఆకాశరాంవన్న ఉత్తరాలు. ఆ విల్ల సెడిపోయిందీ సేసుకోవద్దూ అని. నేన్నమ్మేనా. నమ్మితే యదవనేగదో. సేసుకున్నా, ఇప్పుడు మీ అక్క యట్టాంటిదో యంత నీతిగా వుంటందో నీకు తెలుసు కదా. అసల్నా కొకటనిపిస్తందో యల్లుడూ, పెళ్లి కాక ముందు నలుగురి నోళ్లల్లో పడ్డా అమ్మాయిలే పెళ్లయినాక కుదురుగా సంసార పచ్చంగా కాపరాల్జేస్తారేంవో అని నాకు గెట్టి నమ్మకం కలుగుతుందోయ్.

రాంపండు : అవుననుకో.

మాయోడు : అనుకోవటం కాదు. నీ గురించే ఒక మాటొచ్చింది, సూసినోడేడి రుజువు చేసినోడేది. కాబట్టి నువ్వయినా అంతే నేనైనా అంతే శీతైనా అంతే రాజ్జం అయినా అంతే. యాంవంటా.

రాంపండు : ఇంకనేదేం వుందీ. నే(నడీ.

మాయోడు : ఇప్పుడు కలుపు సెయ్యి. (సేతులో సెయ్యేసేడు రాంపండు)

రాంపండు : మరి సంపందం కుదిర్సే బారం నీది.

మాయోడు : ఆ సంగతి నా కొద్దిలెయ్, మరి మీ బాబు సంగతి మటుకి గెట్టిగా నచ్చజెప్పుకోవాల.

రాంపండు : అది నేం చూసుకుంటాలే.

మాయోడు : అదుగో ఒంటేలోడు మళ్లీ వస్తండాడు. ఇందాక మాయోడికి నువు చెప్పిందేందిరా అని నిలేసడుగు. చస్తే నిజం చెవతాడేంవో సూడు. సెట్టు మీద తేనె తుట్టె వుందీ అనో సెంబు శా(త్రి నెత్తి మీద పిలక వుందీ అనో అబద్దం ఆడేస్తాడు. సూడూ మనం కూడా అది నమ్మినట్టే ఊ కొట్టి ఊరుకోవాల ఆ.

(ఒంటేలు రాగోలు సైకిలు నెట్టుకుంటా వొచ్చాడు) అదుగూ.

రాంపండు : ఒరే ఒంటేలోడా యిందాక యిటు పోయే టప్పుడూ ఉందీ వుందీ అని మాయమాంవకి నువు చెప్పిందేందిరా.

రాగోలు : బలే సెప్పేవే. నీగ్గూడా దెలవదా యేంది. గంటోడికి రేజీకటిగదో. మాయోడన్నేంవో లేదంటాడూ నేనేంవో ఉందంటన్నా అదీకత (రాంపండూ మాయోడు ఒకరి మొకాలొకరు చూసుకున్నారు.) ఏందంటా.

రాంపండు : అదే తెలుసుకుందాంవల్లే. నువ్వెల్లు.

రాగోలు : బలే సెప్పేవే. నువు చెప్పకపోతే యల్నా యేందీ.

(బండి నెట్టుకోని పోతన్నాడు ఒంటే(రాగోలు. బేలెంచు తప్పుతా వుంది సైకిలు. ఆడ్ని చూసి మాయోడు రాంపండూ నవ్వుకుంటన్నారు.)

# దృశ్యం 6

(రాంకోటిల్లు, దిగాలుగా కూసోనుంది లచ్చిందేవి.)

శివశివమూర్తివి గెణనాదా నువు

శివుని కుమారుడివి గెణనాదా.

(పాట పాడకుంటా వచ్చేడు సుందిరి. లచ్చిందేవిని చూసేడు. ఆంవె దిగులు మరిపిచ్చటం కోసం పాట జోరు చేశాడు. ఆంవె సూపు మారలా, పాటాపి లచ్చిందేవెదురుగా కూసున్నాడు.)

సుందిరి : మన గాశారం బాగలేదు. పోయింది. ఎన్నాలు కూసోని యేడిసినా మట్టిలో కలిసిపోయింది మళ్లీ వొచ్చుద్దాప్పా.

లచ్చిందేవి : నాలుగేకరాల సేను. నిప్పులు చేరిగే యండల్లో మూర లోతున గెడ్డిరగ దీసేంవు. నీలుగట్టేంవు నారు బోసేంవు నాట్లేసేంవు. బూంవిలో నించి పొడుసుకోని మొక్క పై కొస్తావుంటే కడుపున పుట్టిన బిడ్డని చూసుకున్నట్టు చూసుకున్నాం. ఇరగ బండిన సేంజూసి యియ్యేటితో అగసాట్లన్నీ తీరతాయనుకున్నాం. సూస్తండంగానే...అంతా గంట సేపుట్లో గంగ పాలై పోయింది.. బతుకులు తెల్లారే దెట్టా..బాకీలోళ్లకి మొకం చూపిచ్చేదెట్టా.

సుందరి : అందుకే రాంకోటు మాంవ... యెద్దుల్ని బేరం పెట్టేడు.

లచ్చిందేవి : ఎ..ద్దు... ల్ని.. అమ్ముతుండావా.

సుందరి : ఆ యెరువుల కొట్టు లచ్చిన్నరుసు బొత్తిగా నోరు కుదిరిక లేకుండా మాట్లాడతన్నాడంట. వాడూళ్లోకొస్తే...నలుగుర్లో నాంవాసాగా వుంటదనీ.

లచ్చిందేవి : బేరం ఐపోయిందా.

సుందరి : ఆ. మంచి రేటు గూడా వొచ్చింది. నీతో కూడా ఒక మాట సెమ్మన్నాడు.

నువు సరే అంటే.. గంటపట్టెళ్లు బొడ్జోళ్లు ఇప్పిచ్చుక రమ్మన్నాడు... ఇప్పుడంత కంటే మారగం ఏంవుందప్పా

(లచ్చిందేవి పైకి లేసింది. ఆంకి మువ్వల గంటల సప్పుళ్లే యినపడ తన్నయ్. గోడ దగ్గిరకి పోయింది. వెంకీకి తగిలిచ్చున్న గంట పట్టెక్లు సేతుల్లోకి తీసుకుంది.)

లచ్చిందేవి : బక్కెద్దుకి గాలికుంటు తగిలి మూడ్రోజులు కాలు కింద పెట్టక – పోతే ఆ మూడ్రోజులు ముద్ద ముట్టలా మీ మాంవ. ప్రతి నెలపొడుపుకీ సందమాంవని చూసినాక యల్లెద్దు మొకం చూడకపోతే ఆ నెలంతా గిలిగానే వుంటది నాకు. రుడం తీరిపోయిందిరా.

(గుటక మింగి పట్టెళ్లు సుందిరికిచ్చింది. అయి తీసుకోని పోతన్నాడు సుందిరి. బయిట్నించి రాంకోటు ఎదురొచ్చాడు.)

రాంకోటు : యక్కడికిరా అయ్యి.

సుందరి : అదే.. ఎద్దల్నమ్ముతుండాంగదా. వాళ్లకి..

రాంకోటు : ఎద్దల్నమ్ముతావా. బక్కెద్దునీ యల్లెద్దునీ బేరానికి పెడతావా.

సుందరి : అమ్ముదామని... ఇందాక...నువ్వే...

రాంకోటు : అన్నాన్రా నేనే అన్నా మతిబోయి అన్నా. పిచ్చిబట్టి అన్నా. రాంకోటు మాండా బూంబిని ఐద్దలుగా సీలిసి బువ్వబెట్టే పసుపులే. పైసల కోసం పరాయోడికి పట్టియ్య కూడదే అని చెప్పేవా. రైతు పుటక పుట్టినోడు కాడి కింద గొడ్డుని అమ్ము కోగూడదే అని చెప్పేవా.

సుందరి : నువ్వు సరే అన్నావనీ...

రాంకోటు : నువ్వు నేనూ సరే అంటే సరిపోయిందా.

సుందరి : లచ్చిందేవప్పని కూడ అడిగా

రాంకోటు : బక్కెద్దునడిగేవా. యల్లెద్దునడిగేవా... నువ్వింటికి వొచ్చినాక సంచకరువు సేతులో పెట్టేరు. నామతి మతిలో లేదు. బూంవంతా గిర్రన తిరిగి పోతావుంది. నేనెక్కడుండానో నాకే తెలవలా. సి..న్నంగ యద్దల కట్టుమట్టు కాడికి పోయినా.. కట్టుతాడు యిప్పుదాంవని బక్కెద్దు మేక్కాడొంగినా. మేకు తాడు వూడ దీస్తన్నా. బక్కెద్దు బుస

కొట్టింది ముట్టెతో నా మెడ మీద యెంగిలి పూసింది. తల పైకెత్తి చూసినా. బిక్కెడ్డు... తలడ్డంగా తిప్పింది. యల్లెద్దు మొకం చూసినా, కళ్లనిండా నీలు.. దాని కళ్లల్లోనో.నా కళ్లల్లోనో.. సూళ్లేక పోయినా. ఒద్దురా (పంచ సెంగుతో కళ్లు తుడుసుకున్నాడు)

ఒరే నీక్కూడు పెట్టలేనూ కూలియ్యలేనూ ఎల్లిపోయి నీ సావు నువు సావరా అంటే నువ్వు నోరుమూసుకోనెల్లిపోతావంట్రా.

సుందరి : నేనెందుకు పోతానూ.

రాంకోటు : నోర్లేని పసరాలు. ఆ మాట సెప్పలేకపోయినియ్‌రా. మూగ పేణాల వుసురు తగల్దంట్రా. ఒద్దు. మనంవుండన్నాలూ అయిగూడ మంతోటే వుండాల. మంతోటే పోవాల అంతే. ఇదుగో వాళ్ల సంచకరువు యిచ్చేసిరా.

(వంద రూపాయలు సుందిరికిచ్చి పట్టేళ్లు తీసుకోని లోపలికి పొయ్యేడు రాంకోటు. సుందిరి యనక్కి తిరిగాడు. వడ్డీల సేసయ్య ఎదురొచ్చాడు అప్పు అడగటాని కొచ్చినోడ్ని ఆటబట్టిచ్చాలని పాటందుకున్నాడు సుందిరి.

సుందరి : శివ శివ మూర్తివి గెణనాదా నువు శివుని కుమారుడివి గెణనాదా. ఒక్కసారి అడిగి సూడు గెణనాదా. సెంప పగలకుంటె అప్పుడడుగు గెణనాదా. (పాడుకుంటా బయిటికెల్లాడు సుందిరి. లచ్చిందేవి దగ్గిర కొచ్చి మంచమ్మీద కూసున్నాడు సేసయ్య)

సేసయ్య : యద్దుల్ని బేరం పెట్టేరంటగా.. రాంకోటు మాటబడే వోడు కాదులే.. ఇయ్యాలమ్మన్నాడు.. సెప్పేడా. మాట్లాడ వేందమ్మా లచ్చిందేవమ్మా.

లచ్చిందేవి : ఎద్దల్నమ్మటం లేదు అమ్మలేం.

సేసయ్య : అమ్మటం.. లేదా.. అ..మ్మ.. లేరా. మరప్పెట్టా తీరుస్తారమ్మా. మీకు పెట్టుబడి పెట్టి మీ యింటి చుట్టూ కుక్కలాగా వందసార్లు తిరగాలా మీ యెద్దులు మీ వద్దనే వుండాల. మీ యిల్లు కుర్దుగా మీకే వుండాల, మీ పొలంవు చెక్కు చెదరకుండా వుండాల మీకు సొమ్మిచ్చినోడి కొంప మటుకి కూలిపోవాల

(యనగ్గా వొచ్చిన రాంకోటు యింటా నిలబడ్డాడు.)

లచ్చిందేవి : రాంప రాంవా అట్టా యెందుకంటాంపు సేసయ్యా.

సేసయ్య : ఇంకెట్టా అనాలమ్మా ఒకేదా రొండేళ్లా. ఒకెయ్యా రొండేలా. ఒ...ట్టి కూతలు యన్నాలైవతారు. అరె కడుపుకి అన్నం తింటానే వుండారు కదా. మానం మీద గుడ్డ చుడతానే వుండారు కదా.

రాంకోటు : (యనక్కి తిరిగి రాంకోటుని చూసి ఆగిపోయ్యేడు సేసయ్య) పదేళ్ల కిందట సేతులో గిన్నె పట్టుకోని సెనగ్గుగ్గిళ్లమ్ముకుంటా యీ వూరొచ్చినోడివి దేవళం గోడ పక్కన పొయ్యి పెట్టుకోని యిడ్లీలమ్ము కుంటా యాపారం మొదులు పెట్టినోడివి. సీటీ డబ్బుల్దగ్గెర పేసీ వొచ్చి సెంచునాయుడు సెప్పుతీసుకోని వెంట బడితే నా యింట్లో కొచ్చి తల్దాసుకున్నోడివి. యనక ట్రోజులు మర్సిపోవాకు సేసయ్యా.

సేసయ్య : ఇంకా నయ్యం. మరిసిపొమ్మంటా వేంవో అనుకున్నా. అందులో నా బాకీ కూడా వుంటది కదా. గుగ్గిళ్లమ్మే కాడికి.. అబ్బో శానాదూరం పొయ్యేవే. నిన్న పొద్దున్నాకేం జెప్పా ఎద్దల్పమ్ముతుండానం చెప్పేవా పైకం కట్టేస్తానం చెప్పేవా. ఇయ్యాల శానా తేలిగ్గా మాట మారిసే స్తండావు. చూడో నువ్వెద్దుల్నమ్ముకుంటావో ఇల్లమ్ముకుంటావో బూంవే అమ్ముకుంటావో నాకనవసరం. నువు చెప్పిన మాట నిలబెట్టు కోకపోతే యింక పరువు దక్కదు. గు..గ్గి..ళ్లమ్మే రోజులు కాదియ్యి. నువ్వట్టా మిర్రి మిర్రి చూస్తే యీ వడ్డీల సేసయ్య బయపడ్డా. ఇయ్యాల సొమ్ము చెల్లెయ్యక పోతే బొడ్లో చెయ్యేసి బజారు కీడుస్తా.

(సేసయ్య సెంప మీద సెళ్లున కొట్టాడు రాంకోటు.)

రాంకోటు : పాతేస్తా నోరెత్తేవంటే. ము..య్యి నోరు. అరగంట.... ఒక్కరగంటాగు నీ సొమ్ము నీ మొకాన కొడతా, లేని పచ్చానికి... నీ కెప్పుట్నించో యీ యింటి మీద కన్నుండగా, రాయిచ్చుకో. నువ్వడిగిన రేటుకే రాయిచ్చుకో. (రాంకోటు సూసిన సూపుకి మాట పడిపోయింది. సేసయ్యకి. నోటి మీద యేలు పెట్టుకున్నాడు.)

అగిర్మెంటు రాయిచ్చి తెచ్చుకో.. పో్పో...బయిటికి

(సేనయ్య బయిటికెల్తావుంటే క్యాసుబ్యాగు పట్టుకోని సుబ్బరాయు డొచ్చాడు. సేసయ్య ఆశగా మళ్లీ యనక్కొచ్చాడు.)

రాంకోటు : మొత్తం వడ్డీతో లెక్క చూయిచ్చు. కాసేపైనాక రా.

లచ్చిందేవి : రా అన్నా రా. కూసో.

(యింట్లోకెల్లింది లచ్చిందేవి. సేసయ్య బయిటికెల్లాడు.)

రాంకోటు : ఇదేనా రావటం.

సుబ్బారా : పొద్దున్నే బయల్దేరా. బసు లేటయింది

రాంకోటు : పెళ్లికి ముందే..నిన్నిబ్బంది పెట్టి నట్టుండా.

సుబ్బరా : నేనూ యగసాయం చేసినోణ్నే బావా. రైతోడి బాదలు నాకూ తెల్సు తప్పేంవుంది. రేపయినా యిచ్చేదేగా. ముందుగాయిస్తే మీరు కాస్తె కాలూ చెయ్యీ కూడ దీసుకుంటారు గదా.

(లచ్చిందేవి మంచినీళెచ్చి సుబ్బరాయుడికిచ్చింది.)

రాంకోటు : సూసేవుగా ఆ సేసయ్యని, సిన్నప్పుడు పెద్దబాల సిచ్చలో చదువుకున్నా పజ్జం గుర్తొస్తంది. అగ్గి సుడుల్దిరిగి మండేటప్పుడు ఇంకా ఆ మంట పెరగటానికి సాయం చేసుంట గాలి. ఆ యగ్గి తగ్గిపోయి సిన్న దీపం ఐనప్పుడూ ఆ గాలే వొచ్చి ఆరిపేసుద్దంట. అట్టయింది నా పని.

సుబ్బరా : బావా నువ్వూ నీ కంవతంవూ నాకు సిన్నప్పట్నించీ తెలుసు. నువ్వు యగసాయం చేసి దెబ్బ తిన్నావూ. నేనేంవో సేర్లు జూదం ఆడి మోసపోయా.

లచ్చిందేవి : సేర్లా.

సుబ్బరా : ఆ. కొడుకు.. ఉజ్జోగం ఎలగ పెడతన్నాడుగా. తొందర తొందరగా డబ్బు సంపాయిచ్చే మారగం వుందీ అన్నాడు. సదుంకున్నోడూ నాకంటే తెలివైనోడూ అనుకున్నా. నమ్మి వుండాదంతా వూడిసిచ్చా. తీరా పిల్ల పెళ్లికి కట్నంరా అంటే. ఆ శేర్లు కాగితాల కట్ట తెచ్చి నేతులో పెట్టాడు. అయిదు లచ్చల కిమ్మత్తు కాగితాలు. పకోడీ పొట్లాలు కట్టుకోటానికి పనికొస్తయన్నారు. దిగమింగి వూరుకున్నా.

లచ్చిందేవి : మా కోడలు బాగా సదుంకుందంటగా.

సుబ్బరా : ఆ సదుంతుంటే నేనే వొద్దని ఆపేశా. అంతకంటే యెక్కువ సదివినోడు కావాలంటదని. సదువైతే సదివింది గనీ దానికి సేద్దెం అన్నా సేనూ సెట్టన్నా పాణం, మీకు సరిపోయిందేలే.

(బయిట్నించి వచ్చిన పండు యింట్లోకి పొయ్యేడు)
అల్లుడు.. నన్ను గుర్తు పట్టలేదేంవో...

లచ్చిందేవి : ఒక్కసారేగా సూసింది.

రాంకోటు : పెళ్లి తిరపతిలో పెట్టుకున్నందుకు మీ వోళ్లు బాద పడతన్నారా.

సుబ్బరా : బాగ్గోరే వోళ్లు బాదపడర్లే బావా (పండు మళ్లీ వొచ్చి బయిటికెల్లి పోతన్నాడు)

లచ్చిందేవి : అబ్బాయ్ పండూ మీ మాంవని పలకరిచ్చవేందిరా.

రాంపండు : మాంవొవురూ, పెళ్లి గాకుండానే మాంవవతాడా.

రాంకోటు : ఏందిరా ఆ తల్తిక్క మాట్లూ.. ఆ సేసయ్య కాడికి పోయి వాడి బాకీ మొత్తం యెంతవుద్దో లెక్క చూడు.

రాంపండు : లెక్కలన్నీ బాగనే వుండయ్. డబ్బేది. సేలో లంకెల బిందె లేంవన్నా దొరికినియా.

సుబ్బరా : డబ్బు నేందెచ్చానల్లుడూ. కట్నం తాలుకూ డబ్బు. సగం ముందే యిద్దాంవనీ. (డబ్బు చూపించాడు)

రాంపండు : అయితే కట్నం డబ్బు సేసయ్యకి యియ్యాలనా.. ఇంతర్జంటుగా నాకు పెళ్లిందుకు పెట్టేరో యిప్పుడు తెలుస్తుంది. అసలే అది బోడి లక్ష అది కాస్తా అప్పులోళ్లకి పంచిచ్చి నా సేతికి బొచ్చ యిస్తారన్నమాట.

రాంకోటు : ఏంద్రా...ఏంద్రా నువ్వనేది.. (దగ్గిర కొస్తన్నాడు రాంకోటు)

రాంపండు : నాకు లక్షావొద్దు పెళ్లి వొద్దు. ఈ సంవందంవే నేం చేసుకోను.

రాంకోటు : ఏందిరా నువ్వు కూసిందీ.
(సాసి కొట్టాడు రాంకోటు. ఆ సేతిని నడింది లోనే వొడిసి పట్టుకొని యిసురుగా లాగి పక్కకి నెట్టాడు రాంపండు. ఆ వూపుకి తూలి పడుతున్న రాంకోటుని లచ్చిందేవి పట్టుకుంది.)
చెయ్యి... నాగ్గూడా వుంది.
(సివాల్న తలెత్తి సూశాడు రాంకోటు. మెల్లెగా నడుసుకుంటా పోయి మంచం మీద కూసున్నాడు. కాసేపొవురూ మాట్లాడా.)

సుబ్బరా : సుబంవా అంటా అదేం మాటల్లుడూ.

రాంపండు : యాంవండీ నాకవతల అయిదు లక్షల క్యాషు అరవై సవర్లు గోల్డు హీరో హొూండా బండీ యిస్తాంవంటన్నారు. నేను మాట తప్పను మూర్తానికి తాలిబొొట్టు గడతా. అంత మొత్తం నువ్విస్తావా. (సుబ్బరాయుడికి మాటరాలా.)

సుబ్బరా : లక్షకి ...ఒప్పుకున్నారు...

రాంపండు : ఒప్పుకుందాయన. నేను కాదు.

సుబ్బరా : మూర్తం పెట్టుకున్నాం. నలుగురుకీ చెప్పుకున్నాం. ఇప్పుడేం చెయ్యాలయ్యా.. పెళ్లాగిపోతే.. ఆడపిల్ల బతుకేంగావాలయ్యా.

రాంపండు : పెళ్లయితే నా బతుకేం కావాలయ్యా.. మీ యమ్మాయిని యింకొకడి కిచ్చి చెయ్యొచ్చు.. యిప్పుడైతే.. మీ యమ్మాయితో పెళ్లయినాక నాకు కట్నం యింకొకడియ్యడుగా (రొండు సేతులెత్తి దండం పెట్టాడు సుబ్బరాయుడు) నన్ను బైరాగుల్లో కలిసి పొమ్మంటారా, అవతల యిస్తాంవన్న రేంజిలో యిచ్చేట్టయితే చెప్పండి. లేకపోతే మీ దారి మీరు చూసుకోండి. (ఇసురుగా యింట్లోకి పోయాడు రాంపండు. సుబ్బరాయుడు అడుగులో అడుగేసుకుంటా రాంకోటు దగ్గర కొచ్చాడు)

సుబ్బరా : రాంకోటు బావా లచ్చిందేవప్పా.. మీరేం బాదపడమాకండి. కాలం అట్టా వుంది. నా రాతిట్టా వుంది. పైకం పుడితే.. నాల్రోజుల్లో మళ్లీ వస్తా. లేకపోతే ..యింక కనపణ్ను
(పుట్టెడేడుపుని గొంతులో కుక్కుకుంటా యెల్లిపోయాడు సుబ్బరాయుడు సొక్కా తొడుక్కుంటా రాంపండు బయిటికొచ్చాడు.)

రాంపండు : నేనేం నా వొక్కడి కోసంవే సెప్పటంలా. గొట్టెకి బెత్తెడే తోకనీ.. యంతకాలం చేస్తారీ శాకిరీ. నా కొచ్చే కట్నం డబ్బుతో మన అప్పులన్నీ తీరుస్తా. సాటి కుర్రోళ్లల్లో నేను కూడ తలెత్తుకోని బతుకుతా నా మాటిని మీరు కూడ ఊం అంటే.

లచ్చిందేవి : అన్ని లచ్చలు పోసి నీకు పిల్లనిస్తానందొవుర్రా.

రాంపండు : నువ్వన్నా కాస్తర్థం చేసుకోమ్మా. ఎన్నాలు మట్టి పిసుక్కుంటే వొచ్చుద్ది. మీకు ఓపికుండన్నాలు మీ కిష్టంవొచ్చిన పంటలు పండిచ్చుకోండి.

మీ మాటకి అడ్డురాను. నా మాటినండి. నన్ను మటుకి నలుగుర్తో పాటు పోనియ్యండి.
మిగిలిన కట్నం డబ్బుతో పదెకరాలు కౌలుకి తీసుకోని పత్తేస్తా ఇంటెదురుగా కోటిబాబుని చూడండి.

లచ్చిందేవి : పిల్లొవురూ.

రాంపండు : రాజ్జం.. అంజియ్య మాం కూతురు. (రాంకోటు కోపంగ చూశాడు). తొందర పడకుండా యినండి. నేనేం తెలివి తక్కువగా ఆ సంవందం కావాలంటంలా. మన పొలంవు రొండెకరాలు వాళ్ల కిందుంది. బూంవంటే బాబుకి ప్రేణం కదా. ఆ రొండెకరాల తెల్ల పొలాన్ని కట్నం కింద అడిగి మల్లీ బాబు సేతి కిందకి తెస్తా
(దగ్గిర కొస్తన్నాడు రాంకోటు)
నేను మాత్రం బాబు రక్తం పంచుకోని పుట్ట లేదా. నాకు మాత్రం రోసం వుండదా. ఆ సేలో మల్లీ మన అరక తిరగాల.
(సెంప మీద ఫెడీల్న కొట్టాడు. రాంకోటు. తలకిందులుగా పడి పొయ్యేడు రాంపండు.)

రాంకోటు : లం..జా.కొడకా నా..కు..ను..న్వు పొలం తెచ్చిపెడతావంట్రా. సెయ్యి.. నీగ్గూడా వుందా. ఏదిరా ఆ సెయ్యి.
(మల్లీ కొట్టాడు)
ఎత్తరా ఆ సెయ్యి.
(రాంకోటు మల్లీ కొట్టాడు. రాంపండు గొంతు మీద కాలుబెట్టాడు. లచ్చిందేవొచ్చి తప్పిచ్చింది.) సుబ్బరాయుడు కూతురు మెళ్లో సూత్రం కట్టిన రోజునే నువ్వు నా కొడుకువి. ఆ పెళ్లి జరక్కుండా కంట పడ్డావో...కుతిక మీద పెట్టిన కాలు యనక్కి తియ్యను. (బయిట్నించి వచ్చిన సేసయ్య బయం బయంగా లచ్చిందేవి సాటుకి తప్పుకున్నాడు)

రాంకోటు : సేసయ్యా (పరిగెత్తుకుంటా ముందు కొచ్చాడు)
తెచ్చేవా కాయితాలు. (తెచ్చినట్టు తలూపాడు సేసయ్య)
అగిర్మెంటు రాయిచ్చేవా. (అవునంటా తలూపాడు)
సదువు... సదు..వూ..

సేసయ్య : ఆన పందొమ్మిది వందల తొంభై యేదు జనవరి యేడో తేది.. (సేసయ్య సేతులో కాయితాన్ని యిసురుగా లాక్కోని గబగబా సదివాడు రాంకోటు. సేసయ్య జేబులో వుండా కలం లాక్కోని సంతకం చేశాడు. కాయితం సేసయ్య సేతులో కొట్టాడు.)

...మరీ..అబ్బాయి సంతకం...

రాంకోటు : నేను బతికుండన్నాలూ నా మాట కొవుడూ అడ్డం చెప్పడు. చెప్పటానికీల్లేదు. సంతకం పెడతాడు. ఇయ్యి వాడికి.

(కాయితం రాంపండుకిచ్చాడు సేసయ్య,. రాంపండు సంతకం పెట్టకుండా చూస్తన్నాడు. రాంకోటు గుడ్లురింవి చూశాడు. అంతే గబుక్కున సంతకం చేశాడు రాంపండు. లచ్చిందేవిని యంట తీసుకోని రాంకోటు యింట్లోకెల్లాడు)

రాంపండు : రేటెంత కాయం చేసేరూ.

సేసయ్య : యాబయాలకి తగ్గనన్నాడు. అట్నే పోదాం.

రాంపండు : అప్పు పోను మిగిలిన డబ్బు.. మా బాబుకి తెలవకుండ నాకే యియ్యాల. లేకపోతే రిజప్ట్రేషనప్పుడు పేచీ బెడతా.

సేసయ్య : ఆ....మిగిలేదెక్కడయ్యా బాబూ. ఇంకా నాలుగేలు వొడ్డీ నాకే రావాల రాంపండు అదంతా నాకు తెలవదు. నాకు పదేలియ్యాల. లేకపోతే ఫోర్టరీ చేసేవం చెప్పి కోర్టుకి పోతా. కావాలంటే యీ పదేలు కూడ ఆయన మీదనే యేసి వొసూల్జేసుకో.

సేసయ్య : సరే రాంపండూ మనం ఎట్నో సెటిల్జేసుకుందాంలే. నీకు పదేలిస్తా. మీ బాబింకా నాకు పద్నాలుగేలియ్యాల. వస్తా.

(సేసయ్య ఎల్లిపోయాడు. సుందిరి బయిట్నించి వొచ్చాడు. పట్టెళ్లూ బొడ్డోళ్లూ వాటేసుకోని రాంకోటు లచ్చిందేవీ బయిటికొచ్చారు. రాంపండు తలెత్తలేదు. ఇల్లంతట్నీ ఆకరి సూపు చూసుకున్నారు.)

లచ్చిందేవీ మా తాత కట్టిచ్చేడంట యీయిల్లు, మన అయాంలో అమ్ముకుంటండాం. ఇరవయ్యేదేళ్ల నాతో కలిసి కాపరం చేసినందుకు నీకు నిలవ నీడ లేకుండా చేస్తంది. కట్టు గుడ్డలో కల్లందిబ్బ మీదకి తీసకపోతండా.

లచ్చిందేవి : అయితే యాంవైందయ్యా. మన బూంవక్కడుంది. మన పేణం అక్కడుంది. నాకు నువ్వుండావూ. నీకు నేనుండా. మన పక్కన సుందిరి వుంటాడు రావయ్యా.

(రాంకోటు సెయ్యి పట్టుకోని ముందుకి సాగింది లచ్చిందేవి. సుందిరి కూడా యంట నడిచాడు.)

# దృశ్యం 7

(కోనేటి గెట్టు మీద. పిండారబోసినట్టు యెన్నెల. చారోడు గంటోడు బ్రేందీ తాగుతున్నారు. నడించిన మాయోడున్నాడు.)

చారోడు : అన్నా నాయాల్ది.. ఒక్క పెగ్గు తీసుకోరా. నా కోసం ప్లీజ్.

మాయోడు : సెప్పేను గదరా. మందు మటుకి ముట్టుకోన్రా.

గంటోడు : బలంతం జేస్తా వెందుకురా.యంకన్నా అయిదేలూ వుంచు.

మాయోడు : కండింపులయినాక యియ్యచ్చుగదా. తొందరేం వుందీ.

గంటోడు : అప్పుటి సంగతప్పుడు. ఇదుంచూ. (జేబులో పెట్టాడు.)

చారోడు : ఒట్టి వుప్పు నేల. ఒంటేలు పోస్తే వారం రోజులారవు. అట్టాటి పనికి మాల్న సవిటి బూంబిని నాయాల్ది యకరా యాబయ్యేల్లెక్కన అమ్మి పెట్టేవు. మా గంటోడికి లచ్చ రూపాయలు వూరెకిప్పిచ్చినట్టేగదా. నాయాల్ది నీకెంతిచ్చినా తక్కువే కదంటెంకన్న (మందు గుటకేశాడు)

మాయోడు : ఆ అదీ నేసనలైవే పక్క నుందీ మన గంటోడి పిల్లలకి తిన పొంతుంది. (కోటరు బాట్లు సికెను పొట్లాంవూ తెచ్చేడు కోట్లింగం)

కోట్లింగం : సోడాలు కావాల్నా.

చారోడు : మంచినీలు చాల్లే. (సికెను ముక్క తీసుకున్నాడు) బాగా ఫ్రై చేసేవా.

కోట్లింగం : తిని సూడూ... (గంటోడిచ్చిన డబ్బుల్దీసుకోనెల్లాడు)

గంటోడు : సికెను ముక్కన్నా తీసుకో యంకన్నా (మాయోడికో ముక్కిచ్చి తానొకటి తీసుకున్నాడు)

చారోడు : ఒరే గంటోడా నాయాల్ది నా సంగతేందిరా.

గంటోడు : నువ్వుంద్రా.. (ఇంకో ముక్క మాయోడికిచ్చాడు) మన సేను పక్కన చారోడిది కూడ నాలుగెకరాలుంది. జీటీ రోడ్డు

పేసింగే. అది కూడ అమ్మిపెట్టమని వాడేదుపు. యదవనాయాలు కరుసుల్లో వుండాళ్లే. సెటిల్జెయ్యి.

మాయోడు : పార్టీ దొరకాల గదా. (మాయోడి నోట్లో సికెను ముక్కబెట్టాడు)

చారోడు : నువు తల్చుకుంటే దొరక్కేంవవుద్దన్నా. నాయాల్ది నువు కిష్టపరంవాత్తు డంతటోడివి. నా పంజేసి పెట్టన్నా. కావాలంటే నీ కంవీసను ముందే తీసుకో. (మందు ఎక్కువైతంది చారోడికి)

మాయోడు : శచ్చ. పని కాకుండానే పైసల్దీసుకోమంటా వేందిరా

గంటోడు : పనైనాకిద్దువుగోన్లేరా. (మందు గుటకేసేడు)

చారోడు : అయితే యీ ముక్క తిను.

మాయోడు : అబ్బా.. ఒద్దురా.

చారోడు : అన్నా నేన్నీ బెదర్ననుకో. నా యాల్ది ప(ట్రా అన్నా.
(బలంతంగా నోట్లో సికెను ముక్క పెట్టేడు)
ఇంక మా బజారోళ్లని కూడ....దోంట్ కేర్..ఎలచ్చన్లొచ్చినా కూడ.. అన్నెటుంటే తమ్ముడటు. (ఇంకో గుక్క మింగాడు)

గంటోడు : అయ్యన్నీ యిప్పుడెందుకురా. యంకన్నా ఈ శారోడూ నేను సచ్చినా బతికినా ఒకటిగానే వుండాల. సిన్నప్పుట్నించి మా సాంవాసం అట్టాటిది.

చారోడు : ఆ. ఫ్రెండంటే మా గంటోడే. వాడు నన్ను నీయమ్మ అని తిడతాడు. నేను రోస పడ్ను. నేను వాడ్ని కాల్తో గతుక్కున తంతా. వాడు రోస పడ్డూ. కావాలంటే సూస్కో (గంటోణ్ని లాగి తన్నాడు. వాడు కింద పడ్డాడు)

గంటోడు : ఒరే ముండనాయాల. పెద్దమణిసితో మాట్లాడతంటే యేందిరా నీ గోల.

చారోడు : నాయాల్ది మన ఫ్రెండ్సిప్పు గురించి...

గంటోడు : మూసుకోరా యింక యదవ నాయాల...యంకన్నా యట్టన్నాగాని యీడి సేను అమ్మి పెట్టాలన్నా.

మాయోడు : ఇన్కం ట్యాక్సు ప్రాబ్లంవుండావోడు దొరకాల గదా.

చారోడు : ఒరే అన్నా అట్టనబాకు, ఇదుగో ముక్కబట్టు..పట్టాల్తప్పదు
(ముక్క పెట్టాడు)
నాయాల్ది నోట్లో ముక్క బెడతండా నీ కాళ్లు బట్టుకుంటండా.
(మాయోడి కాళ్లు గెట్టిగా పట్టుకున్నాడు)

మాయోడు : ఒరె ఒరె ఒరె...ఒద(్రా.

గంటోడు : అమ్మి పెడతాడ్లే వొద(్రా.

చారోడు : ఒదల్నే నాయాల్ది మాటిస్తేనే వొదుల్తా.

మాయోడు : అబ్బా.. అమ్మ పెడతాలే వొద(్రా.

చారోడు : అయితే వొదుల్తా. నాయాల్ది నాగ్గూడ లచ్చ..లచ్చ వొచ్చుద్దీ.. అన్నా యింకొక్క ముక్కదిను.

మాయోడు : ఇంకొద్దురా.

చారోడు : నాయాల్ది నా మీద పేంవ లేదా. నా మనుచ్చాంతి కోసం... ఒక్క ముక్క... నాయాల్ది అన్నా... (పెద్దంగ అరిశాడు. మాయోడు గబుక్కున్నోరు తెరి శాడు. ముక్కబెట్టి పజ్జం అందుకున్నాడు చారోడు) అత్తగారిచ్చిన అంటు మాంవిడి తోట నీవు కోరగ..రాసి యిచ్చినానో...

గంటోడు : అశ నోరుముయ్యి, మందు గొంతు పొడుక్కీ బోయే దాలిశం యదవ నాయాలికి

చారోడు : కోప్మొచ్చిందా. నాయాల్ది నోరుమూస్తా, (నోరు మూసుకున్నాడు)

గంటోడు : యంకన్నా యీడికి మందెక్కువైందీ. ఇంటికి తీసకపోతా... ఆకరి ముక్కబట్టు.

మాయోడు : ఒద్దురా.

గంటోడు : ఈ ఒక్కటే ప్లీజ్, (నోట్లో పెట్టాడు)
నీకు త్యాంక్సురా యంకన్నా, ఇప్పుడు యాపీగా వుంది. ఇంకో పదేళ్లకి అమ్మాయి పెళ్లి కొచ్చుద్ది. ఈ లచ్చా తీసకపోయి బ్యాంకీలో పిక్సుడు చేస్తా.

మాయోడు : యేంది పిక్సుడు చేస్తావా.

గంటోడు : ఆ.

మాయోడు : హు. మనోళ్లకి డబ్బు సంపాయిచ్చటం తెలవదురా. ఏదో అదుస్టం వుండి యిట్టా యెతుక్కుంటా రావాల్సిందే

చారోడు : నాయాల్ది... ఆ యదుస్టం నాకుందా లేదా.

గంటోడు : ఉందిలే నువు పండుకోరా ముండా. (మాయోడి తట్టుకి తిరిగాడు) అయితే యట్టంటా.

మాయోడు : జాగర్తగా గుంట తొవ్వి డబ్బు మొత్తం పూడిసి పెడతానంటావే.

గంటోడు : మరెట్ట చేద్దాంవంటా.

మాయోడు : మనం చేసేదేందీ. ఆ డబ్బే సేసుద్ది సెయ్యాల్సిందంతా. ఒంగోల్లో పీ.టీ.రెడ్డనీ.. పేరిన్నావా. యేసీ యేర్కట్టింగు సెలూన్న డిపేవోడు మొన్నటి దాక. ముందటేడనుకుంటా. ఎంగంపాలెం రోడ్డులో యిట్టాటి సవిట్నేలే ఒకెకరా కొన్నాడు. శానాసీపులో వొచ్చిందిలే. యకరా రొండు లక్షలు. లే అవుట్ గీయిచ్చి ప్లాట్లేసేడు. సంవత్సరం తిరిగేలకీ.. అదే రోడ్డులోకి రొండు ఇండస్ట్రీలొచ్చినియ్. అంతే. రేటు స..ర్రనెత్తుకుంది. గది పదేల్లెక్కన పాతిక ప్లాట్లమ్మేడు. ఇరవై లక్షల క్యాసు సేతులో పడింది. యంటనే మారుతీ కారు కొన్నాడు. దానికి తోడు బ్యాంకీలో యింకాస్తె లోను దీసుకున్నాడు. రాంనగర్లో యిప్పుడు కోట్రూపాయలు బెట్టి అపార్టుమెంట్లు కట్టిస్తన్నాడు. అనుకున్నా రేటుకి అమ్మకం జరిగితే...యీన పచ్చంగ రొండు కోట్లు మిగుల్తాయంట

గంటోడు : అయితే.. యక్కడన్నా బాగా డవలప్పయ్యే యేరియాలో.. సీపుగా దొరికితే.. ఒకెకరా.. చూద్దాం వంటావా.

మాయోడు : బ్రహ్మాండం వైన బిట్టొకటుందిగనే.. అది పీటీ రెడ్డికి చూపిస్తానన్నానూ..

గంటోడు : యక్కడదీ.

మాయోడు : (జేబులోంచి సిన్న కాయితం తీసి మడతిప్పాడు)
ఇదుగో సూడు. ఇది వాటర్ ట్యాంకు కదా. ఇదేంవో ఔసింగ్ బోర్డు కోటర్సు. ఇంకొంచం దూరంలో.. యిక్కడ. ఇంజినీరింగ్ కాలేజీ పెట్టబోతండారంట. దానికి ప..క్కనే వుంది మ(న్రోండెకరాలు ఇంజినీరింగ్ కాలేజీ సంగతి పేపర్లో యేసి సేలో నాలుగు పిల్లర్లు పడ్డయనుకో.. ఈ రొండెకరాలే పాతిక లక్షలంటే మనం యిస్తాంవా

గంటోడు : ఇప్పుడెంతలో వుందో.

మాయోడు : మూడున్నరా ఆ మద్దెల తెగిపోవచ్చు.

గంటోడు : మన దగెరుంది ఒక లక్షే గదా. అదేంవో కండింపు కరుసుల్తో నాలుగు దాకా అయ్యేట్టుంది.

మాయోడు : అదేరా తెలివి తక్కువంటే. చారోడిది. అమ్మితే యింకోలక్ష రాదో. యిద్దరూ కలిసి చేసుకో కూడదా యేంది.

గంటోడు : అయినా యింకా రొండు కావాల గదా.

మాయోడు : రొండుంటే యింకో రొంటిదేం వుందిరా. అయిదొందలు సేతులో వుంటే అయిదేలకి టర్నోవరు చెయ్యాల. అది.

గంటోడు : మరి చారోడిది తొందర్లో సెటిల్జెయ్యి. మిగిలింది యట్నోవొకట్ట చూద్దాం. కాకపోతే..దానమ్మ...దచ్చినప్పొలాన రొండెకరాలమ్మకనూకి దీంట్లో కలుపుదాం.

మాయోడు : తొందర పడబాక. పీటీ రెడ్డికి చూపిస్తానన్నానూ..

గంటోడు : అదుగో యింకా మాటేవొద్దు. దీంట్లో మటుకి యింకొకడికి సోటు పెట్టబాక.

మాయోడు : అది కాదురా యి దీ..

గంటోడు : ఇంక మాట్టాడే పన్లేదు. నువ్వు పదడిగితే పది పాతికడిగితే పాతిక.

మాయోడు : సరే లే. మనోడివి తప్పదు గదా. మంచి రోజ్జూసుకోని పోదాం. పాతికేలు బయానాకి దగెరుంచుకో. (అంటూ వుండగా రాంపండు వచ్చాడు)

రాంపండు : ఏం ఎంకమాంవా మరీ నల్లపూసవై పొయ్యేవే. నీ కోసం వారం రోజుల్నించి యెతుకుతుండా.

గంటోడు : మరి...నే నొస్తా యంకన్నా. అదీ.. అట్నే కాయం జెయ్యి.

రాంపండు : ఏందన్నా యవ్వారంవా. మట్టాడుకోండి నేనెల్తా.

గంటోడు : అబ్బెబ్బే యేంవీ లేదురా.. ఒరే శారోడా.
(చారోణ్ని బలంతంగా లేపి నడిపిచ్చుకోని పోయ్యేడు)

మాయోడు : తాగి పడిపోయేడు.

రాంపండు : నేను తాగకుండనే పడిపోయేట్టున్నా నీ కోసం తిరిగి. ఆ సంవందం సంగతి.. అంజియ్య మాంతో మాట్టాడేవా.

మాయోడు : ఓ..మొన్ననే మాట్టాడితినే.

రాంపండు : మూర్తం పెట్టుకోవచ్చా.

మాయోడు : పెట్టుకోవచ్చునుకో...

రాంపండు : ఇంకా అనుకో యేంది. నెలాకరికి సెట్లవదా.

మాయోడు : సెటిలవదా..అంటే..

రాంపండు : నీలు నములుత్తా వేంది. అంజియ్య మాంవేంవన్నాడు.

మాయోడు : ఆయన్రడీ.

రాంపండు : మరీ..రక్తం వొదినేం వన్నా పేసీ బెట్టిందా.

మాయోడు : ఎబ్బే.

రాంపండు : మరింకాలిశం ఏందీ.

మాయోడు : అదీ.. సిన్న మెలిక బడిందల్లుడూ.

రాంపండు : మెలికా..కట్నం కాడేంవన్నా..

మాయోడు : అట్టాటిదేంగాదోయ్. అదీ కాస్తే.. ఆలిశం అయ్యేట్టుంది.

రాంపండు : అదే యెందుకని.

మాయోడు : నీకు తెలిసే వుంటదనుకున్నానే.

రాంపండు : నన్ను టెంక్షన్లో పెడతన్నావురా మాంవా.

మాయోడు : అదే..రాజ్జంవూ..మొన్నేదో పెళ్లికని చెప్పి ఒంగోలు పోయిందంటగదా. అంతే. అక్కణ్ణించటే...యెపుడో రౌడీ కుర్రోడితో లేసి పోయిందంట.

రాంపండు : ఇప్పుడ్నేనేం జెయ్యాల.

మాయోడు : కాస్త వోపిక పట్టాల. రాజ్జం రావాల గదా.
(మాయోడి శంప సెళ్లు మనిపిచ్చేడు)

రాంపండు : అది రాకపోతే.. (ఇపరీతంగా నవ్వేడు మాయోడు)

మాయోడు : రాకేం చేసుద్దీ.. లేసిపోయిందట్నేపోద్దా... అయినా యీ సెయ్యి తొందరేందిరో. నువ్వు కూడ మీ బాబాల్నే యీరోవై పోదాంవను. కుంటన్నావా.

రాంపండు : ముండమోపెవ్వారం చేసేవు. ఇప్పుడు రొంటికీ చెడ్డా. అయితే వక పంజెయ్యి. ఆ రేంజిలో దొరీ యిచ్చే సంవందం యింకేదన్నా వుంటే సూడు.

మాయోడు : అట్టన్నావ్ బాగుంది. అసల్రాజ్జంవేంది. దాని జేజమ్మలాంటి సంవందం వుళ్లా జమ్మల పాలెంలో.

రాంపండు : ఏది అయిదు క్యాషు యాబై గోల్డు.. ఆ రేంజిలో..

మాయోడు : అయిదేంది. ఆరను యేడను. యనక్కి తగ్గే పనే లేదు. అమ్మాయి పేరుతో వంద సవర్ల గోల్డుంది. వాళ్లమ్మమ్మ కనక అర్జంటుగా పోతే అయిదెకరాల మాగాణి కూడ ఆ పిల్లకే.

రాంపండు : మరి మాట్టాడి సెటిల్డెయ్య కూడదో.

మాయోడు : సెయ్యచ్చనుకో..అయితే అమ్మాయికి యేజి కాస్త యెక్కువోయ్.

రాంపండు : ఎంతుంటదో.

మాయోడు : ఎంతోనా, మహా వుంటే నీకంటే పదేళ్లెక్కువ.

రాంపండు : పదేళ్లా.

మాయోడు : పదంటే పెద్ద యిద్దూరంవా యేంది. కిష్టపరంవాత్ముడికంటే రాద పదేళ్లు పెద్దదంట. యాంవైందీ. ఇస్టుమూర్తి కంటే లష్మీదేవి పన్నెండేళ్లు పెద్దదంట. యాంవైందీ. పాండవుల్లో ఆకరోడు....దేవుడికీ ద్రౌపతికీ అవ్వా మనంవడి కుండంత తేడా. యాంవైందీ. అసలూ. సచ్చింతెదూల్కరు పెళ్లాం మొగుడి కంటె పెద్దదా కాదా. మొన్నీ నడంవ అంవెరికా నించొచ్చిళ్లా.. మన శంద్రబాబు కాడికి కూడా వొచ్చి పోయనే.. అదేం గేటు.. ఆ బిల్లు గేటు. అతని పెళ్లాంవారేళ్లు పెద్దదంట. పెళ్లాలు పెద్దోళ్లు కావటం వల్లనే.. వాళ్లంతా గొప్పోళ్లయ్యేరేంవో అని నాకు సిన్న డౌటల్లుడూ. అస్సలు మనోళ్లు వాయుసు తక్కువుండే అమ్మాయిల్నెందుకు చేసుకుంటారో తెలుసా.

రాంపండు : ....

మాయోడు : ఏం వుందీ. పెద్దయినాక మంచాన పడితే వాయుసులో వుండా పెళ్లాం వోపిగ్గా శాకిరీ చేసుద్దని. అదొక్క సుకంవే చూస్తుండారు గనీ యనకొచ్చే నాంవర్దా గురించి పట్టిచ్చుకోరే.

రాంపండు : నాంవర్దా యేంది.

మాయోడు : తెలవదా. కోనేటి కాడ సెంచురాంవయ్యకి వొయిసెంతుంటదీ.

రాంపండు : ఓ యాబయేళ్లుండొచ్చు.

మాయోడు : కదా. వాడికిక్కాళ్లు పట్టకపోయి మంచంవెక్కేడు. పెళ్లాం ఏం జేస్తుంది. ఊరు మీద బడి దున్నేస్తుంది. పాపం తాను మటుకేంజేసుద్ది సెప్పు. నిండా ముప్పయైదేళ్లు లేకపోయా, సీచ్చీచ్చీచ్చీ. ఒయుసు తక్కువ పిల్లని చేసుకోవటం నాంవర్దా అల్లుడూ. అదే కనక పదేళ్లు పెద్ద పిల్లని చేసుకున్నాంవనుకో.

రాంపండు : ఒరే మాంవా..ఇంక నువ్వేంవీ చెబ్బాకు. ఎనిమిది క్యాషు వందగోల్డు బండి ఆ ప్రైకారం కాయం చెయ్యి.

మాయోడు : సెయ్యొచ్చనుకో. ఈ మ్యాచికి పోవాలంటే కాస్తె గుండె దైర్నం వుండాలోయ్.

రాంపండు : అదేంది.

మాయోడు : యొవుడైనా సరే ఆ పిల్ల మెళ్లో తాలి బొట్టు కడితే.. అచ్చింతలకి బదులుగా కడపనించి బాంబుల్దెచ్చి నెత్తి నేస్తానంటన్నాడంట.

రాంపండు : వాడొవుడు.

మాయోడు : ఆ పిల్ల నుంచుకున్నోడు.

రాంపండు : ...నెత్తిన బాంబుల్నాకిచ్చుకోమంటావా.

మాయోడు : శచ్చ.

రాంపండు : మరాయవ్వారంవెందుకు.

మాయోడు : అదిగాకపోతే యింకోటి. జయ్యారంలో జడ్పీటీసీ కూతురు.. రడీగా వుంది. రేత్రి పూట టీబు లైటు యెల్తుర్లో సూసేంవనుకో సినుమా స్టార్. నీకు సరైన మేచ్చింగు. పది క్యాసు వంద గోల్డు. ఇంక టీవీలు బండ్లూ యిండ్లూ...

రాంపండు : బాంబులు కత్తులూ.

మాయోడు : అట్టాటి యేం లేవుగనే.. అయితే నువ్వు కాస్తె యెజ్జెస్టుగావాల

రాంపండు : ఎజెస్టేంది మల్లీ.

మాయోడు : ఆ పెళ్లాంతో పాటు..యిద్దరు పిల్లలు కూడ వస్తారు.

రాంపండు : వాళ్లొవురు.

మాయోడు : మొదిటి మొగుడికి పుట్టిన మొగ పిల్లోడు రొండో మొగుడికి పుట్టిన ఆడపిల్ల..వాళ్లకి నువ్వేంవీ పెట్టబన్లా. యేరేరుగా యిద్దరికీ డిపాజిట్లుండయి.

రాంపండు : నీయంవ.. నేనేంవన్నా ముసిలోణ్నా మూడో పెళ్లోణ్నా. కాస్తె పరువూ మర్యాదా వుండా కన్నె పిల్ల లెక్కడా దొరకరా.

మాయోడు : పరువూ మర్యాదా వుండా కన్నె పిల్లలు ఉండారు. అయితే నిన్నెందుకు చేసుకోవాల. ఏం చూసి చేసుకోవాల. ఆ కోటిబాబు లాగా ఒక మోటారు సైకిలా టాక్టరా ప్రజా కూలరా ఏం వుండయన్నీకు. కాళ్లూ సేతులూ తప్ప. పిల్లనిచ్చే వోడొవుడైనా.. మాయమ్మాయి మొగుడి నడుంకి సెయ్యి సుట్టేసి మోటార్సైకిలు మీద తిరగాలనుకుంటాడు. డబల్ కాటు పోంబెడ్డు మీద పండుకోవాలనుకుంటాడు. ఫ్రీజ్జులో నీలు తాగాలనుకుంటాడు. అంతేగనే.. నువ్వు పెట్టే సద్ది కూడు తింటానికీ నీ కొట్టాంకాడ పేడ గంపలు మొయ్యటానికి నీ బక్కెద్దుకి గెడ్డి పీకటానికీ పదిలక్షలెత్తు కోనొస్తారను కుంటన్నావా కన్నెపిల్లలు.

రాంపండు : ...

మాయోడు : ముందుగా మనం కొన్ని అంగులు సూపెట్టాలోయ్. కొరవా దరవా వాళ్లెత్తకొస్తారు.

రాంపండు : ఆ కొన్నయినా వొచ్చేదెట్ట.

మాయోడు : ఆ..పాయింట్లో కొచ్చేవు. కోటిబాబు కెట్టొచ్చినియీ. రాదా కిస్టిగాడి కెట్టొచ్చినియీ. పెద్దబ్బికెట్టొచ్చినియీ. వాళ్లు నీకంటే పెద్ద రైతులా. (రాంపండు ఆలోశన్లో పడ్డాడు)
కోటిబాబునే తీసుకో. ఉండా నాలుగెకరాల్లో రొండెకరాలమ్మేసేడు. కావాల్సిన అంగులన్నీ కూరుసుకున్నాడు. పన్నెండెకరాల కిమ్మత్తు కట్నం తీసుకున్నాడు. ఇప్పుడు పాతికెకరాల సేద్దెం చేస్తండాడు. కోటిబాబు అమ్మింది యకరా యాబయ్యేలు. మీ సేనుకి లక్ష లెక్కన

బేరం తెచ్చా. రడీ క్యాసు. మీ బాబుకి చెప్పి.

రాంపండు : ఆ..మొన్నొక సంగజ్జెప్పా.

మాయోడు : యాందన్నాడు.

రాంపండు : చె...త్త ర్యేగ్గొట్టాడు. నువ్వేదారి జూపాల.

మాయోడు : మరి దారి చూపిందాకా ఆగు. ఇంక నేనొస్తా.

రాంపండు : సంవందం సంగతి. మాంవా..మాంవా...మావా..

(యంటబడి బతింవాలాడు.)

మాయోడు : నీకు పెళ్లాం కావాల. అయిదు లక్షల కట్నం కావాల. అంతేగా.

రాంపండు : అంతే.

మాయోడు : అయితే... రేపొచ్చే ఆదివారం అంవాస రోజునాడే నీ పెళ్లికి లగ్గం. మాట్టాడకుండా నా యంట రా. రా...

(గొఱ్ఱె లాగా మాయోడెనక నడిశాడు రాంపండు).

# దృశ్యం 8

(రచ్చబండ, దొరసాని బట్టలుద్దుకుంటా వుంది. ముచ్చాలు పీట కుర్చీగా మారింది. ఓ బుద్దోడికి క్రాపింగ్ చేస్తుండాడు ముచ్చాలు. కోట్లింగం టీ కొట్టు కూర్చింకు సాపుగా మారింది. సుబ్బాయి చారోడు శీనాయి గంటోడు బుచ్చియ్య స్టిక్కీర్నాంవి వుండారు. తాగిన మైకంలో సేత్తో నేల మీద బాదుతా మాట్లాడతన్నాడు చారోడు. ఒక సేతులో సీసా వుంది. సుబ్బాయి పాన్ పరాగేసుకుంటన్నాడు)

చారోడు : నాయాల్ది యీ బూంవి బద్దలుగా సీలిసేస్తా యియ్యాల. తేలిపోవాల.

గంటోడు : డిస్సేంటీనా కొత్తది బిగిచ్చాలంటే పాతికేలవుద్ది. ఇదిరగ నూకిన్నా కొడుకొవుడో తేలాల. (ఇరిగిపోయిన డిస్కు వొస్తువు చూపిస్తన్నాడు)

చారోడు : కొడుకూ గిడుకూ అన్నావంటే నాయాల్టి యేసేస్తా నా కొడక.

గంటోడు : మొగోడివైతే రారా కొజ్జా నా కొడక.

చారోడు : ఒరేయ్...నీ యంవ... (పైకి దూకాడు. ఇద్దరూ కలబడ్డారు. నలుగురూ కలిసి తప్పిచ్చి పక్కకి నెట్టారు)
నాయాల్ది యీణ్నేసేస్తారా యియ్యాల. ఈడెంవ..వదలండ్రా

సుబ్బాయి : ఏడిసేవలే వుండవోయ్ ముండా. కూసో యీడ.

గంటోడు : రానియ్యండ్రా వాణ్నీ వాడేసేదేందో సూస్తాసూ.

సుబ్బాయి : ఆగవోయ్.. నువ్వట్టా కూకో. కూకో సెవతా.

చారోడు : కోట్లింగం.. ఒరే కోట్లింగం. (అక్కణ్నించే పలికేడు కోట్లింగం) తేరా కోటరూ.

శీనాయి : పదిమందిలో పడ్డాక వొళ్లిరుసుకుంటా రేందిరా సోంది. నిజంగా తన్నుకునే వోళ్లయితే యింటికాడ్నే తన్నుకోగోడదో
(కోట్లింగం బాటిల్దెచ్చిచ్చాడు. మూత తీసి గట గటా తాగుతున్నాడు చారోడు)

సుబ్బాయి : అసలీళ్లిద్దరకీ తగూ యెందుకొచ్చిందిరా.

శ్రీనాయి : పోలీసోళ్లొచ్చి చారోది సారాయి కుండలన్నీ పగల్నూకి పోయేరుగదా. ఈడి కాపు సారాయి కతంతా గంటోడే పోలీసులికి శారేసేడని చారోడికి అనుమానంరా.

గంటోడు : వశ వాడు సారాయి కాసుకుంటే నాకెందుకు. సంకనాకితే నాకెందుకు. నేను పోలీసులుకి చెప్పినట్టు రుజువు చెయ్యమన్నా.

శీనాయి : నువ్వుంద్రా సోంవి.. అది కడుపులో బెట్టుకోని అద్ద రేత్తి రొచ్చి చారోడే డిస్పేంటినా పగల్నూకేడని గంటోడంటాడ్రా

చారోడు : నాయాల్ది నేనిరగ నూకంగా చూసిందొవుడో సెప్పమన్నా.

సుబ్బాయి : దొంగనాయాళ్లు చేసే పన్లుకి సాచ్చాలుంట యేంరా.

స్టిక్కోడు : ఒరే యీళ్లిద్దరూ నాలుగైదెకరాలుండా రైతులుగదా. ఈడికి కాపు సారాయి కాసుకునే గతేంది. కొంప మీద ఆ గొడుగంటిది తగిలిచ్చుకోని యింటింటికీ తిరిగి తీగల్లాక్కునే గతి వాడికెందుకు బట్టింది. (చారోడు అరుగు మీద పడిపోయాడు)

శీనాయి : వాడొవుడో పెద్దమ్మోరు నాయాలొకడొచ్చి యీళ్ల సవిటి పొలం కొన్నాడు గదా. సెరొక లచ్చ వుచ్చితంగా వొచ్చినియ్. ఆ వూరకొచ్చిండట్పే యీళ్లనీగతి పట్టిచ్చింది.

సుబ్బాయి : డబ్బొరెకనే వొచ్చిందిరా. కమ్మంగ రొండెకరాలు పొలంగొనుక్కోవచ్చా బ్యాంకీలో దాసి పెట్టుకోవచ్చా. బంగారపు సొమ్ము ల్లేయిచ్చుకోవచ్చా.

శీనాయి : యొవుడ్రా సోంవి సంవత్సరం తిరిగేలకి కోటీస్పుర్లవ్వాల. ఆశ. వుండా పొలాన్ని కూడ అమ్మకనూకీ మొత్తం తీసకపోయి ఒంగోలు పక్కన కటికి బండ రాతినేల సెరో యకరా కొన్నారు. ఇళ్ల స్తళాల కంచెప్పీ కొలతల్లాగి రాళ్లు పాతేరు. ఆర్నెల్లయింది. అడిగినోడు లేదు ఇప్పుడమ్మితే అక్కడ పాతిన కండాప రాళ్ల కరీదు కూడ రాదంట అనిగింది నాయాళ్లకి.

సుబ్బాయి : ఏదో యింజినీరింగు కాలేజీ అని మాటల్లెప్పి యీళ్లని ముంచింది. మాయొడంట కదరా.

శీనాయి : బోకరోడు లచ్చమాట లైవతాడ్రా, ఈళ్లు కడుపుకి కూడు తింటంలా. అసలు మాయోడి తప్పేందిరా సోంవి ఈళ్లు కొన్నా మరసట్రోజు నాడే లచ్చ లాబానికి బేరం తెచ్చేడు. ఇచ్చేరా. ఒక్క రోజుకే లచ్చ పెరిగితే.. ఒక నెలాగితే యెంత పెరుగుద్దా... అని లెక్క లేసేరు. గులనిగింది

గంటోడు : అయ్యన్నీ యిప్పుడెందుకురా, మిమ్మల్నేంవీ పెట్టమన్లేరుగా

సుబ్బాయి : మమ్మల్ని పెట్టమన్నా మీరిద్దరూ పెట్టుకోనొచ్చేరు గదా. ఫ్రెండ్సయితిరే. ఇద్దరూ సక్కెంగా కలిసి అడక్కు నూక్కపొయ్యరా. ఇక్కడకెందుకొచ్చేరు.

బుచ్చియ్య : ఒరే నేనొకమాట...

సుబ్బాయి : నువు కాసేపుండవే సెవుదువుగోని.

స్టిక్కోడు : ఒరే ఒంగోల్లో యిద్దరూ కలిసి స్తళంగొన్నారు. బానే వుంది. సావాని గోళ్లంటన్నారు కదా. మరి తగు యెందు కొచ్చిందీ అని.

శీనాయి : ఎందుకంటే పొలం కొన్నప్పుడూ చారోడేంవో మూడు లచ్చలు పెట్టేడంట. గంటోడేంవో డబ్బందక రొండు లచ్చలే పెట్టేడంట. తేడాని లాబాల్లో సర్దుకుందాంలే అనుకున్నారు. లాబం గూబకంటింది గదా. ఇప్పుడేందో యాబయ్యేలు నాకిస్తే యిద్దరంవీ సంవాన ఔతాంపూ అంటారు. చారోడు. ఇప్పుడు నా దగ్గిరేంవుందీ అమ్మినప్పుడు సర్దుకుందాంవూ అంటాడు గంటోడు.

సుబ్బాయి : అదన్నమాట తగూకి మూలం. బంగారం వంటి పొలం అమ్మక నూకటం ఏందీ బాడకావ్ పన్లు జేసి జుట్లేసుకోవటం ఏంది.

చారోడు : (పైకి వులికి సీసాలో మిగిలింది నోట్లో పోసుకున్నాడు) నాయాల్ది యింకా మాట్లేందిరా తేలిపోవాలియ్యాల

సుబ్బాయి : ఏడిసేవులే పండుకోరా ముండా.

శీనాయి : రాంవాయణంలో పిడకలేట్లాగ యీళ్లెవ్వారంతోనే సరిపోయింది. అసలు మీటింగేసిందెందుకురా సోంవీ.

సుబ్బాయి : ఎందుకేంది. సొసైటీ యలచ్చన్లొస్తండయ్‌గదా. పెసిరెంటుగా యొవురుండాల్నో తేల్చుకోటానిగ్గదో.

శీనాయి : మరా సంగతి మాట్టాడ్రే.

సుబ్బాయి : అసల్లీడర్లు.. బ్రెమ్మంపు యంగట్రావు రాలేదుగా.

శీనాయి : వాళ్లిప్పుడెందుకొస్తాన్రా సోంవి. ఇద్దరూ కలిసి లాలూసీ పడీ.. ఆకర్లో వస్తారు. దొంగనాయాళ్లు. (అంతలో ఒక కుర్రోడు.. యనక యింకొకడ్ని యెక్కిచ్చు కోని సైకిలు మీద బస్తాండు తట్టుగా పోతన్నాడు)

సుబ్బాయి : ఆ సైకల్తొక్కుతుంది...సుందిరి కొడుకు సేకరు గోడు కదో.

శీనాయి : ఆ..

సుబ్బాయి : వాడి మేనమాం తరుపున ఒంగోల్లో వుండి సదువుతుండాడన్నారే.

శీనాయి : సదువైపోయింది గాంవాల. ఊళ్లోనే వుంటన్నాడుగా.
(ఊరు తట్టు నించి ఒంటేల్రాగోలొచ్చాడు)
యాంవరో రాగవాయ్ పెళ్లయినాక అస్సలు మారి పాయ్యేవ్ గదరా.

రాగోలు : బలే సెప్పేవే. పెళ్లికి ముందే మారిపోతినే.

సుబ్బాయి : మాకు చెవితే పెళ్లికి మేం కూడ వొచ్చే వాళ్లం గదరా.

రాగోలు : బలే సెప్పేవే. ముందుగా నాకు తెలుసా యేంది. అంజియ్య మాంవ అర్జంటుగా పిలిసీ తిరపతి పోదాంరారా అన్నాడు. సరే అని కారెక్కా ఆడకి పోయినాక రాజ్జానికీ నీకూ పెళ్లిరా అన్నాడు. సరేలే అని తాలి బొట్టుగట్టా.

గంటోడు : యాంవైతేంవి రాజ్జాన్ని చేసుకున్నాక నీ స్టారు మారింది లేరా. మరి కట్నం ఎంతోయ్ రాగవాయ్.

రాగోలు : బలే సెప్పేవే. కట్నం నేనడిగేనా యేంది. అదంతా రాజ్జం చూసు కుంటల్లా. మర్సిపోయా కోటిబాబు టాగట్రి బేరాని కొచ్చిందంటగా. మా రాజ్జం మాట్టాడమందిలే. కోటిబాబేంవన్నా కనపడ్డాడా మీకు.

సుబ్బాయి : కోటిబాబా. నీకేంవన్నా కనపడితే సెప్పు. అరగంట్లో యిస్తానని అయిదేలు తీసుకోని అయిపు లేకుండా పోయేడు తప్పుడ్నాయాలు

శీనాయి : సీటీ అంచెప్పి యింటి సుట్టూ తిరిగి పాతికేలకి నన్నిరికిచ్చేడ్రా యదవ నా కొడుకూ.

గంటోడు : ఇంకేం సీటీ. కుర్సీలు బీరువాలు... సేతికందిన మటుకి జనం నూక్కపోయేరు పోలీసోళ్లచ్చి ఆపీసుకి సీల్నాకేరు

సుబ్బాయి : నాలుగేళ్లు నడమంత్రంగ యెలిగిచ్చేడురా. ఆ బండి మీద్దిరగటం ఇంట్లో ఫ్రిజ్జు, కలర్టీవీ డబల్ కాటు బెడ్డు ఆ లెవలు.

(ఆ వస్తువులన్నీ సెక్కబండి మీద పెట్టుకోని ఐస్టాండు తట్టుకి లాక్కు పోతండా దొకతను. బండి యెనక యింకో మణిసి కూడా వుండాడు.)

గంటోడు : ఇయ్యన్నీ కోటిబాబుయే.

సుబ్బాయి : ఇంటి మీద కూడా పడి నూక్యప్తోతండారన్నమాట.

శీనాయి : మంచం వుండాకాడికి కాళ్లు ముడుసుకుంటే యిట్టెందుకవుర్దిరా. వాడి జివ్వానికి పెళ్లాం పిల్లలేడుస్తుందారు.

గంటోడు : కింటా మూడేలమ్మాల్సిన పత్తి తొమ్మిదొందలమ్ముతుంది. వాడు మటుకేం చేస్తాడు.

సుబ్బాయి : నిండా నాలుగేకరాల్లేని ముండ నలపయ్యేకరాలెయ్యాల్నా ఒక్కపారే డబ్బు నూకాల, నువ్వట్నే గదో ముసుగేసింది.

గంటోడు : తంతా నాయాల, వాణ్నీ నన్నూ ఒకే గాట్న కట్టేస్తావే. నేనేంవన్నా అప్పులోళ్లకి యెగసూకేనా. అణా పైసలో కట్టెయ్యలా.

రాగోలు : బలే సెప్పేవే. ఇంకా అయిదేలకి నోటుళ్లా. ఎంతడిగినా మొండి కేస్తందివే. ఎప్పుడిస్తా.

గంటోడు : ఇస్తానన్నానుగదా.

రాగోలు : ఎప్పుడూ.

గంటోడు : వుందప్పుడిస్తానోయ్ ఒక సంవత్సరం దాకా నా వల్లగాదు. నన్నడగద్దు.

రాగోలు : సం...వత్సరంవా ....బలేసె...

గంటోడు : ఏయ్ ఏందే..ఏంది నువ్వనేది. అసలియ్యను. ఇయ్యన్రా. నీకు దిక్కుండా వోడితో చెప్పుకో పో, (పైకి దూకాడు)

రాగోలు : ..డబ్బులడిగితే అంత కోప్మయితే యెట్టా,

(గొణుక్కుంటా బస్టాండు తట్టుకి పోయాడు)

గంటోడు : గుడ్డల్లో వుచ్చ బోసుకునే నా కొడుకు.

శీనాయి : వాడిదేంపుందిలేరా సోంవి. పంచలో పండుకునే వోడు.

బుచ్చియ్య : ఒరే నేనొక మాట...

శీనాయి : తరవాజ్జెవుదువుగోన్లే వుండే.

సుబ్బాయి : అసలు రాజ్జంవూ.. మూడు సార్లు...

(గబుక్కున సుబ్బాయి నోరు మూసి సెయ్యి బయిటికి చూపిచ్చేడు శీనాయి. అందరూ బయిటికి చూసి ఒక్కసారిగా నోళ్లు మూశారు. ఏంపీ యేరగనట్టు పక్కలకి చూస్తన్నారు. ఒక్కదూ నోరెత్తలా. రాజ్జంవు ఆ యనక ఓ టౌను కుర్రోడూ నవ్వుకుంటా బుజాలు రాసుకుంటా వచ్చారు. రచ్చబండ దగ్గిరున్నా వాళ్లని పట్టిచ్చుకోకుండా వాళ్ల పాటికి వాళ్లు బస్టాండు కెల్లిపోయారు. అప్పుదు గాలి పీల్చుకోని మాటల్లో కొచ్చారంతా)

సుబ్బాయి : మరీ పెబ్లిక్కయి పోయిందిరా. (పాన్ పరాగేసుకున్నాదు)

గంటోడు : ఈడికి బెయిలెప్పుడిచ్చేరూ.

శీనాయి : బెయిలిప్పుదేందిరా సోంవి. నెలకి పైనైతే. బయటికొచ్చిన మూడో రోజేగదో బైపాస్ రోడ్లో స్కూటరు మీద పోయే వోణ్నాపి నడిరోడ్డులో నరికేసినే.

సుబ్బాయి : మరీ యిట్టాటోణ్ని వూళ్లోకి సేరదియ్యటం మనం గాజులు తొడుక్కోని సూస్తా కూసోవటం... నాకు నచ్చలేదురా.

శీనాయి : నీకెందుకూరుకోరా సోంవి. యొవుడన్నా పోయి వాడి సెవులో వూదేడనుకో వాడికిదే పని. (కత్తితో పొడవటం చూపిచ్చాదు)

గంటోడు : కేసులన్నీ యెట్టా తట్టుకుంటాడ్రా.

శీనాయి : వాడ్నొవుడ్రా సోంవీ అడిగేది. సేతులో పనితనం వుందీ ఎనకెమ్మేల్లే వుండాడు.

(వోండా బండి మీద ఊళ్లోంచి రాంపండొచ్చాదు)

సుబ్బాయి : ఏంవోయ్ పండో.... ఆగవోయ్. రావోయ్ పోదుగోనే. (ఆగాదు)

రాంపండు : బస్టాండుకి పోవాలా.

శీనాయి : పోదుగోస్లేవోయ్. ఊరందరికీ సంవందించినెవ్వారం నదుస్తుంది గదా.

రాంపండు : మళ్లీ వొస్తారా. నా మిసెసు ఒంగోల్నించి వొచ్చుద్ది. ఇంటికి తీసక పోవాల.

గంటోడు : బస్టాండు నించి యింటికి పోలేదా యేంది.

శీనాయి : ఒరే కొత్త వైపు కొత్తబండి. అర్థంజేసుకోవాల్రా.

రాంపండు : తినబాకంద్రా సోంవి.

సుబ్బాయి : బసొచ్చినప్పుడు పోదుగోన్లేరా. (బండికి స్టాండేశాడు రాంపండు)

స్టిక్కోడు : పొగాకెన్నెకరాలేశావురా అబ్బాయ్.

రాంపండు : ముప్పటయిదెకరాలేసేనే. ఆరు బ్యార్నీలు.

గంటోడు : ఇయ్యేడు సొమ్ము నీదేలే. రొండు మూడు మిగుల్తాయా.

రాంపండు : మొత్తం అమ్మనియ్యరా.

సుబ్బాయి : అమ్మేదేంది రేటదిరిపోతంది. నీకేంపో దిగుబడి బాగుంది.

శీనాయి : పుగాక్కొనుగోలు గూడ మొదులు బెట్టేవంటగా.

రాంపండు : అ.... ఎంతలేరా.

శీనాయి : లాగిచ్చు లాగిచ్చు. పెళ్లయినాక సుడి తిరిగిందిలే నీకు.

సుబ్బాయి : పత్తేసి కోటిబాబు పత్తా లేకుండ పోయేడూ. రాంపండు పుగాకేసి ఒక తీత తీస్తండాడు. (బస్సు ఆరన్ మోత యినపడింది)

రాంపండు : ఒరే బసొచ్చినట్టుందిరా. (అడావుడిగా బండి యెనక్కి తీశాడు. బస్టాండు కాడ్నించి వొస్తన్న శేకరు సైకిలు రాంపండు బండీ గుద్దుకున్నయ్) యాంవరా కళ్లు కనపట్టం లేదా.

శేకరు : కనపడితేనేగా ఆపింది.

రాంపండు : మొహమ్మీద కొడతా నాయాల.

శేకరు : రేయ్ నోరు దగ్గిరుంచుకో.

రాంపండు : రే యొవుడ్రా నీకు. (బండికి స్టాండేసి సొక్కా పట్టుకున్నాడు. శేకరు కూడా రాంపండు సొక్కా పట్టుకున్నాడు) బలిసిందిరా నీకూ. బలిసింది నీ...కు. సొక్కా వొదులు.

(ఇద్దరూ గుంజుకుంటన్నారు. బస్టాండు పక్కనించి యంగట్రావొచ్చి యిద్దర్నీ యిడిపిచ్చి పక్కకి తీశాడు)

యంగట్రావ్ : ఏందిరా శేకరూ యిది యదవతనంగ, అయినా కలబట్టంవేది. ఏం జరిగిందిరా పండో.

రాంపండు : సైకిల్దెచ్చి బండికి గుద్దీ ఏందిరా అంటే యేందిరా అంటన్నాడో.

శేకరు : బజారేంవన్నా నువ్వొక్కడివే కొనేసేవా.

రాంపండు : అదుగో... ఆ తల బిరుసు మాట్లే వొద్దనేది. బండిగ్గుద్దుతావా.

శేకరు : నేను గుద్దేనా. నువు దారికి అడ్డంగా బండి తీస్తివి. తప్పు వుంటే యిద్దరిదీ వుండాల.

యంగట్రావ్ : తప్పు లేదూ వొప్పులేదూ. ఒదిలెయ్యండ్రా. ముక్కెంగా నువ్వెల్లిపో సేకరో. ప్లీజ్ గో. (శేకరు సైకల్దీసుకోని పోతన్నాడు)

సుబ్బాయి : నాయాళ్లు.. తిని బలిసుండాట్రా

శేకరు : రేయ్... పదిమందెనకుండారని రెచ్చిపోవాకు. నీ సొమ్ము పెట్టావా.

సుబ్బాయి : ఒక్క తన్ను తన్నేనంటే దొమ్మలు పగిలి పోవాల్నాయాల. పదిమందిం వుండి యేం జేసేంవురా నిన్ను. (పైకి దూకాడు)

యంగట్రావ్ : యహె నువ్వాగరా. పో యనక్కి

సుబ్బాయి : సొక్కాబట్టుకున్నప్పుడే తన్నాల్సిందిరా.

శేకరు : కాళ్లు మాగ్గూడా వుండయ్.

సుబ్బాయి : అయితే తందువుగోనిరా. రారా నా కొడక. (మళ్లీ పైకి దూకాడు సుబ్బాయి)

యంగట్రావ్ : ఆగవోయ్ ముండా. ఇప్పుడ్నువు తంతే రేప్పల్లె పక్కకి పోయినప్పుడు ముక్కెంగ వాళ్లూరుకుంటారా.

సుబ్బాయి : బయపడి గాజులేయిచ్చుకోమంటావా. (బస్సు ఆరన్ యినపడింది)

రాంపండు : బసొచ్చింది. (బండి మీదెల్లి పోయాడు)

యంగట్రావ్ : సేకరూ నువ్వెల్లు, నామాటినూ. ప్లీజ్. (శేకరు కూడ యెల్లిపొయ్యేడు)

సుబ్బాయి : నెత్తినెక్కిచ్చుకోండి. కాళ్లు పట్టుకోని బతింవలాడండ్రా

శీనాయి : అసలోళ్లు పోయేల్లే వూరుకోండ్రా సోంవి.

సుబ్బాయి : ఇయ్యాల సొక్కా పట్టుకున్నాడో రేపు తన్నే పోతాడు. ఇట్టాటెదవ నాయాళ్లు మజ్జిలో చేరితే

యంగట్రావ్ : సరే తిట్రా. ముక్కెంగ నన్నే తిట్టు.

స్టిక్కోడు : ఒరే పండోడబ్బా సేకరు గోడబ్బా సావాసగోళ్లయితిరే యీళ్లిద్దరికీ యెందు కొచ్చిందిరా. ఊరెక సైకిల్దిల్నందుకే యిట్టారెచ్చిపోతారా అని.

గంటోడు : అసలంటా... నిరుడు గాంవాల. పండోడు పల్లెలోకిబోయీ ఒరే సుందిరీ ఒరే సుందిరీ అని కేకేసేడంట. అప్పుడు సేకరు గోడుండీ మర్యాదగా పిలవలేవా మీ బాబుని ఒరే రాంకోటు అంటే వూరుకుంటావా అన్నాడంట.

సుబ్బాయి : సుందరయ్య గారూ అని పిలవాలగాంవాల తొక్కగాణ్ని.

యంగట్రావ్ : నువ్వుంట్రా.

గంటోడు : అప్పుడే సొక్కాలు సొక్కాలు పట్టుకున్నారంటే. అది.

బుచ్చియ్య : ఒరే నేనొక మాట.. సెవతాన్రా

సుబ్బాయి : ను....వ్వొ...క...మా....ట చెవుదుగోన్లే వుండే

(యటకారంగా సాగదీస్తన్నాడు సుబ్బాయి. అందరూ నవ్వారు. బుచ్చియ్య లేసి పోతన్నాడు. ఊరు పక్క నించొచ్చిన బ్రెమ్మం ఎదురయ్యాడు)

బ్రెమ్మం : పోతావుండావేందే.

బుచ్చియ్య : రచ్చబండ కాడెవ్వారంలో మాతరంవోళ్ల అవసరం తీరిపోయిందిరా. నేనుండా వొకటే. లేకపోయినా వొకటే. మీ యిష్టం వొచ్చినట్టు వూరేగండి. వూరేగండ్రా. (యెల్లిపొయ్యేడు)

శీనాయి : చారోణ్ని లేపండ్రా.

సుబ్బాయి : చారోడా. వొరే చారోడా. (పాన్ పరాగేసుకున్నాడు)

చారోడు : ఏసేత్తా... నాయాల్ది...

యంగట్రావ్ : ఏడిసేవ్ లే..లే.

శీనాయి : వాడింకేం లేస్తాడుగనే.. సెప్పండ్రా.. యాంవరా గంటోడా.

గంటోడు : బ్రెమ్మం బావకీ యంగట్రావుకీ యవ్వారంవంతా తెలుసులే.

యంగట్రావ్ : అదిగాదురా గంటాయ్ డిస్సేంటినా యిరగ్గొడతంటే ముక్కెంగా సూసినో డొవుడ్రా.

గంటోడు : సూసినోడుంటే అక్కణ్నే పాతి పెట్టక పోయ్యేనా.

బ్రెమ్మం : మరి విట్నెస్ లేకుండా జడ్జిమెంటెట్టా.

శీనాయి : చారోడి మీద యీడు పోలీసులుకి చెప్పినట్టు గూడ రుజువు లేదుగదా.

బ్రెమ్మం : ఫైనల్ గా ఒకటేనోయ్. ఇద్దరూ లాసయ్యిండారు కాబట్టి.. ఇది మొదులు చారోదు కాపు సారాయి కానుకుంటే నువు పోలీసులుకి యింపర్మేసనియ్య గూడ దబ్బాయ్. అట్నే నువ్వేదన్నా తిప్పలు బడితే చారోదు పట్టిచ్చుకో గూడదు.

సుబ్బాయి : అదీ. అట్టా యొవుడి పనోదు చేసుకుంటే గొడవేంవుంది.

స్టిక్కోడు : ఇప్పుడూ.... మా గూపు శారోదు దొంగసారాయి కాసుకుంటాడూ అది మీ వోడు పోలీసులుకి చెప్పడు. బాగనే వుంది. మరి మీ గూపు గంటోడు... తిప్పలు పడితే.. అనన్నాడే... ఆ పడే తిప్పలేందీ అని.

శీనాయి : అదిరా స్టిక్కంటే.

సుబ్బాయి : అదిగాదులేరా. గంటోదు యీసీపీ తెచ్చి వూళ్లో సినుమా లేస్తంటాడు కదా: అప్పుడప్పుడూ కుర్రోళ్లని బ్యేర్నీలోకి తీసకపోయీ బూతు సినుమాలు కూడ చూపిస్తుంటాళ్లే. ఆ సంగతయ్యింటది. ఏంవే బాబా.

స్టిక్కోడు : అదేంవోరా నాకేం తెలుసూ నేనేంవన్నా చూసేనా నన్నెవుడన్నా పిలిసేడా.

యంగట్రావ్ : అదిరా. ఈ నా కొడుక్కి ముక్కొంగ బ్లూ ఫిలుంలు కావాల్రా.

శీనాయి : యవ్వారంలోకి రండ్రా సోంవి.

బ్రెమ్మం : యంగట్రావ్ చారోదు పైకి లేసినాక నువు స్ట్రాంగా వార్నింగియ్యాలోయ్.

యంగట్రావ్ : వాడికి నేంజెవతాలే. ముక్కెంగా గంటోణ్ని నువు కంట్రోల్జెయ్యి పోలీసోదు మనూళ్లో కొస్తే యెంత నాంవర్దా.

సుబ్బాయి : సొసైటీ సంగతి.. ఎలచ్చన్లు నెల కూడా లేవు.

బ్రెమ్మం : ఆ. మా గ్రూపంతా రాత్రి మీటింగేసుకోనీ వొక డెసిసిన్ కొచ్చేంవోయ్. ఎలక్సన్లో కంటెస్టు లేకుండా సొసైటీ పెసిరెంటు సీటు మీ గ్రూపుకే వొదిలెయ్యాలని డిసైడ్ చేసేంవోయ్. యాంవ్రా గంటాయ్.

గంటోదు : అంతేగదో. వూరు మంచికోసం.

యంగట్రావ్ : మీరంతా వూరు మంచి కోర్తావుంటే... ముక్కెంగ మేమ్మటుకి యదవతనంగా వుంటాంవా యేంది. ఒచ్చే యేదు పంచాయితీ వస్తంది గదా. అప్పుదు సర్పంచ్ పోస్ట్ మీకే వొదిలేస్తాంవూ.

సుబ్బాయి : ఓకే. ఇంక పోటీలూ గొడవలూ వుండవుగదా.

బ్రెమ్మం : ఇంక మనం పీస్ ఫుల్ గా విలేజీని డవలప్ చేసుకోటంవే...

స్టిక్కోడు : ఒరే నాకొక అనుమానంరా.

శీనాయి : రానియ్ బయిటికి రానియ్యరా సోంవి.

స్టిక్కోడు : ఎలచ్చన్లు లేకుండ రాజీ చేసుకున్నారు బాగుంది. రేప్పెసిరెంటు వాళ్లకన్నారు ఇప్పుడు సొసైటీ మనకన్నారు యిదికూడా బాగనే వుంది. మరి మన గూపులో సొసైటీ పెసిరెంటుగా వుండేదొవురు. మా యింటి పేర్టీవోడా శీనాయింటి పేర్టీవోడా.

గంటోడు : సంతనంగా యేసేడ్రా. (యంగట్రావ్ కొరకొరా చూసేడు)

శీనాయి : పెత్సారీ మీయింటి పేర్టీవోడేనా యేంది ఇంకొవురూ లేనట్టు. ఒకసారి మేంవుండ కూడదా.

సుబ్బాయి : మళ్లీ యీ యింటి పేర్టీలూ గుడిసె పేర్టీలూ యేంది. యంగట్రా వనుకున్నాం గదా.

శీనాయి : మీరూ మీరూ లాలూసీ పడితే సరిపోద్దేంట్రా.

యంగట్రావ్ : అయ్యన్నీ యెందుకురా. మెజార్టీ యట్టుంటే అట్టబోదాం నేం జెవతండాగదా. నా సపోటు యంగట్రావుకే. ఇంక... యీర్సాంబాబు స్టిక్కైతే నూకేదు గనీ యంగట్రావుని కాదంటాడెట్టా. ఏంవే బాబా.

స్టిక్కోడు : ఆ ఆ. అంతేగదో. మావోడాయనే.

సుబ్బాయి : మరి నువ్వు కావాలనేదొవురో సూపిచ్చు.

శీనాయి : చారోడ్ని లేపడగండి.

గంటోడు : ఆ ముండ లేసేది లేదూ నీకు సపోటిచ్చేది లేదు. ఎందుగ్గనే వూరుకోరా.

శీనాయ్ : ఇట్టా ముందుగానే యవ్వారంజేసుకోని కుట్ర జేస్తా వుంటే సూస్తా వూరుకుంటాంవా యేందిరా. మేం పదిళ్లోళ్లంవనేగా. ఈ సారి మటుకి సొసైటీ మాకియ్యకపోతే నే న్నాంవినేసన్నూకేది కాయం.

యంగట్రావ్ : యట్టా నూకుతావే నాంవినేసనూ. ముక్కెంగా పదిమందీ ఒక మాటనుకున్నాక.

శీనాయి : నువ్వెట్టా సొసైటీ కొస్తావో నేం జూస్తాలేవోయ్.

యంగ్‌ట్రావ్ : ఏందే నువు చూసేదే. (ముందుకొచ్చేడు)

శీనాయి : నువ్వు జేసేదేందిరా. (ఇద్దరూ కల బడ్డారు. అందరూ కలిసి తలా ఒక మాటని యిద్దర్నీ పక్కకి తీశారు. బస్టాండునించి బండి మీద పెళ్లాన్నెక్కిచ్చుకోని వొచ్చిన్రాంపండు వూళ్లో కెల్లిపోయేడు)

యంగ్‌ట్రావ్ : ఏందోలే అని వూరుకుంటంటే ముక్కెంగ...

శీనాయి : పూరుకోక యేం జేస్తావే.

(మళ్లీ సేతులు కలవటోతన్నయ్, అంతలో గంటోడు బస్టాండు తట్టుకి సెయ్యి చూపిచ్చి సైగజేశాడు. జనం ఆ పక్కి చూసి ఒక్కసారిగా ఆగిపోయారు. అందరికీ నోళ్లు బడి పోయినియ్. ఏంవీ యరగపట్టు పక్క సూపులు చూస్తన్నారు. ఒంటేల్రాగోలు బుజాన సెయ్యేసి నడుసుకుంటా జండా రావొచ్చాడు. ఆళ్లిద్దరూ వూరు తట్టాగా యెల్లిపోయినాక యీళ్లకి వూపిరొచ్చినట్టయింది)

యంగ్‌ట్రావ్ : సొసైటీని సేతులో తీసుకోని ముక్కెంగ గ్రేంవాన్ని డవలప్ చేద్దాంవని కదో నా బాద.

శ్రీనాయి : నా బాదా కూడా అదే. యాంవైనా యియ్యేడు సొసైటీ వొదులుకునే పనే లే.. లే... లే....

(అంతే మళ్లీ రచ్చబండ కాడికొస్తన్న జండారాజుని జూసి శీనాయి. సివరి మాటల్ని మింగేశాడు. జండారాజు దగ్గిరకొచ్చాడు. యొవురూ నోరెత్తలా.)

జండారాజు : ఏంటీ అంతా సైలెంటయ్యారూ.

యంగ్‌ట్రావ్ : రండి.. కూసోండి. (బలవంతంగా నవ్వాడు)

జండారాజు : గంటోడంటే యొవురు.

గంటోడు : నేనేనండి. (గబుక్కున దగ్గిర కొచ్చాడు)

జండారాజు : రాగవరావుగారికి యమౌంటివ్వాలంటగదా. ఆ విషయం.

గంటోడు : రేపిస్తాను సార్. గ్యారంటుగా యిస్తానండీ... తప్పితే అడగండి.

జండారాజు : పర్లేదు పర్లేదు. పది రోజులు టైం తీసుకోండి. ఇబ్బందులొవురుకైనా వుంటయ్ గదా.

గంటోడు : పర్లేదండి. రేపిచ్చేస్తా. ఒట్టు.

జండారాజు : సరే. తరవాత... అసలు సంగతి...

బ్రెమ్మం : సెప్పండి. సెప్పండి సార్. మీకు... హెల్పేంవన్నా కావాల్నా.

జండారాజు : కావాలండీ. మీకు తెలుసుగా. నా మీద అరెస్టు వారంట్లుండయ్ నేనీవూళ్లో వుండట్టు యొవురన్నా పోలీసులుకి చెవితే నాకు శానా యిబ్బందండి.

యంగట్రావ్ : శచ్చ. యొవురండీ సెప్పేది. రాజుగారు ముక్కెంగ మీ మీద యీగ వాల్దండి. పోలీసోడ్ని వూరి పొలింవేర్లోకి రానియ్యంవండి. నాదీ ఆంవీ..

బ్రెమ్మం : మా గ్రూపు తరుపున నేను ప్రామీజ్జేస్తన్నానండి. ఏంరా.

గంటోడు : అంతేగదో. అన్న మనూరొచ్చి నాక మనోడే.

జండారాజు : థ్యాంక్సండి.... ఇంకొక్క మాట. మా ప్లీడరు సలహా యిచ్చేడూ... ఈ గొడవల్లో నించి బయట పడాలంటే...నేను

యంగట్రావ్ : మొకంవాట పడవాకండి. క్యాసేంవన్నా కావాల్నా.

జండారాజు : నోనో. అదేంగాదండి.

బ్రెమ్మం : మరి రెసిడెన్సేంవన్నా ప్రాబ్లంవైతే సెప్పండి. మా యింట్లో...

జండారాజు : ఆహా. అది కూడ కాదండి. నా యనక పదిమంది జనం వుండట్టు చూపిచ్చాల. అప్పుదు గాని పోలీసోళ్లు కాస్తె యనక్కి దగ్గరు అందుకనీ... యీ వూరి... సొసైటీకి పోటీ చెయ్యాలనుకుంటన్నా నండీ... మీరంతా కోపరేట్ చేస్తేనే. మీ కిష్టం లేకపోతే మానేస్తానండి. (వెళ్లబోయాడు)

గంటోడు : నాకిష్టటవే

సుబ్బాయి : మీరుంటే యింక పోటీ మటుకెందుకు నేను ఓకే.

జండారాజు : యంగట్రావ్ గారూ.. మీరేదో వుండాలను కుంటన్నారనీ....

యంగట్రావ్ : అబ్బెబ్బెబ్బే. ఎవురండీ సెప్పింది. ముక్కెంగా నాకు తీరుబడే వుంటంలా.

జండారాజు : బ్రెమ్మంగారూ... మీరు...

బ్రెమ్మం : దగ్గెరుండి మీ సేత నాంవినేసనేయిచ్చేది నేనండి. ప్రాంవీసు. ప్రపోజ్జేసేది కూడా నేనే.

యంగ్‌[ట్రావ్ : నేను ముక్కెంగ సెకండు చేస్తానండి.

జండారాజు : చాలా థ్యాంక్సండి. పేరుకే నేను ప్రెసిరెంటుని. నాకు పైసా వొద్దు. మీరంతా నాయనకుంటే చాలు.

స్టిక్కోడు : అది సరేనొరే. పోటీజెయ్యాలనీ... యిందాక శీనాయేదో..

శీనాయి : ఓరూరుకోరా సోంవి నేనెప్పుడన్నాన్రా. (అరుగుమీద నించి దూకాడు) అమ్మతోడన్నా నాకా ఆలోసెనే లేదు.

జండారాజు : ఒకాల మీకా ఆశుంటే చెప్పండి. నేనే మానుకుంటా.

శీనాయి : అ...బ్బా లేదన్నా. నాకా స్టోరు తోనే సరిపోతందే. ఒట్టన్నాగా.

జండారాజు : నాకు చాలా మోరల్ సపోర్టిచ్చారండి. మీ మేలు యెప్పుటికీ మరిసిపోనండి. మీ యందరికీ నమస్కారం.

(రొండు సేతులెత్తి దండం పెట్టాడు. ఈళ్లు కూడా పళ్లికిలిస్తా దండం పెట్టారు. జండారాజు వొంగి దండం పెట్టాడు. ఈల్లింకా వొంగి వొంగి దండాలు పెట్టారు.)

# దృశ్యం 9

(రాంపండు ఇప్పుడుంటండా యిల్లు. బస్తీలో సదువుకున్న గొప్పోళ్ల యిల్లాల అదిరిపోతంది. పరుపుమీద పండుకున్న హైమ రంగుల టీవీ చూస్తంది. సేతులో రిమోటుంది. ఆ గెది పక్కన వరండాలో వోండా బండి తుడుస్తావుండాడు. శీదేవి మొగుడు. తుడవటం ఆపి దగ్గిరకొచ్చేడు)

మొగుడు : పిన్నీ..

హైమ : ఆ ఏంవన్నావ్. (సౌండు తగ్గిచ్చింది రిమోటుతో)

మొగుడు : పిన్నీ...

హైమ : పిన్నీనా నాన్సెన్స. అంత మోటుగా పిలిస్తే నాకసహ్యం.

మొగుడు : ఊల్లో ఆడోల్లనందన్నీ నేను పిన్నీ అనే పిల్చేది.

హైమ : పిన్నీ కాకపోతే అవ్వ అని పిలుపు. నన్ను మాత్రం అలా పిలవద్దు.

మొగుడు : మదీ.... యత్తా బిలవాలా.

హైమ : ఏం హైమగారూ అని పిలవలేవా.

మొగుడు : దెబ్బకి బిలవనో. అయ్యమ్మ. అయ్యమ్మా.

హైమ : అయ్యమ్మా అమ్మమ్మకంటే వరెస్ట్‌గా వుంది. పిన్నీ అనే పిలువు.

మొగుడు : సదే... పిన్నీ.

హైమ : ఏంటీ.

మొగుడు : బంది బాగా తుదవతం దాకపోతే... దైవింగు దాదా.

హైమ : ఎవరు చెప్పారు.

మొగుడు : దాంపందు బాబాయ్ చెప్పినే.

హైమ : .....అవునవును. క్లీంజెయ్యటం బాగా వస్తేనే డ్రైవింగొచ్చేది.

మొగుడు : ఓహో అయితే పందు బాబాయ్ చెప్పింది నిజంవే.

(అంటా బండి దగ్గిర కెళ్లాడు. సౌండు తగ్గిచ్చి యింకొక చానలు

మార్చింది హైమ. బయిటి నించి పోస్టెంగటేసుర్లొచ్చేడు. హైమ సేతికి ఒక కవరిచ్చాడు. ఎల్తాయల్తా ఆగి టీవీ చూస్తా నిలబడిపోయాడు కవరు చించి దాంట్లో వుండా కాయితం మడతలిప్పి సూసింది హైమ.)

హైమ : మైగాడ్ రేపే లాస్ట్ డేట్... మొగుడూ..... మొగుడూ .. మొగుడూ... (సౌండు తగ్గిచ్చి గెట్టిగా అరిసింది. శీదేవి మొగుడు ఉలిక్కిపడి దగ్గరకొచ్చాడు. సరిగ్గా అప్పుడే దొడ్లో సగం స్తానంచేసి యట్టుండావోడు అట్నే వొచ్చాడు రాంపండు)

మొగుడు : నన్నా

రాంపండు : నన్నా.

(సొడాబుడ్డి కొట్టినట్టు నవ్వేడు పోస్టెంగటేసుర్లు. హైమకి కోప్మొచ్చింది ఎంగటేస్వర్లు యిదేంవీ బట్టిచ్చుకోలా. టీవీలోకి తెగ జూస్తుండాడు.)

హైమ : మొగుడ్నెవరన్నా మొగుడా అని పిలుస్తారా.

రాంపండు : అయితే నిన్నేరా. (పండు బాత్రూంలోకెల్లిపోయాడు)

హైమ : ఏయ్ ...నీకీ మొగుడనే పేరేంటి.

మొగుడు : ఒత్తి మొగుడు గాదు. శీదేవి మొగుడు.

హైమ : అదే. ఆ పేరే యెందుకొచ్చిందీ అని.

మొగుడు : నేను ... శీదేవిని ... లౌజాస్తంతినే. (రవ్వంత సిగ్గు పడ్డాడు)

హైమ : నువ్వు .... శ్రీదేవిని ... లౌజేస్తన్నావా .... ఆవిడకి పెళ్లిపోయిందిగా.

మొగుడు : దొంగ నాయాలు..వాదొవుదో బోనీ కపూరంతగా వాదు జేసుకున్నాదు. అయినా శీదేవి కూడా తొందద పదిందిలే పిన్నీ.

(బాగా పీలింగై పోయాడు. హైమ వోండా బండి కాడికి పోయింది. ఆయిల్ ట్యాంకీ మీదుండే సంచీలోంచి బుల్లి సైజులో వుండా రాంపండు పుటువా బయిటికి తీసింది)

హైమ : లోపల అల్మరాలో గంట్యూబ్ తెస్తావా. (తెలవలా మొగుడికి) జిగురు... జిగురు ట్యూబు. అంటించటానికి.

మొగుడు : ఓ. (అంటా లోపలికి పోయి టీబు తెచ్చి) ఇదేనా

హైమ : య్యా. టేబిల్ పైన పెన్నుంటుంది తెస్తావా
(జిగురు పూసి పుటువాలంటిస్తంది.)

మొగుడు : దెబ్బకి తేనో. (అంటా పోయి ఒక పెన్ను తెచ్చాడు)
ఇదేనా.

హైమ : నోనో. ఇది యిండియన్ పెన్. దీని పక్కనే ఫారిన్ పెన్నుంటుంది. అది.
(మళ్లీ లగెత్తుకుంటా పోయి పారను పెన్ను తెచ్చాడు)

మొగుడు : ఇదేనా.

హైమ : య్యా. (ఆ కాయితాల మీద తెగ రాస్తా వుంది)

మొగుడు : పిన్నీ పెతి వొచ్చువూ యిందియాదొకతి పాదందొకతీ వుందాల్సిందేనా.

హైమ : య్యా.

మొగుడు : ఎందుకూ.

హైమ : ఐ డిజ్‌లైక్ యిండియన్ మేడ్. ఫారిన్ క్వాలిటీ తేవాలంటే యిండియాకి వందేళ్లు పడుతుంది. ప్యాడ్ కూడ తెస్తావా ... (పోతున్నాడు).ఇదుగో ఫారిన్ ది. చూడూ నేనేదడిగినా ఫారిన్‌దా యిండియాదా అనడిగి ఆ తరువాత తేవాల.

మొగుడు : తెలుసులే.

హైమ : ఏం తెలుసు తెల్లరంగులో వుంటుంది. అద్దీసుకురా
(పోయి ఆ తెల్లటిదే తెచ్చాడు)

మొగుడు : యిదేగా.

హైమ : రాంపండుని పిలువు.

మొగుడు : ఆ. (టీవీ గోల్లో సరిగ్గా యినపళ్లా)

హైమ : పండూని పిలువు.

మొగుడు : ఏంది పిన్నీ.

హైమ : మొగుణ్ని... కాదు నా మొగుణ్ని పిలువు

మొగుడు : ఓహో. (అంటా పోతూ ఆగి)
ఇందియా మొగున్నా పాదన్ మొగున్నా.

హైమ : యూ... (అంటా యంట పడింది. మొగుడు లగెత్తు కెల్లాడు. రాంపండు బయిటికొచ్చాడు)
పండూ యిలారా. (పండు దగ్గిరకొచ్చాడు)
ఇక్కడ సంతకంజెయ్. (పెన్ను చేతికిచ్చి ప్యాడ్ చూపిచ్చింది)

రాంపండు : సంతకంవా యేందదీ.

హైమ : ముందు చెయ్. తరవాత చెప్తా.

రాంపండు : ఏందో యింగ్లీసులో వుందే. ఏపీపీయల్లైసీ యేటీ.

హైమ : అప్లికేషన్ ఫరెగ్జంప్షన్ యింటూ యమ్మే యంకాం పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సెస్ యిన్ సింగిల్ సిట్టింగ్. యంయే సింగిల్ సిట్టింగ్‌లో రాయాలి.

రాంపండు : ఓహో యమ్మే రాయ బోతండావా. (సంతకం చెయ్య బోయాడు)

హైమ : నేను కాదు. నువ్వు.

రాంపండు : ఆ నేనా యమ్మే. (షాక్కొట్టి నట్టు అట్ట కిందబడేశాడు)

హైమ : య్యా. సంతకం చెయ్.

రాంపండు : ఆనెక్క చాస్తాలే. (తప్పించుకోని పోబోయాడు)

హైమ : ఆగు... రేపే లాస్ట్ డేటు. కొరియర్లో పంపాలి. సైన్ జెయ్యి.

రాంపండు : ఇంటరు అయిదు సార్లు ట్రై జేసీ యింకవదులే అని ఒదిలేశా. అసలు టెంత్ కూడా ముందోడిది చూసి రాసి బయట పడ్డా.
(మళ్లీ పెద్దంగా నవ్వాడు పోస్టెంగటేసుర్లు, హైమ కోపంగా చూసింది రిమోటుతో టీవీ కట్టేసింది.యంగటేసుర్లు ఈలోకంలో కొచ్చాడు. నీకు కాంగ వుందిలే టీవీ అన్నట్టు ఒక్క సూపు జూసి యిసురుగా యెల్లిపోయాడు)

హైమ : నీకంటే పూర్ నాలెడ్జున్న వాళ్లే యమ్మే ఫస్ట్ క్లాస్ డిగ్రీలు తెచ్చు కుంటున్నారు. నువ్వు సంతకం జేసి పరిక్షకటెండవు.

రాంపండు : అటెండయితే సరిపోదా. సదవాలా రాయాలా మార్కులు...

హైమ : ఆ తిప్పలన్నీ కోచింగ్ సెంటరు వాళ్లు పడతారు. నలపై వేలు తీసుకుంటున్నప్పుడు ఎవరి కోసం పడతారు

రాంపండు : నలపై వేలా.

హైమ : య్యా. ఇరవై వేలు అడ్వాన్సు కూడా కట్టేశాను.

రాంపండు : ఇరవై వేలు... అడ్వాన్సు... డబ్బెక్కడిది.

హైమ : గోల్డమ్మి కట్టానూ.

రాంపండు : ఆ ... గోల్డు ... అమ్మావా.

హైమ : నేనేం తెలివి తక్కువగా అమ్మలా. రేపు మనం ఆమెరికా నించి తిరిగొచ్చేటప్పుడు మినిమం రెండు కేజీల గోల్డు తెచ్చుకోవచ్చుంట. ఇప్పుడు పది సవర్లు పోతే యేంవైందీ.

రాంపండు : మనం అంవెరికాకి యెప్పుడు పోయేంవూ. (తల పట్టుకున్నాడు)

హైమ : పోతాంగదా ఫ్యూచర్లో, సైం చెయ్యి.

రాంపండు : నా వల్లగాదు.

హైమ : ఇప్పుడు నా ప్రిస్టేజేంగాను. (ప్యాడ్లిస్సిరి కొట్టింది.)

రాంపండు : ప్రిస్టేజా.

హైమ : స్టేట్స్ లో వున్న నా ఫ్రెండ్సందరికీ తెలిసి పోయింది. కల్పన ఫోంజేసీ మీ ఆయనెలా వుంటాడూ అనడిగింది. నేనేం జెప్పాను. మా ఆయన చిరంజీవంత మంచివాడూ అమితాబంత అందగాడూ అంచెప్పా.

రాంపండు : అంతవరకు నిజం వేగదా. (కాలరు పైకి లాగేడు)

మొగుడు : ఎత్తు కొంచం తగ్గుతావు బాబాయ్.

రాంపండు : నువ్వు నోరు మూసుకోని బండి తుడువు.

హైమ : రామ సీత మీ ఆయనేం చదివాడూ అనడిగింది. దాని మొగుడు డాక్టరని దానికి టెక్కు మా ఆయన యింటరు అయిదుసార్లు తప్పాడూ... అంచెప్పాలా. యంయే కంప్లీటయిందీ పీహెచ్డీ మొదలు పెడుతున్నాడూ అంచెప్పా.

రాంపండు : పీ.... హెచ్డి అయితే నేను పీహెచ్డీ కూడా చదవాల్నా.

హైమ : చదమంటంలా. రాయమంటన్నా.

రాంపండు : నువ్వొవ్వరికో సెప్పేవు గాబట్టి...

హైమ : వాళ్లకి చెప్పినందుగ్గాదు. మన కోసం. మనకి పుట్టబోయే బాబుకోసం. బాబుని హైడ్రాబేడ్ సెంట్ ఆన్స్‌లో చేర్చాలి గదా.

రాంపండు : అయ్‌దరాబాదా అంత దూరంవా.

హైమ : శిరీష కొడుకుని రామేశ్వరి కూతుర్ని యెక్కడ చేర్చారనుకుంటున్నావ్.

ఈ మురికి స్కూళ్లల్లో చదివించాలా.

రాంపండు : బాబింకా పుట్టలేదు గదా.

హైమ : పుట్టగానే డిగ్రీలొస్తాయా. ఆ స్కూల్లో అడుగు పెట్టాలంటే మమ్మీ డాడీలకి మినిమం బియ్యే డిగ్రీలన్నా వుండాలంట.

రాంపండు : మరి బియ్యే ట్రై జేసినా ఒక రకంగుణ్ను, ఒకేసారి యమ్మే అంటావే.

హైమ : బియ్యే చదివిన వాళ్లని పీహెచ్‌డీ చెయ్యనిస్తారా. పీహెచ్‌డీ అన్నా లేందే అమెరికాలో...

రాంపండు : నీకీ అంవెరికా పిచ్చేందీ. (కొంచం కోపం వొచ్చింది)

హైమ : పిచ్చా నలుగుర్లాగా కాస్త కాస్ట్‌లీగా బతకాలనుకుంటే అది పిచ్చా.

రాంపండు : ఇంకొక్కసారి అంవెరికా మాటెత్తితే పళ్లు రాలగొడతా.

హైమ : కొడతావా కొట్టు. (దిండు తీసుకోని యిసిరేసింది)
ఇంత మొరటుగా బిహేవ్ చేస్తావా. (ప్యాదు తీసుకోని కొట్టింది)
నోటి కొచ్చినట్టు మాట్లాడతావా. (ఇంకో దిండుతో కొట్టింది)

రాంపండు : హై.. మ్మా.. (పెద్దంగ అరిచాడు)

హైమ : షటప్ ఫస్ట్.

రాంపండు : ఏందే నువు కూసిందీ.
(దగ్గర కొచ్చి జుట్టు పట్టుకున్నాడు. దుర్రు మంటా వోండా స్టార్టయింది. ఆపబోయి కంగారులో ఆరన్ సిచ్చి నొక్కేడు మొగుడు. కుంయ్యిమంటా ఆరను మోగింది. మొగ్గుణ్ని బట్టుకోని సితక బాదాడు. పండు)

మొగుడు : ఒదే ఒదే ఒదే బాబాయ్... అమ్మా.. ఒదే బాబాయ్ నా కొదక...వామ్మో.... ఒదే సావ జంగవాకదా బాబాయ్.. ఒదే జాది పుసిక్కిన తొక్కేందా. అది బు...జ్జ్ మందీ. అంతేదా.

రాంపండు : ఇరగనూకుతా నాయాల. పో బయిటికి.

మొగుడు : పోతాలేయే. నీయంవ...బంది బాగా తుదిపిచ్చుకోనీ.... ఒదే కొదితే కొత్తేవుగనే బంది తుదిచి నాక..దైవింగు నేదిపిత్తానంతివే.
(పోబోయి మళ్లీ యనక్కొచ్చి అడిగేడు)

రాంపండు : నేరుపుతా రారా. (అంటా మళ్లీ రొండు పీకాడు)

మొగుడు : ఒదే నీయంవ... ఒద్దులే. మదీ కోపంగా వుందావే సదే వత్తా.

హైమ : మొగుడూ .... వన్ మినిట్. (కవరొకటి తీసి సేతికిచ్చింది) ఈ లెటర్ కాస్త పోస్ట్ బాక్స్‌లో వెయ్యాలి. .. యిది ఫారిన్ మెయిల్ లెటరు. మర్చిపోకుండా వెయ్యాలి.

మొగుడు : దెబ్బకెయ్యనో. వత్తా పిన్నీ. ఒదే బాబా... వామ్మో ఒద్దులే. యీదికి బలే కోపం.

(మొగుడెల్లి పోయాడు. హైమ యిసురుగా లోపలికి పోయింది. రాంపండు తల పట్టుకోని కూసున్నాడు. పొడవాటి తాడొకటి తీసుకొని వుచ్చు ముడేసుకుంటా వొచ్చింది హైమ.)

హైమ : ఈ దర్టీ పల్లెటూర్లో కాపరం చెయ్యలేనూ అంచెప్పా. అసలీ పెళ్లే వొద్దంచెప్పా. పెళ్లికి ముందు రోజే చచ్చిపోవాలని ట్రై జేశా. అందరూ కలిసి తప్పించారు. నా గొంతు కోశారు. పాతికెకరాల మాగాణీ యాబయ్యెకరాల మాంవిడి తోట యాభై లక్షల క్యాషు వుందని చెప్పారు చీటింగ్. తీరా నాలుగెకరాల్లేదు. వుంటానికి కొంపలేదు.

(మాట్లాడతానే టేబుల్ ముందుకి లాగింది. దాని మీద స్టూలు నిలబెట్టింది. పైకెక్కి తాడు కడతా వుంది. రాంపండు బెట్టుగా కూసున్నాడు)

చస్తే హాయిగా వుందాంవనుకుంటున్నావేంవో. నా చావుకి నువ్వే కారణం వనీ యిందాక లెటర్లో రాసేశా. (రాంపండు నోరు తెరిశాడు) కుర్రోడు యంకాం చదివాడు. బ్యాంకాఫీసరుజ్జోగం కోసం సిన్సియర్‌గా ట్రైజేస్తన్నాడు. పెళ్లవగానే ఒంగోల్లో కాపరం పెడతాడు. ఈ అబద్దాలన్నీ యెవరో చెవితే బాధపడేదాన్ని కాదు. మా అమ్మా నాన్న పచ్చి అబద్దాల్జెప్పి నన్నొప్పిచ్చి యీబాయిలోకి తోసేరు. నిజం తెలిసినాక సూయిసైడ్ చేసుకోబోయా. చేసుకోనిచ్చేరా.

(స్టూలు జరిగింది. హైమ పడబోయింది. రాంపండు పైకిలేశాడు. స్టూలు సరి చేసుకొని తాడుగట్టడం ముగిచ్చింది. రాంపండుకి గుండె దడ మొదులైంది. హైమ స్టూలు మీద కెక్కి తాడు మెడకి తగిలిచ్చు

కుంది.)

హైమ : చావటం భయంవనుకుంటన్నావు కాంవాల. (స్టూల్ని తన్నేసింది)

రాంపండు : హైమా. (గబుక్కున పోయి హైమ కాళ్లని వాటేసుకొని పైకెత్తి పట్టుకున్నాడు రాంపండు. హైమ గింజుకుంటా వుంది)
హైమా ..తియ్ ...తాడు తియ్.

హైమ : నో. నన్నొదిలెయ్. నన్ను చావనియ్. ఒదిలెయ్.

రాంపండు : ఒదిలేస్తే చచ్చిపోతావ్.. తియ్. తాడు తీసెయ్.

హైమ : నో..నో.నో, ఒదిలేసి పక్కెళ్లు

రాంపండు : హైమా ప్లీజ్ .. నామాటిను.

హైమ : నీ మాట నేను వినను. నా మాట నువ్వినొద్దు. నన్ను చావనియ్.

రాంపండు : సరే. నీ యిష్ట ప్రకారం సంతకం చేస్తా, తాడు తీసెయ్..

హైమ : నీ మాట నమ్మేదెలా. ముందు సంతకం చెయ్యి.

రాంపండు : నిన్నొదిలేసి సంతకం చేస్తా కూసుంటే వురి బిగుసుకుంటదీ.

హైమ : మరి కాల్తో ఆ స్టూలు దగ్గరకి లాగు. (స్టూలు దగ్గిరకి లాగాడు).
నన్ను దాని మీద దించు. (దించాడు)
పోయి సంతకం చెయ్.

రాంపండు : చేస్తానన్నా గదా.

హైమ : చెయ్యా. (కాయితమ్మీద సంతకం చేశాడు).
ఆ ఫోటో పైన కూడ చెయ్. (అక్కడ కూడా సంతకం చేశాడు)

రాంపండు : ఈ ఫోటో లెక్కడియీ. డ్రైవింగ్ లైసెన్స్ కోసం తీయించుకున్నా. అయ్యేనా.

హైమ : య్యా.

రాంపండు : కర్మ, ....దిగూ, (తాడు తీసేసి కింద కొచ్చింది. ఆ కాయితం మడత బెట్టి కవర్లో పెడతంది)

రాంపండు : నీకిక్కడేం తక్కువైందనీ, ఫ్రిజ్జుంది కూలరుంది కలర్ టీవీ వుంది డబల్ కాట్ బెడ్డుంది. అన్నీ ..... అన్నీ తెచ్చాను.

హైమ : నీ సొమ్ముతో తెచ్చావా. నాలుగు లక్షలు నేను తెచ్చుకుంటే రెండు

లక్షలతో యివి తెచ్చావ్. మిగిలిన రెండు లక్షల్లో నీ పోగాకు డీలర్ షిప్ కొనుక్కున్నావ్.

రాంపండు : మరి ... అంవెరికా పోక తప్పదంటావా.

హైమ : పోక ...యీ డర్టీ కంట్రీలోనే పడుండాలా.

రాంపండు : డబ్బు సంపాయిచ్చటానికేగా.

హైమ : అవును. అమెరికాలో యరన్ చెయ్యాలి. ఇండియాలో ఎంజాయ్ చెయ్యాలి.

రాంపండు : డబ్బు ... ఇక్కడ సంపాయిచ్చ కూడదా.

హైమ : ఎలా సంపాయిస్తావ్. పొలం దున్ని పొగచెట్లు పెంచి సంపాయిస్తావా వ్యవసాయం చేసి కోట్లు సంపాయిచ్చిన వాళ్లున్నారా.

రాంపండు : ఇయ్యేడు ... రొండు మూడు లక్షలు మిగుల్తయ్ గదా.

హైమ : రెండు .... మూడు ... సంవత్సరా.....నికి... అందులో మన కర్చులు పోతే మిగిలేదెంత. ఏదో పాతిక లక్షలు మిగుల్తున్నట్టు చెప్పేవే.

రాంపండు : పాతిక లక్షలు మిగిల్తే యింక అంవెరికా అనకుండా మానుకుంటావా.

హైమ : ఏంటీ ....పాతిక లక్షలు... ఒక్క సంవత్సరం... మిగిలిస్తావా.

రాంపండు : నేనడిగిందానికి బదుల్జెప్పు. అంవెరికా మాట వొదిలేస్తావా.

హైమ : ఒదిలేస్తా. ఎలాగో చెప్పు.

రాంపండు : అదంతా నీకెందుకు ఇయ్యేడు... పాతిక లక్షలు మిగిలిచ్చి నీకు చూపిస్తా.

హైమ : జోకా.

రాంపండు : జోగ్గాదు ఒట్టు. అన్నీ కలిసొస్తే మనబ్బాయి పుట్టే నాటికి. పాతిక లక్షలు చేతికి రావాల.

హైమ : నిజంవేనా ...అంత మొత్తం ...ఎలా

రాంపండు : ఎట్టా అనడగొద్దు. అయిందాకా సీక్రెట్‌గా వుంటే మంచిది.

హైమ : సీక్రెటా ...నాగూడ తెలియగూడదా.

రాంపండు : తెలియచ్చునుకో. అయితే మూడో మణిసికి దెలియగూడదు. బయిటికి పొక్కితే మొత్తం తల్లకిందులవుద్ది.

హైమ : ఇంతకూ...ఏంటదీ.

రాంపండు : (హైమని బెడ్ మీద కూసో బెట్టుకున్నాడు)
మన పొగాకు గోడౌను స్టాకుతో కలిపి మొత్తం ముప్పయ్ లక్షలకి ఇన్సూర్ చేశా.

హైమ : చేస్తే.

రాంపండు : (ఎవురన్నా యింటండా రేంవో అని చుట్టూ చూశాడు)
రేపో మాపో.. నలుగుర్నీ నిదర పోనిచ్చి గోడవున్ని తగలేస్తాం. ఇన్సూర్ క్లెయింజేస్తాం.

హైమ : తగలెయ్యటం ఎందుకు. ఆ సరుకమ్ముకుంటే డబ్బురాదా.

రాంపండు : తగలెయ్యటం అంటే సరుకు తగలేస్తాంవా. ఒకటో నెంబరు సరుకు మొత్తం రాత్రికి రాత్రి పక్కకి తప్పిచ్చి దాసి పెట్టా.

హైమ : ఎక్కడా.

రాంపండు : ఎక్కడోనా మనింటెనకమాల– గోడ కానుకోని కోడి పెంటంజియ్య కొట్టాం వుళ్లా మొత్తం దాంట్లోకి చేరిశా. ఇదమ్మితే పది లక్షల్దాకా వొచ్చుద్ది. ఇంక కాళీ గోడౌను తగలేసి యిన్సూర్ క్లెయింజేస్తే...... మామూళ్లకి అయిదు పోయినా.. పాతికదాకా సేతికి రావాల. ఆ పాతికా యీ పదీ కలిసి యెంత.

హైమ : ముప్పయైదు.

రాంపండు : దాంట్లో నీ కట్నం నాలుగూ తీసేసుకో. కోడి పెంటంజియ్యకి వకటి దాకా యియ్యాల. అది కూడా తీసెయ్. మిగిలేదెంతా.

హైమ : ముప్పై. మరీ ....పొగాకు..రైతుల్దగ్గర అప్పుగ్గదా కొన్నది. వాళ్లకీ...

రాంపండు : అదొక తొమ్మిదో పదో వుంటది. తగలబడిందని చెప్పి రోజులు గడపచ్చు. లేదు మరీ న్యాయంగ చెయ్యాలనుకుంటే రూపాయికి పావలా లెక్కన సేతులో బెడితే రైతులింక మాట్లాడ్రు. అప్పుడుకూడ పాతిక నికరంగ వుంటయ్ కదా.

హైమ : నువ్వు గోడౌన్ తగలేస్తావో రైతుల్ని తగలేస్తావో నాకనవసరం. టొంటీ ఫైవ్ ల్యాక్స్ చూపెట్టాల.

రాంపండు : మరింక నువ్వంవెరికా అనీ ... పీహెచ్డీ అనీ...

హైమ : ఓకే. అన్నట్టు...ఒంగోలు పోదాంవంటినే. డైనింగ్ టేబిల్ పైకి ఫారిన్ సెట్టొచ్చిందంట.

రాంపండు : పోదాం. క్యాష్ రానియ్. ఈ లోపల కాస్త టీ బెడితే...

హైమ : ఓకే. (హైమ లోపలికి పోయింది. రాంపండు స్టూలు మీది కెక్కి తాడిప్పు కుంటన్నాడు. క్యాసు బ్యాగు సంకలో పెట్టుకోని మాయోడొచ్చాడు. ఒంటి మీద దిరీసులు మారిపోయినయ్.)

మాయోడు : యాంవోయల్లుడూ తాడుగడతండా వెందుకోయ్.

రాంపండు : ఉరేసుకోటానికి.

మాయోడు : నీకు వురేసుకునే కరమేం వొచ్చిందోయ్.

రాంపండు : నువ్వు తెచ్చిందే. నాలుగు లచ్చలాశబెట్టి తిక్కల్దాన్ని తెచ్చి మెడగ్గట్టేవు. నింవిశాల మీద కోట్లు సంపాయిస్తావా లేదా అని కూసుంది.

మోయోడు : మంచిదేగా నీ బళ్లోనే సదుపుకుంటందీ.

రాంపండు : ఆ. ఇప్పుడు నన్ను పీహెచ్‌డీ చదవమంటంది. మాట్లాడితే అంవెరికా అదేంవంటే తాడు తగిలిచ్చు కోవటం.

మాయోడు : అయితే సిన్న సీను జరిగిందన్న మాట. సూడల్లుడూ పాపం లోకం తెలవకుండా పెరిగిన పిల్ల. అంవెరికా మొగుడు తప్పితే వొద్దని అంకేసుకోని కూసుంటే... పాపం యిూళ్లబ్బ. అబద్దాలెజ్జెప్పి వొప్పిచ్చేడు అప్పుల్దెచ్చి కట్నంవిచ్చి నీ కాళ్లు గడిగేడు. ఆ యప్పులు తీరుసు కోటానికి... యక్కడ్నో కరీంనగరొౌతలంట పత్తేసి నానా అగసాట్లు పడతండాడు. కాస్తె సర్దుకోని పోవాల.

రాంపండు : మరీ అంత అమాయకత్తం అయితే యట్టా మాంగారు.

మాయోడు : ఆడపిల్ల అమాయికురాలైతేనే మంచిదోయ్. అదుష్టంవంట.

రాంపండు : అదుష్టంవా.

మాయోడు : కాక మరేంది. అంజియ్యని క్యాసడిగేవా. సొంత పన్లూ కూడ ఆపుకోనీ నీకుపంపిచ్చేడు పాతికేలు లెక్కెట్టుకో. (డబ్బిచ్చాడు)

రాంపండు : బ్యాంకీ సీలుందగా.

మాయోడు : ఈ నోటు మీదొక సంతకం పారెయ్. (నోటూ పెన్నూ సేతికిచ్చేడు)

రాంపండు : ఈ యింటికి అద్దెంతో సెప్పేడా. (సంతకం చేశాడు.)

మాయోడు : ఏంది మా యంజియ్యబాబు నీ దగ్గర రెంటు తీసుకుంటాడా. అప్పుటికీ అడిగి సూశా. శాచ్చ పండు దగ్గిర అద్దేందీ అన్నాడు. ఇంతకీ మా సిట్టరేది.

రాంపండు : టీ బెడతావుంది.

మాయోడు : ఏందీ ఉరేసుకునే సీను తరవాత పడక సీనుండాల. దాం తరవాత కాళ్ల బేరం సీనుండాల. అట్టా కాకుండ నేరుగా టీ బెట్టే కాడి కొచ్చిందంటే... నువ్వు అసాజ్జుడివో యల్లుడూ.

రాంపండు : నీ సిస్యుణ్ణి కదా.

హైమ : గుడ్మాణింగన్నయ్యా. (టీ తీసకొచ్చింది)

మాయోడు : ఆ మావూళ్లో గూడ అట్టాగే నమ్మా. (టీ గుక్కెడు పీల్చుకున్నాడు) ఆహ టీ సూపర్‌గా వుందమ్మాయ్.

హైమ : థ్యాంక్యూ. రెండు నిమిషాల్లో వస్తా. (మళ్లీ లోపలికి పోయింది)

మాయోడు : ఆ, మరి...గోడౌందగలేసే పనెంత మటు కొచ్చిందీ.

రాంపండు ఆ ....త..త..తగలేసే దేంది.

మాయోడు : ఏంది అయితే గోడౌందగలెయ్యవా.

రాంపండు : సీచ్చీ. సుబంవా అని యాపారం మొదులు బెడితే అదేమ్మాట.

మాయోడు : మరి గోడౌను మీద స్టాకు మీద యిన్సూర్ చేసేవుగదా.

రాంపండు : సేసేనూ ... సేప్టీ కోసం.

మాయోడు : తగలేసేది కూడ సేఫ్టీ కోసంవే. గోడవుందగలెయ్యకుండా గొప్పోడయిన టుబాకో డీలరొవుడైనా వుండాడా. వుంటే సూపిచ్చవోయ్ నాకట్టాటోడ్ని సిన్నెవ్వారం చేసినోడు సిన్న డీలరయ్యేడు. పెద్దెవ్వారం చేసినోడు పెద్ద డీలరై కోట్లోకి పోయేడు. ఇది జనానికీ తెలుసు గవర్మెంటుకీ తెలుసు రాజకీయ నాయికులుకీ తెలుసు. తెలియదంటావా.

రాంపండు : తెలుసనుకో.

మాయోడు : నాకంతా తెలుసోయ్. నీ ఆలోశన మొత్తం అచ్చరం అచ్చరం నేజెప్పేస్తా. యట్టా తెలిసిందనడగవాక. ఒరే అల్లుడా నీకు పెళ్లి జేసినోణ్ని. నాలుగు

లక్షలు కట్నం యిప్పిచ్చినోణ్ని. అంజియ్య దగ్గెర అప్పిప్పిచ్చినోణ్ని. నన్నేనువు నమ్మలేదు గదరా.

రాంపండు : అదీ.... మరి... నీకు చెవదాంవనుకుంటన్నానూ.

మాయోడు : ఏం జెవదాంవనుకుంటండా.

రాంపండు : అదే... గోడవునుకీ...

మాయోడు : ఎప్పుడు నిప్పెడదాంవనుకుంటండా.

రాంపండు : రేపు.... ఆహా....ఎల్లుండి..........వా... (పెద్దంగ నవ్వేడు మాయోడు) ...ఏందీ.

మాయోడు : ఏం లేదులే. మరీ...ఇంచూరెంచు డిపార్మెంటోళ్లతో సెటిల్జేసుకున్నావా.

రాంపండు : సెటిల్టేసుకునేదేంది.

మాయోడు : అదే. వాళ్ల పర్మెంటేజీ వాళ్లకిచ్చేవాని.

రాంపండు : పర్మెంటేజా... ప్రీమియం కట్టేశాగా.

మాయోడు : ఆహా... నువ్వు ప్రీమియం కట్టి తాటాకుల కొట్టాం తగలెట్టంగానే లక్షలక్షలు నూటుకేనుకి పెట్టుకొని వస్తారనుకుంటన్నావా నీకియ్యటానికి.

రాంపండు : కాకపోతే... మనెంపీ సేతనో మినిస్టర్ సేతనో ఒకమాట చెప్పిస్తానూ.

మాయోడు : మొన్న మినిస్టర్ గారి మేనల్లుడిది. పెట్రోలు బొంకు తగల బడితే ముప్పయైదేలు.. నా సేతులు మీదగా ముట్టజెప్పా, అప్పుడు సెటిలైంది. (యటకారంగా నవ్వేడు)

రాంపండు : నువ్వు సెటిల్టేశావా.

మాయోడు : నేనంటే ...ఎట్టా కనపడతండానూ ...ఓహెూ నీ యింటికి మాటి మాటికీ వస్తండాగా. సీప్‌గానే వుంటదిలే.

రాంపండు : అదీ.... మరి...

మాయోడు : సొయంగా మనెమ్మెల్లే గారిది... క్లెయిం వొకటి పెండింగు బడింది. అయదరాబాదు పోయి పయ్యాపీసర్ని కూసో బెట్టి యేర్పాట్లన్నీ చూసి ఊ అనిపిచ్చాలకి తల పేణం తోక్కచ్చింది.

రాంపండు : యమ్మెల్లే యెప్పుడూ అయ్‌దారాబాదులోనే ఉంటాడు గదా. మర్నీ

శాత..

మాయోడు : నీకన్నీ యిడమర్శి సెప్పాలోయ్, ఆ యాపీసరకి పైటసెంగు యీక్నెసు. గతం సెరిత్రెట్టున్నా యమ్మెల్లే అయినాక అట్టాటి పన్లు చెయ్యటం బాగుంటదా సెప్పు.

రాంపండు : నిజంవే.

మాయోడు : మరాళ్లకి పవరూ పలుకుబడీ లేక యిట్టా లంచాలు పెట్టి పన్లు చేయిచ్చు కుంటన్నారనుకున్నావా.

రాంపండు : ....

మాయోడు : తాను పది లక్షలు తింటండప్పుడు తన కిందోడు పదేలు తింటే తప్పేం వుంది అని. తానూ బతకాల ఎదటోడూ బతకాల అనే నీతి యింకా మన్నాయికుల్లో మిగిలుండబట్టే యీ మాత్రం వైనా పన్లు జరుగుతుండయ్. పెద్దాపీసర్లు కూడ పైసలు ముట్టుకున్నాక ఎంత నిజాయితీగా పన్లు చేస్తారనుకున్నావ్. యవ్వారం ఎక్కడా మడత పడకుండా... ఎట్టా నిబ్బేట్టాల్నో ఎట్టా క్లెయింవు చెయ్యాల్నో మొ....త్తం డైరక్చనిచ్చేస్తారు గదా. కాబట్టీ వాళ్ల వాటా వాళ్లకి ముట్ట జెప్పవోయ్.

రాంపండు : ముట్ట చెప్పక పోతే ...

మాయోడు : ము...ట్ట.... చెప్పక....పోతే... (పోను రింగయింది)
పోనేందో సూడు. (పోనెత్తాడు రాంపండు)

రాంపండు : అలో...యెవురూ. ఇన్పూరెన్సాపీసా.ఆ...ఆ..ఆ పిటీషనా నా మీద.. అ...అదీ...నేను...మీరు...నా మాటినండి...సార్... సార్....సార్. (గుండెల్లో రాయిబడింది. పోను పెట్టేశాడు)

మాయోడు : ఏందోయ్ అల్లుడూ అట్టాగయ్యేవూ.

రాంపండు : ఎవురో నా మీద పిటీషన్లు పెట్టేరంట.

మాయోడు : పిటీసన్లేందీ.

రాంపండు : గోడవున్లో పుగాకంతా పక్కకి తోలేనంట.

మాయోడు : అది నిజంవే గదా.

రాంపండు : కాళీ సెడ్లు తగలెయ్యబోతన్నానంట

మాయోడు : అదీ నిజం వేగదా.

రాంపండు : క్లెయంవు రాదంటన్నాడు.

మాయోడు : రాదుగదా మరి.

రాంపండు : ఈ పిటీసను పెట్టిన్నాకొడుకొవుడూ అని.

మాయోడు : యొవుడైనా పెడతాడోయ్. పావలా కాయితంవేగా కర్సయ్యేది.

రాంపండు : ఇప్పుడెట్టా ఆ పిటీసను పెట్టినోడు దొరకాల...

మాయోడు : ఆ దొరికేడు దొరికితే యేంజాస్తా. పిచ్చోడా జరగాల్సిందేందో సూసుకోవోయ్.

రాంపండు : ఇంకా జరిగేదేంది అంతా అయిపోయింది. (కూలబడ్డాడు)

మాయోడు : ఏంవీ అయిపోలా. నీ క్లెయింవు నీకు లచ్చణంగా వచ్చుద్ది.

రాంపండు : ఎట్టా. (పైకి లేశాడు)

మాయోడు : అసలీ పిటీసను కతంతా అబద్ధం ఎందుకు కాగూడదు. ఆ యాపీసరే నాటకం ఆడ తన్నాడేంవో.

రాంపండు : నా కర్థం కాలా.

మాయోడు : కాదు. గోడవున్ తగలెయ్యటానికి ఒక డబ్బా పెట్రోలు ఒక అగ్గిపుల్లా సరిపోతయనుకున్నావ్. యనకుండీ మతలబులు తెలియపు. ఆ యాపీసరు నిన్ను కిందకి తొక్కాలను కున్నాడనుకో ఎడం సేత్తో పిటీసవ్రాసి కుడి సేత్తో టేబులు మీద పెడతాదు. లేదు నిన్ను పైకెత్తాలనుకున్నాడనుకో వంద పిటీసన్లొల్సినా వరనగా నించేసి. గ్రీంచిగ్నెలిచ్చేస్తాడు. అంతా...
(సూపుడేలు కిందుందా బొట్నేల్ని సిటుక్కున పైకి నెట్టి)
యిందులో వుంది. అయినా పాతికేలకి కక్కుర్తి పడి పాతిక లక్షలు పోగొట్టుకునేవాణ్ని నేనెక్కడా సూల్లా.

రాంపండు : అయితే ట్రై జెయ్యటం మందిదంటావా.

మాయోడు : అది నువ్వు డిసైడ్ చేసుకోవాల... పాతికేలు మనది కాదనుకోని ఫైలు లైన్లో పెట్టుకుంటావో ఎందుకులే అని పాతిక లక్షలు వొదిలేసుకుంటావో నీ యిష్టం.

రాంపండు : సరే. పాతికేలూ యిచ్చేద్దాం. అయితే మాంగారూ క్యాష్ తీసక పోయి నువ్వే సెటిల్జేసక రావాల.

మాయోడు : నేను చస్తే నీ యవ్వారంలో తల బెట్టనోయ్. అసలే నీకన్నీ అనుమానాలు.

రాంపండు : మాంగారు మాంగారు అన్ని తెలిసినోడివి. ప్లీజ్.

మాయాడు : అమ్మమ్మ, నావల్ల కానే కాదోయ్. రేపేంవన్నా అటు ఇటు అయ్యిం దనుకో క్యాసు వాళ్ల కిచ్చేవా లేదా అనడిగినా అడుగుతావ్. ఇదేంవో రొండో కంటోడికి తెలవకుండా నడవాల్సిన యెవ్వారం.

రాంపండు : మాంగారు యాంవన్నాగాని యీ వని నీ దోరా జరగాల్సిందే.

మాయోడు : ఒద్దో యల్లుడూ నన్నిరికిచ్చ వాకు.

రాంపండు : మాంగారూ ప్లీజ్... ఈ ఒక్క పనీ.... చేతులు పట్టుకున్నాడు)

మాయోడు : నీ మొకం చూస్తే కాదనక పోతందాను.... మరి అది...

రాంపండు : ఇంకేంవీ మాట్లాడొద్దు. ఇదుగో...... యీ పాతికేలు తీసకపోయి...

మాయోడు : ఇరికించేవ్ గదా... సరే తప్పుద్దా వస్తా.

రాంపండు : మాంగారు...క్యాషు ....జాగర్త.

మాయోడు : దీని సంగతింక మర్చిపో అల్లుడూ. వస్తా.
(మాయోడెల్లిపోయాడు. రాంపండు నిండా గాలి పీల్చుకున్నాడు. లోపల్నించి హైమొచ్చింది)

రాంపండు : హైమా పెద్ద ప్రంవాదం తప్పకున్నాం. మన ప్రీమియం ఆనర్ కాలేదంట. తగలేస్తే కొంప మునిగి పోయేది.

హైమ : ఏంటి నువు జెప్పేది.

రాంపండు : ఇప్పుడు గోడవును తగలేస్తే మనకి పైసా రాదు. దానికి వేరే యేర్పాటు చెయ్యాల.

హైమ : అయ్యన్నీ నా కెందుకు ....అవునూ క్యాషొచ్చుద్దని చెప్పావ్...

రాంపండు : అదీ... వొచ్చింది. ఒక ముక్యంవైన పనికి సర్దాల్సొచ్చింది.

హైమ : నాక్కావాలన్నాను గదా.

రాంపండు : ఒక్క వారం ఆగు. అన్నీ తెచ్చుకుందువుగాని.

హైమ : ఇందుకే... అమెరికా వెళ్లాంవనేది. (లోపలికి పోయింది యిసురుగా. బయిట్నించి మొగుడు కేకలేసుకుంటా వచ్చాడు)

మొగుడు : ఒదే పందు బాబయ్...పందు బాబాయ్...తగల బదతంది దా...

రాంపండు : ఏందిరా ఏందా పరుగు.

మొగుడు : మంత... మంత మందుతుందిదా. అతు చూదు. ఇంతెనకమాల. (ఇంటెనక్కి చెయ్యి చూపిచ్చేడు. యనక మంటలు కనిపిస్తండయ్) నిప్పు బడిందిదా. కోది పెంతంజియ్య కొత్తాం దగల బదతందిదా

రాంపండు : అంజియ్య కొట్టాంవా ...నా పొగాకు బేళ్లు...

హైమ : పందూ మంటలు.... మంటలు

(లోపల్నించి లగెత్తుకొచ్చింది హైమ. రాంపండుకి నోట మాట రాలా. మంటలు పొగ దగ్గిరవతన్నయ్)

మొగుడు : ఒదే నీయమ్మ నా కొదక... బాబాయ్... ఇల్లూ కూద అంతుకుంతే సూత్తావేం దిదా... పొదాందా. అమ్మో.. నేం బోతా. ఉందుందు. బందన్నా నెత్తక పోతా. (ఓండా బండి నెట్టుకోని పోయేదు)

హైమ : పందూ చూస్తావేంటి. ఫైర్ ...ఇల్లు మైగాడ్ టీవీ...ఫ్రిజ్... ఎలా ..పందూ. బెడ్ ...అన్నీ..మంటలోస్తన్నయ్.. పందూ...ఎలా (దిక్కు తోసక సుట్టూ గంతులేస్తా వుంది. రాంపండట్టానే నిలబడి పోయుందాడు. బయిట్నించి జనం కేకలేసుకుంటా వొచ్చారు. తలావకొస్తువు బయిటికి లాగుతుండారు.)

హైమ : పందూ మండిపోతుంది. సామాన్లు పోతే పోయినయ్. మనం ఎల్దాంరా. రా పందూ... యేయ్ రావేంటీ బయటికెల్దాం.

రాంపండు : ఇప్పుడు... బయిటికెల్లినా ఒగటే. లోపలుండా వొగటే.

హైమ : పందూ...

(లాగి సెంప మీద ఒక్కటి కొట్టి బలంతంగా బయిటికి లాక్కపోయింది. ఇల్లంతా మంటలు చుట్టుకున్నయ్.)

# దృశ్యం 10

(కల్లం దిబ్బ. మీద ఓ మూల్న సిన్న వసారా కనపడతా వుంది. ఓ పక్కన గంపకి పొర్లుగా మిరప కొమ్మలు కనపడతన్నయ్. సిరుగులు బడ్డా గోతాన్ని దబ్బనంతో కుడతన్నాడు రాంకోటు. గోతాం రొండో అంచుని లాగి పట్టుకో నుంది లచ్చిందేవి)

లచ్చిందేవి : పెళ్లయిన కాణ్నించి వూరంతా పెక్కాసిగా చెప్పుకున్నారు. మన కాడ లేకపోతే మాన్లే బిడ్డ పచ్చంగా బతుకుతుండాడూ అనుకున్నా. ఏ అయ్య సూబ్బడిందో యే యమ్మ దిష్టి గొట్టిందో పది లచ్చల సొమ్ము బగ్గున మండి పోయింది. కడుపు తరక్కపోతంది. అమ్మా అబ్బా వుండీ లేనోడయ్యేడు.

రాంకోటు : లేనోడెందుకయ్యేడూ నువ్వుండావుగా.

లచ్చిందేవి : కన్నబిడ్డ కట్టు బట్టలో యీదిన బడ్డాడు. నీక్కనికరం పుట్టలా. నీ మణుసు కరగలా. పిల్లోణ్నొకసారి కంట చూసుకుందాంవని పిచ్చులా. వాడేంవన్నా దొంగతనం చేసేడా కూనీ చేసేడా. నీ మాటినకుండా పెళ్లి జేసుకున్నాడు. అందుకేగా యి. కత్తి గట్టేవు. ఒక్కసారి పోయి పలకరిస్తే లావు తగ్గిపోద్ది కాంవాల.

రాంకోటు : ఆ కోడిపెంటోడి కొంపలో జొరబడమని సెప్పవే పోయి కావిలిచ్చు కుంటానో వుంటానికి వూళ్లో యింకేడా యిళ్లు లేవు. వాడిగ్గావాల్సింది అమ్మా అబ్బా కాదే. కోడి పెంటంజియ్య.

లచ్చిందేవి : ఆ నా మనంవడి మాటల్లో పడ్డాకనే నా దూరంవైపోయేడు.

రాంకోటు : ఆ పుగాక్కొట్టాంలో నిప్పు నూకింది కూడా అంజిగోడే నంటండారు. సెవితే నీ కొడుకు నమ్ముతాడా. గొడ్డె కసాయోణ్నే... నమ్మేది

లచ్చిందేవి : అదేమ్మాయ రోగంవూ. వాడి కొంప వాడే తగలేసుకోవటం ఎందుకో.

రాంకోటు : అందులో వుండా పుగాకు నీ కొడుకుది గదా. వాడు నాశనంవై పోతే

పోయి అంజియ్య ముందు సెయ్యి జాపుతాడు. కుక్కని తిప్పుకున్నట్టు యింటి సుట్టూ తిప్పుకోవచ్చు. నా మీదుండా కశంతా తీరుసుకోవచ్చు.

లచ్చిందేవి : మీ యిద్దరి నడింవిన నా బిడ్డ దొరికేదు. నిలువునా మునిగి పోయేదు.

రాంకోటు : ఆయనేం యగసాయం జేసి మునిగిపోలా. యాపారంలో దిగేదు అందులో ఆగేడా జూదం ఆడేదు. గూడేంలో వుండాల్సిన నెంబరాకంతా అంజియ్య కొట్టాంలో కెందుకొచ్చిందీ. లచ్చల్లచ్చలు గవర్మెంటు సొమ్ము మింగటానికి. డబ్బు పిచ్చి పట్టిందే వాడికీ.

లచ్చిందేవి : డబ్బొవురికీ సేదు కాదులే... సేతులో పైసా లేకుండ యెన్నగసాట్లు బడతండాడో యంత కుంవిలి పోతండాడో... (బయిట్నించి సుందిరొచ్చాదు)

రాంకోటు : ఏందిరా మందులు తేకుండా వొట్టిసేతుల్తో వొచ్చేవే. లచ్చిన్నరుసు లేడా కొట్లో మందుల్లేవా.

సుందరి : లచ్చిన్నరుసూ వుండాడు మందులూ వుండయి. పాత బేలెంచు పైకం మొత్తం కట్టందే యింక అప్పియ్యనన్నాడు.

రాంకోటు : వాడెమ్మ తప్పుణ్నా కొడుకు. వాడు మణిసికి పుట్టే పసువుకి పుట్టేడ్రా. దిగుబడొచ్చిందాకా పెట్టుబడి పెడతానని కూసేడు. నమ్మి సేతులో వుండా అయిదేలూ వాడికే జంవేశా. డబ్బు తీసుకోని యిట్టా అడ్డం దిరుగుతాడా.

లచ్చిందేవి : సేను మొత్తం యాక రాసిన కాబ్బట్టింది. పూతా పిందే ముడ్రన మూలుగుతుంది. ఆ మాయదారి కాయ దొలుసు పురుగేణ్నించి దాపరిచ్చిందో.

సుందరి : ఇయ్యాలా రేపుట్లో మందెయ్యక పోతే.. పట్టిన కాపంతా యర్ధంవప్పా.

రాంకోటు : వంద కింటా దిగుబడొచ్చే కాబ్బట్టింది. యట్టన్నా మందు కొట్టాల్రా. పూతా పిందే రాలకుండా చూడాల్రా.

లచ్చిందేవి : యేం పూరొదిలి పెట్టి పోతాంవా. కటీనంగా వొట్టిసేతుల్తో పంపిచ్చేదు గదా.

సుందరి : అప్పటికీ బతింవాలి సూశా. ససేంవిరా వల్ల కాదన్నాడు.

రాంకోటు : సూట్లానిక్కళ్లు లేకుండా వుంది తోట. పిండారబోసి నట్టుంది పూత పదేలు... ఒక్క పదేలు పుట్టిచ్చి మందులు కొట్టాల. లేకపోతే... మనకి బతుకు లేదురా. సూ..త్తా...వూరుకునే దెట్టారా.

లచ్చిందేవి : కాళ్లాయాళ్లా పడి లచ్చిన్నరుసుని బతింవాలుకుంటా. ఒకసారి నేను పోయొచ్చే దేంవరా.

సుందిరి : ఒద్దప్పా, ఇంక లాబం లేదు. వాడు మొండి కాలు చాపి కూసున్నాడు.

రాంకోటు : యాంవే యక్కడన్నా...

లచ్చిందేవి : ఈస్వరమ్మ నడిగా సిన్నబ్బాయినడిగా. మొకంవాటం లేకుండా లేదన్నారు. లేగ్గాదు. డబ్బు తీసకపోయి ఒంగోల్లో పైనాంచు కంపిణీల్లో పోస్తుండారంట. అవసరానికి ఆపదకీ వూళ్లో రూపాయ పుట్టే రోజులు పోయినియయ్యా.

సుందరి : స్టోర్లో బియ్యం తెచ్చుకోమని మా యింటి దానికి చెప్పే ఐదొందలింట్లో పెట్టా. వుండయేంవో తీసకొత్తా.

రాంకోటు : ఆ ఐదొందలకి వుగ్గిన్నెడు మందొచ్చుద్ది. దాన్ని మిరపసెట్ల కేస్తాంవా నాలిక మీదేసుకుంటాంవా.

లచ్చిందేవి : అయినా ఆ లచ్చిన్నరుసుకి అదేం పొయ్యే రొగంవూ. నిలువునా యగేస్తే నాలుగెకరాల తోట..అన్నేయంవై పోదో.వాడి జిమ్మదియ్య వాడి నాలిక పీక. మన వుసురు వాడి పిల్లలకి కొట్టకుం...

రాంకోటు : ఒద్దే. అట్టన వాక. మన దరిద్రం మంది. వాణ్ననేం లాబం. నయ్యి దిబ్బలో యెరువు సేలో తోలి యింట్లో యిత్తనాలు జడ్జిగంలో యేసి పంట కోసుకున్నన్నాలూ ఒకడికి సెయ్యి జాపకుండా బతికేంవు. ఈ పెట్టు బళ్లు బెట్టే పంట లొచ్చినియీ.. పైసల కోసం పతోణ్నీ దేబిరిచ్చాల్సొచ్చింది. బతుకిట్టా అయిపోయింది. ఇప్పుడొవురి కాళ్లు పట్టుకోవాలా. ఏ బాయిలో దూకాలా.

(తలకాయ తీసకపోయి మోకాళ్ల నడింవిన పెట్టుకున్నాడు. కాసేపొవురూ మాట్లాడ్లా)

లచ్చిందేవి : అట్టా సతికిల బడిపోతే యట్టాగయ్యా.

సుందిరి : ఒక్క పూటాలిశంవైనా సేను సెయ్యి జిక్కదు. పూత రాలిపోద్ది. ఏ యిదాయికంగానన్నా ఒక్క పదేలు పుట్టిచ్చాల మాంవా.. యట్టా...

లచ్చిందేవి : యట్టాగయ్యా.

రాంకోటు : నన్ను కోసక తినంద్రా... పదేలొస్తయీ. పూత బోద్దీ...పిందె బోద్దీ.... పంటబోద్ది. ఏం జేసేదీ. బండి కింద తల బెట్టేదా. పోనియ్ పోతే పోనియ్యరా... అప్పులోళ్లకి మొకం చూపియ్య లేక యీదిలో తలెత్తు కోం తిరగలేక సగంచచ్చి బతుకుతుండా. సీ..దీనెమ్మ బతుకుం దగలెయ్య (గుడిశకెళ్లి పోయాడు. సుందిరి లోపలికి తొంగి చూసొచ్చాడు)

లచ్చిందేవి : ఏం చేస్తుండాడూ. (సెవ్వ దగ్గిర కొచ్చి అడిగింది)

సుందరి : కుక్కి మంచం మీద ముడగ తీసుకున్నాడు. తాను మటుకే తేవాలిసి నోళ్లందరి కాడా తెచ్చేడు.

లచ్చిందేవి : గాశారంరా. ఇక్కడ తోటేంవో యిట్టా వుంది. అక్కడ బిడ్డేంవో అట్టా అయ్యేడు.

సుందరి : ఒక పంజేస్తేనప్పా. సెవితే యట్టా యినడు. ఆయనకి తెలియకుండ యల్లెద్దుని అమ్మేస్తే.... ఇప్పుడు గండం గడుసుద్ది గదా..మేత చాలక బక్కెద్దు చచ్చి పోయింది. యేం జేసేంవూ.

లచ్చిందేవి : దాన్నీ..... పొద్దున గంగెద్దులోడికి తోలిపెట్టేంవు

సుందరి : ఆ... యల్లెద్దుని... వూరెకెనే... తోలేసేరా.

లచ్చిందేవి : పొద్దున నువ్వటు పోయినాక గంగెద్దులో జొచ్చేడు. ఆ మాటా యీ మాటా చెప్పి వుబ్బేసేడు. మీ యయ్య తూంవెడొడ్లు కొలిసేడూ మీ తాత జల్లెడు కంకులు పెట్టేడూ మీ ముత్తాతయితే కణీల్ని రంకేసే కోడె గిత్తనే పట్టిచ్చేడూ.. అని వాడు పాట బాడినట్టు చెవతావుంటే మీమాంవకి వూగ్రం వొచ్చినట్టయింది. యనకా ముందూ చూడకుండా యల్లెద్దుని పట్టిచ్చేడు. దొంగసేతికి పట్టిచ్చినా నాలుగేల సొమ్ము

సుందరి : నువ్వూరు కున్నావంటప్పా.

లచ్చిందేవి : ఏం చేస్తాంరా. అమ్మటానికా ఆయనొప్పుకోడు. మేత కొనేసే బరువన్నా తప్పుద్ది గదా అనుకున్నా.

సుందిరి : ఆ ..... ఇంకేంవన్నా వుపాయం ఆలోసిచ్చప్పా. (సతికిల బడ్డాడు)

లచ్చిందేవి : ఇంకేంవాలోసిస్తాంవురా. ఇల్లు రాయిచ్చుకుంది చాలక వొడ్డీకి తిరుగు తుండాడు సేసయ్య. బ్యాంకీలో సొమ్ము యాలాం వేసి అమ్ముకున్నారు. ఒంగోలొంక మొకం బెట్టనియ్యటంలా యెరువుల కొట్టోడు. అప్పటికీ సందులో బోడిమ్మకాడ అయిదు రూపాయలొడ్డీకి అరేలు తెచ్చి దానికి మరీ అపినెక్కువ, నెల్నెలా వొడ్డీ కట్టమని పీకుతుంది. నిన్న బాయికాడ పెదరావయ్య కనపడ్డాడు. అప్పేంవన్నా అరుగుతాననుకున్నాడేంనో... మిరపకి రేటు పడిపోయిందంటగా అంటా మొకం తిప్పుకోని పోయడు.

సుందరి : రేటిప్పుడు పడిపోతే రేపు కూడ యిట్నేవుంటదా. ఒంగోల్లో నాలుగైదు కొట్టుల్లో అడిగా. బోకరోళ్లు కూడ రాయిగుద్ది సెప్పేరు. ఉత్తరాదిన మిరప్పంటంతా పోయిందంట. ఇంకొొక్క నెలాగితే దర ఆకాశానికి లేసుద్దంట. ఈ కాపు నిలబెట్టి గలిగితేనా. ఈ యేటితో సెని వొదిలి పోద్దప్పా.

లచ్చిందేవి : సేతి కాడికొచ్చింది నోటిదాకా రాకుండా పోతంది. ఏందబ్బా అని బెమ్మాశారి నడిగా. కోడి గుడ్డుకి మసి బూసి పెశన జెప్పాడు. నువ్వన్న మాటే. ఇయ్యటితో సిని వదిలి పొద్దంటరా.

సుందరి : బెమ్మాశారి అబద్దం చెప్పేడప్పా. అదిగే సెని గడపలో కొస్తంటే... (బయిటికి చూస్తా అన్నాడు)

లచ్చిందేవి : మాయోడా. (బయిటికి జూస్తా అంది)

సుందరి : యంకటేస్పర్రావయ్యేడిప్పుడు.

లచ్చిందేవి : నిన్నా మొన్నటి దాకా గొడ్ల దలారీ జేసి పొట్ట బోసుకున్నోడు. ఇప్పుడు చూడు పెళ్లానికి వంద సవర్ణ సొమ్ము చేయిచ్చేడంట. ఒంగోల్లో యిల్లు కట్టిస్తండాడంట. ఏటి మున్నూరు గాలంవూ యీ మట్టిలో బడి శాకిరీ జాస్తండా మన్నోసటిట్టా రాసేదేందిరా ఆ బగవంతుడు.

సుందరి : ఆయనెప్పుడూ అంతేలే... ఇదుగో అప్పా మొండోజైనా వుండోడే మేలంటారు. రారా అల్లుడా అని దగ్గిరకి తీసీ... ఒక పట్టుబట్టు, ఎంతోణ్నయినా మాటల్లో పడేసే మాయగోడు. ఒక పొర్లు యిటు

పొర్లేదనుకో..పదేలనంగా పాంవు నోట్లో సెయ్యి టెట్టి తెస్తాడు (మాయోడొచ్చాడు. ఒంటి మీద దిరీసుల లెవలు పెరిగి పోయింది. సేతులో క్యాసు బ్యాగుంది. సుందిరి గోతాలు కుట్టే పన్లో కెల్లిపోయారు)

లచ్చిందేవి : రారా అల్లుడా మమ్మల్ని బొత్తిగా మర్సిపోయినట్టుండావే.

మాయోడు : ఎంత మాటన్నావప్పా. పాపం రాంపండుది ...... పది లక్షల సొమ్ము బసంవంపై పోయిందా. ఎంత దూరంగా వుండా కన్నోళ్లు గదా. ఎంత కుంవిలి పోతండారో...... ఒకసారి పలకరిచ్చి పోదాంవూ అనొచ్చా సెప్పుతో కొట్టినట్టడిగేవు.

లచ్చిందేవి : సొసంత్రం జేసన్నాలేరా అల్లుడా. అదేంవీ మణుసులో పెట్టుకోవాక అయినా యింతూరుంది. యొవురు కన్నా గుర్తొచ్చేంవా మేంవు. నీతుండా వోడివి కాబట్టి నువ్వొచ్చేవు. మంచీల్దాగుతావా.

మాయోడు : ఒద్దప్పా. అల్లుడా అన్నావు. అది జాలు.

లచ్చిందేవి : అల్లుడు కాకేందిరా అసలూ... మా నాయనమ్మని కన్నమ్మా మీ తాతోళ్ల పెద్దప్పా యిద్దరూ తోడబుట్టినోళ్లంట. ఆ పేగు సంవందం వుండబట్టే నీకు మనోళ్లని చూడాలనిపిచ్చింది. ఆ బెంవలెక్కడికి పోతయ్‌రా.

మాయోడు : అద్సరేలే. మిరపతోట యిరగ బూసిందంటగా. వంద కింటా దాక కావచ్చంటం దార్లే.

సుందరి : సెడి పురుగు ఆసిచ్చకుండా వుంటేగదో. (వంకరగా వుందా మాట)

లచ్చిందేవి : అదేందో మాయదారి పురుగంట. మందులు వారు బొయ్యాలంటన్నా రబ్బాయ్‌.

మాయోడు : పోసేంవప్పా రేపు రూపాయలు రొల్లు కోవటంవేగదో. అన్నట్టు రాంకోటు మాంవ కనపడ్డే.

లచ్చిందేవి : అదిగే పంచలో పాలుమాలేడ్లే.

మాయోడు : పగులు పూట పక్క వాల్సే మణిసి గాదే.

లచ్చిందేవి : ఒరే అల్లుడా నువ్వొక సాయం చెయ్యాల్రా.

మాయోడు : అడుగప్పా, నేనూ అగసాట్లు పడ్డోడ్నే. యగసాయంలో సాదక బాదకాలు నాకూ తెలుసు. నీ సొంత తమ్ముణ్ననుకో. అడుగు.

లచ్చిందేవి : ఆ మాటన్నావు సాలు. కడుపు నిండిందబ్బాయ్.

సుందరి : మాటల్తో కడుపు నిండదూ. మణీ కావాల.

లచ్చిందేవి : తోట మీద కాయదొలుసు పురుగాడతందంట. నింవిశాల మీద మందు కొట్టకపోతే..పిందె మొత్తం బొక్కలు బడి పోద్దంట. పైకం కావాల్లుడా ఎ..ట్టన్నా పదేలు చూసి పెట్టాల.

మాయోడు : పాణం పోతంటే సూత్తా వుంటానంటప్పా. పదేలు గాదు పాతికేలను పాంవు నోట్లో సెయ్యి బెట్టి తేనో.

(నువ్ జెప్పింది నిజంవే అన్నట్టు సుందిరొంక జూసింది లచ్చిందేవి)

మా సావకారి... మిరప తోట్లకి పెట్టుబడి పెడతండాడు. నేనే తిరిగి కొంటన్నా, నా మాట కాదనడ్లే. ఇంతకీ...పదా పాతికా.

లచ్చిందేవి : ఉండుండు. ఆయంతో ఒక మాట చెప్పీ...

(లోపలికి పోబోయింది. రాంకోటు బయిటికొచ్చాడు)

యాంవయ్యా మనోడు పైకం సర్దుతానంటన్నాడు

రాంకోటు : ఇంటండాలే. ఒడ్డీయెంత.

మాయోడు : ఒడ్డీనా సీచ్చీ. నేనేంవన్నా వొడ్డీ యాపారం చేస్తన్నానంట మాంవా నన్నంత యదవ కింద జంవ గట్టేవా యేంది. ఏదో .. యిబ్బందుల్లో వుండారు నెలా రొణ్ణెల్లల్లో పంటొచ్చుద్దిగదా. అందులో జంవేసు కుందాంవనీ.

రాంకోటు : జంవేసేదేంది.

మాయోడు : అదే యిప్పుడెంత కావాలంటే అంత తీసుకోవటం రేపు పంటేంవో సావకారికి అమ్మటం. ఆ పద్ధతిలోనే వూరంతా అడ్వాన్సుల్దీసు కుంటండారు.

రాంకోటు : రేపుండే దర పకారం కట్టుకుంటారా.

మాయోడు : అదేందే రాంకోటు మాంవా నీదంతా యిద్దూరంవే. ఇప్పుటికి పదిమంది కిచ్చా. అట్టొవురూ అడగ లేదే. ఒడ్డీ లేకుండ సావకారి పెట్టుబడి పెడతండాడు గదా. రేపొకాల రేటు ఇంతకంటే పడిపోయిందనుకో. తగ్గిచ్చిస్తే నువ్వూరుకుంటా. ఇయాల్టి దర పకారం రాత కోతలు

చేసుకుంటారు...అది లాకీ.

రాంకోటు : ఇయ్యాల నీలగ్గోలికి రాయిచ్చుకోని రేపు సరుకు మొత్తం సవగ్గా నూకటాని కొచ్చేవన్న మాట.

మాయోడు : ఇన్నావుగా లచ్చిందేవప్పా. మంచికి పోతే సెడెదుర్రావటం అంటే యిదే. మీ సొమ్ము నేం తింటాని కొచ్చేనా. సొమ్మూ నాది గాదు. యాపారంవూ నాది గాదు. ఇబ్బందిలో వుండాంవంటే సావకారి సొమ్ము సర్దుదాంలే అనుకున్నా. అదీ నా తప్పు. అప్పా వస్తా... అన్నట్టూ.... రాంపండెవ్వారం యేంవీ బాగుల్లేదప్పా, సేతులో పైసాలేక ఒకర్ని అడగలేక కిందు మీద్దై పోతండాడు. రాత్రి నేనింటికి పోతే... కాళ్లు కడుపులోకి ముడుసుకోనీ సెరొక మంచానికి కరుసుకోనుండారు. ముద్ద ముట్టుకున్నా జాడ కనపళ్లా, కడుపుతరక్క పోయిందప్పా, నేను సూళ్లేక పోయేనంటే నమ్ము.

(లేనేడుపు నటిచ్చేడు. లచ్చిందేవికి గుండె సెరువైంది.)

యేడిసేం లాబం ఊరుకోప్పా. ఏదన్నా పదేలు సర్దగలిగితే... పరువుగా యిల్లన్నా గడుపుకుంటాడు.... నేనొస్తానప్పా.

లచ్చిందేవి : యాంవయ్యా...పోతన్నాడు. పైకం చాత బట్టుకోనొచ్చేడు. మన కింత కంటే మారగం లేదయ్యా, యాంవయ్యా..... ... ఒరే అల్లుడా ఒక్క సెణం ఆగు. యాంవయ్యా...

రాంకోటు : అప్పుడుండా రేటుకి అమ్ముకుంటే మనకేం వొచ్చుదే మట్టి. వాడు పొంవంటోడే. మన అవసరం చూసొచ్చేడు. పదేలకి పంటంతా తాకట్టు పెట్టమంటన్నాడు. రేపు లచ్చులు జేసే సరుకు వాడి కప్పగిచ్చి మనం యేడుస్తా కూసోవాల్నే.

సుందరి : రొణ్నెల్లాగితే మిరపకాయ బంగారంపంటప్పా. యట్టన్నా గాని పంట తాకట్టు పడకుండా చూసుకోవాల.

లచ్చిందేవి : అసలకా పంట నిలబడితే గదంట్రా. ఆ పైకం తీసుకోని మందులెయ్యక పోతే పంటే లేదు గదా వాడెల్లి పోతే యట్టరా.

సుందరి : యట్ట మాంవా

రాంకోటు : దీనెమ్మ యదవ నాయాల్ది. పేణం పీల్చుకోనియ్యరేంది. మొక్క బతికిచ్చాలకి దేంవుడు కనపడ్డాడు. యేడాదంతా పడ్డ శంవ. ఒక్క నెల.. ఒక్క నెలాగితే లచ్చలు మీగుల్తుయ్. పదేలకి మన జుట్టు వాడికి పట్టియ్యాల.

సుందరి : అదీ నిజంవే నప్పా.

లచ్చిందేవి : అది నిజం ఇదీ నిజంవే. ఇప్పుదు పూట గడిసే దెట్టా. పూత నిలిపేదెట్టా అక్కడ పిల్లోడు నిలబడేదెట్టా.

రాంకోటు : మాటి మాటికీ పిల్లోడూ విల్లోడూ అని రాగం తీస్తే మొకం పగల్నూకుతా.

లచ్చిందేవి : నేనేంవీ మాట్టాణ్ను. తెల్లారేలకి సేనుకి మందేయ్యాల. తెమ్మన్రా. పదేలూ.

సుందరి : ....... ఏం మాంవా.

రాంకోటు : ఆ లంజా కొడుకు వాసెన బట్టొచ్చేదు సేన్నాశనంవై పోయినా సరే వాడి పదేల కోసం పంట తాకట్టు పెట్టేది లేదురా.

లచ్చిందేవి : సూసేవంట్రా ఆ మొండిపట్టు. బండ రాయిరా ఆ మడిసి. ఆయనకి పూత బోయినా పరవాలేదు పిందె బోయినా పరవాలేదు పండక పోయినా పరవాలేదు పండోడు బోయి... నా....ప...ర....వా...లే...దు. ...నా బిడ్డ పస్తులు పడుంటండాడంట. ఎందుకురా యీ జలమ ఇంకా యెందుకురా బతికేది.

రాంకోటు : నీ యమ్మ... యీ యేదుపులూ పెడ బొబ్బలూ యేంది. నోరు ముయ్యక పోయేవంటే యెంవికలిరిసేస్తా.

(జుట్టు పట్టుకున్నాడు. ఇసురుగా యిడిపిచ్చుకుంది లచ్చిందేవి)

లచ్చిందేవి : ఏందయ్యా నువ్విరిసేదీ. పదేలు పుట్టిచ్చలేక ముసుగేసిన మొగోడివీ.

రాంకోటు : యేం కూసేవే నీ యమ్మ....

(అంటా లచ్చిందేవి మీదకి దూకుతుండాడు. సుందిరి అడ్డం వొచ్చి ఆపుతుండాడు. దూరాన్నిలబడి యేంవీ యెరగనట్టు సిగిరెట్టు పీలుస్తుండాడు మాయోడు)

లచ్చిందేవి : ఆపుతా వెందుకు రానియ్యి. కొట్టనియ్యరా. ఒక నాటితో పోద్దీ. ఈ మొండోడితో కాపరం జెయ్యటంకంటే సావటం మంచిదిరా. బిడ్డని జూసుకోలేని గొడ్డు మోతోడురా. పెళ్లాం కడుపు కోతెరగని ముండ మోపోడురా.

(సుందిర్ని పక్కకి నెట్టి లచ్చిందేవిని రొండు దెబ్బలేశాడు రాంకోటు సుందిరి మళ్లీ వొచ్చి తప్పిస్తన్నాడు. ఒల్లు మర్సిపోయినట్టుంది రాంకోటు. రొండు సేతుల్తో గొంతు పిసికేస్తన్నాడు. సుందిరి ఆపలేకపోతన్నాడు.)

రాంకోటు : ఒరే వదల్రా నన్నూ.. తప్పుకోరా నువ్వూ.

సుందరి : ఉందు మాంవా.... నా మాటిను. ఆగు సెవతా....సెప్పేదినూ. మాంవా నీకు దండం బెడతా. వొదిలి పెట్టు మాంవా.

(రాంకోటు కాళ్లు పట్టుకోని బతింవాలాడు సుందిరి. రాంకోటూగ్రం ఆగలా. సెణంవాలిశం వైనా లచ్చిందేవి పేణాలు దక్కేట్టుళ్లా. రాంకోటు సెంప మీద చెళ్లున కొట్టాడు సుందిరి. రాంకోటు బిత్తరపోయి ఆగేడు కాసేపొవురూ మాట్టాళ్లా.)

ముప్పయ్యేళ్లనించి కాపరం చేస్తండారు. ఇట్టాటి గొడవ నేనెప్పుడూ చూళ్లా. అప్పుదీసుకునే కాడ యీ తగూ యేంది. ఒక మాట జారిందనుకో అంతలావున రెచ్చిపోతావేంది. లచ్చిందేవప్పకి మతి బోయిందా నీకు మతి పోయిందా లేకపోతే మీ యిద్దరికీ యొవురన్నా శాతబడి జేసేరా. సూత్తావుండ లేకపోయా.

(సుందిరి బయిటికెల్తన్నాడు)

రాంకోటు : యక్కడకిరా. ఇట్రా. రారా యిటూ

(సుందిరి దగెరకొచ్చాడు. తలొంచుకొని ఆలోశన చేశాడు రాంకోటు)

మాయోడి దగ్గిర... డబ్బు తీసుకుందాంవా.

సుందరి : ....ఎప్పుటి బాగప్పుటిది. ముందు పంట నిలబెట్టాల గదా.

రాంకోటు : (సేనొంక చూసి గుటక మింగేడు) సొశానంలో శవం కోసం పెద్ద బోరవాల కాసుకోనుండాడు. వాణ్ని పిలువు.

సుందరి : రమ్మంటండాడు. (ఎంపీ యరగనట్టు దగ్గిరకొచ్చాడు మాయోడు)

మాయోడు : ఏంది మాంవా పిల్చేవంట.

రాంకోటు : ఇప్పటి దాకా యెందుకు నిలబడ్డా.

మాయోడు : అదీ... లచ్చిందేవప్ప కాసేపుండమంటేనూ..

సుందరి : డబ్బంట... యియ్యి..

మాయోడు : అదా.... రొజ్జెల్లదాక యింటెరెస్టుండదు ....మరి...పంటొచ్చినాక..

రాంకోటు : ఒకసారి చెప్పేవుగా.

మాయోడు : మీ కిష్టంవైతేనే సూడండి. రొణ్నెల్ల తరవాత లేటయితే పెద్దొడ్డీ కట్టుకుంటాడు. చెప్పాలగదా. ఇంతకీ క్యాసెంతగావల్నో.

లచ్చిందేవి : పాతికేలియ్యి. (డబ్బు లెక్కబెట్టి రాంకోటు కిచ్చాడు మాయోడు)

మాయోడు : ఏంవనుకోకుండా యిక్కడొకటి యిక్కడొకటీ.... సంతకాలు చెయ్యి మాంవా. డబ్బిచ్చేవోడు గదా. వాడి జాగర్త వాడిది.

(సదివి సంతకాలు చేశాడు రాంకోటు. నోటు తీసుకోని దాంట్లో యింకేందో రాసుకుంటన్నాడు మాయోడు)

రాంకోటు : సుందిరీ యీ పదేలూ తీసకపోయి కావాల్సిన మందులన్నీ తీసకరా.

సుందరి : ముందు అయిదేలకి తెస్తే సరిపోదో.

రాంకోటు : మల్లీ మల్లీ కావాల్సొచ్చుద్దిగదా. నీ దగ్గిర్నే వుంచు

(పదేలు తీసుకున్నాడు సుందిరి)

లచ్చిందేవి : నాగ్గూడ పదేలు గావాల. యియ్యమన్నా.

రాంకోటు : ఎందుకంటా.

లచ్చిందేవి ఎందుకో వకందుకు. నేను గూడ మీతో పాటు రెక్కలు ముక్కలు జేసుకుంటండా. ఇస్తాడా లేదా.

(తెగేసినట్టడిగింది. లచ్చిందేవి. రాంకోటేందో అనబోతంటే సుందిరే అడ్డం వచ్చి లచ్చిందేవి యిష్ట పకారం కానియ్యమన్నట్టు చూసేడు. మాట్టాడకుండా పదేల కట్ట సుందిరి చేతిలో కొట్టాడు రాంకోటు. ఆ పదేలు లచ్చిందేవి చేతిలో పెట్టాడు సుందిరి. డబ్బు తీసుకోని యిసురుగా గుడిశలో కెల్లిపోయింది లచ్చిందేవి. బయిట్నించి వోండా

బండి మోత యినపడింది. అందరూ బయిటికి చూసేరు. శ్రీదేవి మొగుడు అడ్డదిడ్డంగా నడుపుకుంటా వోండా బండి మీదొచ్చాడు)

మొగుడు : ఏందే మాయోదు బాబాయ్. నీ కోసం నేనూదంతా తిదుగుతా వుంతే నువ్విక్కడ కూసోనుందావేందీ. ఒంగోలు పోదాంవంతివే.

మాయోదు : పోదాం పోదాం. వస్తండా.

సుందరి : యాంవోయ్ మొగుడా బండి కొన్నావా.

మొగుడు : నీకు తెలవదా యేందే కొంతినే. ఒదే బాబాయ్ తొందదగా పోదాంవే

మాయోదు : వస్తండారా.

సుందరి : అసలకి నీకు బందెందుకోయ్ మొగుడా.

మొగుడు : ఎందుకోంది. బిజినెను చేద్దాంవని కదో.

సుందరి : ఏం బిజినెసో.

మొగుడు : ఏదో వకతి, అది నేద్సుకోవతానికే గదో మాయోదు బాబాయ్ సుత్తూ తిదుగుతుంది.

మాయోదు : బండెక్కద కొన్నావురా.

మొగుడు : ఎక్కడోనా మనూల్లోనే, మన పందు బాబాయది కదో

మాయోదు : ఓహో రాంపందు బండి నువ్వు కొన్నావా.
(ఆ మాట సురుక్కున గుచ్చుకుంది రాంకోటుకి)

సుందరి : ఎంతయిందో.

మొగుడు : ముప్పయిదేలు.

సుంరి : అంత పైకం యేద తెచ్చేవోయ్ లోనా.

మాయోదు : లోనా గీనా, ఈడికొకెకరా యఱ్ఱ బొలం వుళ్లా అదమ్మేసి కొన్నాదు.

సుందరి : ఎఱ్ఱబొలం అమ్మి కొన్నాదా.

మొగుడు : యేం... బాలేదా..దంగు కొంచం తగ్గిందిలే. కొత్త పెయింతింగేయిద్దాం వనుకుంతన్నా. అన్నత్తు బందికి... బులుగు దంగేత్తే బాగుంతదా ఎద్ద దంగెత్తే బాగుంతదా బాబాయ్.

మాయోదు : ఏ రంగేస్తే బాగుంటదో సుందిర్నడిగితే యేం చెవతాదురా పాపంపూ తెలిసినోదు... రాంకోటు మాంవ నడిగితే శవతాదు.

సుందరి : ఆ శవతాడు అడుగు.

మొగుడు : యాంవే దాంకోతు బాబాయ్ బందికి బులుగు దంగేత్తే బాగుంతదా ఎద్ద దంగేత్తే బాగుంతదా.
(మొగుణ్ని జుట్టు పట్టుకొని వొంగదీసి నాలుగేశాడు రాంకోటు) ఒదే ఒదే... నీ యమ్మ బాబాయ్ నా కొదకా... వామ్మా... మద్యాదగా మాతదిగితే సావ జెంగుతావేందీ.

రాంకోటు : కల్లందిబ్బ మీద నించి అవతలకి పోతావా కాలవలో తొక్కమంటావా.

మొగుడు : పోతన్నాలేయే. (బండి దగ్గిరకి పోయేడు. బయిట్నించి కేక యినపడింది)

స్వరం : సుందిరీ ఒరే... సుందిరీ.

సుందరి : యొవురక్కడా.

స్వరం : నేనేరా పెద్దబ్బినీ.

సుందరి : ఏంది పెద్దబ్బన్నా.

పెద్దబ్బి : కోనేటి కాడ గొడవౌతందిరా. ఊళ్నోళ్లూ పల్లెలో వోళ్లూ కలబడ బోతండా రంట. అందరూ యలండాగ్రా. వాళ్లల్లో నీ కొడుగ్గూడా వుండాడంట.

సుందరి : ఓర్నాయనో... ఆడేం జరుగుతుందో ...రాంకోటు మాంవా నేనెల్లొస్తా ఊళ్లో యవ్వారం నీ కొద్దురా అని శవతానే వుండా. ఇంటేగదో.
(బయిటికెల్లి పోయాడు)

మాయోడు : ఊరొక పాటు బడతంది. పనీ పాటా లేనోళ్లంతా పొగయ్యేరో. ఈళ్లకి తోడు ఆ రౌడీవోడొకడు చేరేడు. బాంబులూ గూడా తెచ్చేరంట. మరి నేనెల్లొస్తా మాంవా. (బయిటికెల్లిన సుందిర్నే సూస్తన్నాడు రాంకోటు)

మాయోడు : లచ్చిందేవప్పా. రాంపండుకేం జెప్పమంటా.

లచ్చిందేవి : మీ యమ్మా అబ్బా బతికే వుండారం చెప్పు. (గుడిశలో నించే చెప్పింది)

మాయోడు : ఆఆ. రాంపండు కూడా కోనేటి కాడికి చేరేదేంవో కాస్త జాగర్త చెప్పండప్పో.. పదరా.

మొగుడు : బంది కొంచం దూదం నెత్తే బాబాయ్.

మాయోడు : నీ బండి నేన్నెట్టాల్నా

మొగుడు : సాత్త్వతం లేదే. కొంచం. ప్లీజ్.

మాయోడు : సరే పట్టు

(మొగుడు బండి మీద కూసోనుంటే మాయోడు నెట్టుకుంటా పోయేరు. పండిన సేన్నీ సేతులో పైకాన్నీ చూసుకోని సేసేదేంవీ లేక కూలబడ్డాడు రాంకోటు. యేరే కోక కట్టుకొని డబ్బుకట్ట పైట సెంగులో దోపుకుంటా లచ్చిందేవొచ్చింది)

లచ్చిందేవి : నే నెల్తన్నా.

రాంకోటు : కోనేటి కాడికా.

లచ్చిందేవి : కొడుక్కాడికి.

రాంకోటు : వాడు నా పగోడింట్లో జేరేడు. పేణం బోయినా నేనాయింటికి అడుగు పెట్టను.

లచ్చిందేవి : నువ్వు రావాకు నే పోయొస్తా.

రాంకోటు : పొయినాక వొచ్చేదుండదు.

లచ్చిందేవి : నేను పోతంది పరాయోడి కాడిగ్గాదు పగోడి కాడికీ కాదు. పిల్లోడి కాడికి.

రాంకోటు : వాడు నీ కొక్కదానికే పుట్టలా. (కస్సుమన్నాడు)

లచ్చిందేవి : నాకు నా కొడుగ్గావాల. (తెగేచ్చెప్పింది)

రాంకోటు : నువ్వు కొడుకనుకుంటండావ్. వాడు అమ్మను కోవటంలా. అనుకుంటే యిక్కడకే వొచ్చేవోడు.

లచ్చిందేవి : రాకపోతే యేంవయిందీ. బిడ్డుండా కాడికి తల్లి పోగోడదా.

రాంకోటు : నాతో యింక పన్లేదా. (లచ్చిందేవి మాట్లాడలా)

వాడి గడప తొక్కినాక... యీ కల్లందిబ్బ మీద కాలు పెట్టనియ్యను.

లచ్చిందేవి : కడుపున బుట్టినోడు కాటి కీడవ లేక పోతాడా ఎలన్నా. (పోతున్నది)

రాంకోటు : లచ్చిందేవీ. (లచ్చిందేవి ఆగింది. దగ్గిర కొచ్చాడు రాంకోటు) ఎల్లిపోతన్నావా.. ఈ కల్లం దిబ్బ మీద నన్నొక్కణ్నే వొదిలేసి పోతండావా.

లచ్చిందేవి : ఆయాల నీ మీదకి చెయ్యెత్తేడని వాణ్నొంటిరిగా వొదిలేసి నీతో

పాటొచ్చా. ఇయ్యాల వాడి సొమ్ముదిని సుకపట్టానికి పోవటంలా. కస్టాల్లో వుండా బిడ్డకి తోడుంటానికి పోతండా. కట్టుకున్న దాని మీదా కన్న బిడ్డ మీదా నీకు రొవ్వంతన్నా మణుసుంటే నాతోపాటు పోదాంరా. ఒక్కమాట సెప్పు. ముప్పయ్యేళ్లనించి యెప్పుడన్నా... నీ మాట కెదురు జెప్పేనా. ఒక్కసారి నా మాటినగూడదంటయ్యా. అబ్బాయి కాడికి పోదాంవయ్యా... రాంపండు కాడికి బోదాంవయ్యా. (కాసేపు కళ్లు మూసుకోని గుండెల్నిండా గాలి పీల్చుకున్నాడు రాంకోటు. అడుగులో అడుగేసుకుంటా లచ్చిందేవి దగ్గర కొచ్చాడు. ఆంవె కళ్లు ఆశగా మెరిసినియ్. మిగిల్న ఐదేల రూపాయల కట్టని లచ్చిందేవి సేతులో పెట్టాడు)

రాంకోటు : యీ అయిదేలు కూడ రాంపండుకియ్యి.

లచ్చిందేవి : అయితే .. నువ్వు ...

రాంకోటు : రాను: ....వాడి కొక్కమాట చెప్పు. ఆకరి మాట. ఎన్నగసాట్లొచ్చినా యెంత పేణం మీద కొచ్చినా యీ బూంవిని.... అమ్ముకోవద్దని సెప్పు. ఈ సెట్టల్లో మన పెద్దోళ్ల పేణాలుండయ్... లచ్చిందేవీ యింకొక్కమాట మరిసిపోవాక. ఈ దిబ్బ మీద మా అయ్య పక్కన నా గుర్తుగా.. ఒక మొక్క... పూడి సెయ్యమని చెప్పు (లచ్చిందేవి యేడుపాపుకోలేక పోయింది)

నేను మొండోడ్నే. ఇట్టా పోవాలిసిందే.

లచ్చిందేవి : కడుపున బుట్టిన బిడ్డాయనే. అంత కోపం ఎందుకయ్యా.

రాంకోటు : వాడి మీద నాకు కోపంవే. అయితే ఆ కోపం ఎప్పుడూ వుంటదా లచ్చిందేవి.

లచ్చిందేవి : మరింకెందుకయ్యా ఆ మొండి పట్టు.

రాంకోటు : ఆడ కొస్తే...వాడి అప్పుల బాదలు సూస్తా వుండాల. వాడితో మాట్టాడితే పొలం అమ్ముదాం బాబా అంటాడు. కడుపు తీపికి కట్టుబడితే బూంబిని పోగొట్టుకోవాల్సొచ్చుద్ది లచ్చిందేవి

లచ్చిందేవి : నీకు బిడ్డెక్కువా బూంవెక్కువా.

రాంకోటు : నాకు బూంచే యెక్కువ ... నన్నింక మాట్టాడిచ్చవాక. ఎల్లు.... ఎల్లి పో....

గుండె రాయి జేసుకుంటా యనక్కి తిరిగాడు రాంకోటు. లచ్చిందేవి సెట్లని చూసింది. పెనింవిట్ని చూసింది. ఇంకొకసారి బొడ్డుతాడు తెగిపోతా వుండట్టు అలమటిచ్చింది ఆయమ్మమణుసు. పోలేక పోలేక పోయింది. ఇప్పుడు రాంకోటుకి మిగిలింది అయ్య పేరుతో పిల్చుకునే యాపసెట్లే బాదలన్నీ బాబుతో చెప్పుకోటానికేందవో సెట్టు దగ్గిరకి చేరిపోతన్నాడు)

# దృశ్యం 11

(కోడి పెంటంజియ్య యింటెనకమాల పెరడు. ఒక మూల్న చాద బాయుంది. బాయి పక్కనే బయటికి దారుంది. ఒక పక్కన సిన్న మంచం నిలబెట్టుంది. అంజియ్య యొవురి కోసంవో చూస్తన్నాడు. బయిట్నించి దొరసానొచ్చింది)

దొరసాని : రత్తం .....

అంజియ్య : పొలం బోయింది.

దొరసాని : మీ యల్లుడు....

అంజియ్య : వాణ్నేరే సోటికి పంపేలే.

దొరసాని : ముందు వాకిలి తలుపు...

అంజియ్య : లోపల గెడి బిగిచ్చాలే. దొడ్డోకిలికి గెడి తగిలిచ్చేవా.

దొరసాని : ఆ.

(సటుక్కున దొరసాన్ని యింట్లోకి లాక్కపోయ్యేడు. తలుపు మూసుకుంది మంచం సాట్నించి పైకి లేసింది సుబ్బరత్తం. ఏం జెయ్యటానికి తోచక కాసేపటూ యిటూ తిరిగింది. మంచం వాలిచి దానిమీద కూలబడింది. రెండు చేతుల్తో గెట్టిగా తల బట్టుకుంది కాసేపు. పైకిలేచి తలుపు దగ్గెరకి పోయింది. తలుపు తట్ట బోయింది. సెయ్యోణికి పోతంది. కాసేపాగింది. నిండా గాలి పీల్చుకుంది. తలుపు తట్టింది కసిగా తలుప్మీద బాదింది. తలుపు తెరిసేడు అంజియ్య.)

అంజియ్య : పొలంబోతివే యెందుకొచ్చా

సుబ్బరత్తం : లోపల గెడిబెట్టు కోని యింట్లో యెందుకుండా.

(అంజియ్య గుడ్లురింవి సూశాడు. అదురూ బెదురూ లేకుండ నిలబడింది రత్తం. మాట్లాడకుండా లోపలికి పోయేడంజియ్య. కాసేపుటికి దొరసాని బయిటి కొచ్చింది. ఏంవీ యరగనట్టు బాయి

పక్కగా బయిటి కెల్లబోయింది. యనకనించి జుట్టు బట్టుకోని ఆపింది. రత్తం.)

సుబ్బరత్తం : లోపలెందుకుండా.

దొరసాని : నువ్వూ పేరాయీ కొట్టాంవులో యెందుకుంటారో అందుకు.
(ఇసురుగా నెట్టింది రత్తం. దొరసాని మంచం మీద పడింది)

సుబ్బరత్తం : నాకు మొగుళ్లేడే. గతిలేని బతుకు బతుకుతుండా. నీకేం రోగంవు. మొగుడుండాడు ముగ్గురు పిల్లలుండారు. ఈ గెడ్డి తింటం వెందుకు.

దొరసాని : రత్తం వొదినా పెద్దంగ అరవమాక. నన్నీది నెయ్యంవాక. నలుగుర్లో బడితే ..యంత శాతగాని మొగుడైనా వూరుకోడు. తన్ని తరించేస్తాడు. నా బిడ్డలు యీదిన బడతారు. నీకు దండం బెడతా. నాకాపరం తియ్యబాకొదినా, (రత్తానికి మాటరాలా)
నాకేం వొల్లు కొవ్వుబట్టి తిమ్మిరెక్కి యిట్టాటి పంజెయ్యటం లేదమ్మా మీ యన్న... నన్ను బలంతంగా లొంగ దీసుకున్నాడు. ఆయన కెదురు తిరిగే సెగితి నాకు లేదు. సెయ్యి పట్టుకున్నందుకు అంజియ్యని సెప్పుతో కొట్టే దైర్నం నా మొగుడికీ లేదు. అద్దరేత్తిరి దాకా వూరు మీద తిరగాల. ఉండోళ్ల కాళ్ల కాడ బతకాల. మళ్లీ నేనీ వూరుకి పెసిరెంటుని. డబ్బులేని పెసిరెంటుని. కులంలేని పెసిరెంటుని...... ఎవురికి సెప్పుకుంటాంవమ్మా. సెప్పుకుంటే యెవురికి నష్టంవు. అరిటాకు బతుకులమ్మా మాయి.

సుబ్బరత్తం : మీ బతుకులే కాదే. ఆడదాని జలం అంత. నీకూ నాకూ తేడా యేం వుందే.

దొరసాని : ... రత్తం వొదినా...

సుబ్బరత్తం : ఆస్తి కోసం...తోడ బుట్టిందానికి లంజతనం అంట గట్టేడు.. సొంత అన్న. పెళ్లిగాకుండా చెడగొట్టి నా బతుకు బుగ్గి చేసేడు. అంతా తెలిసి కూడ నేనేం జెయ్యగలిగేను. నా సొమ్ముగావాల. నేనొద్దు.

దొరసాని : ఇప్పుడేంవైందొదినా.

సుబ్బరత్తం : పైకం కాస్తె కావాలని అడిగా. అక్కణ్నించి నా మీద పెట్టుకున్నాడు.

నా దగ్గర తాళాలు తీసి కూతురు కిచ్చేడు. ఈడి బొడ్డుకాడి సొమ్మా నాకు అక్కులేదో. పైగానన్ను సెడిపోయిందానా అని తిడతాడు యీడికంటే యీడి కూతురి కంటే సెడిపొయ్యేనా. ఇంక చెవతా.

దొరసాని : నీ దగ్గిర తాళాలు తీసుకున్నాడో. నిన్ను సెడిపోయిందానా అన్నాడో. చ్..చ్..చ్.. తల్లికి మొగుడంటే అంజియ్యేనమ్మా

సుబ్బరత్తం : ఆ డబ్బు కూడ నా కోసం అడగలా. బండి కిందబడి కాలిరగ్గట్టు కున్నాడు పేరాయి. నీకు దెలుసుగా. శాకిరీ చేసేవోడు మంచంవెక్కేడు తింటానికి లేక కుటింబం అలంవటిచ్చి పోతంది...నా గాల్లోబడి పెళ్లాన్నీ పిల్లల్నీ పట్టిచ్చు కోకుండా యీ యింటి సుట్టూ కుక్కాల తిరిగేడు. పొలంలో శాకిరీ అంతా నెత్తినేసుకోని సేసేడు. మా పొలం పని చేస్తానే కాలు పోగొట్టుకున్నాడు. పంజెయ్యటానీ కింక పనికిరాడని మసిగుడ్డందీసేసినట్టు తీసేసేడు...అన్న. ప్లేస్టిక్కాలెయ్యాలంటే శానాడబ్బు కావాలంట. కండలు కరిగిచ్చి చేసి పెట్టేడు గదా. కాలుకి సాయం చేద్దాంవూ అన్నా. అదీ నా తప్పు. నువ్వు చెప్పే దొరసానీ. నేనెట్టా మొకం సాటు జేసుకునేది. పదేళ్లు కలిసుండాం. తాలిబొట్టు కడితేనే మొగుడా..

దొరసాని : రత్తం వొదినా నీతుండా మాటన్నావు. నీ మణుసు గొప్పదమ్మా (రొండు సేతులెత్తి దండంబెట్టింది)

సుబ్బరత్తం : ఏ జలంవలో యేం పాపం చేసేనో. ఇట్టా మొగుడూ మొద్దులు యిల్లూ కాపరం లేకుండ పోయా. నీ కాపరం తీస్తే నాకేం వొచ్చుద్దీ. నిన్నీదినెయ్యాలని కాదే..అంజియ్య జుట్టు చేతిలోకి తీసుకోవాల అందుకు.. నువ్వెల్లు.

దొరసాని : ఒదినా.. కోడిపెంటంజియ్య కిరాతుకుడు. జాగర్త.

సుబ్బరత్తం : నేను వాడి సెల్లిల్ని..నువు పో..

(దొరసానెల్లిపోయింది. కాసేపుటికి లోపల్నించి అంజియ్యొచ్చి మంచం మీద కూసున్నాడు. రత్తం యింట్లోకెల్ల బోయింది.)

అంజియ్య : అమ్మాయి రక్తం...ఇట్రా..

(దగ్గిరకొచ్చింది రత్తం)

ఇయిగో తాళాలు. నీ దగెరుంచు.

సుబ్బరత్తం : ఎందుకూ నీ కూతురుకే యియ్యి.

అంజియ్య : అది పసిది. ఇల్లూ వాకిలి పట్టకుండా వుంది. ఈ బరువు నెత్తిన బెడితే.. యింటి పట్టునుండి పద్దతుల్నేరుసుకుంటదని యిచ్చి మణుసులో పెట్టుకోబాక. తీసుకో

(తాళాలిసురుగా లాక్కోని బొడ్లో దోపుకుంది రత్తం)

ఎన్ననుకున్నా యిద్దరంవీ ఒక తల్లి పిల్లలంవి. చూసింది చూసినట్టు కడుపులో దాసుకో. పల్లు దాటితే పలసనై పోతాం.

సుబ్బరత్తం : ఆ సంగతి అందరంవీ గుర్తుంచుకోవాల.

అంజియ్య : ఏదో దెసలోవుండి నోరు జారేననుకో. అదే పట్టుకోని కూసుంటావే.

సుబ్బరత్తం : నేనడిగిన పైకం సంగతేంజేశా.

అంజియ్య : యంతా.

సుబ్బరత్తం :యాబయ్యేలు

అంజియ్య : యాబయ్ రూపాయలడిగినట్టు అడిగేవు. వాడికి ఆస్పత్రి కర్సులు మనంవే యిచ్చాంగా

సుబ్బరత్తం : ముస్టి మూడొందలిచ్చేంవు. గవర్మెంటాస్పత్రిలో పడేస్తే కాలు తెగ్గొట్టి పంపేరు. తానెట్ట బతకాల.

అంజియ్య : అదేందమ్మాయ్. వాడేంవన్నా మన రగత సంబందీకుడా. సాటి కులపోడు కూడ కాదు.

సుబ్బరత్తం : శాకిరీ జేసినన్నాలూ యియ్యేంవీ గుర్తుకి రాలా. ఇప్పుడు మూల్నబడ్డాడు కాబట్టి మనోడుగాదు.

అంజియ్య : మాటిమాటికీ శాకిరి శాకిరీ అంటావే. సేసినన్నాలూ కూడు బెట్టలా. గుడ్డ తీసియ్యలా. పండక్కీ పబ్బానికీ కాస్తోకూస్తో సర్దుతానే వుండాంగదా

సుబ్బరత్తం : ఆ సొమ్మే కాంవాల కూడబెట్టుకోని తింటండాడు. ఆ లెక్కలన్నీ యెందుకులే. ఇప్పుడు పైకం కావాల.

అంజియ్య : ఎయ్యో రొండేలో అంటే సరేగనీ యాకంగా యాబయేలంటే యొవురి సొమ్ము తెచ్చియ్యమంటా.

సుబ్బరత్తం : యొవురు సొమ్మో యెందుకు. నా సొమ్మే యియ్యి. యాబైలచ్చల ఆస్తుంది నాది. అదంతా యియ్యమన్లేదుగా. అడిగింది యాబయేలు.

అంజియ్య : ఇప్పుడు యాబయేలడిగిందానివి రేపు యాబైలచ్చలు మటుకి అడగవంట్లే.

సుబ్బరత్తం : నాకేం మొగుడా మొద్దులా. అడిగేం జేసుకుంటాను.

అంజియ్య : సూడమ్మాయ్ తోడబుట్టిందానివి నువ్వడగచ్చు నేనియ్యచ్చు. అయితే అద్దీసక పోయి ఆళ్లకియ్యాలంటేనే పేసీ. ఈ యాబయేలతో పోదు. రేపు లచ్చ తెమ్మంటారు.

సుబ్బరత్తం : అంత నీతి లేనోడు కాదులే.

అంజియ్య : ...అయితే యాబయేలూ...యియ్యాల్సిందేనా.

సుబ్బరత్తం : ఇయ్యాల.

అంజియ్య : ఇయ్యక పోతే...

సుబ్బరత్తం : ...మెరక సేను.. అరగొౢరు అమ్మేస్తా.

(సర్రున పైకి లేశాడంజియ్య. యనకనించి రత్తం మీదకి దూకబోయేడు. అంతట్లో యింట్లో నించి ఒంటేర్లాగోలు మాటలినపడ్డయ్.)

రాగోలు : రత్తం వొదినా..రత్తం వొదినా. తలుపు తియ్య.. యొవురూ లేరా యేంది.

అంజియ్య : సరే. అట్టనే తీసుకో. తాళాలు నీ సేతికే వొచ్చినియ్‌గా పో. వాడు కేక లేస్తుండాడు. లోపల తలుపు గెడి తియ్యి.

(తాళాల్జూసుకుంటా లోపలికి పోయింది రత్తం. అంజియ్య చూపు యిసం కక్కుతా వుంది. బాయి దగ్గరకి పోయి శాంతాడు చేతికి తీసుకున్నాడు. బాయిలోకి తొంగి చూశాడు. తాడుకి వుచ్చు ముడేస్తన్నాడు. అంతలో ఒంటేర్లాగోలొచ్చాడు.)

రాగోలు : నువ్విక్కడుండావెట్టా. రంగనాయికులుళ్లా..అప్పుడొచ్చినే ఒంగోల్నించి ఆయనొచ్చాడు.

అంజియ్య : రంగనాయికులు..యిప్పుడెందుకొచ్చేడంటా.

రాగోలు : బలేసెప్పేవే. నాకు చెప్పేడా యేంది. మీ మాంవని పిలువు అర్జెంటుగా మాట్టాడాలా అన్నాడు

అంజియ్య : ఇప్పుడెక్కడుండాడు.

రాగోలు : ఇంటి ముందు వరండాలో కూసోనుళ్లా.

అంజియ్య : ఇక్కడికి రమ్మంటన్నా నని చెప్పు.

రాగోలు : బలే సెప్పేవే. (అంటా యింట్లోకెల్లాడు రాగోలు, ఇంట్లోంచి యిసురుగా వొచ్చిన రత్తం తాళాలిస్సిరికొట్టింది)

సుబ్బరత్తం : తాళాలేం నెత్తిన గొట్టుకోటానికా, బీరువాలోగాని యినప్పెట్టెలోగాని పైసాలేదు.

అంజియ్య : నీకు సెప్పటం మర్చిపోయా. ఇనప్పెట్టెలో పైకం నేనే తీశా. రాజ్జం సేతికి దొరక్కుండా దాసి పెడదాంవని. ఇదిగే నా దగ్గిరుందిలే. (జేబు చూపాడు) నీకిస్తాగా, రంగనాయికులొచ్చేడంటా అతంతో మాట్టాడి పంపినాక..నీ పనిచూస్తా. యాబయేలు ఇచ్చి..పంపుతా.

(రంగనాయికుల్ని తీసకొచ్చేడు ఒంటేర్రాగోలు)

రంగనా : నంవస్కారంవండీ అంజియ్యగారూ.

అంజియ్య : ఆఆ..రా..కూసో, అమ్మాయ్ కాసిని కాపీ పెట్టియ్యమ్మా.

(రత్తం యిసురుగా లోపలికి పో ంది)

రాగోలూ కొట్టాం కాడికి పోయి గొడ్లకి నీలుబెట్టి రాగూడదూ.

రాగోలు : బలే సెప్పేవే. నీలు బెట్టిగదో నేనొస్తంది.

అంజియ్య : అయితే పాటిదిబ్బ మీద నాటు పుగాకు తోట్లో సాలుకెన్ని సెట్లుండయో లెక్కబెట్టి రా.

రాగోలు : బలే సెప్పేవే. (బయిటికెల్లాడు)

రంగనా : అల్లుడుగదూ.

అంజియ్య : ఆఆ. యింక జెప్పు. ఏందీ అదావుడిగా వొచ్చేవూ. తోకరాంవన్న బాగుండాడా.

రంగనా : ఇంకేం బాగు లోబీపీ వొచ్చి ఆస్పత్రిలో జాయినయ్యేడు.

అంజియ్య : ఆస్పత్రిలోనా. రాంవన్నకి బీపీ లేదే. ఎందుకొచ్చిందబ్బా.

రంగనా : అసలు సంగద్దెలిస్తే మీకూ వొచ్చుద్ది బీపీ.

అంజియ్య : ఏందయ్యా అంత పెంవాదంవు.

రంగనా : కొంప మునిగింది. మన ప్లాను ఎదురు తన్నింది. (చుట్టూ చూసి)

అంజియ్య : ఇశయం చెప్పవయ్యా.

రంగనా : ఈ వూళ్లో పెడతారనుకున్నా యిండస్ట్రీ... అది క్యాన్సిలయ్యింది.

అంజియ్య : ఎందుకనీ.

రంగనా : ఎందుకేంవుంది. మనకంటే ముందు తమిల్నాడోళ్లు సైటు కొని పెట్టేరు. మన కోసం ఆగుద్దా.

అంజియ్య : మరి...మనం యిక్కడ చేసిన పనంతా.

రంగనా : వేస్ట్.

అంజియ్య : సివరికొచ్చిందయ్యా, రొండుమూణ్నెల్లల్లో రాయించేస్తా.

రంగనా : అదట్టుంచండి. దానెదురుగా మనం కొన్నా సవిటి పొలం సంగతేంది ఇప్పుడు దాన్నేం చెయ్యాల. ఇక్కడ యిండస్ట్రీ పెడితే యెదురుగా టౌన్ షిప్పవుద్దని పనికిరాని భూంవంతా వాటేసుకున్నాం. పాతిక లక్షలు.. ఆ వుప్పు మట్టిలో పోశాం. (రంగనాయకులుకి నరాల్దెగి పోతండయ్. అంజియ్యేంవో యేంవీకాదన్నట్టు నవ్వుతుండాడు) నవ్వుతారేంవండీ. రెండుమూడేళ్లల్లో కోట్లు కళ్ల జూడచ్చనుకున్నాం ఆడోళ్ల మెడల్లో బంగారం గూడ అమ్మి పెట్టాం. నా వాటా అయిదు లక్షలు.

అంజియ్య : నేనూ నాలుక్కికిరుక్కున్నా గదయ్యా.

రంగనా : పదేళ్లు.. గడ్డిదిని పోగేసిన సొమ్ము, నా అయిదు లక్షలొచ్చేదెట్టండీ. మొక్క మొలవదు. ఆ వుప్పు నేల నేనేం చేసుకునేదండీ.. (మళ్లీ నవ్వేడంజియ్య)
మీ గుండె నిబ్బరంవేందో నాకర్థంగాలా. పోనీ.. అమ్ముకుందాంవా అంటే.. ఉప్పుకుండ..ఒంటేలు పోస్తే వారంరోజులు నిలబడే వుంటయ్. మునిగి పొయ్యేంవండి. (తల పట్టుకోని కూసున్నాడు రంగనాయకులు)

అంజియ్య : అంత బయపడేవోళ్లు యిట్టాటెవ్వారంలో యేలు బెట్ట కూడదు జారిపోతందండీ.

రంగనా : గుండె జారిపోతందండీ.

అంజియ్య : పోయి రాంవన్నకి జెప్పు. మనసొమ్ము వొడ్డీతో సహా తన్నుకోనొచ్చుద్దం చెప్పు.

రంగనా : యాంవన్నారూ. మన సొమ్ము...తన్నుకోనొచ్చుద్దా. వొడ్డీతో..ఎట్టానండీ (పైకి లేచాడు)

అంజియ్య : ఏం సదుపులయ్యా మీరు సదివింది. కూసో సెవతా.

రంగనా : చెప్పండి. (ఆశగా కూచున్నాడు).

అంజియ్య : ఇప్పటిదాకా మనంవొక యిశయం దాసిపెట్టేంవా. అదే మాసేలో ప్యాక్టరీ పెట్టటం. అదే యిశియాన్ని యిప్పుడే మొదులవతండట్టు కొద్దికొద్దిగా లీకుజేద్దాం. నాలుగు టక్కులిశక నాలుగం టక్కువిటికా తోలిచ్చి సేలో నాలుగు పిల్లర్లు పైకి లేపుదాం. యట్టా రేకుల్చెడ్డేద్దాం అనుకుంటాన్నాంలే. మన రాంవన్న శాత బదరా బాదాయనకి చెప్పిచ్చీ పేపర్లో వొక్క ముక్క రాయిచ్చుండి. పలానా సోట ప్యాక్టరీ మొదులవతందీ అని. యింక తరవా తెవ్వారం మనమడుగాడు చూసుకుంటాడు. (నోరు తెరిచి పైకి లేచి తలడ్డంగా వూపేడు రంగనాయికులు) వాడికి పదేలన్నది పాతికేలుగా చేతిలో బెడితే... సంవద్రంలో సరివి తోట్లు ఆకాశంవెత్తున పెరుగుతుండయం చెప్పి నమ్మచ్చి యకరా యాబయేల్లెక్కన సంవద్రాన్నమ్మెయ్యగల్డు.

రంగనా : సార్...సార్...మీరు.. హైదరాబాదు కాదు ఢిల్లీలో వుండాలండీ.

అంజియ్య : అర్జంటుగా మీరు రొండు పన్లు జెయ్యాల. మామోడి కంవీసను కింద పాతికేలు పంపాల. రొండోది. పేపర్లో ఆ ముక్క పలికిచ్చాల.

రంగనా : మన సవిటి పొలం..అమ్ముడైనట్టేనంటారా.

అంజియ్య : తెల్లారేలకి లచ్చలు సంపాయిచ్చాలనే ఆశబోతు నాయాళ్లుండంత కాలం బిడ్డల మీదొట్టేసి ఒక్క రూపాయి కంవీసను కోసం. పంద అబద్దాలాడే బోకరోళ్లుండంత కాలం ... మన యపారానికి డోకా వుండదయ్యా, (తట్టుకోలేక తలడ్డంగా వూపాడు రంగనాయకులు)

రంగనా : క్యాష్ తీసుకోని తెల్లారేల కొస్తా. వస్తానండీ (రంగనాయికులు పోతావుంటే ఒంటేల్రాగోలొచ్చేశాడు)

రాగోలు : తూరుబ్బరంవళ్ల డెబ్బై రొండు. వుత్తర దచ్చాలు అరవై మూడు.

అంజియ్య : ఏందిరా నువు జెప్పేది.

రాగోలు : నాటు పుగాకు తోట్లో సాలుకెన్ని సెట్లో లెక్కబెట్టమంటివే.

అంజియ్య : అదా సరే గనీ నువ్వర్జంటుగా పోయి యంకటేస్రావుని.. అదే.. మాయోట్ని తీసకరావాల.

రాగోలు : బలే సెప్పేవే (అంటా పోబొయ్యేదు)

అంజియ్య : రోయ్...యక్కడికి.

రాగోలు : మాయోడన్న కాడికి.

అంజియ్య : యక్కడుండాడో తెలుసా.

రాగోలు : బలే సెప్పేవే. నువు చెప్పేవా యేంది.

అంజియ్య : మిరపకాయలు కొంటానికి మర్లపాడు పోయేదంట. నువుగూడ అక్కడికి పోయీ వాడు రేప్పొద్దున్నే యిక్కడుండేట్టు జూడాల.

రాగోలు : మాయిటి పూటకల్లా లాక్కరానో.

అంజియ్య : చూడో ఇరవై యైదు లచ్చల పని లచ్చ కంవీసను. అంచెప్పు.

రాగోలు : ఇరవై యైదు లచ్చల పని లచ్చ కంవీసను బలే సెప్పేవే.

అంజియ్య : ఇంకెల్లు, మీ రత్తం వొదిన్ని నేన్రమ్మంటన్నానం చెప్పిపో.

రాగోలు : బలే సెప్పేవే. (అంటా రాగోలెల్లి పోయాడు. అంజియ్య ఆలోశన్లో బడ్డాడు. కాసేప్పటికి రత్తం వొచ్చింది)

ఆ..రామ్మాయ్.. యంతగావాలన్నావూ. (దగ్గిర కొచ్చింది రత్తం)

సుబ్బరత్తం : యాబయ్యేలు.

అంజయ్య : యా..బ...య్యే....లు... ఊ. మొత్తం వొక్కసారే కావాల్నా..

సుబ్బరత్తం : ... కావాల.

అంజియ్య : సరే తీసుకో. నీ సొమ్ము...నీ అక్కు

(జేబులోంచి నోట్ల కట్టలు బయిటికి తీశాడు)

యంతమందడిగినా యింట్లో పైసా లేదని సెవతన్నా. ఆకరకి రాజ్జానికి కూడ. డబ్బు కంట బడితే పీక్క తింటారు. ఆ దొడ్డి తలుపు గెడి దగిలిచ్చి రామ్మాయ్ (రత్తం పోయి దొడ్డి తలుపు గెడి పెట్టొచ్చింది.

ఈ లోపు యింటి తలుపుకి చిలుకు తగిలిచ్చేడంజియ్య)
ఒక బగిటీ నీల్దోడమ్మాయ్.

సుబ్బరత్తం : ....

అంజియ్య : డబ్బుంటే లక్ష్మీదేవి కదో. మురికి సేతుల్తో లెక్కెయ్యబోతే బాగుల్లా. సేతులు కడుక్కుందాంవనీ.

(రత్తం అనుమాన పడకుండా బాయి దగ్గిరకి పోయి బగిటీ బాయిలో కొదిలింది. అంజియ్య డబ్బు జేబులో పెట్టుకొని యనకనించి రత్తం దగ్గిర కొచ్చాడు. రత్తం నీల్లాగుతుంది. అంజియ్య శాంతాడు తీసుకోని సటుక్కున రత్తం మెడకి చుట్టి పట్టుకున్నాడు. రత్తం పెద్దంగ అరిసి వుచ్చు మెడకి బిగుసుకోకుండా రొండు సేతుల్తో మెడదగ్గిర తాడు పట్టుకోని యిడదియ్యటానికి బలంగా లాగుతుంది.)

సుబ్బరత్తం : ఒరేయ్...ఒరేయ్.. ఒద(లా. తాడొదిలిపెట్టరా. ఊ. అమ్మా..

అంజియ్య : తప్పుదు లంజా... కాపేసి నన్ను పట్టుకుంటావా. ఏం చేస్తావే పట్టుకోని.

సుబ్బరత్తం : అ.. న్నా.

అంజియ్య : సెప్పు సెల్లెలా. నీకు యాబయ్యేలు కావాల్నా..నీ రంకు మొగుడికి కాలే యిస్తావా. పైకం యియ్యకపోతే.. మెరక సేను... అ..మ్ముతావా అమ్ము, అమ్మే యిప్పుడూ.

సుబ్బరత్తం : అన్నా నన్ను సంపద్దన్నా. ఒరే.. అ..న్నా..ఒరే
అన్నా.. అన్నా..అన్నా... అ...న్నా

(రత్తాన్ని పైకి వుబికిచ్చి బలంతంగా బాయిలోకి తోసేశాడు. బుడబుడా మని నీలల్లో మునిగి పోతానే ఆకరి ఆశగా కేకలేస్తా వుంది రత్తం.)

ఒరే అన్నా.. త..తాడు..తాడందిచ్చరా..అన్నా.. అ....న్నా.

(యేంజెయ్యాల్నో తోచలా అంజియ్యకి. యొవురన్నా యింటారేంవో అని చుట్టూ చూశాడు. బాయి పక్కన పెద్ద రాయుంది. దాన్నెత్తి బాయిలో రత్తం నెత్తిన పడేశాడు. రత్తం మాటింక యినపల్లా. కాసేపుటికి నీలశబ్దం కూడా ఆగిపోయింది. లోపల్నించి ఎవురో యింటి తలుపు తడతన్నారు. అంజియ్యకి గుండె దడ మొదులైంది. తలుపు శబ్దం

ఎక్కువైంది. బయ్యం బయ్యంగానే పోయి తలుపు గెడి తీశాడు. రాజ్జం వొచ్చింది.)

రాజ్జం : ఏంది నాన్నా యింత సేపు. ఏంజేస్తున్నావిక్కడ.

అంజియ్య : నువ్వేందమ్మా ఒంగోల్నించి యింత తొందరగా వొచ్చేవే.

రాజ్జం : అబ్బబ్బబ్బా, దారుణంవైన యాక్సిడెంట్ నాన్నా. అది చూశాక వుండ బుద్దెయ్యలా.

అంజియ్య : యక్కడా.

రాజ్జం : ఒంగోల్లో పెద్ద చర్చి సెంటర్లో, హోండా మీద పోతన్నాడు. లారీ గుద్దేసింది. నుజ్జు నుజ్జయ్యేడు నాన్నా. చూళ్లేక పోయా.

అంజియ్య : యెవురంటా

రాజ్జం : యొవురో కాదు. మనూరోడే. శ్రీదేవి మొగుడు.

అంజియ్య : ఆ..వాడా.. ఉండా శారెడూ అమ్మక నూకి బండి కొన్నాడంట. దాంతో వుంది గాంవాల వాడికి.

రాజ్జం : ఏంవో చూళ్లేక పోయా. కళ్లు తిగిరిపోయినయ్ నాన్నా.

అంజియ్య : యాక్సిడెంటంటే అట్నే వుంటదమ్మా. ఏం జేస్తాం. ఇయ్యాల బవుసెడ్డ రోజులాగుంది. అట్టాటి ప్రెంవాదంవే మనింట్లో గూడ వకటి జరిగింది

రాజ్జం : మనింట్లో ప్రంవాదంవా. ఎవరికీ.

అంజియ్య : మీ యత్త రత్తం.. కాల్జారి బాయిలో పడిపోయిందమ్మా.

రాజ్జం : ఆ..బాయిలో పడిందా..అత్త...

(గబగబా బాయి దగ్గిరకి పోయి తొంగి చూసింది)

రత్తం ... నీళ్లంతా రక్తం...ఏం జరిగింది. ఎట్టా పడింది.

అంజియ్య : సెవితినే..కాల్జారీ..

(నమ్మబుద్దెయ్యలా రాజ్జానికి. అంజియ్యని అనుమానంగా చూసింది)

రాజ్జం : కాలు.. జా...రి పడిందా.. నువ్వే తోశావా.

అంజియ్య : యట్టయితేం. పడింది. నేను దొడ్లోకిట బయిటికి బోతా. కాసేపాగీ యేంవీయరగనట్టు కేకలెయ్యి. జనంపోగవతారు. నేనూ యిప్పుడే చూసేనం చెప్పు. జరగాల్సిన పన్లు వాళ్లే చూస్తారు. నీకు చెప్పాల్సిన

పన్లేదనుకుంటాలే. (పోబోయాడు)

రాజ్జం : నాన్నా... అత్తనెందుకు చంపావ్.

అంజియ్య : దానికీ...వొల్లు కొవ్వెక్కిందమ్మా. తప్పుడాలోశన చేసింది.

రాజ్జం : తప్పుడాలోచన చేస్తే..నన్ను కూడా చంపుతావా.

అంజియ్య : ఏం నువ్వు కూడా యింట్లో సొమ్ము యీదిలో వాళ్లకి దోసి పెట్టాలను కుంటన్నావా.

(నిప్పులు గక్కుతా జబ్బ పట్టుకోని యిసురుగా తోశాడు రాజ్జం పోయి అల్లంత దూరానుండా మంచం మీద పడింది. గడగడ గడా వొనికి పోతా వుంది రాజ్జం. దగ్గిర కొచ్చాడంజియ్య.)

అన్నట్టు...నీకుదెల్సిన కుర్రోడు..ఏ రాజూ...ఆ.. జండా రాజు. ఆడితో సిన్న పని బడిందీ. రేపొకసారి యింటికి తీసకరా. (రాజం ఏం చెప్పుద్దో అని యెదురు చూడకుండా బాయి పక్కగా బయిటికెల్లి పోయాడంజియ్య. రాజ్జం కుంవిలి కుంవిలేడుస్తుంది. ఇంకా యేడుస్తానే వుంది.)

# దృశ్యం 12

(రాంపండు ఇప్పుడుంటండా యిల్లు. పండు కేందో గొంతు మీద కొచ్చినట్టే వుంది. కాలుగాలిన పిల్లి మాదిరిగా అటూ యిటూ తిరుగుతుండాడు. సపారీ సూటేసుకోని దర్జాగా కూసోనుండాడు మాయోడు)

రాంపండు : అయితే.. సవిటి పొలానికి దశ తిరుగుద్దంటావా.

మాయోడు : ఈ పేపర్లో చూడు.. (పేపరు చేతికిచ్చి చూపిచ్చాడు) రోడ్డు తల్న ఇటీకా ఇశకా తోల్తుండారు. అది జూసేవా.

రాంపండు : ... పేక్టరీ...కాయంవేగా..

మాయోడు : నా బిడ్డల మీదొట్టు...

రాంపండు : నా రోజులు బాగాలేవు... చేతులో పైసా లేదు. ఎట్టా బతకాల.. ఏం జెయ్యా ల..

మాయోడు : బయపడవాకోయ్. నేనుండా నీ పక్కన. నా పిల్లల్లో నువ్వొవకడి వనుకుంటా. (మాయోణ్ని దేవుడ్ని జూసినట్టు చూసేదు పండు) ఇదుగో క్యాసు. తీసుకో అయిదేలు. (డబ్బు చూపిచ్చేదు) అయిదూ పదీ అవసరంవైతే యొవుర్నడుగుతావు సెప్పు. బతికి సెద్దావోడివి. తీసుకో అల్లుడూ.. డబ్బు గాదోయ్ మణిసి కావాల. (డబ్బు తీసుకున్నాడు. పేణం లేసొచ్చినట్టుంది రాంపండుకి)

రాంపండు : అడగంది అమ్మగూడా పెట్టదంటారు. నువ్వు...

మాయోడు : ఒద్దు. ఇంకేందీ సెప్పద్దు. ఫ్రెండ్సిప్పు అంతే. నా సేతులో నీకు పెళ్లి జేశా. నువ్వుసుకంగా వుండాల. నీ కాపరం నిలబడాల అది. నాకొక్క పైసా కంవీసనొద్దు. నువ్వు ంవూ అను. నా డబ్బుల్దీసకపోయి బయానా పెడతా.

రాంపండు : నా మేలు కోరినోడివి. నువ్వు సంవరంలో దూకమంటే దూకుతా.

మాయోడు : సంవద్రంలో వొద్దు. సవిటి పొలంలో దూకాల. నువు పైకి లేవాలంటే అదొక్కటే దారి.

రాంపండు : సరే...అట్నే కొందాం.. అయితే.. క్యాష..

(లచ్చిందేవి బయిట్నించి యిసురుగా వొచ్చింది)

లచ్చిందేవి : దొంగ నా మనంవళ్లు, గొంతులు కోసే నా కొడుకులు..

(తిడతానే పక్కగెదిలోకి పోయింది. తిట్లింకా యినపడతానే వుండయ్ తిట్టుకుంటానే బయిటి కొచ్చింది)

వాడికి దూందగల, వాడి కాస్టమ్మండ. వాడెమ్మ కడుపుగాల, ఆ బతుకు బతక్కపోతే యేంది. వాడి నాలిక పీక. వాడికి పెద్దరోగం తగల

మాయోడు : అది... మరి... అప్పా...నువ్వు తిట్టేది...

లచ్చిందేవి : నమ్మకంగా గొంతులుకోసే నా మనంవళ్లని. డబ్బు కోసం అసుద్దందినే. శనేశపు నా కొడుకుల్ని.

రాంపండు : ఏందమ్మా నువ్వు.

లచ్చిందేవి : పదేలు...పదేల రూపాయలు పోసి మందులు కొని పోసేంవు. ఒక్క పురుగు చావలా. తోటంతా నాశనంవై పోయింది. కల్తీ మందులిచ్చేర్రా పురుగులు బడి పోతార్రా వాళ్లూ.

మాయోడు : పురుగుల మందులమ్మినోళ్లనా. (ఇప్పుడు గాలి పీల్చుకున్నాడు)

లచ్చిందేవి : నీ సేత్తోనే యిచ్చేవుగా డబ్బులు. డబ్బాల్డబ్బాలు కొని పోసేడు. మట్లో పోసినట్టే. సేనంతా నాశనంవై పోయింది. మా బతుకు బండలై పోయింది. ఎవుర్నడగాలయ్యా. యెవుర్ని తిట్టాలయ్యా. ఇట్టా డబ్బాల్లో రంగునీలు పోసి అమ్ముతుంటే ఆగవర్మెంటేం చేస్తందయ్యా ఓట్ల కోసం వొచ్చి మాటలు చెప్పే ఆ మాయదారి గుంపేడ చచ్చేరయ్యా

రాంపండు : అమ్మా యిక్కడ నువ్వు తిడితే అయిదరాబాదుకినపడుద్దా.

లచ్చిందేవి : కడుపు మంటరా. కడుపు కోతయ్యా. ఇరగ బండేసేను. లచ్చల రూపాయల పంట. మందులమ్మేవోళ్లు పొట్టన పెట్టుకున్నారయ్యా,

రాంపండు : అప్పిస్తాంవని ఆశబెట్టి అంటగడతండ్రి. ఏయి అసల మందులో యేయి నకిలీ మందులో అంతు పట్టకపోయా.

మాయోడు : అసలా నకిలీ మందులమ్మే నా కొడుకుల్ని నడీదిలో వురి తియ్యాలోయ్

కాళ్లూ చేతులు కట్టి పంటసేలో పడేసి గొంతులో గొట్టాం బెట్టి పురుగుల మందులు పొయ్యాల. అప్పుడూ వాళ్లకి సిగొచ్చేది.

లచ్చిందేవి : అయిపోయింది. అంతా అయిపోయిందయ్యా, (లోపలికి పోయింది)

మాయోడు : మరి నేనొస్తానో యల్లుడూ.

రాంపండు : మాంగారూ...నాసంగతి..డబ్బెప్పుడిస్తావని అంజియ్యొక పక్క గొంతు మీద కూసున్నాడు.

మాయోడు : అంజియ్య సంగతట్టుంచు. సవిటి పొలంవాగదు. పేపరెప్పుడు చూసేడో యేంవో పీటీ రెడ్డొచ్చి తెల్లారక ముందే గడపలో కూసున్నాడు. మొన్న గృహప్రవేశానికొచ్చినప్పుడు..యమ్మెల్లే నన్ను డాబా మీదకి తీసక పోయి.. బినాంవీ పేర్లతో తిప్పలు బడతానూ రొండో కంటికి తెలియ కుండా ఓ యాబయకరాలు చూసి పెట్టమని కూసున్నాడు. యమ్మెల్లే సూపు దీని మీద పడిందనుకో నేనేం జెయ్యగల్ను సెప్పు.

రాంపండు : యట్టన్నాగాని...పదెకరాలు...

మాయోడు : బయానా వరకి నేంబెడతానోయ్. సెటిల్మెంటుకి క్యాసుండాల గదా.

రాంపండు : యట్టా..యట్టా మాంగారు..

మాయోడు : యట్టా.... అంటే యట్ట.. ఉండాదాంతోనే మ్యానేజేసుకోవాల.

రాంపండు : ఉండాదంటే...

మాయోడు : నువ్వేంవన్నా బికారోడివా యేందల్లుడూ..నిచ్చేపంవంటి నాలుగెకరాల రేగడి గెడ్డకి ఆసాంవి.

రాంపండు : పొలంవా..అది..మా బాబు...వొప్పుకోడు.

మాయోడు : నచ్చ జెప్పుకోవాల.

రాంపండు : ఆయన్నామాటినడు. ఆ యంజియ్యేంవో ఆగేట్టు లేదు.
(పొడుగాటి క్యాసు బ్యాగు బుజానేసుకోని జండా రాజొచ్చాడు రాంపండుకి గుండెల్లో రాయి బడింది)

రాంపండు : నువ్వు... మీరు...కూసోండి. (కూసున్నాడు రాజు)

మాయోడు : నేనెల్తానోయ్. (పో బోయాడు. అడ్డం వొచ్చి ఆపాడు రాంపండు)

రాంపండు : మాంగారూ..నువ్వుండాల. ప్లీజ్.

మాయోడు : రాజుగారు..ఏదో పని మీదొచ్చినట్టుందే.

జండారాజు : అంజియ్య గారి క్యాస్సంగతి. అడుగుతుంటే కిందల్నూకుతుండాడంట.
(రాంపండుకి లుంగీ తడిసేటట్టుంది. లచ్చిందేవొచ్చింది)

లచ్చిందేవి : నిన్నంజియ్య పంపిచ్చేడా

రాంపండు : అమ్మా నువు లోపలికి పో.. పో.

లచ్చిందేవి : పోతాలే వుండు.

జండారాజు : క్యాషు....ఫైనాన్సు కంపెనీలో దంట. పార్టనర్లోప్పుకోరుగదా.

రాంపండు : అదీ... క్యాషు... కాస్త యిబ్బందిగా ఉంది... అందువల్ల..

మాయోడు : బ్యాగులో దేందండీ రాజుగారూ క్యాషా.

జండారాజు : తీసిచూడు... జిప్ తెరువు. ...తెరువూ.
(మాయోడు బ్యాగు జిప్పు తీశాడు. చేతులోకి కత్తొచ్చింది. తెగ బయపడి పోతన్నట్టు నటిచ్చేడు మాయోడు)
ఫ్రెండ్షిప్పు కోసం.. అంజియ్య గారికి మాటిచ్చా.

మాయోడు : ఏంవనీ పొడుస్తానా.

జండారాజు : పొడుస్తానని కాదు. క్యాషొసూల్జేసి పెడతానని. క్యాషిస్తాడో పొడిపిచ్చు కుంటాడో రాంపండు తేల్చుకోవాల. (ధైర్నంగా ముందుకొచ్చింది లచ్చిందేవి)

లచ్చిందేవి : ఏందిరా పొడిసేదీ యొవుర్నిరా నువు పొడిసేదీ. అసల్నువ్వెక్కడోడివి నా బిడ్డింటి కొచ్చి బెదిరిస్తావా.

రాంపండు : అమ్మా... నోరు మూసుకోమన్నానా.

లచ్చిందేవి : ఈడి బొడ్డుకాడి సొమ్మేంవన్నా యిచ్చేడా. అంజియ్యిచ్చేదు మేం దీసుకున్నాంవు. నడింవిన యీడి దవుర్జన్నెంవేంది

రాంపండు : అమ్మా... అమ్మా...

లచ్చిందేవి : ఒరే నువ్వు రౌడీ వోడ్ననుకుంటండా వేంవో. నా బిడ్డొంటి మీద సెయ్యి పడిందనుకో.. సెంవడాల్తీస్తా. పీక కొరికేస్తా
(అంటా పైకి పోయింది. సటుక్కున లచ్చిందేవి గొంతు పట్టుకున్నాడు. రాజు. ఆంవె పెనుగులాడతా వుంది. మానెడు తప్పిస్తన్నాడు.)

జండారాజు : ముసిలి ముండా ఎంత పొగురే నీకు. నన్ను పీగ్గొరుకుతావా (బలంగా తోసేశాడు. అల్లంత దూరాన పడిపోయింది లచ్చిందేవి రాంపండు

పోయి పైకిలేపబోయాడు. ఆంమె స్రువ తప్పి పోయింది)
ఏంరా ముసిల్దాన్నడ్డం పెట్టుకొని నన్ను బెదిరించాలనా.

రాంపండు : ...కాదండి...

మాయోడు : మరి నే నెల్తానోయ్.

రాంపండు : మాంగారూ నాకు బయ్యంగా వుంది... ప్లీజ్.

మాయోడు : నేనుండేం చేస్తానోయ్. డబ్బెట్టా కడతావో సెప్పక పోతంటివీ. అతనేందో కోపం మీదుండే.

రాంపండు : పొలం అమ్ముతా. పొలంవమ్మి కడతా.

జండారాజు : రేయ్ ..కూచోరా. కూచో. (మంచం మీద కూసున్నాదు పండు. జండారాజు కత్తి తీసి పండు గొంతు మీద పెట్టాడు) ఇప్పుడు జెప్పు. క్యాషెప్పుడిస్తా ఎన్ని రోజులుకి.
(పండుకి మాటౖరాలా. కాలు నేలమీద ఆనటంలా. లచ్చిందేవి స్రువలో కొచ్చింది. కొడుక్కాడికి రాబోయింది.)
అడుగు ముందుకే సేవంటే వీడి పీక తెగి పోద్ది.
(లచ్చిందేవి ఆగి పోయింది)
చెప్పరా.

రాంపండు : అమ్మా ...

లచ్చిందేవి : నాయనా... (మాయోడి దగ్గిరకి పోయింది)
ఒరే అల్లుడా ...నా బిడ్డ

మాయోడు : ఈ ఫైనాన్సు కంపెనీలోల్లంతా యింతేనప్పా. అయినా....మీకు కొడుకెక్కువా పొలం ఎక్కువా. అదేదో అమ్మి పారేసి వాళ్ల సొమ్ము కట్టెయ్యొచ్చుగదా.

లచ్చిందేవి : నా మాటిన ఆమడిసి. నువ్వన్నా చెప్పరా అయ్యా. ఒదిలి పెట్టమని సెప్పరా నా బిడ్డనీ.

జండారాజు : క్యాషెప్పుడు కడతాడో సెప్పాల.

రాంపండు : అమ్మా.

లచ్చిందేవి : అయ్యా.

మాయోడు : అప్పా రాంకోటు మాంవని పిల్చిరా. యవ్వారం యింత దూరం

వొచ్చినాక ఆయన మటుక్కాదంటాడా. పోయి తీసకరా.

లచ్చిందేవి : తీసకొస్తా. దండం పెట్టాప్పిస్తా. ఇప్పుడే పోయి తీసకొస్తా. పిల్లోడ్నొదిలి పెట్టమని చెప్పయ్యా.

మాయోడు : వాళ్ల బాబుని తీసకొస్తానంటంది. అతన్ని.. పాపం..

జండారాజు : పోయి రమ్మను. (పండునొదిలాడు. లచ్చిందేవి బయిటికెళ్లింది) ఇదుగో ముసిల్దానా నీ దగ్గిర రౌడీ బుద్దుంది. పోయి వూరూ వాడా పోగే సేవనుకో తరవాతైనా నా చేతిలో నీ కొడుకు...

లచ్చిందేవి : నే నొవురు కాడికీ పోనయ్యా, ఆయనొక్కణ్నే తీసకొస్తా.

మాయోడు : అప్పా రాంకోటు మాంవ కల్లం దిబ్బ మీద లేడు. ఇందాక బస్టాండులో చూశా. అక్కడుంటాడు సూడు. (లచ్చిందేవెల్లిపోయింది)

రాంపండు : పోయొస్తా. (సిటికెనేలు చూపిచ్చాడు)

జండారాజు : పో, (బతుకు జీవుడా అంటా దొడ్లోకి లగెత్తేడు రాంపండు) ఫుల్లుగా బిగిచ్చటం కళ్లు మూసుకోని కసక్కన పొడవటం. అదీ మన టైపు. అంతేగనే యిట్టా బిల్డప్పియ్యటం బయపెట్టటం... చఛ..నాకు బాగుల్లేదయ్యా.

మాయోడు : మనంవింకా శానా సంసార పచ్చంగా డీల్ చేస్తండాం. అదే పైనాన్సు కంపెనీలోళ్లేం చేస్తారో తెలుసా. మణిసిని అమాంతం తీసకపోయి సీకటి కొట్లో పడేసి వరసగా నాల్రోజులు వాసిపోయేట్టు కొడతారు ఆనెక్క అయినోళ్లకీ ఆంవీలుండోళ్లకీ కబురు చేస్తారు. దొంగని తేలు కుట్టినట్టు డబ్బు కట్టి యిడిపిచ్చక పోవాల. అప్పుడీసుకున్నోళ్లు. తెలివి మీరిపోతండారు. పైకం వొసూల్జెయ్యాలంటే గొంతు మీద కత్తి పెట్టక తప్పటంలా.

జండారాజు : యేంవో యిట్టా సాగదియ్యటం నాకు నచ్చులా. అయితే అవటం కాకపోతే కసక్.

మాయోడు : వాడు కసక్కయితే మనకేంవొచ్చుద్ది మట్టి. అయినా మర్డర్ చెయ్యటం పెద్ద గొప్పనుకుంటన్నావా. కోటరు మందు బోయిచ్చి కోడి పలావు బెట్టిస్తే యొవుడైనా పొడిసి పెడతాడు. సొమ్ము వసూలు చేసినోడే మొగోడు.

జండారాజు : వాడి మొకం చూస్తుంటే పాపంవనిపిస్తుందయ్యా.

మాయోడు : పాపంవా ...నీకా... ఈ మాట నాతో అంటే అన్నాను. యింకెక్కడా. నోరు జారంవాక. అర్జంటుగా అయిపోతావ్. మర్దర్లు చేసేవోళ్ల సెరిత్రంతా ఒకసారి తిరగేసి చూడు. దుర్గడి గతేంవైంది. వరసగా పది మర్దర్లు చేసేడు. జిల్లాఅంతా పేరు మోగి పోయింది. నీ లాగనే యిరక్తి బుట్టీ చస్తే మర్దరు చెయ్యను అని అయ్యప్ప సొం మీద ప్రెంవాణం జేసి మాలేసుకున్నాడు. మరసత్రోజే నడీదిలో నరికేసేరు. ఎవురూ వాడికి మందూ మాకూ అందిచ్చే సిసువులే. బండశీసు గాడి సంగద్దెలుసుగా. ఎంతకాలం యిట్టా అండర్ గ్రౌండ్లో బతుకుదాంవా అని యెదుటి గ్యాంగీతో రాజీకి పోయేడు. అంతే. మాటల్లో బెట్టి పట్టుకోనీ సొప్పుకట్టని కుందినట్టు కుందేసేరు. అంతెందుకు ఈ మెతక మాట బయిటికి చెప్పు. రేప్పొద్దున్నే మొగోళ్లు గాదు ఆడోళ్లు గుడ్డ లూడదీసి బాదేస్తారు. కుక్క సావు చస్తావ్. అందుకనీ.. యేదన్నా పన్లోకి దిగినాక ఒకపట్టు దొరికిందాకా ముందుకి పోవాల.

జండారాజు : అందరూ నన్ను జూస్తే బయపడతారు. నాకు నిన్ను జూస్తే బయంగా వుందండీ. (నవ్వాడు మాయోడు)

ఈ సొసైటీ ప్రెసిడెంటయినాక నాకీ మెతక బుద్దొచ్చింది

మాయోడు : అసలు సొసైటీ రాంగానే మినిస్టరై పోయేననుకుంటండావా యేంది దాని పవరెంత దాని పరపతెంత. ఒక లెవెలుకి రావాలంటే ముక్యంగా నీ యంటోడు పైకెక్కాలంటే పవర్లో వుండావోణ్ని పట్టుకోవాల పదిమంది కుర్రోళ్లని పోగేసి ప్రేక్టీసియ్యాల. రోజుకూలీ చేసేవోడికంటే పదిమందిని బెట్టి పంజేయిచ్చే వోడికి యిలువెక్కువగదా.

జండారాజు : అయితే నేనేంజేస్తే బెటరంటావ్.

మాయోడు : ఏజ్జేసినా సించియరుగా చెయ్యాల. మా ప్రెండ్స్ కొత్తగా పైనాన్సు కంపెనీ వోపంజేసేరు. నీ కిస్టం వైతే కొన్నాలు దాని తరుపునుండు. మనక్కాస్తె మంచి సరికిలుంది. ప్రవేటు బాడీగార్డులు కావాలా కాస్తె గెట్టోళ్లని చూసి పెట్టమని అడిగేదు యంపీ. నువ్వు కొంచం నమ్మకంగా వుంటే యంపీకి లింకు జేస్తా. ఎపిసియంటనిపిచ్చుకో. యంపీటీసీ

కావాలను. ఏదో ఒక రకంగ రోజూ పేపర్లో పేరొచ్చేటట్టు చూసుకో యమ్మెల్లే సీటుకి బేస్మెంటేసుకో. నీ మీదుండా కేసులు కొట్టేయిచ్చు కోవాలంటే అదీ దారి. కత్తితో బతికినోడు కత్తితో పోవాలనేది పాతపాట. కత్తి పట్టుకున్నాడు కద్దర్లోకి పోవాలనేది యియ్యాల్టిమాట నెత్తురు మరకలు కడిగేసుకో. నెత్తిన టోపీ బెట్టుకో. సందు జూసి మైకు పట్టుకో. జనం కోసం ప్రేణం యిస్తానూ అని గుండెల మీద సొక్కా చించి సూపిచ్చు.

జండారాజు : నమ్ముతారంటావా.

మాయోడు : ఓరి అమాయికుడా. వందల కోట్ల రూపాయలు జనం సొమ్ము గెడ్డి తిన్నట్టు దినీ కొన్నాలు జైల్లో కూసోని బెయిల మీద బయటికొచ్చిన పెద్దమణిసి దీపం సేత బట్టుకోని అవినీతి మీద పోరాటం చేస్తానూ అని స్టేట్మెంట్లిస్తుంటే జనం సచ్చినట్టు నమ్ముతుండారు. బుజాల మీద కెక్కిచ్చుకోని వూరేగిస్తుండారు. నిన్నగాక మొన్న రిజర్వు బ్యాంకోళ్లు ట్యాక్సు కట్టేసి బ్లాకంతా వైటు చేసుకోవచ్చేచ్..అని దొంగలందరికీ తలుపులు తెరిస్తే..ఒక రాజకీయ నాయకుడుగారు యాభై కోట్లు ట్యాక్సు గట్టి ఉండదంతా వైట్లోకి తెచ్చుకోని మిస్టర్ క్లీనయ్యాడు. ఈ డబ్బంతా యెక్కడిదనిగాని ఎట్టా వొచ్చిందని గాని జనం అడిగేరా. గవర్మెం టడిగిందా. ఆయన కూడ అవినీతి మీద పైటింగ్ చెయ్యటానికే మళ్లీ యలక్షన్లో దిగేడు. రేపు మనకి పీయమ్మైనా ఆచ్చర్యం లేదు కాబట్టి మన జనం వుండారే శానా మంచోళ్లు శానా సవట్లు.

జండారాజు : కాకపోతే నిన్నూ నన్నూ వూళ్లో వుండనిస్తారా.

మాయోడు : నన్ను నీతో కలుపుతుండావేంది.

జండారాజు : జోకేశాగనీ నాకొక డౌటు. నువ్వు చాలా షార్ట్ పిరీడ్లో డవలప్పయ్యేవు గదా. ఏం పని చేస్తుంటావూ అని. ఉజ్జోగంవా బిజినెస్సా రాజకీయంవా లేకపోతే నా మాదిరిగా కసక్కా.

మాయోడు : మర్డర్లు చేసేంత సీప్ పన్లు నేను చెయ్యను. ఇంకేంవీ శాతగాని పిరికోళ్లు చేసే పనది. రాజకీయాలంటేనే నాంవర్దా. జనంతో పని ప్రెతోడితో తిట్లు దినాల. ఇయ్యాల పైకెత్తుతారు. రేప్పొద్దున

కిందబడేస్తారు. వుజ్జోగం అంటావా అది మనకి రాదు. ఒచ్చినా సాల్టు. పైగా యెప్పుడూ పయోడికి తలొంచి బతకాల. ఇక యాపారానికేందో పెట్టుబడి కావాల. రాత్రింబగుళ్లు కష్టపడాల. లాబంవూ రావచ్చు. నష్టంవూ రావచ్చు. కాబట్టే..యీ పన్లేయీ మనకి పడవు. మంది సొసంత్రం వైన లైపు. మన పెట్టుబడి నాలిక. మన వొర్కు మద్దెస్తంగా వుండటం మాటసాయం చెయ్యటం.

జండారాజు : ఇదేదో బాగున్నట్టుందే. నేను కూడ...

మాయోడు : ఒద్దూ. ఇదొక్కళ. అందరికీ అబ్బదు. నీది దావూదిబ్రహీం రూటు నాది అర్సదుమెహతా రూటు. యొవురి లైన్లో వాళ్లు దవలప్పవ్వాల

జండారాజు : మరి నన్ను యంపీకి పరిచయం.

మాయోడు : దూకుడొద్దు. ఒక్కొక్క మెట్టేయక్కాల. ప్రెస్తుతానికి పైనాన్సు తరుపు నుండు. పనొచ్చినప్పుడు యంపీ కాడికి తీసకపోతా.

జండారాజు : సరే. వాడు గుడ్డలు కూడ కరాబు జేసుకున్నట్టుంది. ఇంక మన పనైపోయినట్టేగా.

మాయోడు : నీ పనైపోయింది. నా పని యింకొంచం వుంది. వస్తన్నాడు. నువు మాట్టాడకుండ సూస్తావుండు సెప్తా. (రాంపండు బయటికొచ్చాడు) సూడోయల్లుడూ నీ బాద సూళ్లేక ఒకేర్పాటు చేసేనోయ్ (ఏంటన్నట్టు చూశాడు రాంపండు. పండుని పక్కకి తీసకపోయాడు మాయోడు) ఒక రొణ్నెల్లపాటు నీ జోలికి రాకుండా వుండేట్టు రాజుని వొప్పిచ్చేనోయ్.

రాంపండు : ఒప్పుకున్నాడా.

మాయోడు : డబ్బు మణుసులు. పదేలిప్పిస్తానం చెప్పా. అయితే యీ రొణ్నెల్ల లోపల యవ్వారం సెటిల్జేసుకోవాల రొణ్నెల్లు కాదు. నెల్లోపల మొత్తం క్లియర్ జేస్తా మాంగారు.

మాయోడు : యట్టా. బాత్రూంలో యాంవన్నా అయిడ్యా వొచ్చిందా యేంది.

రాంపండు : సవిటి పొలం పదెకరాలకి బయానా బెట్టు. మాసేనుకి బేరం దీసకరా.

మాయోడు : మరి....మీ బాబు...

రాంపండు : అదంతా నేం జూసుకుంటాగా.

మాయోడు : సరే యేం జేసినా తెలివిగా సేతికి మట్టంటు కోకుండా వుండాల. మరి.. ఆ పదేలు.

రాంపండు : పదేలు.. నువ్విచ్చినియి అయిదేలే వుంది. కాకపోతే... హైమ కానుపు కాంగనే ఆడకి పోవాల్సొచ్చుద్దని యింకో ఐదేలుంచా. అప్పుటికప్పుడు పిల్లోడికేంవన్నా కావాల్సొస్తయని.

మాయోడు : పుట్టకముందే పిల్లోడని డిసైడ్ జాస్తుండావే.

రాంపండు : పిల్లోడే స్కాన్ టెస్టు జేయిచ్చేంగా.

మాయోడు : ఆహా. అబ్బాయి తండ్రి వౌతన్నావన్నమాట. 'అదుష్టం వాడితో వొస్తందోయ్ నీకు. ఆ డబ్బిటిచ్చెయ్. (లోపలికి పోయి యింకో ఐదేలు తెచ్చాడు)

రాంపండు : ఇదుగో యీ ఐదేలతో కలిపి మొత్తం పదేలు. అంతమటుకియ్యి తరవాజ్జూద్దాం.

మాయోడు : సరే తప్పదు గదా. నచ్చజెవతాలే. వస్తా. రావోయ్ రాజు. (అంటా మాయోడు బయిటికి పోతన్నాడు. కసాయో డెంట పోయే గొర్రె మాదిరిగా మాయోడెంట ఫోయాడు రాజు. రాంపండు తల పట్టుక్కూసున్నాడు. పైకి లేసి అటూ యిటూ తిరిగాడు. గబగబా లోపలికి పోయి గ్లాసు పురుగుల మందు డబ్బా తెచ్చాడు. గ్లాసులోకి మందొంచాడు. డబ్బా లోపలికి యిసిరేశాడు. గ్లాసుని చూస్తా కూసున్నాడు. బయిటికి చూశాడు)

రాంపండు : ఒకాల రాకపోతే. వొచ్చినా కూడ.. ఆయంచాత తాగిచ్చేదెట్టా. ఇసం తాగూ..అంటే తాగుతాడా. ఉహు తాగడు. ప్రేణం యొవురుకైనా తీపే. అవునూ..యెవుర్తో మాట్లాడతండాను. యొవురూ లేరుగా నాకే..నాకే నేను సెప్పుకుంటన్నా. తల తిరిగి పోతంది...నాకు మతి బోతందా. పోయుంటది. లేకపోతే..బాబుని.. బాబుని.. సంపాలని యట్టా అనుకుంటాను. పైకి తిడతండా నేనంటే బాబుకి ప్రేణం. పుట్టింది మొదులు మట్టిలో బడి గొడ్డు శాకిరీ చేస్తండాడు. యొవురి కోసం. నాకోసం వేగా. అట్టాటోణ్ని.. సంపాలనీ.. (యేడుపొచ్చింది) ఒద్దు.. యాడవ కూడదు. బాబుని సంపకపోతే.. నేను సావాల. నేను

సచ్చిపోతే... సచ్చిపోతా. (విషం తాగబోయి ఆగాడు)

బయంవేస్తంది..సావాలంటే బయం బతకాలంటే బయం. యట్టా సావాల యట్టా బతకాల..దేవుడా.. ఊహు.. నేను సావలేను. బతకాల. రొండో కంటికి తెలవకుండ.. బాబుని యిట్టా కాదు. తెలివిగా (అంటా లోపలికి పోయి కరెంటు వైర్లు తెచ్చాడు. వైరు సీవర్లు కొరికి కుర్సీ కాలికి కనక్చనిచ్చాడు. వైరు కనపడకుండా యెనగ్గా తీసకపోయి లోపల వోల్డర్లో గుచ్చి వచ్చాడు. బయం బయంగా కుర్సీని చూశాడు.) ఒకాల కుర్సీలో కూసోకపోతే.. కూసుంటాడు..కూసున్నాక..సాక్కొట్టుద్ది. సచ్చిపోతాడు. బాబు.. సచ్చిపోతాడు. నేనే సంపా. అహ సంపుతా. పొలం మొత్తం అమ్ముతా. అప్పులన్నీ తీరుసుకుంటా. సాలక పోతే.. గోడౌందగలేస్తా. ఇల్లు కూడ తగలేస్తా. ఏందీ.. కంట్రోల్ తప్పు తుండానే. ఉహు. స్టెడీగా వుండాల. స్టెడీ.. మల్లీ బాబొస్తాడు స్టెడీ (లేన్నిబ్బరం తెచ్చి పెట్టుకోని కూసున్నాడు. బయిటినించి నిండు నెలలో వుండా హైమొచ్చింది. సూటుకేసు కింద పెట్టింది. కుర్సీలో కూసో బోయింది. కంగారుగా అడ్డం వొచ్చాడు పందు)

రాంపండు : ఆహా హా..హా.. అక్కడొద్దు. ఇట్రా ఇక్కడ కూసో. (సెయ్యి బట్టుకోని లాక్కపోయి మంచం వాల్చాడు. హైమ కూసుంది రాంపండు బయటి వాకిలొంకా కురిసీ వంకా చూస్తన్నాడు.) అప్పుడే వొచ్చేవేంది. డెలివరీ కని పోతివే.

(హైమ యేడుపాపు కోలేక పోయింది. మంచం మీది బడిపోయి యేడుస్తుంది) ఏందీ. యేడుస్తావెందుకు. యాడవబాకు. ఇంకా యేంవీ కాలా. బాబు సావలా.

హైమ : చచ్చి పోయాడు. అమ్మ కూడ చచ్చి పోయింది.

రాంపండు : ఓరి దేంవుడో..మెంటల్ నీకా నాకా. సంపకుండానే సచ్చారంటా వేంది. (ఆంవె యేడుస్తానే వుంది)

కాన్పుకని కరీంనగరెల్తివే. యేంవైందీ.

హైమ : పోయా.. అక్కడ అమ్మా నాన్నా చచ్చిపోయారు. పురుగుల మందుతాగి.

రాంపండు : చచ్చిపోయారా, మీ అమ్మ. నాన్న ఇద్దరు... మందు వాళ్లే తాగారా

యొవురన్నా తాగిచ్చేరా

హైమ : పత్తిపంట పాడై పోయిందంట. అప్పుల బాధ తట్టుకోలేక.. పురుగుల మందు తాగారు. (హైమ కుంవిలి కుంవిలి యేడుస్తుంది. ఏం జెయ్యాల్నో తోచలా రాంపండు?, సటుక్కున యేందో ఆలోశనాచ్చింది)

రాంపండు : హైమా.. పూరుకో.. మరి... అక్కడ, మీ నాన్నోళ్లది.. అస్తి, క్యాషేంవన్నా. గవర్మెంటు లక్ష లెక్కన.....

హైము : నువ్వు మనిషివేనా, అమ్మ నాన్నా పోయారని గుండె పగిలి యేడుస్తుంటే నువ్వు డబ్బు గురించడుగుతావా. నీక్కావాల్సింది మనుషులా డబ్బా

రాంపండు : డబ్బే. డబ్బే. డబ్బుకోసం వేగా నన్ను పిచ్చి కుక్కాల తరివింది. యమ్మే పీహెచ్.డీ. అంవెరికా.. లక్షలు ఒక్క సంవత్సరంలో యిరవైయైదు లక్షలు.. యిప్పుడు కావాల. లేకపోతే నువ్వూ నేనూ తాగాల యిసం. కనీసం పది లక్షలు కావాల. పోయి తీసకరా. తెస్తావా లేదా. లేకపోతే నిన్ను సంపుతా. నిన్ను గూడా సంపేస్తా. (హైమ గొంతుబట్టుకున్నాడు. పెద్దగా అరిసింది. హైమ.)

హైమ : పండూ.. (ఆగిపోయాడు పండు. స్రువలో కొచ్చాడు. తలడ్డంగ వూపుతా యనక్కి నడిశాడు. హైమ నీళ్ల గళాసందుకుంది)

రాంపండు : అది యిసం.. (అరిసినట్టు సెప్పాడు. గ్లాసుని చూసింది హైమ)

హైమ : విషం.. గ్లాసులో విషం.. ఎందుకు, ఎందుకు పండూ..తల తిరుగుతుంది.

(కుర్చీలో కూసోబోయింది).

రాంపండు : షాగ్గొట్టుద్ది.. (మళ్లీ అరిశాడు)

హైమ : షాకా.

రాంపండు : కుర్చీకి కరంటు సప్లయిచ్చా, (ఒణికి పోతన్నాడు పండు)

హైమ : ఏంటిదంతా. అలా అవుతున్నావేంటి. (పండు మాట్లాడ్లా) పండూ ప్రతి దానికీ చస్తానని బెదిరిస్తుండేదాన్ని. చావెంత బాధగా వుంటదో...తెలిసింది. ఇప్పుడు బతకాలని వచ్చాను. అయిన వాళ్లని పోగొట్టుకొని.. నేల మీద బతకాలని వొచ్చాను. మన బాబు కోసం..బతకాలని ఆశగా వ..చ్చా..ను.

రాంపండు : నిజంవే.. బాబు... (హైమ కడుపు మీద సేత్తో తవిడి)
మన బాబు కోసం బతకాల. అయితే ఒకరు సావాల. ఒకరు బతకాలంటే వొకరు సావాల.

హైమ : ఏంటి పండూ. ఎవరి గురించి.

రాంపండు : టైం లేదు..నీకు సెప్పాల.. మాబాబు.. ఆయన్ని సంపాల.

హైమ : పండూ..నీకు పిచ్చి బట్టిందా.

రాంపండు : పట్టింది..డబ్బు పిచ్చి.

హైమ : తప్పు పండూ. ఆయాలోచన మానుకో. కన్న తండ్రిని అలా అనకూడదు. నే నెలాగూ పోగొట్టుకున్నాను. ఇప్పుడు నీకూ నాకూ.. వాళ్లే మీ అమ్మా నాన్నలే దిక్కు వాళ్ల దగ్గరకే పోదాం. అక్కడే...

రాంపండు : ఆయన బతికుంటే సేనమ్మనియ్యడూ... అమ్మకపోతే నేను సావాల నువ్వు ముండ మోస్తావ్. మన బాబుకోసం మనకోసం..తప్పదు

హైమ : నేనొప్పుకోను. మనిషిలాగా బతకాల. అంతేగాని...యింత దుర్మార్గం.. నో... నో..
(ఇసురుగా పక్క వాకిట్లోకి పోయింది. బతింవాల్తా యంటబడ్డాడు పండు)

రాంపండు : హైమా నా మాటిను. గోల చెయ్యవాకు. మన మంచి కోసం చెవతన్నా. నామాటిను.
(ఒకరి వెంటొకరు లోపలకి పోయేరు. బయిట్నించి లచ్చిందేవొచ్చింది.)

లచ్చిందేవి : యెవురూ లేరేంది. పండూ..నాయనా పండూ...
(అంటా పక్క గెదిలో కెల్లింది. పిలుసుకుంటావొచ్చి యింకొక వాకిటి గుండా లోపలికెల్ల బోయింది. కరంటు తీగ కాలికి అడ్డం పడ్డది. దాన్ని తప్పిచ్చుకోబోయి కురిసీ పట్టుకుంది. షాక్కొట్టి పడిపోయింది. లోపల్నించి హైమొచ్చింది. బతింవాల్తా రాంపండొచ్చాడు. చూసి పెద్దంగా కేకబెట్టాడు.)

రాంపండు : ... హైమా...

హైమ : పండూ..షాకు...కరెంటు...

రాంపండు : అమ్మా

(దగెరకి పోబొయ్యాడు. పందుని సెయ్యి పట్టి యనక్కి గుంజింది హైమ. కాసేపిద్దరికీ బుర్రలు పన్జెయ్యలా.కంగారుగా పరుగుల్దీశారు)

హైమ : మెయిను...మెయిను....మెయినెక్కడ.

రాంపండు : లోపల.

(ఒక్క దూకులో లోపలికెల్లాడు. కురిసీ కంటుకోనుండా లచ్చిందేవి దబ్బున పడిపోయి కురిసీనొది లేసింది. రాంపండు లగెత్తుకొచ్చాడు)

హైమ : మెయినాపావా.

రాంపండు : ఆపా.. అమ్మా...అమ్మా...

(లచ్చిందేవిని పట్టి కుదిపాడు. కీసు గొంతుతో పలికిందామె. ఇద్దరూ కలిసి లచ్చిందేవిని మంచం మీదికి చేరిశారు.)

హైమ : అత్తమ్మా.. ఎలా వుందిప్పుడు.

లచ్చిందేవి : బాగనే వుందమ్మా. నాకేంగాలా. నా పందు..నా బిడ్డ..నా బిడ్డేదమ్మా. (పైకి లేవ బోయింది. రాంపండు దగెర కొచ్చాడు. కొడుకుని తనివితీరా చూసుకుంది. పసి బిడ్డనాల వొళ్లోకి తీసుకోని వొల్లంతా నింవిరింది.)

లచ్చిందేవి : నాయనా..పందూ..నిన్ను దక్కిచ్చుకుంటానయ్యా.... పేణం యిచ్చన్నా నిన్ను కాపాడుకుంటారా.

రాంపండు : బాబు... బాబు రాలేదే.. (అమ్మ సేతుల్లోంచి తప్పిచ్చుకున్నాడు)

లచ్చిందేవి : లేదయ్యా. బసెక్కి వొంగోలు పోయేదని సెప్పేరు.నీలు ...మంచి నీలు తాగాల. (పక్కనుండా గళాసందుకుంది)

హైమ : అది విషం.. (ఒడుపుగా గ్లాసు తీసి పక్కన బెట్టింది)

లచ్చిందేవి : ఇసంవా. గళాసులో యిసం ఎందుకుంది. ఆ కురిసీకి కరంటేంది. ఏందిదంతా.

హైమ : ఆస్తి కోసం. పందు..

రాంపండు : హైమా.. (హైమ నోరు మూశాడు. హైమ యిడిపిచ్చుకుంది)

హైమ : నువ్వంత దారుణం చేస్తుంటే నోరు మూసుకోనుండాల.

రాంపండు : చెప్పొద్దు.. హైమా.. చెప్పొద్దు.

హైమ : చెప్తాను.

రాంపండు : నిన్ను చంపేస్తా. (హైమ గొంతు పట్టుకున్నాడు. లచ్చిందేవి

తప్పిచ్చింది) చంపినా చెప్తా.. మాంవయ్య బతికుంటే పొలం అమ్మనియ్యడనీ.

రాంపండు : సంపెయ్యాలనుకున్నా. సంపేస్తా. సంపకపోతే పొలం అమ్మనిస్తాడా అమ్మకుండా నేంజావాల్నా. నేం చావను. నేను బతకాల గదా. అందుకే.. అందుకే.. అనుమానంరాకుండా షాగ్గొట్టిచ్చి సంపుదాం వనుకున్నా. ప్లానంతా పాడుజేసేరు. ఇప్పుడెట్టా.. ఎట్టా... బాబుందీస కొస్తానని పోయేవు. ఊరెకెనే యొవుర్రమ్మాన్నారు. నువు చస్తే యేం లాబం.

హైమ : పండూ..ఏంటి నువ్వు మాట్లాడేది.

రాంపండు : నోర్ముయ్. ఆయన సావక పోతే సవిటి పొలం కొనేదెట్టా. యమ్మే సదివేదెట్టా, పీహెచ్డీ రాసే దెట్టా. అంవెరికానించి యాబయి కేజీల బంగారం తెచ్చుకునేదెట్టా. మొత్తం యిన్సూర్ చెయ్యాల.

(మైండు పోయినోడాల మాట్లాడతా లోపలికి పోయాడు. హైమ యేడూస్తా కూలబడిపోయింది. లచ్చిందేవి రాయిలాగా నిలబడి పోయింది. శానాసేపు లోపలికి చూసింది. పురిటి బిడ్డప్పుడు రాంపండేడిసిన యేడుపు ఆమెకి యినపడింది. యేడిసే బిడ్డకి అమ్మ పాడే జోలపాట యినపడింది. కుప్పకూలి పోయిన హైమని వోదారిసినట్టు తల మీద నింవిరింది. నిండా గాలి పీలుసుకోని మణుసు రాయి చేసుకుంది. పుట్టెడు దుక్కాన్ని కడుపులో దిగమింగి కట్టుకున్నోణ్ణీ కల్లం దిబ్బనీ యెతుక్కుంటా ఎల్లిపోయింది.)

# దృశ్యం 13

(కల్లం దిబ్బ. గంపనిండా కాశీ అయిన పురుగుల మందు డబ్బాలుండయ్ సుట్టూ యెండి పోయిన మిరప సెట్లుండయ్. రాంకోటు సెట్టు మొదట్లో కూలబడ్డట్టు కూసోనుండాడు. యనకటి సంగతులన్నీ గుర్తొస్తండాయతనికి. పచ్చుల కిసకిసలు సెంగణాల్దీసే లేగదూదల అరుపులు ఆంబోతుల రంకెలు కుప్పనూర్సేటప్పుడు పల్లె జనాలు పాడుకునే పాటలు దూరానెక్కల్నో యినపడతండయ్ రాంకోటు యాబయ్యేళ్లు యనక్కిబోయి యింటన్నట్టున్నాడు. అతని కను కొలుకులమ్మిడి సన్నటి తేమ కనపడతా వుంది. బయిట్నించి సుందిరొచ్చాడు. రాంకోట్ని చూశాడు. ఒచ్చి పక్కనే కూసున్నాడు. సిన్నంగ పొడిదగ్గు దగ్గాడు. రాంకోటు కళ్లు దెరిశాడు. ఆ పాటలూ పలుకులూ మాయంవై పోయినియ్.)

సుందిరి : లచ్చిందేవప్ప..

రాంకోటు : నిన్ను రాయబారానికి పంపిందా.

సుందిరి : నేనే అడుగుతుంది. మూడ్రోజుల్నించి.. ఆడ మణిసి, వొంట్రిగా..తిండీ తిప్పలూలేకుండా..ఆ గెట్టుమీద పడిపోయుంది.

రాంకోటు : యెవు దుండమన్నాడు..నా కొడుకూ నా కొడుకూ అంటా పోయిందిగా. మలీ యెవుడు రమ్మంటే వొచ్చిందంటా.

సుందరి : ఎట్నో... వొచ్చింది గదా. కాస్తె పట్టిదుపులుండాల.

రాంకోటు : నాకు రొండు నాలికల్లేవు.

సుందరి : ....అంతేనా.. (రాంకోటు శానాసేపు మాట్లాడ్లేదు.)
నేను గోడా...నీకు చెప్పి...పోదాంవనీ.. (పైకి లేశాడు రాంకోటు)

రాంకోటు : ఓహెూ.. ఆంవెకి సపోటుగా పోతానని చెప్పటానికొచ్చేవన్నమాట. పో..పోరా..యెవుర్ని బెదిరిస్తా్రా పోయి..

సుందరి : నా మాటినీ.. యీవొక్క సారికి..లచ్చిందేవప్పని.

రాంకోటు : (సుందిరి సెంప మీద చెళ్లున కొట్టాడు) పోతానన్నోడివి ఇంక మాట్లిందుకురా. పో.. ప్పో యిక్కణ్నించి. అంతా సమ్మెకట్టి పోతంటే బయపడతాననుకున్నారా మీరు చెప్పిందానికల్లా తలూవుతా ననుకున్నారేంరా. పోండి, పోయి గంగలో దూకండి.

సుందరి : నేను పోతానంటంది.. లచ్చిందేవప్ప కోసం గాదు.

రాంకోటు : మరిందుకో.

సుందరి : .....బతకటానికి.

రాంకోటు : యక్కడ.

సుందరి : టౌన్లో, టౌనుకి పోదాంవని యెప్పట్నించో పోరు జాస్తుండాడు పిల్లోడు. నేనే తోసేస్తా వచ్చా. మా బామ్మర్ది.. అక్కడేందో పేక్రీలో పని మాట్టాడేడంట.

రాంకోటు : ఇక్కడ పన్లేదు. రాంకోటు పనైపోయింది. అప్పులోళ్లు రేపోమాపో పొలం గూడ సోదీనం జేసుకుంటారు. అం..దు..కు..ఒరేయ్. ఇల్లు బోయింది. ఎద్దులు బోయినియ్. పంట బోయింది. పరువు పోయింది. లచ్చిందేవి పోయింది. సివరికి నువ్వు కూడా పోతండావు. అందరూ పోయినా... యిదుగో...యీ మట్టి యెటూ పోదురా.. ఈ నేల యక్కడికి పోదురా. ఎ..ప్పుటికీ యిక్కణ్నే వుంటది. నేనూ యిక్కణ్నే వుంటా.

సుందరి : సిన్నప్పట్నించీ..యిద్దరం మట్టిలో తిరిగేంపు. ఈ మట్టిలో పెరిగేంవు. ఈ మట్టిలో పంజేసేంవు. ఈ మట్టిలోనే సద్ది ముద్ద పంచుకున్నాం. బాయి తొవ్వుతా....మీ అయ్యతో పాటు మా అయ్య కూడ యీ మట్టి కిందపడి పోయేడు. మనం గూడా.. యిక్కణ్నే యిదౌతాంలే అనుకున్నా.. ఇప్పుడు... నిన్నొదిలి పెట్టి.. యీ సేనూ చెట్టూ వొదిలి పెట్టి.. పోవాల్సొచ్చింది.

రాంకోటు : సుందిరీ నిజం..గా బోతావంట్రా.. (దగ్గిరకొచ్చాడు) నా మణుసు తెలిసినోడివి. నా బాదలు పంచుకున్నోడివి. నా మీదకి సెయ్యెత్తి నోడివి. ఇప్పుడేంవైందిరా. ఎందుకు పోవాలనుకున్నావురా. ఇల్లూవాకిలీ గొడ్డూ గోదా పోయినప్పుడు..నా దరిద్రంవల్లా అనుకున్నా. కడుపున బుట్టిన బిడ్డ దూరంవై పోయినప్పుడు.. డబ్బాశవల్లా

అనుకున్నా కట్టుకున్నది కల్లందిబ్బొదిలి పెట్టి పోయినప్పుడు.. బిడ్డ మీద బెమవొల్లా అనుకున్నా. నువ్వు పోతంటే..యేంవనుకునేదిరా. ఇట్టా మణిసినీ మణిసినీ యేరు జాస్తుండారేందిరా. కట్టెనీ పేణాన్నీ దూరం జాస్తందోవ్రా. యొప్రా... సరే.. పో పోయి నీ బతుకు నువు చూసుకో. పో... బతుకు.

సుందరి : నేను బతకటానిగ్గాదు. బతికితే మటుకి యింకెంత కాలం బతుకుతాంవు. బిడ్డల్ని బతికిచ్చుకోవటానికి.

రాంకోటు : ...

సుందరి : ఊళ్లోవోళ్లకీ పల్లెలో వోళ్లకీ వైరం ఎక్కువైంది. కచ్చలు పెరిగి సోయినియ్. వాళ్లేంవో కారంచేడూ సుండూరు గతి బట్టిచ్చాలా అంటండారు. ఈళ్లూ తగ్గేట్టు లేరు. మీవోడూ మావోడూ తగూకి మునిగోపులో వుంటండారు. రేపు నీ కొడుక్కేంవన్నా అయితే నీ మొకం నేం చూళ్లేను. నా కొడుక్కేంవన్నా జరిగితే నా మొకం నువ్వూ చూళ్లేవు. మనం బతికినట్టు మన పిల్లలు బతకాలను కోవటంలా. అందుకనీ.. దూరంగా వుంటే మంచిదనీ...

రాంకోటు : నిజంవే. నేనంత దూరం పారజూళ్లా. నీ యాలోశనా బాగుంది.

సుందరి : మరి... నేను....

రాంకోటు : ...మన చేతులో యేం వుంది. పో...పోయిరా.

సుందరి : ఒంట్రిగా నువ్విక్కడ ఆంవక్కడా.. యట్టా వుంటారు సెప్పు. ఆకర మాటడుగుతుండా. నా మాటింటావా లేదా.

రాంకోటు : ఒరేయ్...పోయినా మళ్లీవొచ్చినా... మీ యప్ప మీద నాక్కోపం లేదురా.

సుందరి : మరీ..

రాంకోటు : రానియ్యకుండా బెట్టు చేస్తే మళ్లీ రాంపండు దగ్గిరకి పోద్దిలే అని. మేం యిద్దరంవీ బతికుండీ కూడ వాడు... అమ్మా అబ్బా లేనోడవ తన్నాడ్రా. అందుకు. (సుందిరి నమ్మలేనట్టు చూసేదు) లచ్చిందేవి.... యిక్కడకి రావటంవే నేయంవనుకుంటే... రమ్మను.

సుందరి : యాంవైనా మీరిద్దరూ ఒక సోటుంటంవే నేయం. లచ్చిందేవప్పని పంపిస్తా. (అంటా బయిటికెల్లేదు సుందిరి సుందిరి పోయిం తట్టుకి

చూస్తా వుండి పోయాడు రాంకోటు. యనకనించి ఒంటే ౖలాగోలు గొడ్డళ్లు పట్టుకొని యిద్దరు పనోళ్లూ వచ్చారు.)

రాగోలు : మా మాం బంపిచ్చేడు. రాంపండు బాకీ కింద సేను సెల్లు బెట్టుకుంటాడంట

రాంకోటు : రాంపండు.. సేను రాసిచ్చేడా.

రాగోలు : బలే సెప్పేవే. రాసిస్తే.... వక్కసారే దున్నటానికి టాగ్ౖటి నూక్క రాకపోయేనా. నోటు రాసిచ్చేడంట. లాయర్నోటీసియ్యమంటావో సేను పంచిస్తావో అడగమన్నాడు. పండుగ్గూడా బాగం వుంటదంటగా.

రాంకోటు : పండు... అడగమన్నాడా.

రాగోలు : బలే సెప్పేవే. పండేంవో.... తిక్క తిక్కగా మాట్టాడతండాడంట. మా మాంవ అంజియ్య అడగమన్నాడు.

రాంకోటు : మాట అడగటానికి..... ఇద్దరు మణుసులూ రొండు గొడ్డళ్లూ కావాల్నా.

రాగోలు : బలేసెప్పేవే. అడగటానికా గెట్టెక్కడకో సూపిస్తే సెడి సెట్లు కొట్టటానికి (రాంకోటు కెక్కిపోయింది. ఒంటేౖలాగోలు మీద కొస్తండాడు. కొద్ది సెణాల కిందట్నే వొచ్చి యిదంతా యింటండా లచ్చిందేవి ముందు కొచ్చింది)

లచ్చిందేవి : యొవుౖడా సెట్లుగొట్టే మొగోడు. యొవుౖడా నీకు రాసిచ్చినోడు. ఎక్కౖడా నువ్వు గెట్టేసేది. (పైట సెంగు నడుంకి చుట్టుకుంది. రాంకోటు చూస్తా నిలబడ్డాడు.) అడుగు ముందు కేసేరంటే నా సేతులో తన్నుల్లింటారు నా మనవళ్లారా.

రాగోలు : బలేసెప్పేవే. నేను...

లచ్చిందేవి : నోరుముయ్యరా ఆడెంగి నా మనంవడా. యొవుడమ్మ మొగుడు సొమ్ము బంచుకోటానికొచ్చేవురా. యొవుడికి పుట్టేవురా నువ్వూ. ఒరేయ్ యింకొక్క శణం యిక్కణ్నే వుండావంటే... అమ్మోరికి బలిస్తా ముగ్గుర్నీ నడవం బయిటికీ, పోంౖడా అవతలకీ.. (ఆడపులాల గాంౖడిచ్చింది. యనక్కి తగ్గేరోళ్లు.)

రాంకోటు : సెప్పిందిగా.. సాయీ ..నేంగూడా చెప్పాల్నా.

రాగోలు : బలేసె... (రాంకోటేలు చూపెట్టేడు. ఒంటేౖలాగోలు నోరుమూశాడు.)

రాంకోటు : నోరెత్తద్దు. ఇయ్యాల్టికి బతికిపొయ్యేరు. పోయి మీ మాంకి చెప్పు రాంకోటు బొందిలో వూపిరుండన్నాలు... యీ గెడ్డ మీద కొవుడూ అడుగు పెట్టేడం చెప్పు. పో.. తొందరగా పో.

రాగోలు : నన్ను బెదిరిచ్చి అదర్నాకటంగాదు. అదుగో అటు చూడు. వాళ్లకేంజెవతా.

(ఎదురుగా చెయ్యి జూపాడు. రాంకోటెనక్కి తిరిగి చూశాడు. జనం. గుంపుగా మాట్లాడుకుంటా రావటం యినిపిచ్చింది. రాంకోటెల్లి మంచం వాల్చుకోని కూసున్నాడు. బయిట్నించి యంగట్రావు బ్రెమ్మంవు శీనాయి సుబ్బాయి గంటోడు చారోడు స్టిక్కీరాసాంవీ వొచ్చారు.)

సుబ్బాయి : యాంవోయ్ గంటాయ్ యీడియో సాఙ్ఞెట్టేవంటగా. యట్టుందీ

గంటోడు : ఆ...... అట్టట్టుందిలే.

యంగట్రావ్ : ఒంగోల్లో యక్కడ్రా నీ సాపో.

బ్రెమ్మం : మన శారోడు వొర్కి జాస్తళ్లా బ్రేందీ సాపు దానికి ఆపోజిట్లోనే.

సుబ్బాయి : బేందీ సాపులో జీతానికి చెయ్యటంవేనా శేరేంవన్నా...

గంటోడు : బలేవోడివే. పది పైసల శేరుగదో

యంగట్రావ్ : ముక్కెంగా కాపు సారాయి కాసిన డబ్బుళ్లా.

చారోడు : నాయాల్ది ఆ సంగతిప్పుడెందుకురా.

శీనాయి : ఈ పోస్కోలు మాట్లేందిరా సోంవీ. ఇక్కడ కొచ్చిందదుకేనా యేంది.

బ్రెమ్మం : నువ్ బిగిన్ చెయ్యవోయ్ యంగట్రావ్.

యంగట్రావ్ : నేనా...ఒచ్చిన సంగతేందో. ముక్కెంగా నువ్ జెప్పరా సుబ్బాయ్

సుబ్బాయి : మనంవే సెప్పాల్నా యేంది. బ్రెమ్మంవోళ్లు చెప్పగూడదో.

బ్రెమ్మం : మేంవు మేంవు వొకింటి పేర్టీ వోళ్లంగదా. ఏరే వోళ్లు జెవితే బెటరేంవో అని..గంటోడా....కానియ్‌రా.

గంటోడు : నేనా.... శీనాయ్... సంగతేందో బయటెయ్యవోయ్

శీనాయి : మనం బయటేసే దేందిరా సోంవి. లీడర్లిద్దర్నీ యెదురుగా బెట్టుకోని. వాళ్లు రమ్మన్రీ మనం వొస్తింవీ. నాయికులు గదా నడిపిచ్చమనండి.

యంగట్రావ్ : కట్టిరిసి పొయిలో బెట్టవాకరా శీనాయ్. ముక్కెంగా మాకు మాట్టాట్టం శాతగాకనాయేంది ... ముసుగులో గుద్దులాటెందుగ్గనీ..కోడి

పెంటంజియ్య కాడ లచ్చన్నర క్యాసు తీసుకోని సేతులెత్తేసేడు రాంపండు. అంజియ్యేంవో.. నాయవ్వారం సెటిల్జేస్తారా కోర్టుకి పొమ్మంటారా అని పెద్ద మణుసుల్లో పెట్టేడు. ఊరన్నాక ముక్కెంగా వొక పద్ధతుండాల గదా. ఆ బాకీ సంగతి మాట్టాట్టానికే యీ మీటింగు.

బ్రెమ్మం : మన్లెవల్లో సాల్వ్ గాకపోతే గదా కోర్టుకి బోవాల్సింది.

(యనక నించి శీనయ్య మాయోడూ వొచ్చి జనం ఎనక నిలబడ్డారు శీనయ్య యేళ్లు మడిసి లెక్కేస్తా యేందో సూపిస్తన్నాడు మాయోడికి)

స్టిక్కోడు : నాకొక అనుమానం వొస్తందరా.

శీనాయి : బయిటికి రానియ్యరా సోంవీ.

స్టిక్కోడు : ఊళ్లో యేందన్నా యవ్వారం వొస్తే యిసారణ చెయ్యాల్సింది రచ్చబండ కాడగదా. మరిట్టా పొలమ్మీదకి నూక్కొచ్చేరేందీ అని.

శీనాయి : అట్టదుగూ.

బ్రెమ్మం : యక్కడైతే యేంది. అన్నిట్లో చేంజింగు రావటంలా. లోకాయుక్తనీ... కోర్టులే పెబ్లిక్ లో కొస్తండయ్.

యంగట్రావ్ : యొవుడిదైనా సొమ్మే. ఎయ్యా రొండేలా లచ్చన్నర. పాపం అంజియ్య పల్లెత్తు మాటన్లా. నాకు నేయం జెయ్యండీ అనడుగుతుండాడు. ఏం సంవాదానం చెవతాడో ముక్కెంగా అడగాలగదా.

బ్రెమ్మం : అంత బిగెమొంటిచ్చినోడు సైలెంటుగా వూరుకుంటాడా.

శీనాయి : ఈర్సాంబాబా యిందాకేందో అంటంటివే ..వొచ్చేటప్పుడు.

స్టిక్కోడు : ఆ యెందుకులేరా నేనేదన్నా అంటే అందరికీ బాదగా వుంటది.

శీనాయి : బాదెందుకే ఏలొంక బెట్టకుండా యన్నపూసొచ్చుద్దా ఒదులు.

స్టిక్కోడు : ఊళ్లో యెన్నెవ్వారాల్జరిగినా యేంవీ పట్టిచ్చు కోకుండా పక్కకి నెడతండారు గదా. అంజియ్యకి డబ్బిప్పిచ్చే యవ్వారంలో యంగట్రావు బెమ్మంవు యింత గెట్టిగా పట్టుబట్టి దిగేరేందీ అని.

శీనాయి : ఎందుకేందిరా సోంవీ. సర్పంచికి టరంవైపోతందగా. కోడి పెంటంజియ్య క్కొమ్ముగాస్తే రేపద్దం బడకుండా వుంటాడని. అంజియ్య మేర్బానీ సంపాయిచ్చటానికి.

యంగట్రావ్ : ముక్కెంగా సర్పంచి నూకటానికే దిగేంవంటావా. సొమ్ము పోగొట్టుకు

న్నోడికి వత్తాసు పలకటం తప్పాయాంట్రా.

సుబ్బాయి : తప్పేంవుందన్నాయ్.

బ్రెమ్మం : మాట్లాడ్రేందిరా గంటోడా.

గంటోడు : నీ మాట కాదనేదేం వుంది బావా.

బ్రెమ్మం : యాంవే యిర్సాం బాబాయ్.

స్టిక్కోడు : నాదేం వుందిరా. మా యంగట్రావెట్ట జెవితే అట్నేగదో.

చారోడు : అట్టాటప్పుడు...నడుంగున పుల్ల నూకేదెందుకో.

యంగట్రావ్ : ఎందుకంటే..ఏలు బెట్టి కుళ్లగిచ్చేవోళ్లుళ్లా. ముక్కెంగా పుండాకోర్నాయాళ్లు.

శీనాయి : పుండాకోరు గిండాకోరంటే మర్యాదక్కదు.

యంగట్రావ్ : ఏం జాస్తావే అంటే.

శీనాయి : నువ్వేం జాస్తావే. (పైకి లేసి కలబడ బోయారు. ఇంక చాల్లే అన్నట్టు చెయ్యి పైకెత్తాడు రాంకోటు. అందరూ ఆగిపోయ్యేరు.)

రాంకోటు : కోడి పెంటంజియ్యకియ్యాల్సిందెంత.

యంగట్రావ్ : లచ్చన్నర.

రాంకోటు : ఇక్కడి కొచ్చినోళ్లు మీరంతా కలిసి యంతమంది.

బ్రెమ్మం : వన్ టూ త్రీ ఫోర్ ఫైవ్ సిక్స్ ఎయిట్ నైను. మొత్తం తొమ్మిది మందింవి మీకు తెలుసుగా. నేను బాగా యిబ్బందుల్లో వుండా. మీరంతా...తలా యిరవయేలు... నాకు సేబదులుగా సర్దండి. అంజియ్య బాకీ కట్టేస్తా కాలూ జెయ్యీ కూడ దీసుకోని మీ పైకం మీకిస్తా. నాక్కాస్త సెయ్యందిచ్చి నట్టూ వుంటది. అంజియ్యకి నేయం జేసినోళ్లవతారు మీ పెద్దరికంవూ నిలబడుద్ది. తలా.. యిరవయేసేలు. (అంతా వొకరి మొకాలొకరు చూసుకుంటన్నారు.) అంతో యింతో బూంవీ పుట్టా వుండోళ్లు. పేణంమీదకొస్తే ఆ మాత్రం పైకం పుట్టిచ్చలేనోళ్లు గాదు.... మాట్టాడ్రేందీ (మొకాలు సాటు చేసుకుంటన్నారందరూ).

సుబ్బాయి : ఏదో మజ్జస్తంగా మాట్లాట్టానికొచ్చేంగానీ అదాట్న డబ్బడిగితే యట్టా.

చారోడు : సీత బాదలు సీతయి పీత బాదలు పీతయి.

గంటోడు : యొవురి బాదలోళ్లకుంటయి.

యంగ్రట్రావ్ : ముక్కెంగా యొవురి అగసాట్లు వాళ్లు పడాల.

రాంకోటు : అంతేనంటారా.

అందరు : ఆ.

రాంకోటు : మరి.... నా అగసాట్లతో పన్లేనోళ్లకి నా అప్పుల్తో యేం పన్రా. నా కష్టాలు పట్టనోళ్లకి నా కల్లందిబ్బ మీదేంపన్రాఏడిక చూట్టానికొచ్చేరా.. ఎడద్దేవా జెయ్యటానికొచ్చేరా. ఎందుకొచ్చేర్రా దొడ్డుల్లో తిరిగేవోడొకడు దొంగ సారాయి గాసేవోడొకడు సేనూ సెక్కా వొదిలేసి సీట్లాడేవోళ్లు బేందీ యిస్కీల్దాగి బేవార్సుగా తిరిగే నాయాళ్లు పెసిరెంటు తనం కోసం సొమ్ముండావోడి సంక నాకే లం.. జా కొడుకులు.. మీరంట్రా నన్ను పంచాత జేసేది. మీరంట్రా రాంకోట్ని యేలెత్తి సూపిచ్చేది.

సుబ్బాయి : అదీ.

రాంకోటు : సెప్పుతో కొడతా నోరెత్తేరంటే.

యంగ్రట్రావ్ : ముక్కెం....

రాంకోటు : తప్పుడెవ్వారం జేసేరంటే.... నాగేటి కర్రేసి కడుపుల్జీలుస్తా.

మాయోడు : అట్టాబెట్టు గెడ్డి.. నాయాళ్లకి సిగ్గొచ్చుద్ది. లగెత్తుకుంటా వొచ్చేరు యాంవనుకోనొచ్చేరూ. యొవురనుకోనొచ్చేరూ. ఏం చేద్దాంవనొచ్చేరూ. రాంకోటు మాంకే తీరుపు చెప్పే మొగోళ్లంట్రా మీరూ. ఒరేయ్ యియ్యాల రాంకోటు మాంవ దెబ్బదిని వొకమెట్టు కిందకి దిగి పోయుండొచ్చు. అంత మాత్రాన మీకు తలొంచు తాడంట్రా. ఏనుగు బతికినా యెయ్యే. సచ్చినా యెయ్యేరా. మీరేంవో తలొంచుకోని నిలబడ్డారు. ఆయనేంవో కాలు మీద కాలేసుకోని దర్జాగా కూసున్నాడు. ఒకడికి చెప్పేవోడేగనీ ఒకడి సేత సెప్పిచ్చుకునే వోడు కాదురా మా మాంవ. బారతంలో బీస్ముడంతటోడురా ఆయన. కురుచ్చేత్రంలో యేంవైంది. బీస్ముడు.... లాగి బాణాలొదుల్తా వుంటే... పాండవులు గిజగిజగిజగిజ లాడి పోయేరు. వూపిరాళ్లా. ఒకరోజూ... బాగా పొద్దుబోయినాక.... అర్జినుడు యొవ్వరికీ కనపడకుండా పోయి బీస్ముడి గుడారంలో చొరబడ్డాడు. తాతా....తాతా నువ్వు బాణాలొదుల్తా వుంటే యెదురుగా నిలబట్టం మా వల్లగావటం లేదూ... నిన్ను జెయిచ్చే

దారేంవన్నా వుంటే సెప్పు తాతా అని కాళ్లు బట్టుకున్నాడు. బీస్ముడు నవ్వీ ఆడోళ్లు పిల్లోళ్లు యెదురొస్తే నేను యిద్దం చెయ్యనూ అనీ కిటుకు చెప్పేడు. అప్పుడు... ఆడామొగా కానోణ్ని తెచ్చి అడ్డం నిలబెట్టి పెద్దాయన్ని పడగొట్టేరు. అట్నే యేదన్నా యవ్వారం వొస్తే యట్టా జేద్దాంవూ అని రాంకోటుమాంవనే అడగాల. అదీ గూడా నువ్వూ నేను అడిగితే సెవతాడా. అడగాల్సినోడడగాల. అడగాల్సిన పద్ధతిలో అడగాల.

(ఒంటేర్లాగోలు మీద సెయ్యేసేడు ఈడు అడగాల అన్నట్టు)

యంగట్రావ్ : మరింకేం ముక్కెంగా ఒంటేర్లాగోలే అడుగుతాడూ. అడగరా క్యాసెప్పుడిస్తాడో యట్టాయిస్తాడో అడుగు.

రాగోలు : లచ్చా యాభైకి నోట్లుండయ్. పొలం గూడ తాకట్టు బెట్టుంది. సేను పంచిస్తావా డబ్బు కడతావా.

(రాంకోటుకి గొంతు మీద కత్తి బెట్టిన్నట్టైంది. మాయోడొంక కసిగా జూశాడు. మాయోడు గెడ్డం గోక్కుంటా పైకి చూస్తన్నాడు.)

సెప్పూ..... (రెట్టిస్తన్నాడు వొంటేర్లాగోలు)

రాంకోటు : డబ్బే కడతా.

రాగోలు : ఎప్పుడు ..అందరెదటా చెవతండావు. మాట తప్పుగూడదు

మాయోడు : రేయ్ యొవుర్తో మాట్లాడతండావ్రా. ఎ..ప్పుడు అనడుగు. అంతేగనీ మాట తప్పుతావు అనవాకు. పళ్లిరగనూకుతాడు

రాగోలు : ఆ....ఎప్పుడిస్తా ...సెప్పూ ఎప్పుడిస్తావు.

రాంకోటు : రేపు. (శానా సేపు మదనపడి సెప్పాడు)

రాగోలు : యట్టా యిస్తా.

మాయోడు : బుద్దుందంట్రా నీకు. రేపిస్తానన్నాడు ఎట్టాయిస్తే నీకెందుకు. రాంకోటు మాంవ మాట దప్పితే అప్పుడడుగు. రేపియ్యకపోతే గదా. అటు పొద్దు ఇటు పొడిసినా అన్నమాటకి కట్టుబడుంటాడురా ఆ.

రాగోలు : బలే సె.... (యేలు చూపిచ్చేడు రాంకోటు. నోరుమూశాడు ఒంటేర్రాగోలు)

రాంకోటు : ఇంకొవురూ మాట్టాడాల్సిన పన్లేదు. ఇక్కడుండాల్సిన పని లేదు.

(ఒక్కరొక్కరూ మెల్లిగా యెల్లిపోతన్నారు. లచ్చిందేవి గుడిశలోకి పోయింది)

మాయోడు : మరి... మాంవా...తెల్లారేలకి ... అంత పైకం... యట్టా. రేపు మళ్లీ యీ జనంవంతా వస్తారు. డబ్బు కట్టకపోతే పైనాంచు కంపిణీ వోళ్లు కూడా రేపే వస్తారంట. (రాంకోటేంవీ మాట్లాడలా)...
రేపు పరువు నిలబడాలంటే... ఏదోవకటి తెగనం...అట్ట చేసినా అంతడబ్బు ... కష్టంవే. సరే మాంవా మొకంవాట పడకుండా నా సాయంవేంవన్నా కావాలంటే అడుగు.

రాంకోటు : నీ సాయం కావాల్రా.

మాయోడు : ఏందో సెప్పు. (దగ్గిర కొచ్చాడు మాయోడు. కాంౕడించి మాయోడి మొకమ్మీద వుమ్మేశాడు రాంకోటు.)
ఇది. ఇంకెల్లు. (మొకం తుడుసుకోని కమ్మంగ నవ్వుకున్నాడు మాయోడు)

మాయోడు : ఇదేందో నాకసలు కోపంవే రావటం లేదు మాంవా. నన్ను జూసుకుంటే నాకే అచ్చర్యంగా వుంది. ఇంత శాంతం ఎట్టొచ్చిందో. నాకాడ గొప్పోడయ్యే సూశన్లు కనపడతండయే. ఆ రోజు కాల్తో తన్నేవు.. ఇంతోణ్నయ్యా. ఇయ్యాల మొకమ్మీదూసేవు. రేపెంతోణ్నవతానో. ఈ మజ్జ జాతకం గూడ చూపిచ్చా. పార్టిక్సులో మంచి పట్టుదొరుకుద్దన్నారు వస్తా
(పోతాపోతా మళ్లీ యనక్కి తిరిగాడు)
ఓపెన్గా జెవతాండా! తెల్లారేలకి నీకు లక్షన్నరిచ్చే మొగోడు ఈ వూళ్లో లేదు. మఱుసు మారితే సేనమ్మాలనుకుంటే యీ యాంకటేసౕావుకి కబురుబెట్టు. (మాయోడు బయిటికి పోయాడు. రాంకోటుకిప్పుడు కోపంరాలా, మానాల నుంచోనుండాడు. ఊరి జనం అన్నా మాటలు గుర్తొస్తండయ్. మాయోడన్నా మాటలు గుర్తొస్తండయ్. సిన్నంగ కూసోని నేల మీద సేతులానిచ్చాడు. సచ్చిపోతా వాళ్లయ్య చెప్పిన మాట్లినపడ్డయ్)
ఒరే అయ్యా ఎన్నగసాట్లొచ్చినా ఎంత పేణం మీద కొచ్చినా బూంవిని

మటుకి పోగొట్టుకోవాకరా.

(రాంకోటు సేతులు బార్లా చాపి ముందుకి వాలిపోయాడు. బూంవిని వాటేసుకున్నట్టు బోర్లా పండుకున్నాడు. లచ్చిందేవి సిన్నంగా వొచ్చి దగ్గెర కూసుంది.)

లచ్చిందేవి : యేందా పండుకోటంవూ... (రాంకోటామాట పట్టిచ్చుకోలా) యాంవయ్యా... లేసికూసో. (మోకేసి లాగినట్టు పైకి లేశాడు రాంకోటు లచ్చిందేవిని పట్టిచ్చుకోలా. సెట్టుకాడికి పోయేడు. ఒకే మాయిన యాపసెట్టుని చూస్తుండాడు.)

లచ్చిందేవి : తిండి తిన్నావంటయ్యా.

రాంకోటు : మా అయ్య.... (అంటా రెండో సెట్టు కాడికి పోయాడు) మా అమ్మ

లచ్చిందేవి : ఏందయ్యా కొత్తగా చెవతండావూ... నా మాటినపడతందా. (రాంకోటు సూపు సెట్టు మీదనించి నేను మీదకి పోయింది. సుట్టూ చూశాడు. అడుగులో అడుగేసుకుంటా పోయి కుక్కి మంచం మీద కూసున్నాడు. లచ్చిందేవి కూడ వొచ్చి పక్కన కూసుంది. రాంకోటు గెడ్డం కింద సెయ్యేసి తలపైకి వుబికిచ్చింది. అప్పుడు చూసేడు లచ్చిందేవి మొకాన్ని. శానా సేపు అట్టానే చూశాడు. సేత్తో లచ్చిందేవి శంపమీద నింవిరాడు. శానాసార్లు ఆ శంపని సెళ్లుమనిపిచ్చిన సెయ్యి. శానా సార్లు ఆ దెబ్బని బరిచ్చిన శంప. లచ్చిందేవి ఆ సేతిని కాసేపు తన శంపకేసి అదింపట్టుకుంది.)

రాంకోటు : లచ్చిందేవీ ఒక్కసారి ... రాంపండుని తీసకొస్తావా.

లచ్చిందేవి : నేంబోను. (సెయ్యొదిలి పెట్టింది)

రాంకోటు : ఏం.

లచ్చిందేవి : అన్నీ తెంచేసుకోనొచ్చా. వాడి మాట నాకు చెప్పద్దు.

రాంకోటు : నువు తెంచుకుంటే తెగిపోద్దా...పోయి తీసకరా. (లచ్చిందేవి కదల్లా, రాంకోటు పోయి గంపలో మందు డబ్బా సేతికి తీసుకున్నాడు. లచ్చిందేవి కంగారుగా దగ్గరకి పోయింది.)

లచ్చిందేవి : యాంవయ్యా. (అంటా డబ్బానొడిసి లాక్కుంది.)

రాంకోటు : అంజియ్య మణుసులు గొడ్డెళ్లెత్తుకోనొచ్చినప్పుడు... వాళ్లు నా మీద కొస్తారని... నాకేంవన్నా అవుద్దని నువు చూపిచ్చిన పెతాపంవంతా చూశా... నామీద యింక. ఆశ వొదులుకోయే. కాడి కింద బడేశా.

లచ్చిందేవి : నే చెప్పేదింటావా.

రాంకోటు : రాంపండు.

లచ్చిందేవి : వాడు... వొద్దు

రాంకోటు : మన బిడ్డేగదా లచ్చిందేవి.

లచ్చిందేవి : నీ కెట్టా సెప్పేదయ్యా... వాడు..

రాంకోటు : సెప్పు.

లచ్చిందేవి : వాడు.... నువు లేకుండాబోతే... సేనమ్ముకోవచ్చునుకుంటన్నాడు. నీ సావు కోరతన్నాడయ్యా

రాంకోటు : వాడెన్ని బాదల్లో వుండాడో.... సేలో పుట్టిన మొక్కనీ పురుగు దిన్నది. కడుపున పుట్టిన బిడ్డనీ పురుగు తిన్నది. పోయి తీసకరా.

లచ్చిందేవి : వాడింటి పట్టునుంటంలా. ఎక్కడుండాడని తీసకొచ్చేది.

రాంకోటు : వాడికొక్కమాట చెవదాంవనుకున్నా.

లచ్చిందేవి : ఏందయ్యా నువ్వు. నాకు బయంగా వుంది.

రాంకోటు : ఈ బూంవీకీ మనకీ రుడం తీరిపోయింది. లచ్చిందేవి. రాంపండనుకున్నట్టే.. అడ్డం లేకుండా.

లచ్చిందేవి : ఒద్దు. అట్టాటి అగాయిత్తేప్మాట్లనద్దు. బాదలుండోళ్లందరూ సచ్చి పోయేట్టయితే యా బూమ్మీద యింకొవురూ మిగ(లయ్యా.

రాంకోటు : ఇంకేంవీ సెయ్యలేం. తలెత్తుకునే మారగం లేదు. వుచ్చు బిగుసుకుంది పైనాంచు కంపెణీ వోళ్లు కూడ రేపొస్తారు. పది మందిలో నానా మాట్లూ అంటారు. పరువుబోయి బతకటం కంటే పాణంబోయి బతకటం మంచిది.

లచ్చిందేవి : అప్పులెంత మందికి లేవు. యగసాయం చేసినోళ్లు అప్పులు కాకుండా వుంటండారా.

రాంకోటు : అప్పులొక్కటే కాదు. అయి మనకి కొత్తాగాదు... ఊరు మారిపోయింది. మణుసులు మారి పోయ్యేరు. కింద బడ్డావోడికి సెయ్యందిచ్చే కాలం

పోయింది. ఆదరిచ్చే వోడు లేడు. అయ్యో పాపం అనే వోడు లేడు. ఊబిలోకి దిగబడిపోతా వుంటే అదొక పండగ. పరాశకం... యేక్కేసం.. యగతాలి. యిట్టాటి జనం మజ్జన బతకలేంవే... తెల్లారితే అప్పులోళ్లస్తారు. ఏడిక చూట్టానికి వూరూ వొచ్చి కూసుంటది. ఈ నేల్లిని రొండుగా నడించికి చీల్సాల. అయ్యోక పక్కకి అమ్మోక పక్క.. సూళ్లేను... నేను బతికుండంగానే యీ బూంవిని పరాయోళ్లకి... ఒద్దు లచ్చిందేవి.

లచ్చిందేవి : అప్పులోళ్లందరకీ నేను చెవతానయ్యా. ఈ సారి పంటొచ్చిందాకా ఆగమని బతింవాలి చొప్పిస్తా.

రాంకోటు : ఈ సారి పంట మటుకి మనకి దక్కుద్దని సమ్మకం వేంది

లచ్చిందేవి : ........... (ఆలోశన్లో పడింది).

రాంకోటు : సీతమ్మోరు అవుమానం బరిచ్చ లేక బూదేవమ్మ కడుపులో తల్దాసు కుందంట. మనం కూడ అట్నే.... ఈ బూంవిలో పుట్టేంవు, ఈ బూమ్మీద పెరిగేంవు. ఈ బూంబిలోకే...

లచ్చిందేవి : అయితే పదవయ్యా పది మందీ సూసేట్టుగా పట్నం నడిబొడ్డున వురేసుకుందాం పా కలగటేరు కళ్లెదట పెట్రోలు బోసుకోని తగల బెట్టుకుందాంపా. నెత్తురు సుక్కలు బిండి మొక్కలు మొలిపిచ్చే రైతుకి పట్టిన గతేందో సూపిద్దాంపా. మన పంట దళారోళ్లకప్పగిచ్చి మనజుట్టు అప్పులోళ్లకి పట్టిచ్చి మన పేణాలు మందుడబ్బాల పరంజే సేరని అరిసి అరిసి అరిసి సెవదాంపా.

రాంకోటు : ఎందుకు లచ్చిందేవీ బిడ్డని బాయిలో యేసి లోతు జూసే గవర్మెంటు. పురిటి బిడ్డ గొంతులో వడ్ల గింజలేసి జోలపాట పాడే నాయికులు... ఆలిశంవైతే బతుకు మీద మల్లీ ఆశ పుట్టుద్ది...రా. (రాంకోటు పిడికెడు మట్టి సేతికి తీసుకున్నాడు)

అమ్మా బూంతల్లీ మొక్కలు మొలిపిచ్చేవు. కాయలిచ్చేవు. పళ్లిచ్చేవు నీలిచ్చేవు నూలిచ్చేవు. ఎన్ని జనంవలెత్తినా నీరుడం తీర్చుకోలేం తల్లీ. మల్లీ జనమలో కూడ మమ్మల్ని మట్టి మడుసులుగానే పుట్టిచ్చు.

లచ్చిందేవి : అయితే అప్పుడు అప్పులోళ్లని పుట్టిచ్చ వాకమ్మా. దళారీవోళ్లని

పుట్టిచ్చవాకమ్మా. నకిలీ మందులోళ్లని పుట్టిచ్చ వాకమ్మా.... కాదన కుండా కడుపులో దాసుకో. దండంవమ్మా.

(మందు డబ్బా నోటి కాడికొచ్చింది. కెవ్వుమని కేకిన పడింది. అత్తమ్మా... అంటా కేకబెట్టింది హైమ. పొట్ట చేత పట్టుకొని పడతా లేస్తా వొచ్చింది. పడబోతండా హైమని పట్టుకుంది లచ్చిందేవి. నెప్పుల్తో మెల్దిరిగిపోతంది హైమ. నిరామయంగా చూస్తన్నాడు రాంకోటు)

హైమ : అత్తమ్మా... నొప్పులు... బాధ... భరించ లేకపోతున్నాను. ఆకాశమ్మీద తిరుగుతా వుండేదాన్ని. కరీంనగరు నా కళ్లు తెరిపిచ్చింది. నేలమీద కొచ్చాను. వేరే దిక్కు లేక.. మీతోనే కలిసి యీ మట్టిలో బతకాల నొచ్చేను. భూమ్మీద కొచ్చే యీ బిడ్డకి నీ సేత్తో బొడ్డుతాడు తెంచాల. ఈగెడ్డ మీదనే పెంచాల... అమ్మా....

రాంకోటు : రాంపండేడి.

(మాట్లాడకుండా ఒక సీటీ తీసి రాంకోటుకిచ్చింది హైమ. హైమని గుడిసె లోపలి తీసుకుపోయింది లచ్చిందేవి. రాంకోటు సదవటం మొదలుబెట్టాడు)

రాంపండు : హైమా నేనెల్లి పోతన్నా, యక్కడకో నాగూడ తెలవదు. అందరూ నాకు స్వరం మతి చెడిందంటన్నారు. చెడే వుంటది. మన బాబుని.. మా బాబుకి వొప్పగిచ్చు. నేం చేసిన తప్పుల్జెయ్యకుండా వాణ్ని పెంచమని చెప్పు. తప్పులన్నీ వొప్పుకోని... మా బాబు కాళ్ల మీద బడి యాడవాలనిపిస్తంది. ఆ కల్లం దిబ్బ మీద కాలుబెట్టే అర్హత నాకు లేదు. ఆ బూంవికి నేను ద్రోహం జేశాను. మన బాబు రైతుబిడ్డగా మేడి పట్టాల. అదీ నా ఆశ. ఎలన్నా... రాం...పం...డు.

(రాంకోటు యేడుపాపుకోలేక పోయాడు. హైమ నెప్పులు తట్టుకో లేకుండా వుంది. హైమ మూలుగుతా వుంది. లచ్చిందేవి పక్కనే వుండి ధైర్నం చెవతా వుంది. రాంకోటుకి రాంపండు ఉత్తరంలో రాసిన మాట మన బాబు రైతు బిడ్డగా మేడి బట్టాల అన్న మాట మళ్లీ మళ్లీ యినపడతంది. కెవ్వుమని అరుస్తా పసిబిడ్డ గొంతినపడింది.

రాంకోటుకి వొల్లు జలదరిచ్చింది. ఒకసోట నిలబ్డలేకుండా వుండాడు. పసి బిడ్డ అరుపు యినపడతానే వుంది. కాసేపైనాక లచ్చిందేవి తబ్బిబ్బవతా లగెత్తుకొచ్చింది)

లచ్చిందేవి : యాంవయ్యా మొగపిల్లోడు. (అంటా లోపలికి పోయింది. సెణం ఆలిశం కాకుండా మళ్లీ బయిటికొచ్చింది)

లచ్చిందేవి : యాంవయ్యా పిల్లోడు ...యర్రంగా వుండాడు. అచ్చు గుద్దినట్టు ...రాంపండు పోలికే.

రాంకోటు : రాంపండాల్నే వుండాడా నా మనంవడు .....ఎ.. ర్రంగా వుండాడా. లచ్చిందేవీ ...నేను లోపలికి రావచ్చా ...సూడచ్చా

లచ్చిందేవి : రావయ్యా ....రా (లోపలికి పోబోయి... ఆగాడు)

రాంకోటు : ఒద్దు లచ్చిందేవి. మళ్లీ బతుకు మీద ఆశ బుట్టుద్ది

లచ్చిందేవి : ఇంకా సావాలనే అనుకుంటండావా. ఆ నెత్తురు కందుని యీ దిబ్బ మీద వొదిలేసి యట్టా పోదాంవనుకుంటండావయ్యా

రాంకోటు : బతికి...వాడికి ఏంవియ్య గల్లోళ్లంవి. తెల్లారితే యీ నేల మంది గాదు.

లచ్చిందేవి : ఈ నేల యెవుర్దీ కాదయ్యా. శాకిరీ చేసేవోడిది. మొన్న మీ యయ్యది. నిన్న నీది. రేపు నా మనంవడిది. మనంవేవి యీడవలీడవలు కావాలని వాటేసుకుంటన్నాంవా. ఇందులో మిగిల్న లిబ్బి తీసకపోయి డబ్బు కట్టల్తో పాతర్లు బెట్టుకుంటన్నాంవా. డొక్క పూడుసుకోటానికి శారెడు సెక్క అదీగూడా మనది కాదని తీరుపు జెప్పేవోడెవుడో రానియ్యవయ్యా (అంటా గబగబా పోయి శారెడు గింజలు పిడికిట పట్టుకోనొచ్చింది) అన్ని ఆస్తులు పోయినా మనకీ యాస్తి మిగిలేవుంది. ఇయిగో యిత్తనాలు. అదుగో నెత్తురు కందు. ఈ యిత్తనాలు మొలిపిచ్చాల ఆ నెత్తురు కందుని బతికిచ్చాల.

(అంటా వుండగానే హైమ... బిడ్డని గుడ్డల్లో ఒత్తుగా గుండెలకేసి అదింపట్టు కోని అడుగుల్తడబడతన్నా ఆశగా ముందుకొచ్చింది.)

హైమ : ఇలాగే... నాన్న చచ్చిపోయాడు. అమ్మ చచ్చిపోయింది. నా తమ్ముడు దిక్కులేనోడయ్యాడు. ఆ చావు గొప్పదా మామయ్యా. భయంతో బాధతో అసంతృప్తితో బిడ్డలకి అన్యాయం జరుగుతుందని కుమిలిపోతా చచ్చే

చావుకంటే ఈ నేల చక్క కోసం యీ తరం హక్కు కోసం చెమట ధారపోసిన యీ మట్టిలోనే... అవసరమైతే రక్తం ధారబోసి... సంతృప్తిగా చావటం గొప్ప కాదా మాంవయ్యా.

(శానాసేపు హైమనట్టాగేచూశాడు రాంకోటు. లచ్చిందేవొంక చూశాడు. పసిబిడ్డని జూశాడు. మందు డబ్బా చేతిలోంచి జారిపోయింది. చటుక్కున వొంగి సిటికెడు మట్టి సేతికి తీసుకున్నాడు. పసిబిడ్డ నొసిటి మీద మట్టి బొట్టు పెట్టాడు. మనంవణ్ని తీసుకోని గుండెలకేసి అత్తుకున్నాడు. లచ్చిందేవి సేతులో వుండా యిత్తనాలు పిడికిట్లోకి తీసుకున్నాడు)

రాంకోటు : లచ్చిందేవీ ఈ దిబ్బ మీదకి కొత్త నెత్తురొచ్చింది. నా వొంట్లోకి కొత్త సత్తవొచ్చింది. ఉక్కు ముక్కలాల నా రెక్కలుండయ్. నా పక్కన నువ్వుండావు నా కోడలుంది. యెయ్యిమంది పెట్టు నా మనంవ దుండాడు. పిడికిట్లో యిత్తనాలుండయ్ మళ్లీ మట్టిని మొలిపిస్తా.

(సీకట్లని చీలుసుకుంటా సూరీడు యర్రంగా పైకొస్తా వుండాడు. మట్టి జనం పాడుకునే పల్లె పాట యినపడతా వుంది.)